కావరముచేతను జగముల బాధించిరి. నీవు విలువిద్యయందు చాటుగనుండి కొట్టుట యందు నింద్రజిత్తును బలమునందు రావణుని పోలుదువు. నాదు నీ పెనసువన్ = నా నీ యుద్ధసంపు, హరి=ఇంద్రుని, శంబర=శంబరుని, జన్యభంగి = యుద్ధవిధము, క్రమాలంకారము, ఇట్లు చెప్పుటచే నాచేత నీవు చచ్చుట నిజమని భావము. ఈ యుండెడు సకల ప్రాణులు చూచునుగాక, దృఢాస్త్రచాపకౌశలమునన్ = అనేకములైన యస్త్రములను వింటియందలి నేర్పుచే క్రోఁతులను జంపితివి. ఎంతటి శౌర్యవంతుఁడవురా? ముప్పదియేండ్లు సాముచేసి ముసలదానిని బడ మొత్తె నన్నట్లు గదా యున్నది నీ క్రోఁతులను జంపిన ఆ నీ శౌర్యము.

కం. అపవాదభయంబున ని, న్నిపుడే వధియింప నొల్ల • నీక నాయాసం
బపనీతముగాఁ దొడరుమ, యపు డీవు మదీయబలము•నంతయుఁ గనుమా.

అర్థములు. అపవాదభయంబున=బడలిన వానిని జంపినాఁడని యపకీర్తి వచ్చునను భయముచే, అపనీతముగాన్=తొలఁగిపోగా, తొడరుము=ఎదిరింపుము.

తాత్పర్యము

అపకీర్తి వచ్చునను భయముచే నిన్నిపుడే చంపనిష్టపడను. నీవు యుద్ధము చేసి యలసి యున్నాఁడవు నీవు బడలిక పోఁగొట్టుకొని యుద్ధమున నెదిరింపుము అప్పుడు నా బలమంతయు నీవు చూడఁగలవు.

కం. అని గౌరవరూపక వా,క్యనిచయముల హేళనంబు • గావింపఁగ న
య్యనఘతనయునిఁ బట్టుకొనెన్, ఘనమదబలయుతుఁడు కుంభ•కర్ణసుతుండున్.

అర్థములు. గౌరవరూపక వాక్య నిచయములన్=రూపమున గొప్పతనము తెలుపు మాటల సమూహములు, వాస్తవమున హేళనము=పరిహాసము, ఘన మదబలయుతుఁడు=గొప్పమదముతోను బలముతోను గూడినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

## —• సుగ్రీవుఁడు కుంభుని వధించుట •—

ఉ. వానిని పీడఁ దన్నికొని • వానరనాథుఁడు వెండి దండిచం
దానను బైబడంగ నిటు•దానవవానరవీరు లుద్ధతిన్
బూనిన రోషవేగములఁ • బోనిమదంబులఁ గొంచెమేనియున్
న్యూనత లేని బింకముల • నుద్ధతిఁ బోరిరి దంతులోయనన్. ౧౮౭౮

అర్థములు. దండిచందానను = యమునివలె, దంతులో=ఏనుఁగులో.

తాత్పర్యము

కుంభుఁడు పట్టిన పట్టూడఁదన్నికొని సుగ్రీవుఁడు యమునివలె మీఁదఁ బడఁగా నీప్రకారము రాక్షస వానర వీరులు గర్వమున నతిశయ కోపమున మదము వదలక కొంచెమైనను గొఱతలేని పౌరుషముల నొకరి నొకరు కొట్టుకొనుచు నేనుఁగులవలె యుద్ధము చేసిరి.

ఉ. మాటికి మాటి కూర్చుచును • మార్కొని యొండొరులతోఁ బెనంగుచున్
బాటిగఁ జేదివల్లు తను•వల్లరు లొప్పఁగఁ గ్రిందఁ బొర్లుచున్
వ్రేటుల నొంచుచుం బరశ•రీరము నీడ్చుచు గాసి నోలుచున్
నోట సధూమకీలల న•నూనముగా వెడలించు చిర్వురున్. ౧౨౪౯

అర్థములు. తను వల్లరులు=తీఁగవంటి దేహములు, ఓలుచున్=బాధచేయుచు, సధూమ కీలలన్=పొగతోఁ గూడిన జ్వాలలను, అనూనముగా = విస్తారముగా.

తాత్పర్యము

పలుమారు శ్వాసములు విడుచుచు నొకరితో నొకరు పెనఁగు లాడుచు చక్కఁగాఁ జేని వట్లు దేహములను తీఁగ లొప్పఁగా గ్రిందఁబడి పొర్లుచు దెబ్బలు కొట్టి నొప్పించుచు, ఎదుటివాని శరీరము నేలవేసి యీడ్చుచు గాసిచే విలపించుచు నోటినుండి పొగతోఁ గూడిన జ్వాలలు దండిగా నిర్వురు వెడలించుచు.

మ. పదఘాతంబుల వార్ధిఘూర్ణిలఁగ దు•ర్వారంబుగాఁ బోరుచో
నదనైనన్ వెసఁ గుంభుఁ బట్టికొని పా•రావారమధ్యంబునన్
మదమారన్ రవిసూనుఁ జేసినను విం•ధ్యగ్రావతుల్యంబుగా
నుదధిన్ నీరము లేని యొడ్డతిమె, శౌ•ర్యోదగ్రుఁడై కుంభుఁడున్. ౧౨౫౦

అర్థములు. పదఘాతంబులన్=కాలి త్రొక్కుడులచే, వార్థి=సముద్రము, ఘూర్ణిల్లఁగన్=కలఁత చెందఁగా, అదను=సమయము, పారావార మధ్యంబునన్=సముద్రమునడుమ, వింధ్యగ్రావ తుల్యంబుగాన్ = వింధ్య పర్వతముతో సమానముగా, అతిమెన్=అతిక్రమించెను, ఉదధిన్=ఉదధియును=సముద్రమును.

తాత్పర్యము

పాదఘట్టనములచే సముద్రము కలఁత చెందఁగా నడ్డము లేక పోరుచోఁ గొంచెము సమయము లభింపఁగాఁ గుంభునిఁ బట్టుకొని సుగ్రీవుఁడెత్తి సముద్రములోఁ బాఱవైచెను. అప్పుడు వింధ్యపర్వతము నీళ్ళలోఁబడినట్లుగా వాఁడు పడఁగా సముద్రముపొంగి నీళ్ళులేనిస్థలమును గట్టుమీఁద నాక్రమించెను. అప్పుడు కుంభుఁడు శౌర్యముచే భయంకరుఁడై.

ఉ. కోపము రూపముం గొనిన•కోపున వారిధి నుద్గమించి పై
ల్లేవున దాపునం దుమికి యింద్రపవిస్ఫుట వేగముష్టి సా
టోపత గ్రుద్దినన్ మెయి క•పుంగడుఁ జీలి స్రవించె రక్తజా
లాపగ తత్ప్రహారమున•నాఁచెఁ దదంగగతాస్థిసంతతుల్. ౧౨౫౧

అర్థములు. కోపునన్ = విధముగా, వారిధిన్ = సముద్రమునుండి, ఉద్గమించి = ఎగిరి, దాపునన్ = సుగ్రీవుని సమీపమందు, ఇంద్రపవిస్ఫుట=ఇంద్రుని వజ్రాయుధమువలె విశదమైన, వేగ = వేగముగల, ముష్టిన్ = పిడికిట, పాటో

పటిన్=వేగిర పాటుతో, రక్త+జాల + ఆపగ = రక్త సమూహానది, తత్ప్రహారమును = ఆ దెబ్బను, తదంగగత = అతని దేహమునందున్న, అస్థిసంతతుల్ = ఎముకల గుంపులు.

తాత్పర్యము

కోప మాకారము వహించిన విధముగ సముద్రమునుండి లేచి మిగుల బలముతో సుగ్రీవు సమీపమందు దుమికి యింద్రుని వజ్రాయుధము యొక్క విశద వేగముగల ముష్టిచే వేగిర పాటుతో గ్రుద్దఁగా దేహము మిక్కిలి చీలి వానినుండి నెత్తుటి వంక ప్రవించెను. ఆ దెబ్బను ఆ దేహము నందున్న యెముక లాఁపెను. లేనియెడల ప్రాణములు పోయి యుండునని భావము.

తే. దివిజపతి మేరుపక్షముల్ • ద్రెంచునపుడు, వజ్రనిష్పేషసంజాత • వహ్నియనఁగఁ
బిడుగునకు నుద్ది యైన యా • వ్రేటువలన, వింతరుచిదోఁచె నాహరి • కాంతుమేన.

అర్థములు. మేరుపక్షముల్ = మేరుపర్వతముయొక్క రెక్కలు, వజ్రనిష్పేష = వజ్రముయొక్క తాపుచే, సంజాత = పుట్టిన, వహ్ని = అగ్ని, వింతరుచి=క్రొత్తకాంతి.

తాత్పర్యము

ఇంద్రుఁడు మేరుపర్వతము రెక్కలు నఱకునపుడా వజ్రముయొక్క రాపిడిచే పుట్టిన వహ్నివలెఁ బిడుగునకు సమానమైన యా దెబ్బలవలన సుగ్రీవుని దేహమునందు క్రొత్త కాంతి కానవచ్చెను.

ఉ. హుమ్మని వానరేంద్రుఁడు స • ముజ్జ్వలహేతిసహస్రభాసురం
బయ్యహిమకారి మండలము • నట్టి దృఢంబును శక్రవజ్రక
ల్పమ్మును నైనముష్టి బిగ • బట్టి తదాశరువక్ష ముద్ధతిన్
గ్రుమ్మినఁ దత్ప్రహారమునఁ • గూలెను గుంభుఁడు విహ్వలాత్ముఁడై ౯౩

అర్థములు. సముజ్జ్వల = మిక్కిలి ప్రకాశించు, హేతిసహస్ర = వేయి కిరణములచే, భాసురంబు=ప్రకాశించునదియు, అహిమకారి మండలము = సూర్యమండలము, అట్టి = అటువంటి, దృఢంబును=గట్టిదియు, శక్రవజ్రకల్పమ్మును = ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైన, ఆశరు వక్షము = రాక్షసు రొమ్ము, ఉద్ధతిన్ = పెద్దదెబ్బచేఁ గ్రుమ్మినన్ = పొడవఁగా, తత్ + ప్రహారమునన్ = ఆ దెబ్బచే, విహ్వలాత్ముఁడై=చలించిన ప్రాణముగలవాఁడై, కూలెను=పడెను.

తాత్పర్యము

సుగ్రీవుఁడు వేయి కిరణములచేఁ బ్రకాశించు సూర్యమండలమువలె దృఢమైనదియు, ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైనదియు నగు పిడికిలిని బిగఁబట్టి హుమ్మని గ్రుమ్మఁగా నా దెబ్బకు విరవిరపోవు ప్రాణములు గలవాఁడై కుంభుఁడు నేలఁబడెను.

కం. శూలితిరస్కృతఖరకర,మాలి యసం బ్లవగనాథ•మర్దితుఁడై తా
నేలఁబడి తన్నుకొని వి,జ్వాలం బగు వహ్నివోలెఁ • బలలాదుండున్. ౧౭౫౮

అర్థములు. శూలితిరస్కృత=శూలిచే ధిక్కరింపఁబడిన, ఖరకరమాలి = సూర్యుఁడు, ప్లవగనాథమర్దితుఁడై = సుగ్రీవునిచేఁ గొట్టఁబడినవాఁడై, విజ్వాలంబు=జ్వాలలు చల్లారిన, పలలాదుఁడు=రాక్షసుఁడు.

తాత్పర్యము

దక్షయాగకాలమున శివునిచే ధిక్కరింపఁబడిన సూర్యునివలె వానరపతిచేఁ గొట్టఁబడి యా రాక్షసుఁడు నేలఁబడి తన్నుకొని జ్వాలలు చల్లారిన యగ్నివలె.

కం. దివినుండి లోహితాంగుఁడు, భువిఁ గూలిన యట్లు ప్లవగ • పుంగవహతుఁడై
భువిఁ గుంభుఁడు పడ వడఁకెన్, సవనాద్రిధరిత్రియసుర•సంతతి బెగడెన్.

అర్థములు. లోహితాంగుఁడు = ఎఱ్ఱని దేహము గలవాఁడు, అంగారకుఁడు. "అంగారకః కుజో భౌమో లోహితాంగో మహీసుతః" అమరము. సూర్యుఁడు నెఱ్ఱనివాఁడే కావున సూర్యుఁడని చెప్పినను జెప్పవచ్చును ప్లవంగపుంగవహతుఁడై = వానరశ్రేష్ఠునిచేఁ జంపఁబడినవాఁడై, సవనాద్రి ధరిత్రి = వనములతో కొండలతోఁ గూడిన భూమి, బెగడెన్ = భయపడెను.

తాత్పర్యము

• ఆకాశమునుండి యంగారకుఁడు నేలఁ గూలినట్లు వానరశ్రేష్ఠుఁడగు సుగ్రీవునిచేఁ జంపఁబడి నేలమీఁదఁ గుంభుఁడు పడఁగా వనములతోఁ గొండలతోఁగూడిన భూమి గడగడ వడకెను. రాక్షస సమూహము భయపడెను.

## —• ౭౭-వ సర్గము. నికుంభుఁడు కపులఁ బాఱఁదోలుట •—

ఉ. కుంభు నిజాగ్రజుం బ్లవగ•కుంజరుఁ డిట్లు వధింప రోషసం
రంభవిజృంభితుం డగుచు • మంటలు గ్రమ్మెడిచూడ్కిచేత సం
స్తంభితుఁ జేయున ట్లదరి • స్రక్కనకాంబరభూషితంబు ను
త్తంభితశృంగసన్నిభము • దత్తకరాంగుళిపంచకంబునున్. ౧౭౫౯

అర్థములు. నిజాగ్రజున్ = తన యన్నను, రోషసంరంభ విజృంభితుండు= రోషముచేతను తత్తఱపాటుచేతను విజృంభించినవాఁడు, సంస్తంభితున్=నిశ్చలునిఁగా, అదరి = ఎదిరించి, స్రక్+కనకాంబర భూషితంబు=పూలహారముల చేతను, బంగారు సొమ్ములచేతను నలంకరింపఁబడినది, ఉత్తంభిత శృంగసన్నిభము = పైకెత్తుటచే పొడుగుగాఁ జేయఁబడిన, ఉత్ + స్తంభిత, ఉత్తంభిత, దత్త=సమర్పింపఁబడిన, అంగుళి పంచకము=ఐదు వ్రేళ్ళు గలది, కుంకుమ చందనాదులందు చేతులద్దియట్టి యైదు వ్రేళ్ళేర్పడునట్లుగా నద్దఁబడినది. ముందు పద్యముతో నన్వయము.

తా త్ప ర్య ము

తన యన్నయగు కుంభుని సుగ్రీవుఁ డిట్లు వధింపగా రోషముతోను తత్తర పాటుతోను విజృంభించి మంటలు గ్రమ్ముచున్నచూపు చేతనే యతని మొద్దుపాలు నట్లు చేయువానివలె నెదిరించి పూలహారముల చేతను, బంగారు సొమ్ముల చేతను నలంకరింపఁబడినదియు, ఎత్తగు శిఖరముతో సమానమైనదియు, ఐదు వ్రేళ్ళ గురుగలదియు.

సీ. యమదండతుల్యంబు ♦ నఖిలరాక్షసలోక, భయనాశకం బైన ♦ పరిఘ మెత్తె
నల నికుంభుఁడు వక్ష♦తలగతనిష్కంబు, లంగదంబులు మెఱుఁ♦గారు చుండఁ
గుండలంబులు కాంతి♦మండలంబుల నీనఁ, బరిఘంబుతో వాఁడు♦ప్రజ్వలించె
శంపాలతాయుత ♦ జలదంబుచూడ్కిఁని, దాని త్రిప్పునఁ బుట్టు ♦ దారుణాగ్ని
తే. చే మహావాయువులు మండు ♦ చెలువుఁ జూపె,
నలక గ్రహతారకలును మ ♦ హాగ్రహాళి
చందురుండును భువనంబు ♦ సకల మింద్ర
పురముతోఁ గూడ భ్రమియించు ♦ కరణి నుండె. ౧౦౫౭

అర్థములు. యమదండతుల్యంబు=యముని దండముతో సమానమైనది, అఖిలరాక్షస లోక భయ నాశకంబు = సమస్త రాక్షస సమూహముల భయము నాశము చేయునదియు, పరిఘము=ఇనుపకట్టు గుదియ, వక్షస్తల గతనిష్కంబులు= ఱొమ్మున నుండు పతకములు, అంగదంబులు=భుజకీర్తులు, శంపాలతాయుత జలదంబు=మెఱపుతీఁగలతోఁ గూడిన మేఘమువలె, అలక = కుబేరపట్టణము, భ్రమి యించు = గిరగిర తిరుగు.

తా త్ప ర్య ము

యమ దండముతో సమానమైనది సర్వరాక్షస భయము పోఁగొట్టునది యగు నినుపకట్ల గుదియనెత్తి యా కుంభుండు ఱొమ్మున నుండు పతకంబులు భుజకీర్తులు మెఱుఁగు లీనుచుండ, చెవులయందలి పోగులు కాంతిసమూహములు గల్పించుచుండఁ, బరిఘంబులతో వాఁడు మెఱుపుఁదీగెలతోఁగూడిన మేఘమువలె వెలిఁగెను. అది త్రిప్పుటచేఁ బుట్టు భయంకరాగ్నిచే, ఆవహ ప్రవహ నివహ ప్రవహాది మహావాయువులు మండునట్లుండెను. అలకాపురము బుధుఁడు లోనగు గ్రహములు అశ్విని మొదలగు నక్షత్రములు మహాగ్రహములు శుక్రుఁడు మొద లగునవి - రాత్రివేళ కావున సూర్యుఁడు చెప్పఁబడఁడు. చంద్రుఁడు ఇంద్రుఁబట్ట నముతోడ సకల ప్రపంచము తిరుగు నట్లుండెను.

కం. పరిఘాభరణప్రభలం, బరఁగి, నికుంభాగ్ని కీల ♦ వరులకుఁ గల్పో
ద్ధురవహ్నివోలె సైఁపం, దర మేమియుఁ గామి మిగులఁ♦దరలిం భీతిన్.

అర్థములు. పరిఘ ఆభరణప్రభలన్ = గుదియను వేసిన భూషణముల కాంతులచే. పరఁగి = వ్యాపించి, నికుంభాగ్ని = నికుంభుఁ డను నగ్ని, కల్పోద్ధుర వహ్నివోలె=ప్రలయకాలమందలి యధికమైన యగ్నివలె, తరలిరి=పఱచిరి.

తాత్పర్యము

గుదియను వేసిన సొమ్ముల కాంతులను జ్వాలలచే వ్యాపించి నికుంభుఁ డను నగ్ని వానరశ్రేష్ఠులకు ప్రలయకాలమందలి యధికమైన యగ్నివలె కొంచెమైన సహింపరాకుండుటచే భయపడి వణఁకిరి.

కం. కదలక మెదలక యేమియుఁ, బెదవులఁ దడి లేక యొసఁగు • వెలఁపున పసురల్
మద మఱి కేశులు నిలఁబడి, యెదవక కోకఁగంపు హనుమ • యెదురన్ నిలిచెన్.

అర్థములు. ఎదవడక = భయపడక.

తాత్పర్యము స్పష్టము.

—• హనుమంతుఁడు నికుంభు వధించుట •—

చ. నిలిచిన వాయుపుత్త్రుఁ గని • నిష్ఠురవృత్తి నురంబుఁ జూచి య
బ్బలియుఁడు దాని పైవ నది • పావనిఁ దాఁకిన యంతఁ దునకలై
పొలుపఱి పెక్కులుల్కలన • భూమిని వ్రాలె దదాహతిని ధరా
చలనమునందు శైల మనఁ • జంచలతం గని పావమానియున్. ౧౨౬౦

అర్థములు. నిష్ఠురవృత్తిన్ = కఠినమైన చలనముచే, పొలుపఱి = అందము చెడి, ఉల్కలు = కొఱవులు, తదాహతిన్ = ఆ దెబ్బచే, ధరాచలమునందు = భూకంపమందు, చంచలతంగని = వణఁకి, పావమాని = హనుమంతుఁడు.

తాత్పర్యము

నిలువఁబడిన హనుమంతునిఁ జూచి కఠినవర్తనముచే నతనియురంబు గుఱి చూచి యబ్బలశాలి దానిని వేయఁగా నది హనుమంతుని ఱొమ్ము దాఁకినంతనే తునకలై యందము చెడి యనేకములగు కొఱవులవలె నేలమీఁదఁ బడెను. ఆదెబ్బచేత హనుమంతుఁడు భూకంపమందు పర్వతమువలె వణఁకెను.

కం. ఉడుగక వెంటనె బెడిదపుఁ, బిడికిటిపోటున నికుంభు • వే తాఁచిన వాఁ
డడలియు దెప్పిరి కపిపైఁ, బడిపట్టెన్ దనుజు లార్వఁ • బ్రముదితు లగుచున్.

అర్థములు. తాఁచినన్ = కొట్టఁగా, తెప్పిరి = తెప్పరిల్లుకొని, ప్రముదితులు = సంతోషించినవారు.

తాత్పర్యము స్పష్టము.

కం. పట్టువడియుండి గాడుపు, పట్టియు దృఢముష్టిఁ బొడిచి • పగతుని బలిమిన్
బట్టు విడఁగొట్టికొని మఱి, కొట్టెం గడు హెచ్చరికను • గూలఁగ ధరణిన్.

తాత్పర్యము స్పష్టము.

తే. పృథివిఁ బడఁదన్ని యతనిపై • కెగిరి వేగ, చక్కఁబిగఁబట్టి మెడఁద్రిప్పి • శాత్రవుండు
గర్జిలుచునున్న వికృతక • కాలనులిమి, మృత్యువునుగూర్చ యొక్కఁడి • మేవమునను.

అర్థములు. గర్జిలుచునున్న = కూఁతలు పెట్టుచున్నను, నులిమి = నలిపి.

తాత్పర్యము స్పష్టము.

ఇంద్రవంశము. కుంభానుజన్ముండిటు • గూల నేలపై, గంభీర రావంబున •
శాఖామృగ రాటులున్
శుంభద్గతిన్ సమ్మద•శుద్ధచిత్తులై, జృంభించి గర్జించిరి•పృథ్వియాడఁగన్.

అర్థములు. కుంభానుజన్ముండు = కుంభుని తమ్ముఁడు, రావము = ధ్వని, శాఖామృగ రాటులు=వానరులు, శుంభద్గతిన్ = ప్రకాశించు విధముగా, సమ్మద శుద్ధ చిత్తులై=సంతోషముతోఁ గూడిన నిర్మలమైన మనస్సుగలవారై, ఇంద్రవంశము. తతజర గణంబులు, ఎనిమిదింట యతి.

తాత్పర్యము స్పష్టము.

యుద్ధదినముల లెక్క రెండు విధము లని ముందు చెప్పఁబడెను. అందు మొదటి పక్షము ప్రకారము కుంభాదుల వధము నవమినాఁడు. రాత్రి మకరాక్ష వధము, దశమి యుదయాన జరిగినదని యొఱుఁగునది. ఈపక్షమున నాక్షేపణీయములు పెక్కులున్నవి. రెండవ పక్షమున అకంపనవధ, ప్రహస్తవధ, రావణముకుట భంగము, కుంభకర్ణవధ, దశమి యుదయాదిగా జరిగినవి, బ్రహ్మాస్త్రబంధము దశమి సాయంకాలము. ఆ మునిజామున బ్రహ్మాస్త్ర మోక్ష లంకాదాహ కుంభ నికుంభ యూపాక్ష శోణితాక్ష ప్రజంఘ కంపనమకరాక్షులవధ యని యొఱుఁగునది. నరాంతకాది యుద్ధమునందుఁగాని కంపనాది యుద్ధమందుఁగాని యొకరు చచ్చువఱకు మఱి యొకరు కాచి వేడుక చూచుచుండి రని తలఁపరాదు. నలువురు నేక కాలమందే యుద్ధము చేసినను నట్లు చెప్పుట సాధ్యముకాదు. కావున వారివారి యుద్ధము వేఱు వేఱుగఁ జెప్పఁబడెను. కావున నించుమించుగ నందఱు నేక కాలముననే చచ్చినవారే.

## —• ౭౮-వ సర్గము. మకరాక్షుఁడు యుద్ధమునకు వెడలుట •—

సీ. కుంభనికుంభులు•కుంభిని పాలౌట, విని రావణుఁడు రోష•వివశుఁడగుచుఁ
క్రోధశోకంబుల • బాధితుండై మండి, పడి మూర్ఛితుం డయి • ప్రకటబలుని
ఖరపుత్రు మకరాక్షుఁ•గనిపలుకెఁ బుత్రకా!, నాయాజ్ఞఁ బ్రబల సే•నలు భజింపఁ
జని వానరుల రామ•చంద్రుని లక్ష్మణు, హతులఁ గావింపు నా•యన! యటన్న
తే. నట్లె యనుచును వలగొని•పంక్తివదను, వందనము సల్పి యిల్వెడి•బయటవచ్చి
సైన్యనాథునితోఁ డనా•స్యందనంబుఁ, దెమ్ము సైన్యంబుఁ గూర్పుమా•రమ్ము లోన.

అర్థములు. వలగొని=ప్రదక్షిణించి, స్యందనము=తేరు.

తాత్పర్యము

కుంభనికుంభులు నేలపాలౌట విని రావణుఁడు రోషముచేఁ బరవశుఁడై క్రోధము చేతను శోకము చేతను బీడింపఁ బడినవాఁడై మండిపడి మూర్ఛపోయి లేచి ప్రసిద్ధబలుఁడును ఖరునిపుత్రుఁడు నగు మకరాక్షుఁ జూచి కుమారా! నా యాజ్ఞచే ప్రబలమైన సేనలు కొలువఁగాఁ బోయి వానరులను రామలక్ష్మణులను చంపుము అని చెప్పఁగా, అట్లులే చేసెద నని చెప్పి ప్రదక్షిణనమస్కారములు చేసి

యిల్లు వదలి వెలుపల వచ్చి సేనానాయకునితో నాతేరు తెమ్ము. శీఘ్రముగ నావెంట వచ్చు సేన గూర్పుము అని చెప్పఁగా.

చ. అనవుడు నట్లు గూరుప శతాంగము ముంగలఁ దాఁ బ్రదక్షిణం
బొనరిచి యెక్కి సూతుఁడ ? సముగ్రజవంబునఁ దోలుమీ యటం
చని నిశిచారులార! రథసంబున మీరలు మత్పురస్థులై
యని నొనరింపుఁ డేనును దశాస్యునియానతి మేర నుద్ధతిన్. ౧౦-౧౬

అర్థములు. శతాంగము ముంగల = తేరికి ముందు భాగమున, సముగ్ర జవంబునన్ = అతివేగమున, రథసంబునన్ = త్వరగా, మత్పురస్థులై = నాకు ముందున్నవారై, అని = యుద్ధము, ఉద్ధతిన్ = గర్వముతో.

తాత్పర్యము

ఆ ప్రకారమే యతఁడు సేనగూర్చి యీయఁగా తేరి ముందు ప్రదక్షిణము చేసి యెక్కి సారథీ! యతివేగంబునఁ దేరిని దోలుము అని చెప్పి రాక్షసులారా! మీరు వేగముగ నాకు ముందున్నవారై యుద్ధము చేయుఁడు. నేను రావణునియాజ్ఞ ప్రకారము.

తే. రామలక్ష్మణులను గపిరాజుఁ దక్కఁ,గల వనేచరసంఘంబుఖడ్గబాణ
శూలవహ్నుల దావాగ్ని శుష్కవనము, చందముగ నిర్దహింతు నమందగతిని.

అర్థములు. దావాగ్ని = కార్చిచ్చు, శుష్కవనము = ఎండినయడవి నిర్దహింతును=కాల్చివేయుదును, అమందగతిని=వేగముగ.

తాత్పర్యము స్పష్టము.

కం. అనవుడు రాక్షసవీరులు, సునిశితనానాయుధములశోభలు నిండన్
ఘనవర్షరులన గర్జించుచు, మొన నిల్చిరి కామరూపములఁ దాల్చి వెసన్.

అర్థములు. సునిశిత=పదునుగల, శోభలు=కాంతులు, ఘనవర్షరులవన్= పెద్దయేనుఁగులో యనునట్లు, కామరూపములన్ = వారువారు కోరిన యాకారమును, మొనన్ = సేనయందు.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా రాక్షసవీరులు వాఁడిగల పలుతెగలగు నాయుధముల కాంతులు నిండునట్లు చూడఁగా పెద్ద యేనుఁగులవలె గర్జించుచు కోరిన రూపములు ధరించిన సేన యందు నిల్చిరి.

తే. శంఖభేరీసహస్రనిస్స్వనములను, క్ష్వేళికాస్ఫోటితంబులవికటరవము
చాపగుణటంకరణములుసంకులముగఁ, బర్వవడచిరి మకరాక్షుబలసి యనికి.

అర్థములు. శంఖభేరీ సహస్ర నిస్స్వనములను=వేలకొలఁదులగు శంఖములయు, నగారాలయు ధ్వనులును, క్ష్వేళికాస్ఫోటితంబుల=అఱపులయు సింహనాదములయు, వికటరవము =భయంకర ధ్వనులును, చాపగుణ టంకరణము = వింట్ర

యుల్లెత్రాటి టంటమ్మను ధ్వనులు, సంకులముగన్=ఒక్కటిగఁ గలసినవై, పర్వ=వ్యాపింపఁగా, బలిసి=చుట్టుకొని, అనికిన్=యుద్ధమునకు.

తాత్పర్యము స్పష్టము.

చ. అరుగు ఖరాత్మజాతుని ర•థాగ్రగతంబు ధ్వజంబు నేలపైఁ
  దొరఁగెను, సూతు చేచబుకు•దూలె, హయంబులు గాళ్ళుత్రొటిలన్
  గురుపులు వాఱి కశ్రులను•గార్చె నదైన్యములై, సపాంసులై
  పొరిఁ బ్రతికూలవాయువులు•ఘోరుస వీచెను దారుణంబుగన్. ౧౮౭౦

అర్థములు. రథాగ్రగతంబు = తేరిపై భాగమున నుండునది, చేచబుకు = చేతికోలడా, తూలెన్ = పడిపోయెను, త్రొటిలన్ = తడఁబడఁగా, గురుపులు వాఱి=వేగముగఁ బరువెత్తి, అశ్రువులను=కన్నీటిని, సపాంసులై = ధూళితోఁ గూడినవై.

తాత్పర్యము

పోవుచున్న ఖరుని కుమారుని రథము కొననున్న ధ్వజము నేలపై బడెను. సారథిచేతి కోలడా జాఱిపడెను. గుఱ్ఱములు కాళ్లు తడఁబడఁగా త్వరగా పరువెత్తి దుఃఖముతోఁ గన్నీళ్లు కార్చెను. దుమ్ముతోడ నెదురుగాలి భయంకరముగ వీచెను.

కం. బహుముఖ్యకునము లైనను, సహియించి గజాహి మేఘ•సమవర్ణులు దా
  రహమిక నసురులు దుస్సహతేజుని రామచంద్రు•చక్కటి కరుగన్. ౧౮౭౧

అర్థములు. గజ, అహి, మేఘసమవర్ణులు=ఏనుఁగుల, పాముల, మబ్బుల వన్నె గలవారు, అహమహమిక = నేను ముందనిన నేను ముందనుచు, దుస్సహతేజుని=సహింపరాని తేజస్సుగల, చక్కటికి=ఉన్న ప్రదేశమునకు సరిగా.

తాత్పర్యము

అనేకములు దుశ్శకునములైనను నోర్చుకొని ఏనుఁగు, పాము, మేఘము వీనితో సమానకాంతి గల రాక్షసులు నేను ముందు పోయెద ననిన నేను ముందు పోయెద నని సహింపరాని తేజస్సుగల రామచంద్రమూర్తియున్న చోటుకు సరిగా బోయిరి.

—• ౭౯-వ సర్గము. మకరాక్షుఁడు శ్రీరాముఁ దూలనాడుట •—

చ. ప్లవగుల నంటఁ దాఁకుటయు•వారల కద్భుతరోమహర్షణం
  బవు సమరంబు చెల్లఁ బరి•ఘాయుధశూలనిహంత లుర్వీభృ
  న్నివహకుజాళిమారకులు•నిష్ఠురముష్టికలంబ తాడితుల్
  వివిధగదాసికుంతశర•వృక్షశిలాచయభిన్న గాత్రులున్. ౧౮౭౨

అర్థములు. అద్భుత రోమ హర్షణంబు = ఆశ్చర్యకరము, గగ్గురుపాటు గలిగించునది, సమరంబు=యుద్ధము, నిహంతలు = చంపఁ బడ్డవారు, ఉర్వీభృన్నివహ = పర్వతముల గుంపుల చేతను, కుజాళీ = చెట్లగుంపుల చేతను, మారకులు =

చంపువారు, నిష్ఠుర ముష్టికలంబ తాడితుల్ = కఠినములైన పిడికిళ్ళచేతను, బాణములచేతను, గొట్టఁబడినవారు, వివిధ=అనేక విధములైన, గద=గదలచేతను, అసి=కత్తులచేతను, కుంత = ఈఁటెలచేతను, శర = బాణములచేతను, వృక్ష = చెట్లచేతను, శిలాచయ = తాల సమూహముచేతను, భిన్నగాత్రులన్ = విఱుగఁగొట్టబడిన దేహములు గలవారు, రాక్షసు లాయుధములతోఁగొట్టిన వానరులు తాలు చెట్లు పిడికిళ్ళతో గొట్టిరని భావము.

తాత్పర్యము

వానరులను సమీపించి తాఁకుటయు, వానర రాక్షసులకు నాశ్చర్యకరమై, గగుర్పాటు గలిగించు యుద్ధము జరిగెను. అందు గుదియలచేతను శూలములచేత జంపినవారును కొండలచేత, వృక్షములచేతఁ జంపినవారును, కఠినములగు పిడికిళ్ళచేత బాణములచేతఁ గొట్టఁబడినవారును నానావిధములైన గదలచేతను కత్తులచేతను ఈఁటెలచేతను బాణములచేతను చెట్లచేతను తాలసమూహములచేతను ఛేదింపఁబడిన దేహములు గలవారును,

చ. అయి సమరంబు చెల్ల మక • రాక్షుని వేఁడిమి కంప వెల్లికిన్
భయమున నెల్ల వానరులు • పాఱఁగ వెన్కొని రాక్షసావళుల్
రయమునఁ దోలఁ గోపమున • రాముఁడు వారల నిల్వరించె దు
ర్జయపరసంఘభీతికర • శాతమహాశుగతీవ్రవృష్టిచేన్. ౧౦౭౩

అర్థములు. సమరంబు = యుద్ధము, వేఁడిమికిన్ = ప్రతాపమునకు, అంప వెల్లికిన్ = బాణముల ప్రవాహమునకు, తోలన్ = తఱుమఁగా, దుర్జయ=జయింపరాని, పర = శత్రువుల, సంఘ=సమూహమునకు, భీతికర = భయము కలిగించు, శాత=వాఁడియైన, మహా=గొప్పదగు, ఆశుగ=బాణముల, తీవ్రవృష్టిచేన్ = అధికమైన వానచే.

తాత్పర్యము

కలదై యుద్ధము జరుగఁగా మకరాక్షుని ప్రతాపమునకు వాని బాణముల ప్రవాహమునకు భయపడి వానరులందఱు తమ్ము రాక్షసులు తఱుముకొని రాఁగా బఱవెత్తిరి. ఇట్లు వానరులనుఁ దఱుము రాక్షసులను జూచి కోపించి రామచంద్రమూర్తి జయింపరానట్టివియు శత్రువులకు భయంకరము లయినట్టివియు నగు వాఁడి బాణముల మహావర్షముచే వారిని పైపడి రాకుండ నిలువరించెను.

కం. వారితదనుజుల శరసంవారము గురియించు రామభద్రునిఁ గని రో
షారంభుఁడు మకరాక్షుఁడు, ధీరత నిట్లనియె రామ • దేవునితోడన్. ౧౦౭౪

అర్థములు. వారిత = నివారింపఁబడిన, దనుజులన్ = రాక్షసులను, శర సంవారము=బాణసమూహము, రోషారంభుఁడు=రోషముతోఁ గూడిన త్వరగలవాఁడు, ధీరతన్=ధైర్యముతో.

తాత్పర్యము

ఆడగింపఁ బడిన రాక్షసులను బాణసమూహములను గురియించు రామ చంద్రమూర్తిని జూచి రోషముతోడి త్వరగల మకరాక్షుఁడు ధైర్యముతో రామ దేవునితో నిట్లనియె.

చ. నిలు నిలు రామ! యేమిటికి ♦ నిక్కెదు? నే నిదె యున్నవాఁడ, నీ
 బలువును జూడ వచ్చితిని ♦ ద్వంద్వరణంబున నీదు ప్రాణముల్
 బలియిడువాఁడ మేదినికిఁ ♦ బాఱకు, నా చను దేనిచోట నీ
 వలవున నాదు తండ్రి ఖరు ♦ నంతకుఁ గూర్చితి దండకాటవిన్. ౧౨౬౫

అర్థములు. బలువు=బలము, మేదినికిన్ = భూమికి, పాఱకు = పరువెత్తి పోకుము, నాచను దేనిచోట=నేను రానిచోట, అలవునన్ = పరాక్రమముచే, అంతకున్=యముని, తేతేరులు తెచ్చునకగు. సు. వ్యా. క్రియ ౧౦౨ సూ. చను దెంచు- చను దేరు - చనుదే యనియగు.

తాత్పర్యము

నిలు నిలు రామా! ఏల గర్వించి మిడిసిపడెదవు? ఇదిగో నేనున్నాఁడను. నీ బల మే మాత్రమో చూడవచ్చితిని. ద్వంద్వయుద్ధమునందు నీ ప్రాణములను భూమికి బలియిచ్చెదను. పరువెత్తిపోకుము. నేను రానిచోట నాతండ్రిని పరాక్ర మించి నీవు దండకారణ్యమునఁ జంపితివి.

ఉ. నా యెదుటం బరాక్రమము ♦ నన్ విలసిల్లెడి నిన్నుఁ జూచినం
 గాయము మండెడిన్ ఖలుఁడ ♦ కాలము నా కనుకూల మాటచే
 సాయము చేసె దైవమును ♦ స్వల్పమృగంబు క్షుధార్త సింహ సం
 స్థాయముఁ గూర్చినట్లు నిను ♦ నాదట నిల్పె మదీయసన్నిధిన్. ౧౨౬౬

అర్థములు. ఖలుఁడ = దుష్టుఁడ, కాయము = దేహము, సాయము = సాహాయ్యము, తోడుపాటు, క్షుధార్త=ఆకలిచే బాధపడు, సింహ = సింహము యొక్క, సంస్థాయము=గృహమును, వాసస్థానమును, ఆదటన్=ప్రేమచే.

తాత్పర్యము

నా యెదుటఁ బరాక్రమముఁ జూపు నిన్నుఁ జూడఁగా దుష్టుఁడా! దేహము మండుచున్నది. కాలము నా కనుకూలించుటచే దైవము నాకుఁ దోడుపడెను. ఏమి చేసినందువా? ఆఁకలిగొన్న సింహముండు గుహయొద్దకు స్వల్ప మృగమును దెచ్చి నిల్పినట్లు నా యొద్దకు నిన్నుఁ దెచ్చిపెట్టెను. నేను నిన్ను వెదకికొనుచు వచ్చు శ్రమము దప్పినది. ఇది సాహాయ్యము కాదా!

కం. నాచే వని నిహతిం గని, వే చని సూర్యాత్మజాతు ♦ వీటికి నట మున్
 నీచేఁ జచ్చిన వీరని, శాచరులున్ నీవు క్రీడ ♦ నల్పుఁడు చెలిమిన్. ౧౨౬౭

అర్థములు. అనిన్ = యుద్ధమందు, నిహతింగని = చచ్చి, వే = త్వరగా సూర్యాత్మజాతు = యమునియొక్క, వీటికిన్ = పురమునకు, అటన్=ఆ ప్రదేశమందు, చెలిమిన్=స్నేహముతో.

నీవు నాచే జచ్చి త్వరగా యమపురమునకుఁబోయి యచ్చటఁ బూర్వము నీచేఁ జచ్చిన రాక్షసులు నీవు స్నేహభావము గలవారై క్రీడింపుఁడు.

ఉ. ఏటికిఁ బెక్కుమాటలు న•రేశ్వర! యెల్లరుఁ జూచువారు నీ
యేటును నాదుపోటు, నిపు•డే గదనో యిత రాస్త్రశస్త్రముల్
కోటినొ రిత్తచేతులనొ•కోరెద వెయ్యది యొందు నీవు మేల్
పోటరి వద్ది యర్థిఁగొని•పోరికి రమ్మన మందహాసియై. ౧౦౭౪

అర్థములు. ఎల్లరు = ఎల్లవారు, సమస్త జనులు ఇపుడే = ఈ గడియయందే, శస్త్రములన్ + కోటినొ=శస్త్రముల యొక్క కోటినో, పోటరివి=శూరుఁడవో, అర్థిఁగొని=కోరికొని, మందహాసియై=చిఱునవ్వు గలవాఁడై.

తాత్పర్యము

రాజా! యేల! యెక్కువమాటలు చెప్పవలెను. నీదెబ్బ నా ప్రతాపము నీ గడియయందే సమస్తజనులు చూచువారు. నీవు గదాయుద్ధమందే సమర్థుఁడవో, అస్త్రయుద్ధమందే సమర్థుఁడవో, శస్త్రయుద్ధమందే సమర్థుఁడవో లేక రిత్తచేతుల మల్లయుద్ధమందే సమర్థుఁడవో, దేనియందు నీకు విశేషసామర్థ్యము గలదో దానినే కోరికొని యుద్ధమునకు రమ్ము. అనిన రామచంద్రమూర్తి చిఱునవ్వు నవ్వి.

కం. ఏటికి వికత్థనములు ని, శాటుఁడ! యేమే మొ ప్రేల•వ్యర్థముగ ననిన్
బోటరితనమునఁ గాకిటు, మాటలబలమునను జయము•మసఁగునె యెందున్.

అర్థములు. వికత్థనములు = ఆత్మస్తుతులు, తన్నుఁ దాను బొగడుకొను మాటలు, పోటరితనమునన్=శౌర్యమున, మసఁగునె=ప్రాప్తించునా?

తాత్పర్యము

ఓరీ రాక్షసుఁడా! నిన్ను నీవే పొగడుకొనుచు నేమేమో నిష్ప్రయోజనముగ వదరెదవేల? యుద్ధమునందు జయము శౌర్యమున వచ్చునుగాని మాటల బలమున వచ్చునా?

ఉ. ఆలమునఁ జతుర్దశస•హస్రనిశాటము సేన దండకన్
బాలిశ! దూషణుం ద్రిశిరుఁ•ద్వత్పితనేఁ బొరిగొం టెఱుంగవా?
హాళిని దీక్ష్ణతుండనఖ•రాంకురగృధ్రసృగాలమాళికల్
చాలఁగఁ ద్వచ్ఛరీర తర•సంబు భుజించుత ముక్కుబంటిగన్. ౧౦౭౫

అర్థములు. చతుర్దశ సహస్ర నిశాటము=పదునాలుగు వేల రాక్షసులఁగలది,

శాలిశ=మూర్ఖుఁడ, శాలిని=ఆసక్తితో, తీక్ష్ణ = కూచియగు మొనగల, తుండ= ముక్కు, నఖరాంకుర=మొలకలవంటి గోళ్ళుగల, గృధ్ర = గ్రద్దలు, సృగాల = నక్కలు, మూకభుల్ = కాకులు, త్వత్ = నీయొక్క, శరీరతరసంబు = దేహము నందలి మాంసమును, ముక్కుబంటిగన్ = ముక్కులవఱకు వచ్చువఱకు, భుజించుతన్ = తినును గాక.

తాత్పర్యము

యుద్ధమునందు దూషణుని త్రిశిరుని, నీతండ్రిని బదునాలుగు వేల రాక్షసులను జంపినవాఁడను నేనని యెఱుంగవా? వాఁడియగు ముక్కులు గోళ్ళుగల గ్రద్దలు, నక్కలు, కాకులు నాసక్తితోఁ గడుపులునిండి ముక్కుమునుఁగ నీదేహము నందలి మాంసమును దినును గాక.

—♦ శ్రీరాముఁడు మకరాక్షు వధించుట ♦—

చ. అనవుడు రామచంద్రుని శ ♦ రాధిక వృష్టిని ముంచె దైత్యుఁ డా
ఘనశరపాళినెల్ల నిజ ♦ కాండములన్ హరియించె రాముఁడున్
దనుజనరేంద్రు లీగతి మ ♦ దంబు జవంబు బలంబుఁ జూపుచున్
జెనఁగిరి జ్యారవంబులు ది ♦ విన్ ఘనఘర్షణ సన్నికాశమై. ౧౮౮౧

అర్థములు. శరాధిక వృష్టిని=బాణముల పెద్దవానచే, మదంబు=గర్వము, జవంబు = వేగము, జ్యారవంబులు = అల్లెత్రాటి ధ్వనులు, ఘనఘర్షణ సన్నికాశమై=మేఘధ్వనితో సమానమై.

తాత్పర్యము

అని చెప్పఁగా మకరాక్షుఁడు శ్రీరామచంద్రమూర్తిని అధికమైనబాణవర్షముచే ముంచెను. రామచంద్రమూర్తి యా బాణ సమూహములనెల్ల తన బాణములచే ఖండించెను. దనుజశ్రేష్ఠుఁడు మనుజశ్రేష్ఠుఁడు నీవిధముగ గర్వము, వేగము, బలము చూపుచునల్లెత్రాటిమ్రోఁతలు మేఘధ్వనితో సమానమగునట్లుగ యుద్ధముచేసిరి.

చ. పరఁగఁగ మౌని దానవ సు ♦ పర్వమహోరగులుం దదీయసం
గరమును మెప్పవాటిడక ♦ ఖస్థలి నిల్చి కనుంగొనం బర
స్పరకరముక్తబాణముల ♦ భంగ మొనర్చుచు నంతకంతకుం
బెరుఁగుబలంబుతో నలఘు ♦ వీర్యము ధైర్యము శౌర్య మేర్పడన్. ౧౮౮౨

అర్థములు. ఖస్థలిన్ = ఆకాశ ప్రదేశమందు, పరస్పర = అన్యోన్యము, కరముక్త=చేతులతో విడువఁబడిన, భంగ మొనర్చుచున్=విఱుచుచు.

తాత్పర్యము

మునులు దానవులు దేవతలు సర్పములు నా యుద్ధమును మెప్పు వాల్పక యాకాశము నందుండి చూచుచుండిరి. రామ మకరాక్షు లొకరు వేసిన బాణముల నతియొకరు ఖండించుచు క్రమక్రమముగాఁ బెరుగుచున్న బలముతో గొప్పవీర్యము ధైర్యము శౌర్యము స్పష్టపడఁగా.

ఉ. రాముఁడు వైచుబాణముల • రాక్షసవీరుఁడు నేలఁ గూల్పఁగా
  రాముఁడు రాక్షసాశుగప•రంపరలన్ శతధావిభిన్నమై
  భూమిని వ్రాలఁ జేసె, నిరు•పు ర్నిగిడించుఖగాళి దిగ్విది
  క్సోమము నిండె, నెద్దియును • దోఁపక యుండె రణాజిరంబునన్. ౧౨౨౩

అర్థములు. శతధా విభిన్నమై = నూఱుగా విఱిగినవై, ఖగాలి = బాణసమూహము, దిక్ + విదిక్ + వ్యోమము = అష్టదిక్కులను, (నాలుగు పెద్దవి నాలుగుమూలలు), రణాజిరంబునన్ = యుద్ధరంగమందు.

తా త్ప ర్య ము

రాముఁడు వేసిన బాణములను మకరాక్షుఁడు, మకరాక్షుఁడు వేసినవానిని నూఱుతునకలుగ రామచంద్రమూర్తి ఖండింపఁగా వారు వేయు బాణము లెని మిది దిక్కులు నిండెను. ఆ రణరంగమం దేదియుఁ గానవచ్చినదికాదు.

మ. తనతోఁ బాటిగఁ బోరు రాక్షసుని చం•దం బంత వీక్షించి చ
  య్యన రాముండు ధనుస్సుఁ ద్రుంచి వసుసం•ఖ్యా కేషులన్ సారథిన్
  దునిమెన్, వాజులఁ ద్రుంచెఁ, దద్రథము నిర్ధూతంబుఁ గావించె, నం
  త నిశాటుండు ధరాస్థలినే దుమికెఁ జే•తన్ శూలమున్ గ్రాలఁగన్. ౧౨౨౪

అర్థములు. వసు సంఖ్యాక + ఇషులన్ = ఎనిమిది బాణములను, వసువు లెనమండ్రు, వాజులన్=గుఱ్ఱములను, నిర్ధూతంబు=ఎగురఁగొట్టఁబడినది.

తా త్ప ర్య ము

అప్పుడు రామచంద్రమూర్తి తనతో సమముగ యుద్ధముసేయు రాక్షసుని విధముఁజూచి యేమిరా! నీవు నాతో సమముగఁ బోరాడుచున్నాఁడని శీఘ్రముగ వాని ధనుస్సు దెగవేసి యెనిమిది బాణములచే సారథిని జంపి గుఱ్ఱముల ఖండించి రథ మెగిరిపోవు నటులు గొట్టఁగా వాఁడు చేత శూలముఁ దీసికొని నేల మీఁదికి దుమికెను.

కం. లోకభయంకరశూలము, భీకరగతిఁ ద్రిప్పి విసరి•వేసెన్ రామున్
  గాకుత్స్థవరుఁడు దానిని, నాకసమం దొక శరత్ర•యంబునఁ ద్రుంచెన్.

అర్థములు. శరత్రయంబునన్ = మూఁడు బాణములచే.

తా త్ప ర్య ము

కం. మిణుఁగురులు పెదర శూలము, పొడిపొడియై ధరణిఁబడిన • భూతములెల్లన్
  బుడమిసుతవిభునిఁ బొగడెను, గడుమేల్ మేల్ మే లటంచు•గగనము నిండన్.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. శూలము భగ్నమై చెడిన • శూరవరుండు క్షపాచరుండు దాఁ
  గేలిన ముష్టి గూర్చి రఘు•కేసరి! నిల్నిలు మంచు దైపడన్

రా లలితాల్పహాసవద • నద్విజరాజు క్షమాత్మజామనో
జ్ఞాళి గుణంబుఁ గూరిచి భ • యంకరపావక బాణ ముగ్రుఁడై. ౧౮౮౭

అర్థములు. భగ్నమై = విఱిగి, క్షపాచరుండు = రాక్షసుఁడు, లలిత = అందమైన, అల్పహాస=చిఱునవ్వుగల, వదనద్విజరాజు=ముఖచంద్రుఁడు, క్షమాత్మజా = భూపుత్రియగు సీతయొక్క, మనోజ్ఞ=మనస్సనెడి కమలమునకు, అళి = తుమ్మెదయగువాఁడు, పావకబాణము = ఆగ్నేయాస్త్రము, గుణంబుఁ గూరిచి = నారికి సంధించి, ఉగ్రుఁడై=భయంకరాకారుఁడై.

తాత్పర్యము

శూలము విఱిగి పోఁగా శూరుఁడగు రాక్షసుఁడు చేతఁ బిడికిలి పట్టుకొని రామా నిలునిలుమని పైపడరాఁగా రామచంద్రమూర్తి చిఱునవ్వునవ్వి యాగ్నేయాస్త్రంబు వింట సంధించి భయంకరుఁడై.

కం. చిమ్మిన నా యమ్మును వేఁగమ్మునఁ జని యసురుఱొమ్ము•గాఁడిన క్షణమా
త్రమ్మున ధరణిం బడి కా,యమ్మును విడి యమునియాల•యమ్మున కలిగెన్.

అర్థములు. ఆ యమ్ము = ఆ బాణము, ఱొమ్ము=ఱొమ్మునందు, సప్తమ్యర్థమునఁబ్రథమ, గాఁడివన్=నాటఁగా, కాయమ్ము=దేహము,ఆలయమ్ము=ఇల్లు.

తాత్పర్యము స్పష్టము.

తే. రామచంద్రునిచే నిట్లు•రాక్షసుండు, పడినఁ జెలరేఁగి పొంగెఁ బ్లవంగతతులు
దశరథాత్మజబాణపా • తంబుభీతి, యలమఁ బఱచెను హతశేష•మసురసేన.

అర్థములు. దశరథాత్మజ = రామచంద్రమూర్తియొక్క, బాణపాతము= బాణములు పడుటవలన, బాణములు తమమీఁదఁ బడునను, భీతి = భయము, అలమన్ = ఆక్రమింపఁగా, పఱచెను = పరువెత్తెను, హతశేషము = చావఁగా మిగిలినది.

## —• ౮౦-వ సర్గము. ఇంద్రజిత్తు రెండవసారి యుద్ధమునకుఁ బోవుట •—

కం. పటుబలుఁ డగు మకరాక్షుం, డిటు హతుఁ డగు టాలకించి•యింద్రారి క్రుధన్
బటపట రదములు కొఱుకుచుఁ, గుటిలచరిత్రునకుఁ దనదు•కొడుకున కనియెన్.

అర్థములు. పటుబలుఁడు=దృఢమైన పరాక్రమముగలవాఁడు, ఇంద్రారి= రావణుఁడు, కుటిల చరిత్రునకున్ = మోసపు నడవడిగల వానికి, దీనివలన నికఁ గేవల ధర్మప్రధానమైన యుద్ధమందు జయము రాదని నిశ్చయించుకొనెనని భావము. రదములు=దంతములు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. వీరుఁడ యింద్రజీ! యధిక • వీరుల రాము సుమిత్రపుత్రకున్
ఘోర వధింపు మెట్లయినఁ • బొంచియొ తోఁచియొ మాయ మించియో

యీారయ నీవె యింతకు స•మర్థుఁడవుం బ్రబలుండ వల్లబృం
దారకనాయకున్ సమర•ధాత్రిజయింపవె వాల్మగండ వై. ౧౭౯౧

అర్థములు. బృందారక నాయకున్ = దేవతాపతిని, వాల్మగండవై = శూరుఁడవై, వీరుఁడా, అధిక వీరుల రామలక్ష్మణులన్ —అనుటచే నీకంటె వారు వీరులని సూచన.

తాత్పర్యము

వీరా! యింద్రజిత్తా! మిగుల వీరులగు రామలక్ష్మణులను యుద్ధమునందు నే విధముగనైన సరియ చంపుము. ఎదురుగా నిలువఁబడి యుద్ధము చేయుటకు నీకంటె వా రధికవీరులు. కావునఁ బొంచియైనను, కానవచ్చియైనను, మాయ ప్రయోగించి యైనను జంపుము. ఇంత కార్యముచేయుటకు నీవే సమర్థుఁడవు, బలముగలవాఁడవు నీవేకదా! శూరుఁడవై యింద్రుని రణమునఁ జయించితివి.

కం. మానవు లన లెక్కఁయె పుత్రా! నీ మహిమంబునకును • దరలు మటన్నన్
గా నిమ్మని సెలవుం గొని, తా నేగెన్ యజ్ఞభూమి • దహనున్ వేల్వన్.

అర్థములు. తరలుము=పొమ్ము, కానిమ్ము=అట్టులే చేసెదను మానవులు నీకు లక్ష్యమా? చూచినంత మాత్రముననే జయింపఁ గలవు.

తాత్పర్యము స్పష్టము.

తే. అరుణవర్ణంబు లైన మూ•ర్ధాంబరములు, చేతఁ దాలిచి భయమున•శీఘ్రగతిని
దెలుదెంచిరి రాక్షస•వనిత లపుడు, దేవపతిశాత్రవుఁడు వేల్వ•దేశమునకు.

అర్థములు. అరుణవర్ణంబులు = ఎఱ్ఱని రంగుగలవి, మూర్ధాంబరములు= తలగుడ్డలు — ఋత్విజుఁడగు నింద్రజిత్తు ధరించుటకు, వేల్వ = హోమముచేయు, దీనివలన యజ్ఞముచేయు ప్రదేశమునకుఁబోయి యందుండి యింటికిఁ జెప్పిపంపఁగా నాఁడువారు వస్త్రములు దెచ్చిరని భావము. భయమునన్ = సమయము మించి పోవునేమో యను భయముచే, 'లోహితోష్ణీషా ఋత్విజః ప్రచరంతి' యని శ్రుతి. అభిచారహోమముచేయువా రెఱ్ఱని తలపాగలు ధరింపవలయును.

సీ. లాజలు గంధమా•ల్యంబులచే నొప్ప, హవిచేత నర్చించి • యగ్నిహోత్రు
శరపత్రములుగాఁగ•శస్త్రముల్ ఘటియించి, తాండ్రశాఖల సమి•ధలుగఁజేసి
యెఱ్ఱవస్త్రము లూని•యినుపస్రువముఁ బూని, శరపత్రమధ్య దే•శంబునందు
మిమ్మటంబుగ నల్ల•మేఁకను బలియీయఁ, బొగ లేనిమంటలఁ•బొలుపుమీఱి
ఆ. విజయలక్షణముల • వెలికి సూచించుచు, నప్రదక్షిణముగ • జ్వాల లెగయఁ
బసిఁడినగలుదాల్చి•ప్రత్యక్షముగరోహి, తాశ్వుఁడెగయుఁదెంచి•హవిగ్రహించె.

అర్థములు. శరపత్రములు=గుండ్రజాతి దర్భ, 'గుంద్రస్తే జనకః శరః' అమరము. కాకిపెదురకనుము. (చూడు ౧౭౩౦ వ పద్యము)

సీ. దశకంఠసూనుఁ డంతర్ధానగతమును, వాజిచతుష్కవి•రాజితంబుఁ
గనకపరిచ్ఛదం•బనలతేజంబును, జంద్రార్ధచంద్రని•శాతవిశిఖ
సంపూర్ణమును మృగ•సంయుతంబును నగు,రథ మధిరోహించి • రమ్యశాత
కుంభకంబువు నయి • జృంభితపావక, తులిత మై వైడూర్య•కలిత మైన
తే. ధ్వజము మెఱయంగ సూర్యక•ల్పంబు బ్రహ్మ,శరము రక్షింప దుస్సాధ•సత్త్వుఁ డగుచు
బురము వెలువడి రాక్షస•పూగములకుఁ,బలుకువిట్లునిజబాహు•కటిమ తెలియ.

అర్థములు. అంతర్ధానగతము = కానరాక పోవునది, వాజి చతుష్కవిరాజితంబు=నాలుగు గుఱ్ఱములచేఁ బ్రకాశించునది, కనకపరిచ్ఛదంబు=బంగారు కప్పును వస్త్రము గలది, అనలతేజంబును=అగ్నిహోత్రునివంటి కాంతిగల, చంద్ర= పూర్ణచంద్రుని, అర్ధచంద్ర=సగము చంద్రునివంటి, నిశాత = పదునైన, విశిఖ = బాణములచే, సంపూర్ణము=నిండినది, మృగసంయుతంబును=మృగాకారము గల ప్రతిమలు గలది, అధిరోహించి = ఎక్కి, రమ్య=మనోహరమైన, శాతకుంభ = బంగారు, కంబువు=వలయము,'కంబుర్నా వలయే శంఖే' అమరము. వలయము=కడియము, జృంభిత=విజృంభించిన, అనఁగా చక్కఁగా మండుచున్న, పావకతులితమై= అగ్నిహోత్రముతో సమానమై, వైడూర్యకలితము=వైడూర్యముతోఁ గూడినది, సూర్యకల్పంబు=సూర్యునితో సమానమైనది, దుస్సాధ సత్త్వుఁడు=జయింపరాని బలము గలవాఁడు, పూగములకున్=సమూహములకు

తాత్పర్యము

ఇంద్రజిత్తు అదృశ్యముకాఁగల శక్తిగలదియు నాలుగు గుఱ్ఱములు గలదియు బంగారు కప్పు వస్త్రము గలదియు అగ్నివలెఁ బ్రకాశించునదియు చంద్రునివంటి అర్ధచంద్రునివంటి బాణములచే నిండినదియు మృగముల యాకారముగల ప్రతిమలు గలదియునగు తేరెక్కి అందమైన బంగారు వలయములు గలిగి, మండుచున్న యగ్నిహోత్రునితో సమానమైన వైడూర్యములతోఁ గూడిన ధ్వజము మెఱయఁగా సూర్యునితో సమానమైన బ్రహ్మశరము తన్ను రక్షింపఁగా జయింపరాని బలము గలవాఁడై లంకవిడిచి రాక్షససమూహములకు తన భుజబలము తెలియునట్టు లిట్లు పలికెను.

**—• ఇంద్రజి త్తదృశ్యుండై కపిసేనను రామలక్ష్మణుల నొప్పించుట •—**

చ. అనృతమునీంద్ర వేషకుల • నాజి వధించి జయం బొనంగెదన్
జనకునకున్, ధరాతలము • సత్యము నేఁడ యరామలక్ష్మణం
బును వికపిప్రకాండ మగుఁ • బూర్ణముదంబు సురారినేతకున్
బొనరు నటం చదృశ్యుఁ డయి • పోరికి నేగె జయాభిలాషి యై. ౧౮౯౬

అర్థములు. అనృతమునీంద్ర వేషకులన్ = అసత్యపు మునుల వేషము వేసిన వారిని, ఇతరులను మోసము చేయుటకై మునుల వేషము వేసిరి కాని వీరు

నిజమైన మునులుగారు, నిజమైన మునులైన నిట్లు యుద్ధము చేయుదురా? ఇందఱఁ జంపుదురా? జయంబు = ప్రాణముతో మరల లంకఁ బ్రవేశించుటే జయము. అరామలక్ష్మణము = రామలక్ష్మణులు లేనిది, అకపిప్రకాండము=వానర వీరులు లేనిది, వర్ష సమానము, అదృశ్యుఁడయి=కానరానివాఁడై, జయాభిలాషియై= జయమందుఁ గోరిక గలవాఁడై.

తాత్పర్యము

జనముల మోసగింప మునుల వేషములు ధరించిన వారిని రామలక్ష్మణులను యుద్ధమందుఁ జంపి తండ్రికి జయము గలిగించెదను. ఈ దినము భూమియందు రామలక్ష్మణు లనువారు కపివీరు లనువారు లేకుండఁ జేసెదను. రాక్షసరాజునకు నిండు సంతోషము కలిగించెదను, అని చెప్పి కానరానివాఁడై యుద్ధమునకు జయకాంక్షతోఁ బోయెను.

చ. దశముఖచోదితుం డతుల•దారుణరోషుఁడు దివ్యచాపస
ద్విశిఖధరుండు గాంచె నవ•ధీరితనైఋతయోధులన్ రుషా
వశులఁ ద్రిశీర్ష పన్నగవి•భా ప్రవిభాసులఁ గాంచి వీరహో
దశరథపుత్రకుల్ ప్లవగ•దండసమావృతు లంచు నెంచుచున్. ౧౯౭

అర్థములు. దశముఖచోదితుఁడు=రావణునిచే నాజ్ఞాపింపఁ బడినవాఁడు, దారుణరోషుఁడు=భయంకరమైన కోపము గలవాఁడు, దివ్యచాపసద్విశిఖధరుఁడు= దేవదత్తమగు విల్లు బాణము ధరించినవాఁడు, అవధీరిత నైఋతయోధులన్=తిరస్కరింపఁబడిన రాక్షసయుద్ధభటులు గలవారిని, రుషావశులన్=కోపముచే దేహము తెలియని వారిని, కోపము గలవారిని, త్రిశీర్ష పన్నగ = మూఁడు తలల పాముల యొక్క, విభా=కాంతిచే, ప్రవిభాసులన్=మిగులఁ బ్రకాశించు వారిని, అహో = ఆశ్చర్యార్థకము, ప్లవగదండ=వానరసేనతో, దండో స్త్రీ దమ హింసా సేనా లగుడేషు శాసనే రాజ్ఞాం దండే మానవిశేషే. వ్యూహే రవిపారిపార్శ్వగే పుంసి నానార. దండశబ్దభవము దండు. దండశబ్దమునకు సమూహ మనియు నర్థము గలదు. దండోప దండ మనుదానినే యపశబ్దముగ తండోపతండము లని కొంద ఱనెదరు.

తాత్పర్యము

రావణుచే నాజ్ఞాపింపఁబడినవాఁడు మిగుల భయంకరమైన కోపము గలవాఁడు దేవతాసంబంధమైన విల్లు బాణములు గలవాఁడు రాక్షస భటులను తిరస్కరించిన వారును కోపము గలవారును రెండంబుల పాదు లుండుటచే మూఁడు తలల పాములవలె నుండువారును నగువారిని జూచి, వానరసేనతో నుండువీరేకదా రామలక్ష్మణులని తలఁచినవాఁడై.

ఉ. చాపము నెక్కు వెట్టి శర•సంతతి వారలమీఁద ఘోరధా
రాపతనంబు భంగిని బ•రంపరగాఁ గురియింప బ్రాతలున్

రోషపరీతగాత్రు లయి ♦ రోషమునన్ వినువీధి మార్గణ
వ్యాపితముం బొనర్ప నొక ♦ బాణము యేనియుఁ దాఁక దింద్రజిన్. ౧౪౯౪

అర్థములు. ఘోరధారా పతనంబు భంగిన్=భయంకరమైన వర్షధారలు పడుటవలె, పరంపరగా=ఒకదానివెంట నొకటి విరామము లేకుండ, రోష పరీత గాత్రులయి=కోపముచేఁ జుట్టఁబడిన దేహముగలవారై, మార్గణ వ్యాపితమున్=బాణములచే వ్యాపింపఁబడినది.

## తాత్పర్యము

విల్లెక్కుపెట్టి బాణసమూహమును జడివాన కురిసినట్టు లొక్కధారగా తెలిపి లేకుండ వేయఁగా రామలక్ష్మణులు కోపించి బాణములచే నాకాశము నించిరిగాని యొక బాణమైనను నింద్రజిత్తునకుఁ దగులలేదు.

సీ. ధూమాంధకారంబు ♦ భీమంబుగాఁ జేసి, యభ్రంబు మూఢమం ♦ చలమినట్టు
లొనరించి శరవర్ష ♦ ముగ్రతఁ గురియంగ, గుణలతాఘోషంబొ ♦ ఖురరవంబొ
నేమిధ్వనియొ మఱి ♦ యేమియు వినరాదు, బాణపాతం బొండ ♦ ప్రబలుచుండె
రావణి యెదురేగి ♦ రామలక్ష్మణుల మేనులు ముంచె నారాచ ♦ ములను వారు
తే. హన్యమానశరీరులై ♦ యధికవృష్టిఁ, దాడితంబైన గిరులచం ♦ దంబు దాల్చి
వానిశరములు వచ్చెడి ♦ వలను చూచి, కఱకుములుకులు చిమ్మిరి ♦ కడఁక మెఱసి.

అర్థములు. రామలక్ష్మణుల బాణములు వానికిఁ దవులక పోవుటకుఁ గారణము చెప్పుచున్నాఁడు. ధూమాంధకారంబు=ధూమమువలనఁ గలిగిన చీకటి. వాఁడు తన మాయాశక్తి వలనఁ బొగ దట్టముగాఁ గ్రమ్ముకొనఁజేయుటచేఁ జీకటిలో నుండువాఁడు వెలుతురులో నుండువానికిఁ గానరానట్టు లింద్రజిత్తు రామలక్ష్మణులకుఁ గానరాకుండెను. చీకటిలో నుండువానికి వెలుతురులో నుండువాఁడు కానవచ్చునుగదా. అట్లులే రామలక్ష్మణు లింద్రజిత్తునకుఁ గానవచ్చుచుండిరి. అభ్రంబు=ఆకాశము, మూఢమంచు = దట్టమైన మంచు, శరవర్షము=బాణములవాన, గుణలతాఘోషంబొ = తీఁగవంటి యల్లెత్రాటిధ్వనిగాని, ఖురరవంబొ=గుఱ్ఱముల గిట్టలధ్వనిగాని, నేమిస్వనమో=రథచక్రముల ధ్వనిగాని, నారాచములను=బాణములచే, హన్యమాన శరీరులై = కొట్టఁబడుచున్న దేహములు గలవారై.

## తాత్పర్యము

పొగక్రమ్మినట్లు గాఢాంధకారంబు కల్పించి యాకాశము దట్టపుమంచు క్రమ్మినట్లుచేసి బాణవర్షము గురియింపఁగా నల్లెత్రాటి మ్రోఁతగాని గుఱ్ఱముల గిట్టలధ్వనిగాని రథచక్రముల ధ్వనికాని యేదియు చప్పుడు వినరాదయ్యెను. చప్పుడు వినవచ్చెనేని శబ్దవేధులచే వానిని రామలక్ష్మణు లప్పుడే పడఁగొట్టి యుందురు. బాణములు పడుటమాత్రమే తెలియుచుండెను. రామలక్ష్మణులకు నెదురుగాఁబోయి

వారి దేహములను బాణములచే ముంచెను. వారిట్లు కొట్టఁబడిన వారయ్యు వానచేఁ గొట్టఁబడిన కొండలవలెనై దానిని సహించి చలింపక వాని బాణములు వచ్చు మార్గమునుబట్టి వాని యునికి యూహించి వాఁడి బాణములు చిమ్మిరి.

మ. అతఁ డా బాణపరంపరం దరలి బా•ధాయుక్తుఁడై బాణసం
తతులం బైఁ గురియుంగ దాశరథులు • న్వావిన్ మహాస్త్రంబులన్
శతధాభిన్నముఁ జేయుచుం బెనఁగ ర•క్షస్సత్తముం డుద్ధతిన్
శితనారాచము లుగ్రవేగమున వై•చెన్ దేహముల్ వ్రీలఁగన్. ౧౯౦౦

అర్థములు. తరలి = కంపించి, శతధాభిన్నమున్=నూఱు తునకలుగా, వ్రీలఁగన్=చీలిపోవునట్లు.

తాత్పర్యము

వాఁ డా బాణపరంపరలకు వణఁకి బాధగలవాఁడై బాణముల సమూహములను వీరిమీఁదఁ గురియింపఁగా రామలక్ష్మణులు వానిని మహాస్త్రములచే నూఱు తునకలు చేయుచు యుద్ధము చేయఁగా నింద్రజిత్తు వాఁడిములుకులను వారి దేహము చీలునట్లు వేసెను.

ఉ. పూచిన కింశుకంబు లనఁ • బొల్చుచు రాఘవు లుండ నేరి కా
నీచునిరూపమో ధనువొ • నిల్చిన పోయెడు పట్టిచొప్పొ నా
రాచములో కనుంగొనఁ ద•రం బెటుగా, దిటు వాఁడు మాయచే
నేచిన నూర్లు వేలుగ మ•హిం బడె వానరసంఘ మెల్లెడన్. ౧౯౦౧

అర్థములు. కింశుకంబులు=మోదుగుచెట్లు, తరము=సాధ్యము, ఏచినన్=విజృంభింపఁగా.

తాత్పర్యము

పూచిన మోదుగులవలెనై రామలక్ష్మణు లుండఁగా నానీచుని రూపముగాని విల్లుగాని వాఁడు పోవు మార్గముగాని బాణములు విడుచుటగాని చూడ నెవరికి సాధ్యముగాలేదు. ఇట్లు వాఁడు తనశక్తిచే విజృంభింపఁగా వానరులు నూర్లు వేలుగ నేలఁబడిరి.

ఉ. అకుటిలాత్మచందమున • సాగ్రహ మూని సుమిత్రపట్టి సీ
తాకమనున్ వచించె విధి•దారుణబాణముచే నరాక్షసా
నీకముఁ జేసెదన్ జగము • నీకది సమ్మతి మేని యన్నన
స్తోకదయాపరుండు పరి•శుద్ధమనస్కుఁడు తమ్ము నిట్లనున్. ౧౯౦౨

అర్థములు. కుటిలాత్మ చందమునకున్ = వంచనతోఁగూడిన మనస్సుగలవాని విధమునకు, సీతాకమనున్ = శ్రీరాముని, విధి = బ్రహ్మకు సంబంధించిన, అరాక్షసానీకమున్=రాక్షస సమూహ మనునది లేకుండ, అస్తోకదయాపరుండు=విశేష దయగలవాఁడు, విశుద్ధమనస్కుఁడు=నిర్మలమైన మనస్సు గలవాఁడు.

### తాత్పర్యము

ఆ వంచకుని విధముఁ జూచి లక్ష్మణుఁడు కోపించి అన్నా! నీవు సమ్మతించెద వేని బ్రహ్మాస్త్రము వేసి ప్రపంచమున రాక్షసు లనువారు లేకుండఁ జేసెద ననిన విశేషదయ గలవాఁడును నిర్మలమైన మనస్సు గలవాఁ డగుటచే రామచంద్ర మూర్తి తమ్మునితో నిట్లనియె.

ఉ. ఒక్కని కారణంబునను ♦ నుర్విఁ గలట్టి సమస్త దైత్యులన్
ద్రుక్కఁగఁ జేత ధర్మ మొకో ♦ సుక్కినవాని నయుధ్యమానిఁ దా
నుక్కఱిపాఱువానిఁ గర ♦ యుగ్మము మోడ్చిన దాఁగి యున్న నా
దిక్కఁక నీవ యన్నను వ ♦ ధింపఁగ ధర్మముగాదు శాత్రవున్. ౧౯౦౩

అర్థములు. సుక్కినవానిన్ = ప్రమత్తుని, దేహముమీఁద స్మృతి లేని వానిని, అయుధ్యమానిన్ = యుద్ధము చేయని వానిని, ఉక్కఱి = బలము చెడి, పాఱువానిని = పరువెత్తువానిని, కరయుగ్మము మోడ్చిన వానిని = రెండు చేతులు జోడించి నమస్కరించిన వానిని, దాఁగియున్నన్ = చాటుగ నున్నను, నా దిక్కఁక నీవయన్నన్ = శరణాగతుని, శాత్రవున్ = పగవానిని.

### తాత్పర్యము

లక్ష్మణా! యెవఁడో యొక్కఁడు మన కపరాధము చేసెనని నిరపరాధులుగా నుండు రాక్షసుల నెల్లఁ జంపుట ధర్మమా? ప్రమత్తుని, యుద్ధప్రయత్నమందు లేని వానిని, బలము చెడి పరుగెత్తి పోవువానిని, నమస్కరించినవానిని, నీవే నాకు దిక్కని శరణాగతుఁడైన వానిని శత్రువునైనను జంపరాదు. నీవు బ్రహ్మాస్త్రము సర్వరాక్షసుల నుద్దేశించి ప్రయోగించితి వేని శత్రువులుగాని రాక్షసులను, బాలురను, వృద్ధులను, నిద్దురపోవువారిని, త్రావి మత్తెక్కియున్నవారిని, ఊరక యిండ్లయం దున్నవారిని నెందఱనో వధించును గదా. అది ధర్మమా? కావున నట్లు చేయకుము.

ఉ. వీని వధించు నవ్వెరవు ♦ వేగ ఘటింతము, వీఁడు మాయచేఁ
గానఁగ రాఁ డదెట్లయినఁ ♦ గానఁగఁ జేసిన యంతలోననే
వానరులే వధించెదరు ♦ వాఁడు రసాతల మేగినన్ దివం
బేని గమించినన్ దునుమ ♦ నే నిదె పూనెదఁ జక్కఁ జూడుమీ. ౧౯౦౪

అర్థములు. వెరవు = ఉపాయము, దివము = స్వర్గము.

### తాత్పర్యము

సర్వసంహార కార్యమునకుఁ బూనక వీని మాత్రము చంపు నుపాయము చేయుదము. వీఁడు మాయ చేఁగదా నింత కార్యము చేయుచున్నాఁడు. మన మా మాయను చెడఁగొట్టితి మేని తరువాత మనతోఁ బనిలేక వానరులే వీనిని జంపఁగలరు. అంతమాత్రమునకూడఁ బనిలేదు. వీఁ డధోలోకములలోఁ బాతాళమునకు బోయినను

నెగసి యూర్ధ్వలోకములందు స్వర్గమేగినను వీనిని జంపెదను. నీవు చూచుచుం డుము. సహింపవలయునని సహించితిమి కావున వీఁడిన్ని యాటలాడఁ గలిగెను. ఇఁకఁ జూడుము.

కం. మామకశరదగ్ధుండై, భూమిం బడుఁ జూడు మంచుఁ • బురుషోత్తముఁ డు
ద్దామరుషామతి వికసిత, తామరసేక్షణుఁడు చూచెఁ • దారాపథమున్.

అర్థములు. మామక శరదగ్ధుండై = నా బాణములచేఁ గాలినవాఁడై, ఉద్దామ రుషామతి= అధికమైన కోపముగల మనస్సుగలవాఁడు, వికసిత తామర సేక్షణుఁడు = వికసించిన కమలములవంటి కన్నులు గలవాఁడు. ఇట్లు చెప్పుటచేఁ గోపముచేఁ గన్నులు పూర్ణముగా పెద్దవి చేసెనని భావము. తారాపథమున్ = ఆకాశమార్గమును.

తాత్పర్యము

వీఁడు నా బాణములచేఁ గాలి నేలఁబడును జూడుము అని పురుషశ్రేష్ఠుఁడు రామచంద్రమూర్తి కోపముచే వికసించిన తామరలవలెఁ గన్నులు పెద్దవిచేసి యాకాశమును జూచెను.

## ౮౨-వ సర్గము. ఇంద్రజిత్తు మాయాసీతతో హనుమంతుఁ డున్న దిక్కున కేగుట

కం. యోద్ధమణి యైనరఘుపతి, బుద్ధి యొఱఁగి పంక్తికంఠ • పుత్త్రుఁడు మరలెన్
యుద్ధంబుమాని పురికిని, గ్రుద్ధుఁడు రాఘవుఁ డటంచుఁ గొంకెడిభీతిన్. ౧౯౦౬

అర్థములు. యోద్ధమణి = యోద్ధలందు శ్రేష్ఠుఁడు, రూ - యోధ.

తాత్పర్యము స్పష్టము.

కం. తనవారల మరణంబును, మనమునఁ దలపోసి పోసి • మండుచుఁ గినుకన్
గనుఁగవ నిప్పుక లురలఁగ, మనుజాదుఁడు వచ్చెఁ బశ్చి•మద్వారమునన్.

తాత్పర్యము

తన పినతండ్రులు, తమ్ములు, చుట్టములు, మిత్రులు అందఱు చచ్చిన విషయము మనమునఁ దలఁచి తలఁచి కోపముచే మండుచు కన్నులందు నిప్పులు రాలఁగా రాక్షసుఁడు పశ్చిమద్వారమున వచ్చెను.

తాను యుద్ధము మానిన రామచంద్రమూర్తియు యుద్ధము మానననియు, పశ్చిమద్వారము రామునకు దూరముగుటచేఁ దాను గానరాక యుందుననియు, సీతను జూచినవాఁడు హనుమంతుఁ డొక్కఁడే కావున నతఁడుండు పశ్చిమద్వార మున బయలుదేఱి వచ్చెను. రాముని యెదుటఁ జేసినా యచ్చటనే బలిపెట్టును. మఱి యెచ్చట నైనఁ జేసిన తక్కిన వానరు లెవ్వ రైనో చంపినాఁడని తలఁచి రాము నకుఁ జెప్పక యూరకుందురు కావున హనుమంతుఁడున్న ద్వారము నొద్దకు వచ్చెను.

ఉ. వచ్చి సుయుధ్యమానరఘు • వర్యులపొం గణఁగింప నెంచి రూ
పచ్చుపడంగ మాయజన • కాత్మజఁ గల్పన చేసి తేరిపై

ముచ్చిరుదాని నిల్పి పెను • మోహమునం గపిసేన ముంపఁగాఁ
క్రచ్ఛుఁడ వారికట్టెదురు • గాఁ జనియెన్ సతిఁ ద్రుంపఁ గోరుచున్. ౧౯-౧౦

అర్థములు. సుయుధ్యమాన=చక్కఁగా యుద్ధము చేయుచున్న. పొంగు = ఉద్రేకము, ముచ్చిరుదానిన్=శోకించు దానిని, క్రచ్ఛుఁడన్=శీఘ్రముగా.

తాత్పర్యము

ఇట్లు వచ్చి చక్కఁగా యుద్ధప్రయత్నము నందున్న రామలక్ష్మణుల యుద్రేకమణఁచి యుద్ధము చేయకుండునట్లు చేయనెంచి సీత యేవిధముగ నున్నదో యట్టిదే యగు సీతరూపమును తన శక్తిచేఁ గల్పించి యేడ్చుచున్న యా రూపమును తన తేరిమీఁద నుంచుకొని కపిసేనలను విస్తారమోహములో ముంచుటకై శీఘ్రముగ వానరుల కట్టెదురుగా సీతను జంపఁగోరి పోయెను.

కం. పురనిర్గతుఁ గని కానన, చరు లందరు నొక్కపెట్ట • సాలధరాంచ
త్కరులై వాయుభవపుర, స్సరులై పడిఁ జనిరి వాని • జంపెడియాసన్.

అర్థములు. పురనిర్గతున్=పురమునుండి బయలు వెడలిన వానిని, కానన చరులు = వానరులు, ఒక్కపెట్ట = ఒక్కసారిగ, సాలధరాంచత్కరులై = చెట్లు కొండలు వీనిచే నొప్పు చేతులు గలవారై, వాయుభవపురస్సరులై=హనుమంతుని ముందుగా నుంచుకొన్నవారై.

తాత్పర్యము

వాఁడు పురము వెడలి రాఁగనే వానరులంద ఱొకసారిగ జేతులందు, చెట్లు కొండలు తీసికొనినవారై హనుమంతు ముందుగా నుంచుకొని వానిని జంపు కోరికతో శీఘ్రముగాఁ బోయిరి

చ. హనుమయుఁ గేలఁ గ్రాల మహి • ధ్రాద్రి రయోత్కం డెదురేగి స్యందనం
బునఁ గనె మాసియున్న యొక • పుట్టముతోఁ బెనఁగొన్న వేణితోఁ
గనఁగవఁ గాఱు నశ్రువుల • కాల్వలతో నుపవాసకారణం
బునఁ గృశియించి యున్న మెయి • పోణిమితో గతభూషణాళితోన్. ౧౯-౧౧

తాత్పర్యము

హనుమంతుఁడు చేత నొక పెద్ద పర్వతము తీసికొని యెదురుగాఁబోయి తేరియందు మాసిన యొంటి చీరతో పెనవేసికొన్న జడతో నీళ్ళు కాలువలుగాఁ బాఱు కన్నులతో వస్తులుండుటచే చిక్కిన దేహముతో వదలినయాభరణములతో.

కం. దీన యయి ధూళి గ్రుంగిన, మేనం జెలు వేదియున్న • మెలఁతుకను మరు
త్సూనుఁడు మూర్తము గనుఁగొని, జానకియే యీమె యనుచు • సంతాపించెన్.

అర్థములు. గ్రుంగిన = మునిఁగిన చెలువేది = సౌందర్యము తొలఁగి మూర్తము=కొంచెము సేపు.

తాత్పర్యము

దుఃఖించుచు నేల దుమ్ముతో మునిఁగిన దేహముతో నందము చెడి యున్న స్త్రీని హనుమంతుఁడు కొంచెము సేపు చూచి యామె సీతయే యని సంకటపడెను.

కం. కొన్నిదినంబులముందఱఁ, గన్గొనఁడుగాన సీత ♦ గా నెఱుఁగుట నా
పన్న యయి వానిరథమున, నున్నం గని హనుమహృదయ♦ముల్లల నుడికెన్.

అర్థములు. కన్గొనఁడు = చూచినవాఁడు, ఆపన్నయయి = కీడు దశ నొందినదై, ఉల్లలనుడికెన్=నీ ళ్ళెక్కువగా నున్నప్పుడు కళకళ ధ్వనితో నుడికి నట్టు లుడికెను.

తాత్పర్యము స్పష్టము.

—♦ ఇంద్రజిత్తు మాయసీతఁ జంపఁ బూనుట ♦—

ఉ. ఏమి యొనర్చు నో కొఱ యితఁ ♦ డీపతి నీ మెయిఁ బట్టి తేరఁగా
నేమొకొ హేతు వంచుఁ బ్లవ ♦ గేంద్రుఁడు వానరసైన్య యుక్తుఁడై
భీమజవంబునం బఱవ ♦ వీరుఁడు శక్రజి వారిఁ గాంచి దు
ర్ధామరుషావశాత్ముఁ డయి ♦ శ్రచ్ఛల ఖడ్గము దూసి యెత్తుచున్. ౯౧౩

అర్థములు. దుర్ధామ రుషావశాత్ముఁడు = వారింపరాని కోపముచే బర వశమైన మనస్సు గలవాఁడై, శ్రచ్ఛలన్=శీఘ్రముగ.

తాత్పర్యము

వీఁ డీమెను నేమి చేయునో. ఏల వీఁ డీమె నిచ్చటికి బట్టి తెచ్చెనో యని హనుమంతుఁడు సేనాసమేతుఁడై యేదియైనఁ గీడు చేయుటకు ముందే యీమెను రక్షింపవలయునని త్వరగా రాక్షసుని మీఁదికిఁ బోఁగా వీరుఁ డగు నింద్రజిత్తు వారు వచ్చుట చూచి మిగులఁ గోపముచేఁ బరవశుఁ డయి తటాలున ఖడ్గము దూసి పైకెత్తి.

కం. చేతఁ గొని ఖలుఁడు మాయా, సీతాకేశములు రామ ♦ శ్రీరామా! యం
చా తరుణి యేడ్వ శిరమున్, వే తెఱుఁగఁ గనున్న దైత్య ♦ వీరునితోడన్.

అర్థములు. కేశములు = తల వెండ్రుకలు, తెఱుఁగఁగ=ఖండింప, ఉన్న= పూనిన, మాయ=పరులను వ్యామోహింపఁజేయు శక్తికి మాయ యని పేరు.

తాత్పర్యము

ఆ మాయా సీతాదేవి తలవెండ్రుకలు పట్టుకొని ఆమె రామా రామా యని యేడువు చుండఁగా శీఘ్రముగా తల నఱకుటకుఁ బ్రయత్నించు చున్న రాక్షసునితో.

చ. కనుఁగవ బాష్పపూరములు ♦ గ్రమ్మఁగఁ జారుశరీర రామచం
ద్రుని ప్రియురాలు దేవెరి మ ♦ నోజ్ఞ చరిత్రను గాంచు చిట్లనం

గినుకను మూర్ఖ! యవ్యపతి • కేశకలాపము నాత్మనాశముం
గన నిటు లేని పట్టితివి • కావలుఁడా! దురితాత్మ! శుంఠుఁడా! ౧౯౧౫

అర్థములు. కేశకలాపము = తలవెంట్రుకల సమూహము.

తాత్పర్యము

రెండు కన్నులనుండి నీళ్ళు కాఱుచుండఁగా సుందరమైన శరీరము గలదియు రామచంద్రమూర్తికిఁ బ్రియురాలైనదియు పట్టపురాణి యైనదియు, మనోహరమైన నడవడి గలదియు నగు దానిని జూచి కోపముతో హనుమంతుఁ డిట్లనియె. ఓరీ! పాపకార్యములు చేయువాఁడా! పాపపు మనస్సు గలవాఁడా! శుంఠా! బుద్ధిలేనివాఁడా! ఏలరా నీవు నాశమై పోవుటకు పరస్త్రీ తలవెంట్రుకలు పట్టితివి.

ఉ. మానితమైన బ్రహ్మఋషి • మండనవంశమునందు రాక్షసీ
యోనిని సంభవించితివి • రోరి దురాత్ముఁడ! కాన నీవు పా
పీ! నిరయాధ్వగామి యగు • నిట్టిమహాకలుష ప్రవర్తనం
బూనితి క్షుద్రశీల! ఖల! యుగ్రచరిత్ర! దయావిహీనుఁడా! ౧౯౧౬

తాత్పర్యము

ఓరీ! నీ తండ్రివంశము గౌరవింపఁ దగిన బ్రహ్మఋషి వంశమైనను నీవు రాక్షసస్త్రీ యోనియందు జన్మించితివి కావున క్షేత్రమాహాత్మ్యమువలన నీ కట్టి గుణములే పట్టుపడెను. కావుననే యోరి పాపాత్ముఁడా! నరకమార్గమునకుఁ దీసికొనిపోవు నిట్టి మహాపాపకార్యము చేయఁ బూనితివి. నీచస్వభావుఁడా! దుష్టుఁడా! క్రూరచరిత్రుఁడా! దయలేనివాఁడా!

ఉ. ఏమిర నీమదిం గరుణ • యేని జుగుప్సయేని దోఁపదా
భామినిఁ జంపఁ బూనెదవు • పాపము! రాజ్యము నిల్లు వాకిలిన్
రామునిసన్నిధిన్ విడిచి • రాద్పడు చీయెడ నేమితప్పు రా
యీ మిథిలేంద్రుకన్య ఘటి • యించెను నీ కిటు నామెఁ ద్రుంపఁగన్. ౧౯౧౭

అర్థములు. జుగుప్స = రోఁత రాద్పడు = బాధపడు.

తాత్పర్యము

ఏమిరా, అయ్యో పాపము, ఆఁడుదే. ఎట్లుచంపుదునని దయదోఁపలేదుగా, దయలేకున్నఁబోనీ, ప్రతిక్రియ చేసి తన్నుఁ దాను రక్షించుకొనఁజాలని యాఁడుదానిని జంపుట నీచమని లోకమంతయు భావించియుండగా పలువురు ఛీకొట్టు నింతటిరోఁత కార్యము నెట్లు చేయుదునని యైన నీకుఁ దోపలేదు గదా! ఈమె నాకపరాధము చేసినది దానివలనఁ జంపెద నందువా! రాజ్యము వదలినది. దానివలన రాజ్యములోని ప్రజలవలన నీకు అపరాధము కలిగించినది కాదు. ఇల్లు వాకిలి వదలినది. దానివలన బంధువులచే నీకు నపకారము కలిగించినది కాదు, రాముని సన్నిధిని విడచినది. ఈమె చెప్పి రామునిచే నీకపరాధము చేయవలెను. ఆమెను మీరే సకల బాధలు పెట్టుచుండ

సహించిపడియున్నది. పరమయోగిజ్ఞానియని పేరెన్నికగన్న మహాత్మునికూఁతురు. ఇట్టి గొప్ప వంశమునఁ బుట్టినది. అపరాధమనునది యెట్టిదో యామె యెఱుఁగనే యెఱుఁగదు. అట్టిది నీ కేమి తప్పు చేసెనని యామెను జంపఁ బూనితివిరా!

కం. నీవే సతిఁ జంపితివా, జీవింపవు సుమ్ము నిజము ♦ చిరముగ విను నే
విధమున నేన్ ద్రుంచెద, రావణి! నాచేతఁ జిక్కి ♦ క్రమ్మతి చనుదే! ౧౯౧౮

తాత్పర్యము స్పష్టము.

కం. ఓ లోకవధ్య! జడుఁడా!, స్త్రీలను వధియించు పాప ♦ కీలురలోకం
బోలిఁ గనెదీవు సుమి ని,ర్మూలితకాయుండ వగుచు♦రూక్షమనస్కా! ౧౯౧౯

అర్థములు. లోకవధ్య=జనులకందఱకు వధ్యుఁడవే యగువాఁడా! నిర్మూలితకాయుఁడవు = నాశముచేయఁబడిన దేహము గలవాఁడవు, రూక్షమనస్క = కఠినమనస్సు గలవాఁడా.

తాత్పర్యము

ఓరీ! జారుని చోరుని లోకములో నెవ్వరైనఁ జంపవచ్చును. అది పాప కార్యముకాదు. నీవో స్త్రీవధము చేయువాఁడవు. కావున వారికంటెఁ బాపుఁడవు. కావున నిన్ను విశేషించి యెవరైనఁ జంపవచ్చును. బుద్ధిలేనివాఁడా! యీ కార్యమువలనఁ బుణ్యము వచ్చునా? పాపము వచ్చునా? కీర్తివచ్చునా? అపకీర్తి వచ్చునా యని యాలోచించు బుద్ధిబలము లేనివాఁడవుకదా. పరుషమైన మనస్సు గల నీవు నాచే చంపఁబడి స్త్రీవధముచేయు పాపాత్ముల లోకమునకుఁ బోదువు గాని వీర స్వర్గమునకుఁ బోవు.

—♦ ఇంద్రజిత్తు మాయాసీతను వధించుట ♦—

చ. అని తనమీఁదవచ్చు నని ♦ లాత్మజు సేనను గాంచి దాని నె
ల్లను శరవృష్టి ముంచుచుఁ బ ♦ లాయితముం బొనరించి వాయు
పుత్రున కిటు లాడు నీవు నల ♦ తోయజమిత్రసుతుండు రాముఁ డే
వనితకు నిందు వచ్చితిరో ♦ వాయుజ! తత్సతి నీవ చూడఁగన్. ౧౯౨౦

అర్థములు. పలాయితమున్ = పరువెత్తిన దానిని.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుచుఁ దనమీఁద వచ్చు హనుమంతుని సేనను గాంచి యా సేనను బాణవర్షముచే ముంచి పరువెత్తిపోవునట్లు చేసి పోక నిలఁబడిన హనుమంతునితో నిట్లనియె. నీవు సుగ్రీవుఁడు రాముఁడు నే స్త్రీ నిమిత్త మిచ్చటికి వచ్చితిరో హనుమంతా యా స్త్రీని నీ కన్నుల యెదుట నీవు చూచుచుండఁగనే.

చ. తునిమి, మతిన్ రఘూత్తముల ♦ ద్రుంచెద, నిన్ను దివేశపుత్రు నా
యనుచిత మార్గవర్తి ఖలుఁ ♦ డైన విభీషణుఁ జెండి పైచెదన్

వనితను జంపరా దనుచు • వానర! పల్కితి, శత్రుకోటికిన్
మనసులు నొచ్చు కార్యములు • మానక చేఁత సమర్థమే యగున్. ౧౯-౨౧

అర్థములు. అనుచిత మార్గవర్తి = స్వపక్షమువారిని విడిచి శత్రుపక్షము వారిలోఁ జేరుటచే నుచితముగాని నడవడిగల దుష్టుని, విభీషణుని, మఱిన్=అవల.

తాత్పర్యము

నఱకి యావల రామలక్ష్మణులను నిన్ను సుగ్రీవుని ననుచితమార్గమందు నడచు దుష్టుని విభీషణుని ఖండించెదను. ఓరి వానరుఁడా! యాఁడుదానిని జంపరా దంటివి. శత్రువులకు మనస్సులు నొచ్చుకార్య మేదైనను పాపాత్మకమైనను జేయుట తగిన పనియే యనుట యెఱుఁగవా?

కం. అని మాయామయి సీతను, దనచేతి కృపాణధారఁ • దఱిగెను నది రో
దన మొనరింపఁగ జన్నిద,మున చొప్పున దాని తుండె•ములు ధరఁ దొరఁగన్.

అర్థములు. మాయామయిని = వంచన శక్తిచేఁ జేయఁబడిన దానిని, జన్నిదమునచొప్పునన్=జందెము వేసికొను విధముగ, ఎడమ భుజముమీఁద నుండి కుడిప్రక్కగా నడుమువఱకు వచ్చునట్లు, తుండెములు=తునుకలు.

తాత్పర్యము

అని పరులను మోహింపఁజేయు శక్తిచేఁ గల్పింపఁబడిన సీతను తన చేతి కత్తిచే జందెము వేసికొను మార్గమున నది యేడ్చుచుండఁగా నఱకెను. అది రెండు తునుకలయి నేలఁబడెను.

ఉ. ఈవిధిఁ ద్రుంచి రాముపయి • నెత్తిన కోపముపేర్మి నీ ధరి
త్రీవరకన్యకం దునిమి•తిన్ వృథమయ్యెను గాదె మీ శ్రమం
బో వనచారి! యంచు దివి • నొత్తురవంబున నార్భటించినన్
లావఱి పాఱెఁ గ్రోఁతులబ•లంబు ప్రహృష్టుని వైరిఁ జూచుచున్. ౧౯-౨౩

అర్థములు. దివినొత్తు = ఆకాశమును దగులు, లావఱి = బలము చెడి, ప్రహృష్టుని = సంతోషించినవానిని.

తాత్పర్యము

ఈ ప్రకారము ఖండించి యోరీ యడవి ద్రిమ్మరీ? రాముని మీఁది కోపముచే నీ సీతను జంపితిని. మీ కష్టమంతయు వ్యర్థమయ్యెనుగదా యని యాకాశము తగులునట్లు గట్టిగా నఱవఁగా క్రోఁతులసేన బలముచెడి సంతోషించిన శత్రువును జూచుచుఁ బరువెత్తెను.

## —• ౮౨వ సర్గము. హనుమంతుఁ డింద్రజిత్తుతోఁ బోరుట •—

కం. చెదరిన పాదరపం బన, నదరున నాస్యములు వెల్ల•నై పఱచెడి యా
మెదకలఁ గని యిట్లనియెను, స్మృదులోక్తుల వాయుపుత్రుఁ•డెల్లరు వినఁగన్.

అర్థములు. అదరున = భయముచే, వెల్లనై = తెల్లనయి, మెదకలన్ = మందులను, మృదుశబ్ద భవము, మృదులోక్తులన్=మెత్తని మాటలతో.

తాత్పర్యము

భయముచే ముఖములు తెల్లనై చెదరిన పాదరసమువలె నలుదిక్కులకు బరువెత్తుచున్న మందులఁజూచి యందఱు వినునట్లు మెత్తని మాటలతో నిట్లనియె.

ఉ. సాహసచిత్తులార! రణ♦సంభ్రమతత్పరులార! సంగరో
త్సాహము వీటిఁ బుచ్చి దృఢ♦ధైర్యరమం బెనువెల్లిఁ గల్పి వీ
రాహవముం దొఱంగి పరు♦లందఱు ఫక్కున నవ్వ దుర్యశం
బూహ యొనర్పలేక యిటు♦లొప్పునె కాలికి బుద్ధిసెప్పఁగన్? ౧౯-౨౫

అర్థములు. రణసంభ్రమ తత్పరులార = యుద్ధమునందు వేగిరపాటుతోఁ బని చేయుటయందు నాశక్తిగలవారలారా! వీటఁబుచ్చి = వ్యర్థము చేసి, ధైర్యరమన్ = ధైర్యలక్ష్మిని, పెనువెల్లిన్ = పెద్ద యేటిలో, వీరాహవమున్=వీరుల యుద్ధమును, పరులు=శత్రువులు, దుర్యశంబు=అపకీర్తి, కాలికి బుద్ధిచెప్పఁగన్ = (ఇది లోకోక్తి) పరువెత్తఁగా, ఒప్పునె=తగునా?

తాత్పర్యము

ఓ వానరులారా! మీరింతవఱకు నెంతో తెంపుగల మనస్సు గలవారు. యుద్ధమనిన వేగముగఁ బని చేయుటయందు నాసక్తి గలవారు. ఇట్టి మీరు యుద్ధమందలి యుత్సాహము వ్యర్థపఱిచి అధికమైన ధైర్య సంపదను పెద్ద యేటిలో (సముద్రములో) కలిపి, వీరులకు యోగ్యమగు యుద్ధమును వదలి శత్రువులు పకాలున నవ్వ రాగల యపకీర్తి యాలోచింప లేక యీ ప్రకారము కాలి కొలఁది పరువెత్తుట తగునా?

ఉ. శూరత యెందుఁ బోయె? మగ♦చొప్పది మిమ్ముడఁబాసి పోయెనే?
భీరుత యెందు నేర్చితిరి ♦ పెంపుతలంపును లేక పోయెనే
కారియ మౌనె మార్గ్రముఖ♦ మైకొని పాఱఁగ? నంతభీతియే?
వీరవరేణ్యులార! నను♦వెన్కొనుఁడే జనువాఁడ ముంగలన్. ౧౯-౨౬

అర్థములు. మగచొప్పు = మగవారి విధము, పురుషత్వము, భీరుత = పిఱికితనము, పెంపుతలంపును=గౌరవమను నాలోచనయు, మార్గ్రముఖము= వెనుక ముఖము, కారియము = తగినపని, వెనుకొనుఁడు = వెనుకరండు, ముంగలన్ = ముందుగా.

తాత్పర్యము

మీ శౌర్య మెందుఁబోయెను? మీరు మగవారను నభిప్రాయము కూడ మిమ్ము వదలిపోయెనా? ఈ పిఱికితన మెచ్చట నేర్చితిరి? గౌరవమనునది యొకటి కలదనునది మీ యాలోచనకే రాదాయెనా? శత్రువుల కెదురుగనున్న ముఖము ను

వెనుకకుఁ ద్రిప్పుకొని పరువెత్తుట తగినపనియా? అంతభయమా? వీరశ్రేష్ఠులారా! మీకంత ప్రాణభయముండెనేని నేను ముందు పోయెదను నావెనుకనైన మీరురండు.

సీ. అనవుడు వారెల్ల • నద్రుల ద్రుమములఁ, గైకొని తమిఁ జుట్టి • కదలిరాఁగ
పవమాన వేగాఢ్యుఁ • డాశుగనందనుం, డరివాహినులఁ బ్రళ • యాగ్నివోలె
నిర్దహింపఁగ జొచ్చె • నెఱికింక సూకురు, పెనఁగొన మనమునఁ • భీమగతిని
నొండు విశాల మా • బండను రావణి, రథమున వైవ సా • రథియు మిగుల
ఆ. నోడికమునను జేరి • నెడగాఁగఁ గొనిపోయె, నదియు నచట నున్న • యసురతతుల
నలియఁ జేసికొనుచు • నిలయు బ్రద్దలువాఱ, ధరణిఁ జొచ్చెఁ బరులు • తత్తరిల్ల.

అర్థములు. ఆశుగనందనుఁడు = వాయుపుత్రుఁడు, అరివాహినులన్ = శత్రుసేనలను, నెఱికింక = నిండుకోపమున, సూకురు = శోకము, ఒడికమునను = నేర్పుతో.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా వారందఱు కొండలను చెట్లను దీసికొని తన్నుఁ జుట్టుకొని రాఁగా మిగుల వేగసంపత్తిగల హనుమంతుఁడు శత్రుసేనలను బ్రళయాగ్నివలెఁ గాల్పఁ బ్రారంభించెను. సీతను జంపెఁగదా యని కోపము, సీతాదేవి మరణించెఁగదా యని శోకము, మనస్సును పెనగొనుచుండఁగా భయంకరమైన విధమున నొక పెడలుపాటి బండనెత్తి యింద్రజిత్తు రథముపై వైచెను. సారథియు మిగుల చమత్కారముగ నది తప్పిపోవునట్లు తేరిని దూరముగఁ దోలికొని పోయెను. అది పడి యచటనున్న రాక్షస సమూహమును నలియఁజేయుచు నేల పగుల్చుపాఱ శత్రువులు తత్తఱలాడ భూమిలోఁ బ్రవేశించెను.

ఉ. వానరు లంతలోఁ గలసి • వాసవవైరిని సాంద్రభూజసం
తానశిలాప్రహారములఁ • దద్దయు నొంచుచు వానిఁ గాచు నా
సేనను బీన్గుపెంటలుగఁ • జేయఁగ నింద్రజి తీవ్రబాణసం
దానితమూర్వియై ప్లవగ • నాథులఁ దాఁకి తెరల్చె వారలన్. ౧౯-౨౦

అర్థములు. వాసవవైరిని = ఇంద్రజిత్తును, సాంద్ర = దట్టమైన, భూజసంతాన = చెట్ల సమూహములయొక్కయు, శిలా = రాలయొక్కయు, ప్రహారములన్ = దెబ్బలచే, తీవ్రబాణ=తీక్ష్ణ బాణములచే, సందానిత = కూర్పఁబడిన, మూర్వియై = అల్లెత్రాడు గలవాఁడై, తెరల్చెన్=తొలఁగిపోవునట్లు చేసెను.

తాత్పర్యము

ఇంతలో వెనుకనున్న వానరులు హనుమంతుని గలిసికొని దట్టమైన చెట్ల సమూహము యొక్కయు, రాలయొక్కయు దెబ్బలచే వానిని మిక్కిలి నొప్పించుచు వానిని రక్షించుచున్న యాసేనను పీనుఁగుపెంటలుగాఁ జేయఁగా నింద్రజిత్తు వింటఁ దీవ్రబాణములు సంధించివైచి వారినెల్లఁ దొలఁగిపోవఁ గొట్టెను.

ఉ. ఏలినవాని విక్రమ మ•హీనవిజృంభమునఁ జూచి మత్తులై
శూలపరశ్వధాసులను • శోఁకులమూఁకలు కీశపాళులన్
గూలుచు చున్నఁ జూచి కపి•కుంజరుఁ డుగ్రమహోగ్రరోషణా
భీలుఁడు వారి నాఁగి కపి•వీరులతోడ పచించె నీగతిన్. ౧౯౨౯

అర్థములు. ఏలినవాని = ప్రభువుయొక్క, అహీన విజృంభము=ఎక్కువ వికాసము, మత్తులై = మదించినవారై, ఉగ్ర + మహోగ్ర + రోషణాభీలుఁడు= అంతకంతకు హెచ్చిన కోపముచే భయంకరుఁడు, ఆఁగి=అడ్డగించి.

తా త్ప ర్య ము

తమ ప్రభువుయొక్క పరాక్రమము వికాసముచూచి మదించినవారై యిఁక మనకేమి భయమని శూలములు గండ్రగొడ్డండ్లు తీసికొని రాక్షసుల గుంపులు వానరుల గుంపును జంపుచుండుట చూచి వానర శ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు మిక్కిలి కోపము గలవాఁడై వారి నడ్డగించి కపివీరులతో నిట్లనియె.

—• హనుమంతుఁడు రణంబు చాలించి శ్రీరాముఁ జూడఁబోవుట •—

ఉ. వానరవీరులార ! పర•వాహిని నంతయుఁ ద్రుంచి వైచినన్
దాన లభించు మేలు గల•దా రఘురామునిమిత్తమై కదా
ప్రాణము లాస మాని బహు•భంగులఁ బోరుట, యట్టిరాము న
జ్ఞానన యుద్ధహేతువు ధ•రాత్మజయే హత యయ్యె వైరిచేన్. ౧౯౩౦

అర్థములు. పరవాహిని = శత్రుసేన.

తా త్ప ర్య ము

వానరవీరులారా ! మనము శత్రుసేన నంతయుఁ జంపినను రాఁగల లాభ మేమి? మనము రామచంద్రమూర్తి నిమిత్తమై ప్రాణముల యాస వదలి యుద్ధము చేయుచున్నాము ఆయన సీతాదేవి నిమిత్తమై పాటుపడుచున్నాఁడు. ఆయన, మనము యుద్ధముచేయుటకు కారణము సీతయే. అట్టి సీత శత్రువుచేఁ జంపఁబడెను.

ఉ. ఈవిధ మంతయున్ దశర•థేశ్వరుపట్టికిఁ గీశనేత సు
గ్రీవునకున్ వచించి యెదిరీతిగ వారు దలంత్రు తద్విధిన్
బోవుట మే లటంచు హరి•పుంగవులన్ మరలించి మెల్ల నీ
శావిభుఁ జూడఁ బోయెఁ గపి•దండముతో నిట శక్రవైరియున్. ౧౯౩౧

తా త్ప ర్య ము

ఇది యిట్లు జరిగినదని మనము పోయి రామచంద్రమూర్తికి సుగ్రీవునకుఁ జెప్పుదము. వా రెట్లు చేసిన మేలని తలంతురో మన మట్లు చేయుట బాగు. అని హనుమంతుఁడు వానరుల నెల్ల మెల్ల మెల్లగా వెనుకకు మరలించి కపులగుంపుతో రామచంద్రమూర్తిని జూడఁబోయెను. ఇచ్చట నింద్రజిత్తు,

చ. అనివని వీడి రాముఁ గన • నంజనపట్టి చనంగఁ బోంగి చె
ల్పన విధివత్ప్రకారముగఁ • జైత్యము నందలి యా నికుంభిలన్
ఘనతరహోమముం జలుపఁ • గాఁ గడఁగెం బలత్రయుక్తమై
యనలము హేతిమంత మయి • యస్తమయార్కరుచిన్ వెలుంగఁగన్.

అర్థములు. అనివని = యుద్ధకార్యము, విధివత్ప్రకారముగన్ = శాస్త్రములోఁ జెప్పఁబడిన రీతిగ, చైత్యము నందల = రచ్చమాని యందున్న, నికుంభిలన్ = నికుంభిలా దేవ్యాలయము, నికుంభిల యనునది శక్తి పేరు.

## తాత్పర్యము

యుద్ధపుఁబని వదలిపెట్టి యాంజనేయుఁడు పోఁగా నింద్రజిత్తు తన యుద్దేశము ఫలించెనని సంతోషించి వెంటనే శాస్త్రప్రకారము రచ్చమాని యొద్దనున్న నికుంభిల యను దేవి యుండు నాలయమందు గొప్ప హోమము చేయ నారంభించెను. మాంసము నెత్తురు తోడఁగూడి యగ్ని జ్వాలలతోఁగూడి సాయంకాల సూర్యుని కాంతిచే వెలిఁగెను.

కం. రాక్షసులశుభము పొంటెను, రాక్షసపతిసుతుఁడు తదుప • రం బగుహోమం
బా క్షణము సలుపఁ గడఁగెను, రక్షింప నయానయజ్ఞ • రాక్షసవర్యుల్.

అర్థములు. శుభముపొంటెను = శుభముకొఱకు, నయానయజ్ఞ = శాస్త్రప్రకార మిది చేయవచ్చును, ఇది చేయరాదను విషయము తెలిసినవారు.

## తాత్పర్యము

రాక్షసులకు మేలు కలుగుకొఱకు నింద్రజిత్తు మిగుల శ్రేష్ఠమైన యభిచార హోమము చేయ శాస్త్రప్రకారము కృత్యాకృత్యములు తెలిసిన రాక్షస శ్రేష్ఠులు రక్షింపఁగా నారంభించెను.

## —• { ౮౩-వ సర్గము. హనుమంతుఁడు శ్రీరామునకు నింద్రజిత్తు సీతాదేవిని వధించె నని తెలుపుట. } •—

కం. అక్కడ రాముఁడు వాయుజు, దిక్కునఁ గోలాహలంబు • దివి కెగయుదుఁ బో
రెక్కడని తలఁచి విధిసుతు, నిక్కరణిం బలికె వింటె • వే యా రవముల్.

అర్థములు. కోలాహలంబు = కలకలధ్వని, దివికిన్ = ఆకాశమునకు, విధిసుతున్ = జాంబవంతుని, పోరు = యుద్ధము, రవముల్ = ధ్వనులు.

చ. వినవిన భీమ మయ్యెఁ బర • వీరుల యాయుధనిస్స్వనంబు, లా
హనుమకుఁ బోరు భార మయి • వట్టులు దోఁచెడి నీవు బాసటై
చను మన నాత్మసేనఁ గొని • చయ్యన నాతఁడు పోవుచున్ మరు
త్తనయుని దీర్ఘనిశ్వసను • దారితవైరిఁ గపీంద్రసంవృతున్. ౧౯ ౨౯౧

అర్థములు. వినవినన్=వినుకొలఁది, శానసై = తోడై, దీర్ఘనిశ్వాసుని = నిట్టూర్పులు విడుచువాని, దారితవైరి=శత్రువులఁ జీల్చిన వానిని, కపీంద్ర సంవృతున్=కపిశ్రేష్ఠులతోఁ జుట్టఁబడినవాని.

తాత్పర్యము

వినుకొలఁది క్రమక్రమముగ శత్రువీరుల యాయుధముల ధ్వని యెక్కుడగుచున్నది. ఆ హనుమంతునకు శక్తికి మించిన గొప్ప యుద్ధము తటస్థించినట్లున్నది. నీ వాయనకుఁ దోడుపడఁ బొమ్మనఁగా నతఁడు తన సేన దీసికొని వేగముగఁ బోవుచు నిట్టూర్పులు పుచ్చువానిని,శత్రువులఁ జీల్చినవానిని కపిశ్రేష్ఠులచేఁజుట్టఁబడినవానిని.

కం. తన కెదురై వచ్చెడివా, నిని ద్రోణం గనుడు నతఁడు ♦ నిలువఁగ నిలిచెన్
హనుమయు రామునిఁజేరం, జని భృశదుఃఖమున భూప ♦ చంద్రునిఁ బలుకున్.

తాత్పర్యము

తన కెదురుగా వచ్చువానిని హనుమంతునిఁ జూచి యతఁడు తన స్థానమున నిలువఁగా నిలిచెను. హనుమంతుఁడును రాముని సమీపించి మిక్కిలి దుఃఖమున రామునితో నిట్లనియె.

చం. అరిబలమర్దనా! కడుభ ♦ యంకరవృత్తిని మేము పోరుచో
దురితరతుండు రావణియుఁ ♦ దొయ్యలి సీతను నేడ్చుదానిఁ దాఁ
బొరిగొనె మా సమక్షమునఁ ♦ బొక్కనఁ జిత్తము తత్తఱింపఁగా
సరగున వచ్చినార మది ♦ సర్వము నీ కెఱిఁగించువారమై. ౧౯-౩౭

అర్థములు. అరిబల మర్దనా!=శత్రు సైన్యముల మర్దించువాఁడా.

తాత్పర్యము

శత్రుసైన్య సంహారకా! మిగుల భయము కలిగించు విధముగా మేము యుద్ధము చేయునపుడు పాపాసక్తుఁడు ఇంద్రజిత్తు మేమందఱము చూచుచుండఁగా నేడ్చుచున్న సీతను జంపెను. వ్యసనముచే మనస్సు తత్తఱపడుచుండ సర్వము నీ కెఱిఁగింపవలయునని శీఘ్రముగ వచ్చితిమి.

చం. అనవుడు ఛిన్నమూలకుజ ♦ మై రఘురాముఁడు మూర్ఛ దన్నుఁ ద్రె
క్కొనఁ ధర వ్రాలె శోకమునఁ ♦ గూరినవంతఁ గపీంద్రులెల్లఁ గ్ర
క్కునఁ బ్రదహద్దురాసదశి ♦ ఖంబగు వహ్నినిబోలెఁ జల్లి రా
య్యనఁ గువపద్మినీపరిమ ♦ ళామలనీరము దాపశాంతికై. ౧౯-౩౮

అర్థములు. ఛిన్నమూలకుజము = వేరు తెగిన చెట్టు, త్రెక్కొనన్ = ముంపఁగా, ప్రదహత్=మిగుల దహించునట్టి, దురాసద=సహింపరాని, శిఖంబు= జ్వాలలుగలది, కువ = కలువయు, "కువాలయం కువలయం కువాలం కువలం కువ" మ్మని ద్విరూప కోశము. పద్మిని = తామరల, పరిమళ=సువాసనగల, అమల = నిర్మలమైన, నీరము=నీళ్ళు.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా వేళ్ళు నఱకఁబడిన చెట్టు పడునట్లు రామచంద్రమూర్తి మూర్ఛ తన్ను ముంపఁగా శోకమున గలిగిన బాధచే నేల వ్రాలెను. మిగుల దహించు దగ్గఱకుఁ జేరరాని శిఖలు గల యగ్నిమీఁద నీళ్ళు చల్లినట్లు వానరులు కలువల తామరల సువాసనగల నీళ్ళు తాపము చల్లారుటకై చల్లిరి.

**—• లక్ష్మణుఁడు శ్రీరామునితో ధర్మంబు నిరర్థకం బని చెప్పుట •—**

కం. శోకావేశభరంబునఁ, జూకురుపడి తమ్ముఁ డగ్ర • జుం గ్రుచ్చి యనున్
ప్రాకట హేత్వర్థయుతంబై కొలిపిన వాక్యములను • నస్వస్థునకున్. ౧౩

అర్థములు. శోకావేశ భరంబునన్ = అధికమైన శోక మావేశించుటచే, చూకురుపడి = దుఃఖపడి, ప్రాకట=స్పష్టమైన, హేత్వర్థయుతంబు=హేతురూపమైన ప్రయోజనముతోఁ గూడినది, అనఁగా యుక్తియుక్తమైనది, అస్వస్థునకున్= మనస్సు స్వస్థముగా లేనివానికి, లక్ష్మణుఁడు చెప్పఁబోవు మాటలు శోకావేశము చేతను ఇంద్రజిత్తుమీఁద నేను బ్రహ్మాస్త్రము ప్రయోగించెద ననిన వలదనినే, దానిని బ్రయోగించి యుండిన నిప్పుడీ యనర్థము కలిగియుండదుగదా యను విచారము చేతను జెప్పఁబడినవి కాని పరమార్థములు గావనియు నవి రామచంద్రమూర్తి మనస్సుస్వస్థముగాలేనికారణమున వివరించుకొనినవాఁడుగాఁడనియు గ్రహింపనగు.

తాత్పర్యము

అతిశయమైన శోకావేశముచే దుఃఖపడుచు లక్ష్మణుఁడు అన్నను కౌఁగిలించికొని యుక్తియుక్తమైన మాటలను మనస్సు స్వస్థముగా లేనివానికిఁ జెప్పెను.

కం. కేవల ధర్మరతాత్ముఁడ, వీవు జితేంద్రియుఁడ వెంతొ • హితకారివి నిన్
గావ దనర్థమువలనం, గావున ధర్మము నిరర్థ • కంబు మహాత్మా. ౧౪

అర్థములు. కేవల ధర్మరతాత్ముఁడవు = ఒక్క ధర్మమునందే ప్రీతిగల మనస్సు గలవాఁడవు. కావున నేకదా.

“అతివ ధనార్జనంబ పరమార్థముగాఁగఁ దలంపఁబోను......యతులిత సత్య ధర్మనియమైకరతిం జరియించు సంయమి ప్రతతులతోడ సాటి”యనికదా చెప్పితివి. (అయోధ్య ౧౯।౩౩)

అట్లు చెప్పి పితృవాక్య పరిపాలన ధర్మమందె నిలిచి చేతికి వచ్చిన రాజ్యమును వదలితివి. జితేంద్రియుఁడవు=ఇంద్రియములు జయించిన వాఁడవు. కనుకనే న్యాయప్రకారము నీకు రావలసిన రాజ్యము రాకుండఁ జేసిన కైకయీ దశరథులపై మనఃకాలుష్యము లేనివాఁడవు. హితకారివి = ఇతరులకు మేలే చేయువాఁడవు. రావణాసురుని కిరీట మెగురఁ గొట్టుటకు మాఱుగఁ దల యెగురఁ గొట్టి

యుండిన నిట్టి కీడు కలిగి యుండదుకదా. వాని కింకనైన బుద్ధి వచ్చును. రక్షింతు మను నభిప్రాయముతోఁ గదా వదలితివి. నిరర్థకంబు=నిష్ప్రయోజనము.

తాత్పర్యము

అర్థము కామము వదలియైన ధర్మమునందే నిలువవలయు నని ధర్మము నందుఁ బ్రీతి గలవాఁడవు. ఇంద్రియముల జయించినవాఁడవు. మిక్కిలి లోకహితమునే చేయువాఁడవు. ఇట్టి నిన్ను ధర్మము నీకుఁ గీడు రాకుండఁ గాపాడఁజాలదయ్యె. కావున ధర్మము నిష్ప్రయోజనము. 'ధర్మో రక్షతి రక్షితః' తన్నురక్షించు వానిని ధర్మము తాను రక్షించుననుట వ్యర్థవాక్యము.

ఉ. స్థావరజంగమంబుల వి॰ధంబున లోకములోనివారి కే
లా విశదంబుగా దది త॰లంపుము ధర్మమొకండు గల్గినన్ ?
వావిరి తత్ఫలంబు లయి॰నం బొడకట్టని స్థావరాదు ల
ట్లో విపులేశ ధర్మమొకఁ ॰ డుండుట కల్లని నేఁ దలంచెదన్. ౧౯౮౧

అర్థములు. స్థావరము = చరము కానిది, కదలక యుండునది - పర్వతాదులు - జంగమము=కదలునది, పశు మనుష్య పక్షులవంటిది, ధర్మము ధర్మమనెడవే యది కలదనుటకు నేమి ప్రమాణము? ప్రత్యక్షమా? అనుమానమా? అని వికల్పించుకొని రెంటివలనను ధర్మముకలదని స్థాపింప సాధ్యపడదనుచున్నాఁడు.

తాత్పర్యము

ధర్మమనునది లోకములో నొక పదార్థముండెనేని యది కదలని పర్వతాదులవలెఁగాని కదలు పశుమనుష్య పక్షులవలెఁగాని యేలఁగానరాదు. కానరాకుండినఁ బోనిమ్ము. చెట్లు మొదలైనవానివలననో పశుపక్ష్యాదులవలననో మనకొక ఫలము గానవచ్చుచున్నది. అట్టి ఫలముకూడ ధర్మమువలన నేల గానరాదు. పర్వతములవలెఁ జెట్లవలె మృగాదులవలె ధర్మము కానరాకున్నది. కావునఁ బ్రత్యక్ష ప్రమాణముచే ధర్మమున్నదని స్థాపింప సాధ్యపడదు. చెట్టును మనము చూడకపోయినను ఫలమును జూచితిమేని యా ఫలమునకుఁ గారణమైనది చెట్టొకటి యుండవలె నని యూహింతుము. అట్లూహించుటకు ధర్మమువలనఁగలుగు ఫలము కానరాకున్నది. కావున ననుమానప్రమాణముచేతను ధర్మము కలదని చెప్ప సాధ్యపడదు.

కం. కలదేని యధర్మము గన,వలయున్ బహుదుఃఖములను ॰ బంక్తిముఖుండున్
గలదేని ధర్మమీగతిఁ, గలుగక యుండంగ వలయుఁ॰గద నీకు వెతల్. ౧౯౮౨

తాత్పర్యము

అతీంద్రియములైనవి లోకమున నెన్ని లేవు. అట్టులే ధర్మాధర్మములందువా? అధర్మమనునది యొకటి యుండెనా రావణాసురుఁడు విశేష దుఃఖములచే యనుభవించుచుండవలయును. ధర్మమనునది యొకటి యుండెనా నీకు నిటువంటి దుఃఖములు కలుగకయే యుండవలయు. వాఁడు సుఖపడుచున్నాఁడు. నీవు దుఃఖపడు

చున్నావు. ధర్మమువలనఁ గలుగు ఫలమేది? ఫలనియమము లేదాయెఁగదా. ధర్మాధర్మములు ఫలశూన్యములు.

ఉ. కావలుఁడైన రావణుఁడు • కష్టము గానమి నిత్యధర్మస
ద్భావుఁడ వీవు దుఃఖముల • పాలగు చుంట నధర్మధర్మముల్
త్రోవఁ జెడంగాఁ బరస్పరవి • రుద్ధఫలప్రదముల్ దలంపఁగా
ద్రోవగుఁ గీడు ధర్మమునఁ • బొల్పగు సౌఖ్య మధర్మసంగతిన్. ౧౯౮౩

అర్థములు. కావలుఁడు=దుష్టుఁడు.

తాత్పర్యము

నిత్యధర్మ సద్భావుఁడవు, సర్వదా ధర్మమందే యుండవలయు నను మంచి యభిప్రాయము గలవాఁడవు నీవు. ఇట్లుండఁ గ్రమమార్గము తప్పి ధర్మాధర్మములు పరస్పర విరుద్ధ ఫలము లిచ్చుచున్నవి. నీవు దుఃఖపడుచున్నావు. వాఁడు సుఖపడుచున్నాఁడు. కావున ధర్మము కష్టమునకు, అధర్మము సుఖమునకుఁ గారణమైనపుడు ధర్మము కలదని దానివలన మేలిఫలమే కలదని యెట్లు చెప్పనగును? కావున ధర్మములేదు. దానికి ఫలములేదు.

సీ. ధర్మప్రవర్తన • శర్మంబు ఘటియిల్లు, ధర్మహీనత దుఃఖ • తతులు గలుగు
నని తలపోసెదే • యన్నయా! యది కల్ల, ధర్మంబు సౌఖ్యప్ర • దంబ యేని
ధర్మాత్ము లగు వారు • ధర్మమంద చరింపఁ, దద్ధర్మఫలములు • దలఁగ కుండ
వలదె జగంబునఁ • గలవె యా భంగులు, తలపోయుమా యింత • ధర్మశీల!
తే. పాపు లగువారు సౌఖ్యముల్ • పడయు చుండఁ
దలఁగకుండును గష్టముల్ • ధార్మికులను
దాన్నఁ జేసియె ధర్మంబ • ధర్మ మనెడి
రెండును నిరర్థకములు భూ • మండలమున. ౧౯౮౪

తాత్పర్యము

అన్నా! ధర్మప్రకారము నడచుకొనిన శుభము కలుగును, ధర్మము విడిచిన దుఃఖములు కలుగును, అని యాలోచించెదవా? ఆ యూహ సత్యమైనది కాదు. ఏలందువా? ధర్మము సౌఖ్యమునే యిచ్చునేని ధర్మాత్ములగువారు ధర్మమునందే వర్తించుచుండ వారికి ధర్మఫలములే తొలఁగిపోక యుండవలయునుగదా. లోకమున నట్లు ధర్మాత్ములు సుఖమునే యనుభవించు చున్నారా? లేదుగదా. ధర్మాత్ముఁడా! దీని నీ వాలోచింపుమా? అధర్మముకష్టములనే కలిగించునేని పాపులుకష్టములనేకదా యనుభవింపవలెను. లోకమున నట్లు జరుగుచున్నదా? అదియు నాలోచింపుము. లోకమునందు పాపులు సుఖము లనుభవించు చున్నారు. ధర్మాత్ములు కష్టము లనుభవించుచున్నారు. ఆ కారణమున ధర్మ మధర్మమనునవి రెండును నిరర్థకములు. ఫలమును బట్టి చెట్టున్నదని యూహించునట్లు సుఖదుఃఖ

రూపక ఫలములఁబట్టి ధర్మమున్నదని అధర్మమున్నదని యనుమాన ప్రమాణ ముచే సిద్ధాంతముచేయ సాధ్యపడదు.

తే. పాపరతుల నధర్మంబు♦బాధపఱిచె, నేమియుఁ గ్రియాత్మకం బయి♦యిట్టిబాధఁ
గూర్చెడియధర్మ మొకట్రుటిఁ♦గూడఁ బిదపఁ, దానుజెడివేఱకవలబా♦ధలఘటించు!

తాత్పర్యము

ఇట్లు ప్రత్యక్షానుమాన ప్రమాణములచే ధర్మాధర్మముల యునికి ఖండించి యిఁక శబ్దప్రమాణమును ఖండించుచున్నాఁడు. రామచంద్రా! పాపాత్ములను క్రియారూపమైన యధర్మము (పాపకర్మము) బాధించు నందువా, యిట్టి బాధఁ గూర్చెడి యధర్మము మూఁడు క్షణములు మాత్రమే యుండునని శాస్త్రములు చెప్పుచున్నవి గదా అప్పుడు మూఁడు క్షణములు మాత్రముండి నాలుగవ క్షణ మున నశించు నధర్మము తాను నశించి కాలాంతరమున నెట్లు దుఃఖఫలము నెవనికైన కలిగింపఁగలదు? ఇది యసంగతముగదా. కాఁబట్టి యీ యధర్మకర్మము దుఃఖమిచ్చు ననియు నా దుఃఖమునుబట్టి యధర్మ మొకటి యున్నదనియు వేదాదు లూహింపు మనుట నీళ్ళమీఁద తాలు తేలునట్లసంగతము. శబ్దము బుద్ధి-కర్మము మూఁడు క్షణ ములే యుండునని శాస్త్రము. కావున నివి క్షణికములు. అట్లులే ధర్మరూపమైన కర్మము సుఖమిచ్చునందువా? అదియును మూఁడు క్షణములే యుండి నశించునది కావునఁ దాను నశించి కాలాంతరమున నెట్లు ఫలమీయఁ గలదు? ఇట్లు కర్మ ములు క్షణికములని చెప్పునవి కాలాంతరమున ఫల మిచ్చునని చెప్పు వేదవాక్య ములు తాలు నీళ్ళకంటె బరువని చెప్పుచు తాలునీళ్ళపైఁ దేలునని చెప్పుటవంటిది.

సీ. కర్మంబు చెడినను ♦ గర్మాధిదేవత, ఫలము గూర్చెడి యని ♦ పలికితేని
దైవ మెప్పుడు ధర్మ♦తత్పరు బాధించుఁ, గాదేనియును గర్మ♦కారుఁ డన్య
జనుని బాధించును ♦ సత్య మిట్లైనచోఁ, బాపకర్మంబుల♦ఫలము దుఃఖ
మది దైవమునె చెందు ♦ నందదు కర్మము, ధర్మంబుచందంబు ♦ తప్పకిట్లె
ఆ. కానరాదు రూపు♦కడఁగి చిహ్నములచే, నైనఁ దెలియఁబడదు ♦ మానవీయ
యుల యసత్స్వరూప♦మగు ధర్మ మేరీతిఁ, బరమఫల మొసంగు♦భ్రాంతి గాక.

తాత్పర్యము

ఓయీ కర్మము మూఁడు క్షణములలోఁ జెడినఁ జెడనిమ్ము. దానిచే నారా ధింపఁబడిన దేవత చెడఁడుగదా! ఆ దేవతయే యీ ఫలము నిచ్చునందువా? అదియు సరిగాదు. ఎట్లన —పురుషుఁడు తాను—నధర్మముచేసి బాధపడుటకుఁగాని, యితరుల బాధించుటకుఁగాని దైవమే కారణము. ఆ దైవమే పురుషునిచేత ధర్మ రూపకర్మము చేయించి సంతోషించి దానికి సుఖఫల మిచ్చి, యధర్మ కర్మము చేయించి యసంతుష్టుఁడై, దుఃఖఫలము నిచ్చునేని, అప్పుడు రెంటికిని ప్రయోజక కర్త దైవమేకదా యగును. అప్పు డా ధర్మాధర్మములవలనఁ గలుగు ఫలము

సుఖము దుఃఖము ప్రయోజకకర్తకుఁ జెందునుగాని ప్రయోజ్యకర్తకుఁ జెందదు గదా. రాజాజ్ఞప్రకార మొకఁడొక కార్యము చేసిన దానిఫలము రాజనుభవించునుగాని భటుఁ డనుభవింపఁడుగదా కావున దైవమే తాను ధర్మముగాను నధర్మముగానునై సుఖఫలము నిచ్చు ననుట సరిగాదు.

ఓయీ నీవు చెప్పునది సరిగాదు. అచేతన కర్మము ఫల మీయఁజాలదు. దైవము ప్రయోజకకర్తయై యొకపురుషునిచే నొక కర్మము చేయించి దానికిఁదగిన ఫలమిచ్చుటయు లేదు రాజశాసనమువంటిది దైవశాసనము. రాజ్యపరిపాలనము చక్కఁగా జరుగుటకై ప్రజలక్షేమమునకై రాజు కొన్ని శాసనము లేర్పఱిచెను. ఈ కార్యములిట్లు చేసినవానికి మేలు. ఈ కార్యమిట్లు చేసినవానికి కీడని శాసించెను. ఆ ప్రకారము జరుపుటకు దగిన యేర్పాటులు చేసెను. ఒకఁడు దొంగతనము చేసెనేని రాజభటులు వానిని దండింతురు. ఇందు రాజు చేయునది యేదియు లేదు. రాజు వానిని దొంగతనము చేయుమని ప్రేరింపలేదు. కావున రాజు ప్రయోజకకర్త గాఁడు. అట్లే దైవము. దైవము ఇది పాపమని ఇది పుణ్యమని శాసనములు చేయఁ గారణ మేమి? స్వలాభముగోరియా? పరులనిమిత్తమా? దైవము అవాప్తసమస్తకాముఁడు. ఆయన క్రొత్తగా సంపాదించుకొనవలసినది యేదియు లేదు. కావున స్వార్థముగ ధర్మాధర్మము లేర్పాటుచేసె ననుట సరిగాదు. పరార్థమందువా? ఒకనిని దరిద్రునిగాఁ జేయుటచేఁ గదా వాఁడు దొంగతనముచేసెను. అందఱను భాగ్యవంతులుగాఁ జేసినయెడల లోకమున దొంగతన మనునది లేకపోవుఁ గదా! ఒకనిని దరిద్రునిఁగ నొకనిని ధనికునిఁగఁ జేయుటచే నిర్దయత్వము పక్షపాతము కలవాఁడయ్యెనుగదా యందు వేని, ఒకనిని దరిద్రునిఁగా మఱియొకని ధనికునిఁగా దైవముచేయలేదు. వాని వాని పూర్వకర్మము చేసినది. ఒక కర్మమునకు నొకఫల మనివార్యముగా నంటి యుండును. ఆ కర్మము చేయఁగానే దాని ఫల మదృష్ట మనుపేర నొక శక్తియు నుత్పన్నమగును. కర్మము చెడినను అదృష్టము ఫలానుభవపర్యంతము చెడదు. ఒకఁడొక యపథ్య వస్తువు దినెను. తినుట యను కర్మము క్షణములో ముగిసెను. కాని యాపదార్థమందుండు శక్తి దాని ఫలమును వ్యాధిరూపముగ బాధించి గాని క్షయింపదు. అటులే పురుషుండు ధర్మముగాని, యధర్మముగాని చేసెనేని దానివలన జనించిన యదృష్టశక్తి కాలాంతరమున ఫలమిచ్చునుగాని ఫలమిచ్చునది దైవము గాదు, కర్మముగాదు. ఆ యదృష్టమును ననుభవించుటకుఁ దగిన సందర్భములను దైవము కలిగించుచున్నాఁడందు వేని ఒకఁడు పాపకర్మల ననుభవించుటకుఁ బాపపు సందర్భము లేకదా దైవము కలిగించును దానివలన నదృష్ట మనుభవించుటకు మరలఁ బాపకార్యము లేకదా చేయును. దానివలన మరల పాపరూపమైన యదృష్టమేకదా జనించును. ఇట్లైనచో ననాదిప్రవాహరూపము కదా కర్మము. ఒకసారి పాపము చేసిన పురుషుఁడు కలకాలము పాపము నేకదా చేయుచుండును. ఒక

సారి పుణ్యముచేసిన పురుషుఁడు పుణ్యమునే కదా చేయుచుండును. అప్పుడొకఁడు నిత్యదుఃఖి, మఱియొకఁడు నిత్యసుఖి కదా యగును. లోకమునందట్టి నియమము కనఁబడుటలేదు. కావున ఫలదాత దైవముకాఁడు. అదృష్టమే యందువా? అదియు సరిగాదు. ఏలన—నీవు చెప్పెడి యపూర్వ మనునది ప్రత్యక్షముగఁ గానవచ్చునది కాదు. లక్షణములచేత నూహింప శక్యమగునదికాదు. ఇంద్రాదులవలె నర్థవాద వాక్యములచేఁ దెలియ వచ్చునదికాదు. కావున సత్తుగాదు. సత్తుకానిది అసత్తే. అనఁగా లేనిదే. అభావమైన దెట్లు ఫలమీయఁ గలదు.

కం. ధర్మం బొకఁ డుండినచో, ధార్మికమణి వైన నీకుఁ ♦ దగులునె కీడుల్ ?
మర్మచ్ఛేదనదుఃఖము, లర్మిటచే ధర్మముంల♦యనృతము సుమీ౯. ౧౯౪౭

తాత్పర్యము

ధర్మమసత్తుగాదు. సత్తే. దానికి ఫలముగలదందువా? అట్లగునేని ధర్మాత్ములలో శ్రేష్ఠుఁడగు నీకుఁ గీడెట్లు కలిగెను? ప్రాణముదీయు నంతటి దుఃఖము నీకుఁగలిగెను గదా. ఇది యసత్యమనఁ జాలపుగదా. ఇట్టిదుఃఖము కలిగించు నధర్మము నీయందు లేదాయెగదా. ఈ దుఃఖ మెట్లువచ్చెను? కావున ధర్మమున్న దనుట యసత్యము.

తే. క్లీబమును దుర్బలంబు లె♦క్కించి చూడఁ, బౌరుషము ననువర్తించి♦వ్యవహరించు
ధర్మ మల్లొట ఫలములు♦తెనకుఁ దాన, యీయ నేరని ధర్మంబు♦నేల నలుప.

తాత్పర్యము

ఓయీ నీవు చెప్పునది సరిగాదు. కన్నులకుఁ గానరాక పోయినంతమాత్రము చేతనే యొక వస్తువు లేదన రాదు. మన యింద్రియములకు గోచరింపనివి యెన్నియో యున్నవి. ఇంద్రియగోచరములు గాని వన్నియు నసత్యములే యను నెడల వీనినెల్ల నిరాకరింపవలసి వచ్చును. అది సరిగాదు కదా. అదియునుగాక యొక్కొక్క కార్యమునకు సహకారి యుండుట గలదు కుమ్మరివాఁడుకుండలు చేయుటకు చక్రము కఱ్ఱ యున్నట్లు, చక్రము కఱ్ఱ లేదేని కుమ్మరివాఁడు కుండలు చేయలేఁడు. అట్లులే దైవమునకు పౌరుషము(పురుష ప్రయత్నము)సహకారి. అట్టి సహకారి లేమిని ధర్మము వ్యర్థమైన దందువా? అట్లనిననేమి? ధర్మము స్వతంత్ర శక్తికలదికాదు. పౌరుష సాహాయ్యము లేక యది కార్యము చేయఁజాలదనియె కదా యర్థము అట్టి స్వతంత్రశక్తి లేని దుర్బలము క్లీబమైన ధర్మమునే ప్రధాన ముగా నెంచి యర్థకామముల వదలుట సరిగాదని నా యభిప్రాయము.

చ. కనుఁగొన ధర్మమే పురుష♦కారవిశేషణభూత మైనచోఁ
బనిగల దొక్కొ ధర్మమని ♦ బాధలు పొందఁగ ? దాని వీడి యిం
దనుకను ధర్మముం గొలుచు♦తప్పున్ఁ బౌరుషమున్ భజింపుమీ
జనవర ! యన్నికార్యములు ♦ చక్కఁబడున్ నను విశ్వసింపుమీ. ౧౯౪౯

తాత్పర్యము

ఎప్పుడు ధర్మము పురుషకార సాహాయ్యములేక కార్యము చేయఁజాలదో యప్పుడు ధర్మము విశేష మగుచున్నది. ముఖ్యమైనది పురుషకార మగుచున్నది. (కుమ్మరి యప్రధానమై చక్రము, కట్టె ప్రధానమని చెప్పిన ట్లయినది. ఇదియె యీ వాద దౌర్బల్యమును జూపుచున్నది) కావున అప్రధానమగు ధర్మమునకై బాధలు పడనేల? కావున దానిని వదలి యింతవఱకు ధర్మమే ప్రధానమని దానిని రక్షించు నిమిత్తమై యెట్లు శ్రమించితివో యట్లేక పురుషకారమునకై శ్రమింపుము. అట్లు చేసితివేని సర్వకార్యములు ఫలవంతములగును. నామాట నమ్ముము.

సీ. సత్యభాషణము శ్రే•ష్ఠం బైనధర్మము,యెయ్యది సల్పువాడ వం • చనెదు గాని
యదియు నీచే సమ్య•గాచరితము గాదు,సభలోన నెల్లరు • చక్క విన్ఁగ
నీకు రాజ్యం బీయ • నీకొని నిర్దయుం,డై తండ్రి నిన్నిట్టు • లడవి కనిచె
నతని దండింపవ • యాతని రెండవ,నుడి సల్ప నేమని • కడఁగి తీవు
తే. ధర్మ మొండెను నొండె న•ధర్మ మొకటి, పరఁగ నరుఁ డాచరింప ని•ర్బంధమేని
దేవపతి యేల మాని వ•ధింపకుండ,యజ్ఞ మొనరింపఁ డయ్యెనో•యార్యవర్య!

తాత్పర్యము

సత్యము చెప్పుట శ్రేష్ఠమైన ధర్మము, దానిని నేనాచరించు వాఁడ ననెదవు కాని దానినైన నీవు చక్కఁగా రక్షించిన వాఁడవు కావు. ఎట్లన సభలో లోకులెల్ల వినఁగా నీకు రాజ్యం బీయ నంగీకరించియు దయలేనివాఁడై తండ్రి నిన్నిట్టు లడవుల పాలు చేసెను. ఆయన మొదటఁ జెప్పిన యసత్యమున కాయనను దండించిన వాఁడవుకావు. మొదటఁ జెప్పిన సత్యమును పాటింపక రెండవ సారి చెప్పినదానిని నీ వేమని యంగీకరించితివి? ధర్మాధర్మములందు మనుష్యు డేదో యొకటియే చేయవలయును. రెండును జేయరా దందువేని, మనవలెనే క్షత్రియుఁడగు నింద్రుఁడు ముని యగు విశ్వరూపుని జంపక యేల యజ్ఞము చేయలేదు? ధర్మ మొక దానినే యనుష్ఠింపవలసి యుండిన యెడల నింద్రుఁడు యజ్ఞములను మాత్రమే చేసి యుండవలెను. విశ్వరూపుని చంపియుండరాదు. విశ్వరూపుని చంపుట యను నధర్మమునే యనుష్ఠించెనేని యజ్ఞములు మానవలసి యుండెను. ఆ సమయమున కది చేసెను. ఈ సమయమున కిది చేసెను. అట్టులే మనము సమయోచితముగఁ బ్రవర్తింప వలయును గాని యొక ధర్మమునే నిర్బంధముగ నుంచుకొనరాదు. "యాన్యేతాని దేవక్షత్రాణీంద్రో వరుణః పర్జన్యో యమ ఈశానః" ఇంద్రుఁడు వరుణుఁడు పర్జన్యుఁడు యముఁడు ఈశానుఁడు వీరుక్షత్రియులుఅనిశ్రుతి.

కం. కేవల మధర్మ మేనియుఁ, గేవల ధర్మంబ యేని • కీ డొనఁగుఁ జమీ
యే వేళకుఁ దగినటు లది,భావించుట మేలు సౌఖ్య • పదకాములకున్.

### తాత్పర్యము

కేవల మధర్మముగాని, కేవల ధర్మముగాని రెంటిలో నొకటి మాత్రమే యనుష్ఠించు కర్తకుఁ గీడుగలుగును. కావున నే వేళకు నేది తగునో యా వేళకు నది చేయుట సౌఖ్యము పడఁగోరు వారికిఁ దగిన కార్యము.

### —♦ లక్ష్మణుఁడు శ్రీరాముతో ధనంబు సర్వార్థసాధకం బని చెప్పుట ♦—

సీ. నామతం బిది తండ్రి! న్యాయంబుగా నీకు, లభియించు ధర్మమూ♦లంబు రాజ్య
రమ వీడి క్షేమమూ♦లము పాడుచేసితి, ధర్మమెట్టులు నిన్నుఁ♦దలఁగకుండు ?
నర్థమూలము ధర్మ♦మది జనదత్తమౌ, కరములచే వృద్ధిఁ ♦ గాంచు చుండ
శైలజాతంబు లౌ♦శైవలినులఁ బోలు, నద్దాన ధర్మకా♦ర్యములు జరుగుఁ
ఆ. గాన సకలకార్య♦కాండంబులకు నెల్ల, ధన మొకండె కదు ప్ర♦ధాన మట్టి
ధనముఁ గరగతంబుఁ♦దలఁగంగ నెట్టు స్వ, కార్యఘాతుకునకుఁ ♦ గలదె మేలు.

అర్థములు. జనదత్తము=ప్రజలచే నీయఁబడినది, కరములు = పన్నులు, కరగతంబు=చేతికి దొరకినది, స్వకార్యఘాతుకునకు=తనకార్యము పాడుచేసికొను వానికి.

### తాత్పర్యము

తండ్రీ! యిది నా యభిప్రాయము. న్యాయముగా నీకు రావలసినవై ధర్మము చేయుటకు నాధారమైన రాజ్యసంపదల వదలి పెట్టితివి. దానిచేత నీవు క్షేమమునకు నాధారమైన దానిని పాడుచేసికొంటివి. ఇట్టి నిన్ను ధర్మము మాత్రము వదలి పెట్టకుండునా? ధర్మవృక్షమునకు నర్థము వేరు. వేరుచెడిన చెట్టుచెడు టరుదా? వేరుతో నాకుఁ బని లేదు. చెట్టుమాత్రము కావలయు నంటివి. అట్టిచెట్టు ఎన్నాళ్లు నిలుచును? అర్థసహాయము లేక ధర్మమెట్లుచేయ సాధ్యమగును? అర్థమనునది జనులిచ్చు పన్నులచే వృద్ధిఁగనును. జనములిచ్చు పన్నులు కొండ యూఁటల యేళ్ళవంటివి. ఆనీళ్ళ్యేళ్ళకుఁ బాఱిన నాచెట్టు ఫలించును. అట్లు జనులిచ్చు ధనముచే ధర్మకార్యములు జరుగును. కావున సకల కార్యసమూహములకు ధన మొక్కటే మిగులఁ బ్రధానమైనది. అట్టి ధనము చేతికి దొరకిన దానిని దొలఁగఁ ద్రోచి తన కార్యము నాశము చేసికొనిన వానికి యెప్పటికైన మేలుగలదా?

కం. ధనహీనుఁడె బలహీనుఁడు, ధనహీనుని విడుతు రన్న♦దమ్ముల యేనిన్
ధనహీనుఁడు తలపెట్టిన, పని వేసవియేటి నీటి♦పగిది నశించున్. ౮౯౫౩

### తాత్పర్యము

ధనము లేనివాఁడు బలము లేనివాఁడు. ధనము లేనివాని నన్నదమ్ములైనను వదలిపెట్టుదురు. ధనము లేనివాఁడు తలఁచినపని యెండకాలమున నేటినీళ్ళ వలె నశించును. దేహబలము లేనివాఁడు ధనబలము గలవాఁడయ్యేనేని బహుజనులు

వాని నాశ్రయించి వాఁడు చెప్పినట్లు చేయుచుందురు గాన వాఁడు బలవంతుఁడే యగును. ధనము గలవానికి నందఱు బంధువులే. ధనము గలవాఁడు తలఁచిన పని యెంతటి యసాధ్యమైన దైనను సులువుగ నెఱవేఱును.

తే. సౌఖ్యపరుఁ డాత్మధనము వెచ్చంబొనర్చి, క్రమ్మఱసుఖార్థియై తదర్థంబుధనము
సేకరింపఁగ బాపముల్ సేయుచుండు, దానఁ గల్మషవర్తియై తా నశించు.

అర్థములు. సౌఖ్యపరుఁడు = సౌఖ్యము మరగిన వాఁడు, తదర్థంబు = ఆ సుఖము కొఱకై, సేకరింపఁగ = సమకూర్పఁగ, కల్మషవర్తియై=పాపవర్తనము కలవాఁడై.

తాత్పర్యము

ధనహీనుని గతి యింత మాత్రమే కాదు. ధనము గలవాఁడు సుఖములు మరగినవాఁడై వాని నిమిత్తము కలధనము వెచ్చించి పేదవడఁగా సుఖముల ననుభవించు చుండినవాఁడు కావున ధనముతోడ నవియు పోవుటచూచి ధనము వచ్చిన మరల సుఖములు వచ్చునని ధనార్జనమునకై దొంగతనము లోనగు పాపకార్యములు చేయును— ఆకారణముచే బాప చరిత్రుఁడై నశించును నిఱుపేద యగు వాఁడును ధనికులు సౌఖ్యపడుట చూచి సుఖాభిలాష ధన మార్జింపఁగోరి న్యాయమార్గమున సంపాదింప సమర్థుఁడుగాక యధర్మమార్గమున సంపాదింపఁబూని చెడును. కావున ధనములేమి యన్నివిధముల ననర్థకరమే.

*కం. కలవాఁడే మిత్రంబులు, గలవాఁడును బంధుజనులు గలవాఁడు సుమీ
కలవాఁడే పురుషుం డిలఁ, గలవాఁడే సర్వశాస్త్రగణపండితుఁడున్.

తాత్పర్యము

ధనము గలవాఁడే మిత్రులు గలవాఁడు మిత్రులు గలవాఁడు ధనవంతుఁడు కాఁడేని యా మిత్రులు దీర్ఘకాలము నిలువరు. ధనము గలవాఁడే బంధుజనులు గలవాఁడు. బంధుజనులు పెక్కురున్నను ధనము లేనివానిని వా రాదరింపరు. తమ వానిఁగా నెంచరు. కలవాఁడే మగవాఁడు. మగవాఁడైనను ధనము లేనివానిని స్త్రీ కంటె నికృష్టముగఁ జూతురు. స్త్రీలు స్త్రీకృత్యమునకైనఁ బనికి వత్తురు. వీఁడు దానికిని బనికిరాఁడు. కలవాఁడే సమస్త శాస్త్రములందుఁ బండితుఁడు. వాఁడు చెప్పినది యసత్యమైనను దానిని వేదవాక్యముగ లోకులు గ్రహింతురు. ధనము లేనివాఁడు వేదవాక్యమును జెప్పినను లోకులు దానిని లక్ష్యపెట్టరు.

---

*[Kautilya supports Lakshmana. Quote slokas here and explain Remind me if I live till you copy this. అని శ్రీ వాసుదాసస్వామివారు వ్రాసినారు. ఏమి చెప్పెడివారో.]

'యస్యార్థాస్తస్య మిత్రాణి యస్యార్థాస్తస్య బాంధవాః —
యస్యార్థాః సపుమాన్ లోకే యస్యార్థః సచ పండితః' — కౌటిల్యుఁడు.

ఎవరికి ధనము గలదో వారికే మిత్రులు గలరు. ఎవరికి ధనము గలదో వారికే బంధువులు గలరు. ఎవరికి ధనము గలదో వారే లోకములో పురుషులు ఎవనికి ధనము గలదో వాఁడే పండితుఁడు.

లక్ష్మణుని యొక్క పై అభిప్రాయముచే కౌటిల్యుఁడుకూడ బలపఱచుచున్నాఁడు.

కం. ధనవంతుఁడె బలవంతుఁడు, ధనవంతుండె ధీయుతుండు • ధర్మాత్ముండున్
ధనికుండె మహాభాగియు, ధనికుండె మహాగుణుండు• ధైర్యరతుండున్. ౯౫౬

అర్థములు. ధీయుతుండు=బుద్ధిమంతుఁడు.

కార్పణ్యము స్పష్టము.

ఉ. అర్థము లేమిఁ గల్గెడు ప•నర్థములన్ మును పల్కినాఁడ నే
యర్థముఁ గోరి రాజ్యమును • వ్యక్తము చేసితొ నె నెఱుంగఁ, దా
నర్థము సర్థకామముల•కై వ్యయపెట్టెడు వాని కేదియున్
వ్యర్థముపోదు, నిర్ధనుఁ డ•నర్థముఁ గూరు ధనాభిలాషి యై. ౯౫౭

అర్థములు. వ్యక్తము చేసితో=వదలితివో.

కార్పణ్యము

ధనము లేకుండినఁ గలుగు కీడులను ముందు చెప్పితిని ఏ ప్రయోజనముఁ గోరి రాజ్యమును నీవు వదలితివో నాకుఁ దెలియదు. ఎవనికైనను అర్థము కామము నిమిత్తమై ధనము వెచ్చపెట్టెడి వానికి నే కార్యమైనను వ్యర్థముపోదు. సర్వమను కూలించి వచ్చును. ధనము లేనివాఁడు ధనముఁ గోరి కీడుల పాలగును.

కం. శమమున్ హర్షము కామము, దమముం గ్రోధంబు దర్ప•ధర్మంబులు స
ర్వము నివి ధనమ్ముచే భూ,రమణా! వర్తించు నిలుచు • రహింగాంచు ధరన్.

అర్థములు. శమమున్=అంతరింద్రియ నిగ్రహము, హర్షము=సంతోషము, దమము=బాహ్యేంద్రియ నిగ్రహము, రహిగాంచును = ప్రకాశించును, ధరన్ = ఈలోకమందు, ధరన్, అనుటచేఁ బరలోక సుఖము గోరువాఁడు ధనము లేకున్నను దానిని సంపాదింపవచ్చును. అంతియకాదు. ముముక్షువున కది ప్రతిబంధకముగ నగును అని భావము. మనము క్షత్రియులము. భూమి పాలించుట మనకు స్వధర్మము. దానిని వదలి సర్వత్యాగము చేసిన సన్న్యాసుల ధర్మము ననుష్ఠించుట తగదు. మనస్వధర్మ నిర్వహణమునకు ధనమావశ్యకము. మనకైనను ముసలివారమై వానప్రస్థుల మైనపుడు ధనముతోఁ బనిలేదు కాని గృహస్థులమై క్షత్రియులమై యుండి యాశ్రమాంతర వర్ణాంతర ధర్మముల ననుసరింపరాదు, పరధర్మము భయావహము. స్వధర్మము శ్రేయస్కరము అని భావము.

ఉ. ధర్మము ధర్మమంచు నొక • ధర్మమునే శరణొందు వారికిన్
శర్మ మిహంబునం గలుగ•జాలదు, మేఘము లావరించినన్
భర్మసమాంశుముఖ్యఖగ•పాళులు దోఁచనిభంగి, సర్వస
చ్ఛర్మనిదాన విత్తములు • చారుగుణా! విను నీకు లేవుగా. ౧౯౫౯

అర్థములు. శర్మము = సుఖము, ఇహంబునన్ = ఈలోకమందు, ఇట్లను టచే ధర్మమునే శరణొందువారికిఁ బరలోకమందు సుఖము గలదని భావము. భర్మ సమాంశు ముఖ్య = బంగారు కాంతిగల కిరణములు గల సూర్యుఁడు మొదలగు, ఖగపాళులు = గ్రహములు, తోఁచనిభంగిన్=కానరాని విధమున, సర్వ+సత్+శర్మ = సమస్తములైన మంచి సుఖములకు, నిదానము = మూలకారణ మగు, విత్తములు=ధనములు, చారుగుణా=మనోహర గుణములు గలవాఁడా!

తాత్పర్యము

ధర్మము ధర్మమని తక్కిన యర్థకామములను వదలి ధర్మమే రక్షకమని తలఁచువారికి మేఘములు క్రమ్మిన సూర్యాది గ్రహములు కానరాని విధముగ నీ లోకమున సుఖములు లేవు. సమస్త సుఖములకు ప్రధాన కారణమైన ధనము నీకు లేదుగదా. నీ వర్థకాంక్ష గలిగి రాజవై యుంటివేని యీ సీతాహరణము వలనఁ గలిగిన యీ కష్టములం దొకటియైన నీకు లేక సుఖించుచుందువు గదా.

చ. జనకుని సత్యభావమునుఁ • జల్పగఁ బూనితి, తత్ఫలం బిదే
కనితివె? నీకు ప్రాణముల•కన్నఁ బ్రియన్ భవదీయపత్నినిన్
దనుజుఁడు ముచ్చిలించెను, గ•తం బది యేటికి? నింద్రజిత్కృతం
బునకుఁ బ్రతిన్ ఘటింతు రఘు•పుంగవ లెమ్ము యనుజ్ఞ యిమ్మిగిన్. ౧౯౬౦

అర్థములు. గతంబు = మించిపోయినది, ఇంద్రజిత్ + కృతంబునకున్ = ఇంద్రజిత్తు చేసినదానికి, ప్రతిన్ = మారు.

తాత్పర్యము

అసత్యమాడిన తండ్రిని సత్యవంతుని జేయవలయునని నీ సుఖము నీవు చూచుకొనక ప్రయత్నించితివి. దాని ఫలముఁ జూచితివా, ఎట్లు లభించెనో? నీ ప్రాణములకంటెఁ బ్రియురాలిని నీ భార్యను రాక్షసుఁడు దొంగిలించెను. నీవు సుఖముగా నింటనుండిన నీకీ కష్టము ప్రాప్తించి యుండదుగదా. అయినదేమో యైనది. మించినదానికిఁ జింతించి యేమిలాభము? ప్రకృత మనుసరింతము. ఇంద్రజిత్తు చేసిన కార్యమునకుఁ బ్రతీకారము చేసెదను. లెమ్ము. నాకనుజ్ఞ యిమ్ము నీయాజ్ఞ లేక నే నేదియుఁ జేయఁజాలకున్నాను.

తే. పార్థివోత్తమ! యాజానుబాహుయుగళ!, నియమసద్వ్రత! లే లెమ్ము • నినుమహాత్ముఁ
డైన యాత్మని నెఱుఁగ లే•కకట! నీవ, యిట్లు తపియింపఁ జేయ నే•నేమి సేతు?

అర్థములు. మహాత్మన్=గొప్ప యత్నము కలవాఁడవు, గొప్ప ధైర్యము గలవాఁడవు. గొప్ప మనస్సు గలవాఁడవు, గొప్ప స్వభావము గలవాఁడవు, గొప్ప బుద్ధిగలవాఁడవు, ఇంతయేల 'మహతో మహీయాన్' అన్నట్లు గొప్పయని చెప్పఁబడు వాని కన్నిటికంటె గొప్పవాఁడవు, ఆత్మను=పరమాత్మను; విష్ణువును.

తాత్పర్యము

రాజశ్రేష్ఠుఁడా! మోఁకాళు లంటు బాహువులు గలవాఁడా! నియమముగా మంచి వ్రతముల ననుష్ఠించువాఁడా! లేలెమ్ము. మహాత్ముఁడవు, ఆత్మవు నగు నిన్ను నీవు తెలియని వానివలె వ్యసనపడితివేని నీదాసుఁడనైన నేనేమి చేయనేర్తును.

ఉ. నీకుఁ బ్రియం బొనర్పఁగ జ • నించిన పేఁడు భవత్ప్రియావధం
బాకట వింట రోషకలు • షాత్మకుఁ డయ్యెను దేవ! లంక న
స్తోకరథాశ్వసింధురముఁ • దూర్ణము రాక్షసనాథ యుక్తమున్
బ్రాకటమత్కరోజ్ఝితశ • రప్రకరంబులఁ గూల్చునై చెరన్. ౧౯౬-౭

అర్థములు. భవత్ప్రియావధంబు=నీప్రియురాలు చంపఁబడుట, ఆకట = అయ్యో! హా కష్టమ్ యొక్క తద్భవము. వింటన్ = వినుటచే, రోషకలుషాత్మ కుఁడు = కోపముచేఁ గలఁక పాఱిన మనస్సు గలవాఁడయ్యెను, దేవ= నా పాలిక నీవు దేవుఁడవనియే నా భావము, అస్తోక = అధికముగా, రథ - అశ్వ - సింధు రము=తేరులు గుఱ్ఱములు ఏనుఁగులు కలదియగు లంకను, మత్కరోజ్ఝిత శరప్రక రంబులన్=నా చేత నున్న వింటినుండి విడువఁబడిన బాణసమూహములచే.

తాత్పర్యము

రామచంద్రా! నీవు దేవుఁడ వనియే నా యభిప్రాయము. అట్లైన నేల యిన్నియు నత్యవ్యస్తపు మాటలాడితి వందువా? నేను నీకుఁ బ్రియము చేయఁబుట్టిన వాఁడను. అట్టి ప్రయత్నమందే యుండువాఁడను. నీ ప్రియముగోరు నేను నీకు నీ ప్రాణములకంటెఁ బ్రియురాలగు నీ భార్య యితరులచే సంహరింపఁబడిన దని విన్నప్పుడు నా మన స్సెట్టులుండవలెనో యాలోచింపుము. నీ ప్రియురాలిని నీతోడఁ జేర్చి నీకుఁ బ్రియము కలిగింప యత్నించు నాకు నది విఘ్నమై పోవుటచే కోపమున కలఁక పాఱిన మనస్సు గలవాఁడనై తాఱుమాఱుగఁ బలికితిని. క్షమిం పుము. అట్లైన నిప్పు డేమి చేసెదమందువా? లంకను రావణాసురునితో నేనుఁ గులు గుఱ్ఱములు తేర్లతో నా బాణములచే నాశము చేసెదను.

వాల్మీకి లక్ష్మణునిచే నీతి వాక్యములు పలికించుట నీతికంటె ధర్మము శ్రేష్ఠ మని స్థాపించుటకే. కావడి యెన్ని వంకరలు పోయినను ఇల్లు వచ్చి చేరుట ప్రధాన మైనట్లు కేవల ధర్మ పక్షమున నిలచి రామచంద్రమూర్తి యెన్ని కష్టములు పడినను దుదకు ధర్మమే జయించునని యనుష్ఠానముచేఁ జూపెను.

అర్థో ధర్మః కామ ఇత్యర్థే త్రివర్గః । తస్యపూర్వః పూర్వః శ్రేయాన్ వను సంప్రాప్తుమ్॥ కౌటిల్య. ఇందు ధర్మమునకంటె నర్థము ప్రధానముగాఁ జెప్పఁబడెను. రాజునకుఁ బ్రజాపాలనకర్మము ధర్మము. ధనములేక ప్రజాపాలనము జరుగదు. కావున నర్థసంగ్రహము ప్రథమము. కనుకనే కౌటిల్యుఁడు "అర్థ ఏవ ప్రధానః అర్థమూలోహి అర్థకామావితి'అని చెప్పెను. ఈనీతి ననుసరించినవాఁడు లక్ష్మణుఁడు. నీకు న్యాయముగా రావలసిన దేల పోఁగొట్టుకొంటివని లక్ష్మణుఁడు చెప్పెను గాని యన్యాయముచేసి ధన మార్జింపుమని చెప్పలేదు.

"ధర్మాదర్థశ్చ కామశ్చ"అని వ్యాసమతము. భారత సావిత్రి. ఈ ధర్మము ననుసరించినవాఁడు రామచంద్రమూర్తి. ఇది యయోధ్యాకాండమునఁ జెప్పెను. అయినను వాలివధమందు ధర్మవిరుద్ధము కాని నీతి ననుసరించెనని తోఁచెడిని.

## —•{ ౮౪-వ సర్గము. విభీషణుఁ డింద్రజిత్తుమాయోపాయంబు శ్రీరామునకుఁ దెలుపుట }•—

సీ. అని భ్రాతృవత్సలుం • డగు లక్ష్మణుం డన్న, నూరార్చుచుండఁగ • నుచితరీతి
గుల్మముల్ దీరిచి • కుంజరసేవిత, యూథపభంగిని • నుగ్రులైన
సచివులు గొల్వ నా • స్థానంబునకు విభీషణుఁ డరుదెంచి బా•ష్పములు రాల
వగచు లక్ష్మణు నున్న•వానరులను లక్ష్మ.ణాంకాశ్రితుని వ్యస•నార్తు రాముఁ
ఆ. గాంచి వగచి యేమి•కతము దీనికి ననఁ, గనుల మిగుల నీరు • గార్చికొనుచు
నతనిఁ గపుల భాస్క•రాత్మజుఁ జూచుచు, లక్ష్మణుండు పలికె•సూక్ష్మఫణితి.

అర్థములు. భ్రాతృవత్సలుఁడు = అన్నమీఁదఁ బ్రేమ గలవాఁడు, అన్న కష్టపడుచున్నాఁడే యని పరితాపపడి యెట్లులైన సుఖము కలిగింపఁ గోరి మీఁది వాక్యము లుచ్చరించెనని యెఱుఁగనగు. వైద్యులు తమ బిడ్డలకు రోగమువచ్చి నపుడు కఠిన పథ్యము పెట్టినను వాత్సల్యాతిశయంబున నట్టి పథ్యము పెట్టలేక యెట్లులైన నింత యన్నము లోపలికిఁ బోవునుగాక యని యపథ్య వస్తువులు పెట్టెడి తల్లు లెందరో గలరు. అట్టివారిలోఁ జేరినవాఁడు లక్ష్మణుఁడు, గుల్మముల్=సేనా సన్నివేశములు, కుంజరసేవిత=ఏనుఁగులచేఁ గూడిన, యూథప భంగిని=పరికాని వలె, ఏనుఁగుల గుంపులో ముఖ్యమైన యేనుఁగునకు పరికాఁడని పేరు. ఉన్న వాన రులను = తక్కిన క్రోఁతులను, లక్ష్మణాంకాశ్రితుని = లక్ష్మణు తొడఁమీఁదఁ బండుకొనిన వానిని, కతము=కారణము, సూక్ష్మఫణితి=మెల్లగా.

### తాత్పర్యము

ఈ ప్రకార మన్నయందుఁ బ్రేమగల లక్ష్మణుఁ డూరార్చుచుండగాఁ సేనా సన్నివేశములు చక్కఁజేసి యేనుఁగులతోఁ గూడ పరికానివలె భయంకరుఁడైన తన నలువురు మంత్రులతోఁ గూడి రామలక్ష్మణులున్న ప్రదేశమునకు విభీషణుఁడు

వచ్చి కన్నులనీరు గాఱ దుఃఖించు లక్ష్మణునిఁ జక్కిన వానరులను జూచి యేల యిట్లున్నారని యడుగఁగా మిక్కిలి కన్నీరు కార్చుచు నతని, సుగ్రీవుని, వానరులను జూచుచు లక్ష్మణుఁడు హీనస్వరమున నిట్లనియె.

కం. హాత యయ్యె నిపుడు ధరణీసుత యింద్రజిచే నటన్న ♦ సుద్దులను మరు
త్సుతుఁడు వచించిన రాఘవుఁ, డతిదుఃఖముచేత మూర్ఛ♦నందె మహాత్మా !

తాత్పర్యము స్పష్టము.

చ. అని వచియించు లక్ష్మణుని ♦ నాఁగి విభీషణుఁ డిట్లు పల్కె నో
యనఘ ! మరుత్తనూజునడి ♦ యంబుధి యింకె నటన్న రీతిగా
మనమున నమ్మరాదు, సుర ♦ మర్దనుచిత్తము నే నెఱుంగుదున్
జనకజపట్ల, నత్తరుణిఁ ♦ జంపఁడు నొంపఁడు నమ్ము రాఘవా ! ౧౯౬౫

అర్థములు. ఆఁగి = అడ్డగించి, అంతయు నాకుఁ దెలియును. నీవు చెప్ప వలసిన పనిలేదని, సురమర్దను=రావణాసురుని.

తాత్పర్యము

అని యింకను నేమేమో చెప్పఁబోవు లక్ష్మణుని నిలిపి రామచంద్రుని జూచి యిట్లనియె. పుణ్యాత్ముఁడా ! సముద్ర మింకిపోయిన దని యెవ్వరైన జెప్పిన నది యెంత నిజమో హనుమంతుఁడు చెప్పినది యంత నిజమే. నమ్మఁదగినదిగాదు. ఏల యందువా ? సీతావిషయమున రావణుని చిత్తవృత్తి నే నెఱుంగుదును. ఆమెను వాఁడు చంపను జంపఁడు. మఱి యేవిధముగను బాధింపఁడు. నామాట నమ్ముము. ఆమెకు భయము లేదు.

ఉ. ఎంతయు వేఁడినాఁడ మను ♦ జేశ్వర ! యూతనిమేలు గోరి భూ
కాంతతనూజ నీవు మని ♦ కర్ణము లీయఁడు నా హితోక్తికిన్
శాంతము దానభేదములు ♦ జాలము దండము నీన నేరికిన్
బొంతను బోయి చూచుటకుఁ ♦ బోలదు పో జనకాత్మసంభవన్. ౧౯౬౬

అర్థములు. జాలము = ఇంద్రజాలము. మోసము.

తాత్పర్యము

రామచంద్రా ! సీతాదేవిని వదలిపెట్టుము, లంకలో నీ స్వాధీనమందుంచుకొనకుమని, నేనెంతయో చెప్పితిని. నా హితసూక్తి వాఁడు విన్నవాఁడు కాఁడు. సామదాన భేదములచేఁగాని, మాయాదండములచేఁగాని సీతాదేవి సమీపమునకైనఁ బోవుటకు నెవ్వరికి సాధ్యపడదు. కావున నింద్రజిత్తు సీతాదేవిని లాగి తెచ్చుట సంహరించుట యివి కొంచెమైన సత్యమని యనుమానింప నైనరాదు.

## ఇంద్రజిత్తు నికుంభిల యాగముఁ జేయువార్త విభీషణుఁడు శ్రీరామునకుఁ దెలుపుట.

సీ. విన నీకృతిచేత • నగులాభ మే మన్న, మోహాకులిచి కపి•వ్యూహములను
గ్రూరుఁడై చైత్యని•కుంభిల రావణి, హోమంబుఁ జేయుచు • నున్నవాఁడు
అది పూర్ణమైనచో • నమరాదులకు నైనఁ, గలన నజయ్యుండు • కాన వాని
విక్రమక్రమమును • విఘ్నముఁ గావింప, వానరవర్యులఁ • బంపవలయు
ఆ మాయఁ బన్నినాఁడు•మనుజేంద్ర! సత్యంబు, వేల్మి ముగియుమున్న•వీరవరులఁ
గపులఁ బంపు మందుఁ•గారణ హీనమౌ, వగపు మాను రామ•భద్ర లెమ్ము.

అర్థములు. కృతిచేతన్ = ఇప్పుడు వాఁడుచేసిన కార్యముచేత, చైత్యనికుంభిలన్ = నికుంభిల యను పేరుగల చైత్యమునందు, రాతికట్టడమునకు చైత్యమని పేరు. నికుంభిల దేవతపేరనియు ఆమెకు రాతితో నాలయము కట్టియున్నారనియు అందు మఱ్ఱిచెట్టు కలదనియు ఆ చెట్టుక్రింద నింద్రజిత్తు హోమము చేయుచున్నాఁడనియు నెఱుఁగవగు. చేయుచు నున్నవాఁడని వర్తమానార్థకముగఁ జెప్పుటచే వాఁడు నికుంభిల యొద్దకుఁ బోయినవార్త తన మంత్రులవలనఁ దెలిసికొనియే విభీషణుఁడు రామలక్ష్మణులఁ జూడవచ్చెనని భావము. అజయ్యుండు = జయింప సాధ్యముకానివాఁడు.

### తాత్పర్యము

నీవు చెప్పినది నిజమైన యెడల వాఁడీ ప్రకారము చేయనేల? నిష్ప్రయోజనముగ వాఁ డిట్టి కార్యము చేయునా యందువేమో? ఇంతవఱకు లంకలో యోధులగు వీరు లిచ్చట యుద్ధము చేయుచుండఁగా వాని యిష్టము వచ్చినట్లు వాఁడు హోమములుచేసి వచ్చుచుండెను. ఇప్పుడు లంకలో వాఁడు తప్ప నిచ్చటికి వచ్చి మనకుఁ బని కల్పింపఁ దగినవాఁడు లేఁడు. ఊరక హోమము చేయుచుండిన వానరులు లోపలఁ బ్రవేశించి లంక ధ్వంసముచేసి యజ్ఞమునకు విఘ్నమొనర్తురు. ఎవఁడు యజ్ఞము విఘ్నముచేయునో వానిచేతనే వాఁడు చచ్చునట్లు బ్రహ్మవరము గలదు, ఆ కారణముచే వానరులు గాని మీరుగాని యీ ప్రక్కకు రాకుండుటకై మన కిక్కడ నేడ్చుచుండు పని కల్పించి వాఁడు హోమము చేయుచున్నాఁడు. అది పూర్ణముగ నెఱవేఱెనా దేవతలైనను వానిని జయింపలేరు. కావున వాని పరాక్రమము విఘ్నము చేయ వానరులను బంపవలెను. వాఁడు మిమ్ముల నందఱ మోసగించినాఁడు. ఇది వాస్తవము. కావున వాని యజ్ఞము పూర్తి కాకముందే వానరులఁ బంపుము. నిష్కారణమైన యేడుపు మానుము. లెమ్ము.

జం. వ్యసనమున మునుఁగు నిష్టని, పసచెడి సైన్యంబు శోక•భరమున మాతో
వెస సౌమిత్రిని బంపుము. కసి తీరఁగ నీతఁ డతని • గండడఁగించున్. ౧౮౬౮

తాత్పర్యము

దుఃఖపడుచుండు నిన్నుఁజూచి సేనగూడ నిస్సారమై యున్నది. నీవు లేచి ధైర్య మవలంబించితివేని వానరులును బురికొందురు. ఆలస్యము చేయక మా వెంట లక్ష్మణుఁబంపుము. వగతీరగ నీయన యతనిఁ జంపును.

ఉ. శూరుఁడు లక్ష్మణుండు బల ♦ సూదనవైరిసవంబుఁ దొల్తదు
ర్వారశరంబులం జెఱిచి ♦ వాని వధించును వెండి శత్రుసం
హారమునం దుపేక్ష దగ ♦ దావతి యిమ్ము సుమిత్రపట్టికిన్
వైరి సమాప్తకర్ముఁ డయి ♦ నన్ విబుధాళికి నే నసాధ్యుఁడౌ. ౧౯-౨౦

అర్థములు. బలసూదనవైరి సవంబు=ఇంద్రజిత్తు చేయు యజ్ఞము, సమాప్తకర్ముఁడు=యజ్ఞము పూర్తి చేసినవాఁడు.

తాత్పర్యము

అచ్చటికిఁబోయి చేయవలసిన దేమందురా? లక్ష్మణుఁడు ముందుగ నింద్రజిత్తు యజ్ఞమును బాణములచే గొట్టి చెఱుపవలెను. అవల వానిని వధింపవలెను. ఈశత్రువును జంపుట యందుపేక్ష సేయరాదు. లక్ష్మణున కాజ్ఞ యిమ్ము. యజ్ఞము పూర్తియాయెనా దేవతలయినను వాని జయింప లేరు.

కం. సవమారఁ దీరెనేనియు, దివిజారిసుతుండు దివి న ♦ దృశ్యుం డగుడున్
బవర మొనరించుఁ బదపడి, యవనీశ్వర ! యతని గెల్వ ♦ నమరుల వశమే.

అర్థములు. సవము=యజ్ఞము, ఆరన్=పూర్ణముగ, తీరెనేని = చక్కఁగా నెఱవేఱెనేని, అదృశ్యుండు=కానరానివాఁడు, బవరము = యుద్ధము, పదపడి = ఆపిమ్మట.

తాత్పర్యము

యజ్ఞము పూర్తిగా నెఱవేఱ్చినా యింద్రజిత్తు కానరాకుండ యుద్ధము చేయును. అవల వానిని గెల్వ దేవతలకు సాధ్యము గాదు.

—♦ { ౮౬-వ సర్గము. ఇంద్రజిత్తును జంప లక్ష్మణుఁ బంపుమని విభీషణుఁడు శ్రీరాము వేఁడుట } ♦—

చ. అనవుడు దుఃఖతప్తమతి ♦ యావరపాలవరేణ్యుఁ డామదుల్
వినియు గ్రహింపలేక ధృతి ♦ వెండియుఁ గైకొని లేచి యిట్లనున్
విన మదిఁ గోరెదన్ దనుజ ♦ వీర ! వచింపుము క్రమ్మఱంగ నీ
వనిన హితోక్తులన్న మహి ♦ తాత్మకుఁడా యసురేంద్రుఁ డిట్లనున్. ౧-౫

అర్థములు. దుఃఖతప్తమతి = దుఃఖముచేఁ దపించిన మనస్సు గలవాఁడు.

తాత్పర్యము

ఇట్లు విభీషణుఁడు చెప్పఁగా దుఃఖముచేఁ దపించిన మనస్సుగల రామచంద్రమూర్తి యామాటలు వినియు గ్రహింపలేక ధైర్యము తెచ్చుకొని లేచి మరల

నిల్లనెను. రాక్షసవీరా! నీవు చెప్పిన హితములైన మాటలు మరలఁ జెప్పుము విన గోరెదను, అనిన విభీషణుఁ డిట్లనియె.

కం. నీయానతిఁ గొని చని యా, యా యెడలన్ నిలిపి సేన • లన్నియును యథా
న్యాయంబుగ విభజించితిఁ, జేయంగలయంతవట్టు • చేసితి నధిపా! ౧౯౭౨

తాత్పర్యము

నీ యాజ్ఞ తీసికొని పోయి యే యే యెడల నే యే సేనల నిలుపవలయునో యాయాచోటుల నాయాసేనల క్రమముగ నిలిపి సేనలను విభాగించి యెంతవఱకు భద్రపఱుప వలయునో యంతయుఁ జేసితిని. ఆ విచారము నీకక్కఱ లేదు.

ఉ. నా మన వాలకింపుమి మ•నంబున హేతువు లేని యార్తి మీ
రీ మెయి సంతపింప నన • నేటికి మా దురవస్థ దేవ ! మా
యామయశోకమున్ విమత•హర్షకరంబును వీడి సమ్మద
స్థాయిఁ బరాక్రమంబుఁ గొని • శాత్రవులం బరిమార్పఁ జూడుమా. ౧౯౭౩

తాత్పర్యము

నేను జేయు మనవి వినుము, కారణము లేని దుఃఖముచే మీరీ ప్రకారము సంతాపపడఁగా మా దురవస్థ నేనేమని చెప్పుదును ? దేవా! శత్రువుల సంతోష కరమగు మాయచేఁ గలిగిన శోకము వదలి సంతోషము నిలుకడగఁ గల పరాక్రమమును గ్రహించి శత్రువును వధింపుము.

ఉ. జానకిఁ గమ్మఱం గొనఁగ • స్వాంతమునం గలదేనిఁ ద్రుంపుమీ
దానవపాళి నెల్ల, నల•దానికి నే నుపమన్ వచించెదన్,
వానరసేనతోడ రఘు•వర్య! నికుంభిల కిప్డు పంపుమీ
యీ నెఱబంటు లక్ష్మణుని • నీయన రావణిఁ ద్రుంచుఁ బోరిలోన్. ౧౯౭౪

అర్థములు. స్వాంతమునన్ = మనస్సునందు, ఉపమ = ఉపాయము, నెఱబంటు=మిగుల శూరుని.

తాత్పర్యము

నీకు జానకిని మఱల గ్రహింపవలయునని కోరిక యుండెనా రాక్షసులనెల్లఁ జంపుము. అంతవఱకు నీ కోరిక నెఱవేఱదు. ఆ కార్యము సాధించు నుపాయము నేను జెప్పెదను. వానరసేనతోడ నికుంభిలకు నీ శూరాగ్రేసరు లక్ష్మణుఁ బంపుము. ఈయన యింద్రజిత్తును వధించును.

తే. మండలీకృతభీమకో•దండుఁ డగుచు, భండనంబున నీతఁ డు•ద్దండవృత్తి
గండడంచును నిజభుజా•చండిమమునఁ, గాండకాండప్రయుక్తి నా•ఖండలారి.

అర్థములు. మండలీకృత = గుండ్రముగాఁ జేయఁబడిన, భీమ=భయంకర మైన, కోదండుఁడు = విల్లుగలవాఁడు, భండనంబునన్ = యుద్ధమందు, ఉద్దండ వృత్తిన్ = పరాక్రమముచే నధికమైన వ్యాపారములో, నిజ=తనయొక్క, భుజా=

భుజబలములయొక్క, చండిమమునన్ = వాఁడిమిచేత, కాండ = బాణములయొక్క, కాండ=సమూహములయొక్క, ప్రయుక్తిన్ = ప్రయోగముచే, ఆఖండలారిన్ = ఇంద్రజిత్తును.

### తాత్పర్యము

లక్ష్మణుఁడు వానిని జంపఁగలడా యని సందేహింప వలదు, వింటిని గుంద్రముగా వంచి యుద్ధమున భుజబలము వాఁడిమి చేత బాణసమూహములఁ బ్రయోగించి యింద్రజిత్తును జంపగలఁడు.

చ. దశముఖనందనుండు మహి♦తం బగు ఘోరతపం బొనర్చి బ్ర
హ్మశిరమునస్త్ర మభ్రచర ♦ మైన తురంగతతిన్ వరంబుగా
దశరథనందనా! పడసెఁ ♦ దామరసోదరుచేత, దాన నా
నిశిచరుఁ డేగినాఁడు క్రతు♦నిర్వహణైకమనస్కుఁడై నృపా! ౧౯౭౬

అర్థములు. అభ్రచరము = ఆకాశమున సంచరించునది, తామరసోదరుచేతన్ = బ్రహ్మచే, క్రతునిర్వహణైకమనస్కుఁడై = యజ్ఞము పూర్తి చేయుటయందే మనస్సంతయు నుంచినవాఁడై.

### తాత్పర్యము

ఏమి ధైర్యముతో లక్ష్మణుఁ డితని జంపఁగలఁడని యడిగెదవేని వినుము. ఇంద్రజిత్తు ఘోర తపస్సుచేసి బ్రహ్మచేత బ్రహ్మశిర మను నస్త్రము ఆకాశ సంచారము చేయు గుఱ్ఱములను దేరిని వరముగాఁ గోరి తీసికొనెను. ఆకారణము చేత వాఁడు యజ్ఞపూర్తియందే మనస్సంతయు నిల్పిన వాఁడై పోయెను.

చ. బలగము చుట్టునుం బలియ ♦ వాఁడు నికుంభిల కేగినాఁడు, వాఁ
డలసవమున్ ఘటించి యని♦కై యరుదెంచిన మమ్ము నెల్లరం
దలఁపుము చచ్చినా రని, పి♦తామహుఁడుం గ్రతువిఘ్నకర్తయే
బలరిపువైరినిం దునుము♦వాఁ డని చెప్పె వరంబు నిచ్చుచోన్. ౧౯౭౭

అర్థములు. బలము = సేన, బలియన్ = చుట్టుకొనఁగా, అల = ఆ, సవమున్ = యజ్ఞమును, క్రతువిఘ్నకర్తయే=యజ్ఞమునకు విఘ్నము చేసినవాఁడే, బలరిపు వైరినిన్=ఇంద్రజిత్తును.

### తాత్పర్యము

సేన తన్నుఁ జుట్టుకొని రాఁగా వారి నడుమఁ దాను గానరాకుండ నికుంభిలకుఁ బోయినాఁడు. ఆ యజ్ఞము వాఁడు పూర్తి చేసినా మేమందఱము వాని చేతఁ జచ్చినార మనియే నమ్ముము. బ్రహ్మదేవుఁ డా వరమిచ్చువేళ నీయజ్ఞము నెవఁడు విఘ్నపఱచునో వానిచే నీవు చచ్చెదవని చెప్పెను. కావున లక్ష్మణుఁడు పోయి యజ్ఞమును విఘ్నపఱచెనా, లక్ష్మణుని చేతిలో వాఁడు తప్పక చచ్చును.

కం. కావున వానిం దునుమఁగ, నీ వనుమతి యిమ్ము జాన • కీశ్వర! కలవన్
రావణి తెగ హితరతితో, రావణుఁడుం జచ్చినట్లు • రామా! యనుచున్ ౧౯౭౦

తాత్పర్యము స్పష్టము.

చ. తెలియనివాఁడఁ గాను సుమ • తిప్రవరా! యలవానిమాయలున్
బలము జవంబు, వాఁడు కడుఁ • బ్రాజ్ఞుఁడు, బ్రహ్మశరం బెఱుంగు, వే
ల్పుల జలధీశు నైనఁ బోరి • పుచ్చఁగ నేర్చు రథస్థుఁ డై, దివిన్
జలధరసంప్లవార్కుగతిఁ • జక్షు రగోచరుఁ డై చరించెడిన్. ౧౯౭౧

అర్థములు. సుమతిప్రవరా = బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా! జలధర = మేఘములచే, సంప్లవార్కుగతిన్ = కప్పబడిన సూర్యునివలె, చక్షురగోచరుఁడు = కన్నులకుఁ గానని వాఁడు.

తాత్పర్యము

బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా! యింద్రజిత్తు చేయు మాయలు, వాని బలము వాని వేగము నేను దెలియని వాఁడఁగాను. వాఁడు మిగుల బుద్ధిమంతుఁడు. బ్రహ్మశరము తెలిసినవాఁడు. రథమునందున్న వాఁడై దేవతలను వరుణునైనఁ జంపఁగలఁడు. ఆకాశమందు మబ్బు మాటు సూర్యునివలె నెవ్వరికిఁ గానరాక తిరుగఁగలఁడు.

**—• ఇంద్రజిత్తును జంప శ్రీరాముఁడు లక్ష్మణుని నికుంభిలకుఁ బంపుట. •—**

సీ. అన దురాత్ముండైన • యసురేంద్రనందను, బలమెంచి యనుజుతోఁ • బలికె నిట్టు
లన్న! సుగ్రీవుని • యఖిలసైన్యముతోడఁ, బవనజముఖయూథ • పతులతోడఁ
జాంబవంతునితోడఁ • జని జాపిరము లేక, మడియింప వయ్య యా • మాయలాని
నస్త్రదెంచు నీమహి • తాత్ముఁడు మంత్రుల, తో విభీషణుఁడును • దోడుగాఁగ

ఆ. నతనిసవనతలము • నితఁడు చూపునటన్న, నద్భుతోరువిక్ర • మాఢ్యుఁ డైన
లక్ష్మణుండు హేమ • లసితచాపముఁ గేలఁ, గొన విభీషణుండు • గొని మెనోండు.

అర్థములు. జాపిరము = జాగు, మాయలానిన్ = మాయల వానిన్, మాయలాఁడు ప్రథమ - సవనతలము = యజ్ఞప్రదేశము, అద్భుతోరు విక్రమాఢ్యుఁడు = ఆశ్చర్యకరమైన గొప్పదైన విక్రమ సంపద గలవాఁడు, ఇంతవఱకు విభీషణుఁడు గద ధరించియే యుండెను. ఇప్పుడు వింటితోను బనిపడునని తానొక్క వింటిని దీసికొనెను.

తాత్పర్యము

ఈప్రకారము విభీషణుఁడు చెప్పఁగా దుష్టమనస్సు గల యింద్రజిత్తు బల మాలోచించి సులభసాధ్యుఁడు గాఁడని తలఁచి తమ్మునితో నిట్లనియె. అన్నా! సుగ్రీవుని యను నసైన్యముతోడ హనుమంతుఁడు మొదలగు యూథనాయకుల తోడ జాంబవంతుని తోడఁ బోయి ఆలస్యము లేక యా మాయలమారిని

జంపుము. ఈగొప్ప మనస్సు గల విభీషణుఁడు మంత్రులతో నీవెంట వచ్చి యజ్ఞ వాటము చూపును. అని చెప్పఁగా నాశ్చర్యకరమై గొప్పది యగు పరాక్రమ సంపత్తి గల లక్ష్మణుఁడు బంగారుచేఁ బ్రకాశించు చాపముఁ జేతఁ దీసికొనెను. విభీషణుఁడును నొక విల్లు దీసికొనెను.

కం. సన్నద్ధుండై కవచం,బు న్నిశితతరాసిబాణ•ములు గైకొని తా

నన్నపదంబుల వ్రాలి ముదున్నతి వచియించి నిజమ•హోద్యమవిధమున్.

అర్థములు. సన్నద్ధుండై = యుద్ధమునకు సిద్ధపడినవాఁడై, నిశిత తర= మిగుల వాఁడి యగు, అసి=కత్తి, బాణములు, ముదున్నతిన్ = సంతోషాతిశయముచే, నిజ = తన, మహోద్యమ విధమున్=గొప్ప ప్రయత్న విధమును.

తాత్పర్యము

యుద్ధమునకు సిద్ధపడిన వాఁడై కవచంబు తొడిగికొని మిగుల పదునైన కత్తి బాణములు దీసికొని యన్న పాదముల వ్రాలి నమస్కరించి సంతోషాతిశయంబునఁ దన గొప్ప ప్రయత్న విధమును జెప్పెను.

ఉ. ఇప్పుడు మత్కరోజ్ఝిత శి•తేషువు లా దశకంఠపుత్రుమే

నొప్పుగఁ దూఱి పుష్కరి•ణి వ్యూహములై చొరఁబాఱు నంచలై

తొప్పలుదోరలై పడెడిఁ • మార్గము లంకపయిన్ మహాత్మ! వాఁ

డిప్పుడు మచ్ఛరాహతి మ•హిం బడు దారితసర్వగాత్రుఁడై. ౧౯౧౨

అర్థములు. మత్ =నాయొక్క, కర = చేతులచే, ఉజ్ఝిత = విమ్మఁబడిన, శిత=పదునైన, ఇషువులు = బాణములు, పుష్కరిణిన్ = సరస్సునందు, తొప్పలు దోరలై =గుంపులు గుంపులై, మత్ + శరాహతిన్ = బాణముల దెబ్బచే, దారిత= చీల్పఁబడిన, సర్వగాత్రుఁడై = దేహమంతయు గలవాఁడై.

తాత్పర్యము

ఇప్పుడు నాచే విడువఁబడిన బాణము లాయింద్రజిత్తు దేహమునందుఁ దూఱి సరస్సునందు గుంపులుగ వ్రాలు హంసలవలె లంకపై శీఘ్రముగ గుంపులు గుంపులుగాఁ బడును. ఇప్పుడు వాఁడు నాబాణములచేఁ జీల్పఁబడిన దేహము గలవాఁడై నేలఁబడును.

చ. అని వచియించి రావణివ•ధాభిరతిన్ వలగొంచు భక్తి రా

మునిచరణాంబుజంబులకు • మ్రొక్కి విభీషణుతోడ నంజనా

తనయునితోఁ బ్లవంగమవి•తానముతోఁ జనువాఁడు జాంబవం

తునిబలఁగంబుఁ గాంచి నడి•త్రోవను దానిని గొంచు నేగుచున్. ౧౯౧౩

అర్థములు. వధాభిరతిన్ = చంపుట యందలి ప్రీతిచే, వలగొంచున్ = ప్రదక్షిణము చేసి.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పి యింద్రజిత్తును జంపు కాంక్షచే రామచంద్రమూర్తికిఁ బ్రదక్షిణించి యాయన పాదపద్మములకు నమస్కరించి విభీషణాంజనేయులతోను, వానరసేనతోడను బోవుచు నందుత్రోవలో జాంబవంతుఁడు కనబడఁగా నతని సేనను దీసికొని పోవుచు.

చ. చని చని దూరమందుఁ గనె • శస్త్రభయంకర మై విశాల మై
ఘనతరకేతనోగ్ర మయి • గాఢజవం బయి దీప్తిమంత మై
కనఁగొనఁ గారుమబ్బునకు • గాదిలిచుట్టము నై రహించు నా
దనుజవరేణ్యుసేనఁ, గని • దారుణకార్ముకదండహస్తుఁడై. ౧౯౧

అర్థములు. శస్త్రభయంకరమై = ఆయుధముల వలన భయము గలిగించు నదియై, ఘనతర=మిగుల గొప్పదగు, కేతన+ఉగ్రమై=ధ్వజముచే భయంకరమై, గాఢజవంబయి = మిగుల వేగము గలదై, దీప్తిమంతమై = ప్రకాశించునదియై, కారుమబ్బునకున్ = వానకాలము మేఘమునకు, గాదిలిచుట్టమునై = ప్రియమైన బంధువై, అనఁగా సమానమై, దారుణ = భయంకరమైన, కార్ముకదండ=దండము వంటి వింటిని, హస్తుఁడై=చేతఁగలవాఁడై.

తాత్పర్యము

ఇట్లు పోయిపోయి దూరమందు శస్త్రములచే భయంకరమై విస్తారమై గొప్ప ధ్వజమ్ము కలదై, మిగుల వేగము గలదై ప్రకాశమానమై వానకాలపు మబ్బునకు సమానమైన గొప్ప నా రాక్షసశ్రేష్ఠుని సేనలఁ జూచెను. చూచి భయంకరమైన వింటిని చేతఁదీసికొనినవాఁడై.

తే. పవనతనయునితోడను • వాలితనయు,తో విభీషణుతోడ నద్దుష్టు యజ్ఞ
మబ్జజునివాక్యవిధమున • హతము సేయ,సిద్ధపడి యుండె నప్పు డా•సేనఁజూచి.

తాత్పర్యము

హనుమంతునితోడ నంగదునితోడ విభీషణుతోడ నాదుష్టుని యజ్ఞమును బ్రహ్మవాక్యము ప్రకారము నాశముచేయ సిద్ధపడి యుండెను. అప్పుడా సేనను జూచి.

## ౮౬-వ సర్గము. విభీషణుఁడు లక్ష్మణునకు నింద్రజిత్తుండు బోటు చూపుట.

కం. బాధక మరులకు నై హిత, సాధక మూరితిఁ బలికె • సౌమిత్రి ! ద్విష
ద్యోధులయూథముఁ గనుము ప,యోధరనీలంబు దాని•నుగ్రశరములన్. ౧౯౨

అర్థములు. అరులకున్ = శత్రువులకు, బాధకము = బాధ కలిగించునది, హితసాధకము=మేలు సమకూర్చునది, ద్విషత్ యోధుల యూథము = విరోధి వీరుల సమూహము, పయోధర నీలంబు=మేఘములవలె నల్లనిది.

తాత్పర్యము

శత్రువులకు బాధ కలిగించునది, మిత్రులకుఁ గార్యము సాధించునది యగు రీతి విభీషణుఁ డిట్లనియె. లక్ష్మణా! విరోధులగు యుద్ధవీరుల సమూహము మబ్బు వలె నల్లగాఁ గానవచ్చుచున్నది చూడుము. దానిని భయంకర బాణములచే.

ఉ. పాయలు పాయఁ గొట్టు మది • పాసినయంతన తోఁచువాఁడు దై
తేయధవాత్మనందనుఁడు • ధీరుఁడు క్రూరుఁడు వంచకుండు దు
ర్జేయపరాక్రముండు ఖల•శీలుఁడు సర్వజగద్భయంకరుం
డా యుధముండు సేన నడు•మంతరమందు సవంబు సల్పెడిన్. ౧౯౮౭

అర్థములు. పాయలుపాయన్ = చీలికలుగా విచ్చునట్లు, అది = ఆ సేన, నడుమంతరమందు=నడుమ.

తాత్పర్యము

దానిని జీలికలై పోవునట్లు గొట్టుము. ఆ సేన తొలఁగి పోయెనా ధైర్య శాలియు, క్రూరుఁడు, మోసగాఁడు, తెలియఁ గష్టమైన పరాక్రమము గలవాఁడు, దుష్టస్వభావము గలవాఁడు. ప్రపంచమున కంతియు భయము కలిగించువాఁడు, నీచుఁడునగు రావణకుమారుఁడు దానినడుమ యజ్ఞము సేయువాఁడు కానవచ్చును.

కం. అనవుడుఁ బిడుగులఁబోలిన, ఘనశరముల లక్ష్మణుండు • కడిమిం గురిసెన్
వనచర భల్లూక సంఘము, చని గవిసెన్ శైలభూజ•సాధనమగుచున్. ౧౯౮౮

అర్థములు. కడిమిన్=బలము కొలఁది.

తాత్పర్యము

విభీషణుఁ డిట్లు చెప్పఁగాఁ బిడుగులవంటి బాణములను లక్ష్మణుఁడు బలము కొలఁది గురియించెను. కోఁతుల యెలుఁగుల సంఘము చెట్లు కొండలు నాయుధము లుగాఁ దీసికొనిపోయి యా సేనపైఁ బడెను.

—• కపు లింద్రజిత్సేనలతోఁ బోరుట •—

చ. కలఁగక రాక్షసుల్ ముసల•ఖడ్గపరశ్వధతోమరాదులన్
బలిముఖసేనఁ దాఁకుటయు • వారికి వీరికిఁ బోరు ఘోరమై
యులివె పురంబు నల్గడల • నుద్దవిడిం గలసెన్, నభంబు సం
కుల మయి తోఁచె నుద్యదసి•కుంత శరాద్రిమహీజపూర్ణమై. ౧౯౮౯

అర్థములు. ఉలివె=ధ్వనియె, ఉద్దవిడిన్ = మిగుల వేగముతో, ఉద్యత్ = ఎత్తఁబడిన, అసి=కత్తులచేతను, కుంత = ఈటల చేతను, శర=బాణములచేతను, అద్రి=కొండలచేతను, మహీజ=చెట్ల చేతను, పూర్ణమై=నిండినదై.

తాత్పర్యము

రాక్షసులును గలఁత చెందక రోకండ్లతోను, కత్తులతోను, గండ్రగొడ్డండ్ల తోను, చిల్లకోలలతోను వానరసేనను దాఁకఁగా వారికి వీరికి యుద్ధము ఘోరము

కాఁగా నాధ్వని లంకాపురము నలుప్రక్కల నిండెను. వారిచే నెత్తఁబడిన కత్తులతోను, ఈటెలతోను, బాణములతోను, కొండలతోను, చెట్లతోను నిండినదై యాకాశము వ్యాపించినదై కానవచ్చెను.

మ. తమపై భీకరశస్త్రముల్ గురియుచున్ ♦ దర్పించు కీనాశసం
ఘములం గీశులు వృక్షభూమిధరసం ♦ ఘాతంబులం గూల్చి దు
ర్దమదోశ్చండిమ చాటుచున్ శలభవా♦రంబో యనన్ మూఁగి సం
తమసాకారచమూసమూహముల భి ♦ న్నంబై చెడం గూల్చినన్. ౧౫౦

అర్థములు. కీనాశ=రాక్షసులయొక్క, దుర్దమ = అణఁపరాని, దోశ్చండిమన్ = భుజబలముయొక్క వాఁడిమిచే, శలభవారంబో=మిడుతల సమూహమో, సంతమస+ఆకార = గాఢాంధకారమువలెనున్న. చమూసమూహములన్=సేనల గుంపును, భిన్నంబై =చీలినదై.

### తాత్పర్యము

తమమీఁద భయంకరములైన యాయుధములు వైచి గర్వించు రాక్షస సమూహములను వానరులు చెట్లయు, గొండలయు సమూహములచే పడఁగొట్టి యణఁపరాని భుజబలాతిశయము ప్రకటించుచు, మిడుతల సమూహమువలె ముసరి గాఢాంధకారమువంటి సేనాసమూహమును చీలిచెడునట్లు కొట్టఁగా.

కం. వారల మునుమున నిలువఁగ, నేరక రాక్షసులు చెదర ♦ నిజసైన్యము దై
న్యారంభముఁ గని వేలిమి, కారియమున్ విడిచి లేచి♦కనలున వచ్చెన్. ౧౫౧

అర్థములు. మునుమునన్ = ముందు, వేలిమి కారియమున్ = యజ్ఞకార్యమును, కనలున = కోపముతో, కర్త ప్రకరణమును బట్టి యింద్రజిత్తు అనుపద మధ్యాహారము.

### తాత్పర్యము

వారల ముందు నిలువలేక రాక్షసులు చెదరిపోఁగా తన సేనయొక్క దీన స్థితిఁ జూచి హోమము చేయుట విడిచి కోపించి యింద్రజిత్తు వచ్చెను.

సీ. వృక్షాంధకారంబు ♦ విడిచి వెల్వల వచ్చి, మహితరోషంబున ♦ మండిపడుచుఁ
బూర్వకల్పితరథ♦మును నధిరోహించి, కాలాభ్రనిభుఁ డుగ్ర ♦ కార్ముకంబుఁ
గొనుచు రక్తాక్షుఁడై ♦ క్రుద్ధాంతకునిఁ బోలి, తరలిన లక్ష్మణుఁ♦దాఁక నున్న
బలము లాతనిఁ జేరు ♦ బలసి నిల్చుండిన, నీ లోన రావణి ♦ యొలుక పడమి

ఆ. మారుతాత్మజుండు ♦ మందరతుల్యుండు, కల్పవహ్నిఁ బోలి ♦ కాల్పఁ జొచ్చె
వృక్షహస్తుఁ డగుచు ♦ నెగచి, యతాతుల, రూపుమాపె ననమ♦రూక్షవృత్తి.

అర్థములు. వృక్షాంధకారంబు=చెట్టు చీఁకటి, ఆ మఱ్ఱిచెట్టునీడ చీఁకట్లు క్రమ్మిన ట్లున్నదని భావము, పూర్వకల్పితరథమును = ముందు కల్పించుకొని

యుండిన తేరిని, అధిరోహించి = ఎక్కి, కాలాభ్రనిభుఁడు = నల్లని మేఘముతో సమానుఁడు, క్రుద్ధాంతకుని=కోపించిన యముని.

తాత్పర్యము

ఇంద్రజిత్తు యజ్ఞము చేయుచున్న చెట్టుయొక్క చీఁకటివంటి నీడలోనుండి వెలుపల వచ్చి మిక్కిలి కోపమున మండిపడుచు ముందే గుఱ్ఱములుకట్టి సిద్ధముగా నుండిన తేరెక్కి నల్లని మబ్బువంటివాఁడు భయంకరమైన విల్లుదీసికొని కోపముచే నెఱ్ఱనగు కన్నులు గలవాఁడై కోపించిన యమునిబోలి ప్రయాణింపఁగా లక్ష్మణునిఁ దాఁకనున్న సేనలు వాని తేరిని జుట్టుకొని నిలుచుండెను. ఈలోపల నింద్రజిత్తు కానరాలేదేయని హనుమంతుఁడు మందరపర్వతమువలె దేహమును బెంచినవాఁడై ప్రళయకాలాగ్నివలె రాక్షసులను కాల్ప నారంభించెను. చెట్టు చేతఁదీసికొని రాక్షసులఁ దఱిమి మిగుల కఠినుఁడై వ్యూహపనాశము గావించెను.

—◆ హనుమంతుఁడు రాక్షసుల నాశ మొనర్చుట ◆—

సీ. జవనాధికుండగు ◆ పవమానసుతుఁ దాఁకె, బలలాశిసంఘముల్ ◆ భయదభంగి
శితశూలపాణులు ◆ శితశూలధారలఁ, గరవాలహస్తులు ◆ ఖడ్గములను
బట్టిసాయుధకరుల్ ◆ పట్టిసాయుధముల, శక్తిప్రయుక్తుల ◆ శక్త్రుధరులు
పరిఘముద్గరగదా◆పరశుశతఘ్నుల, భిండిపాలంబుల ◆ భీమభంగిఁ
తే. దలములను ముష్టులను వేఁగి◆ తాఁచుచుండ
నరకు గొనకేమియును వాని ◆ జనును చేసి
పీనుఁగుపెంటలు గావించె ◆ భీమగాహి
తాహితార్క్ష్యుండు గంధవ◆హాత్మజుండు. ౧౯౩

అర్థములు. జవనాధికుండు = వేగముచే నధికుఁడు, అధిక వేగము గల వాఁడు, తలములను=అఱచేతులను, చమనుచేసి = నేలతో సమముగఁ జేసి, భీమగాహిత = భయంకరశత్రువు లనెడి, అహి = సర్పములకు, తార్క్ష్యుండు=గరుత్మంతుఁడు, గంధవహాత్మజుండు=వాయుపుత్రుఁడు.

తాత్పర్యము

అధిక వేగము గల హనుమంతుని రాక్షససమూహములు భయంకరరీతి మార్కొనెను. వాఁడిగల శూలములు చేత ధరించినవారు శితశూలధారల చేతను, కత్తులు చేతధరించినవారు కత్తుల చేతను, అడ్డకత్తులవా రడ్డకత్తులతోను, శక్తులఁ బ్రయోగించువారు శక్తులతోను, గండ్రగొడ్డండ్లుగుదియలు గదలు ఇనుప గుదియలు శతఘ్నులు విడిచివాటుగుదియలు వీనిచేతను, అరచేతుల చేతను, పిడికిళ్ళను విజృంభించి కొట్టుచుండ వానిని లక్ష్యము సేయక భయంకరశత్రువులను పాములకు గరుత్మంతుని వంటివాఁ డగు హనుమంతుఁడు పీనుగు పెంటలు చేసెను.

చ. ఎదిరెడు రాక్షసోత్కరము • లేయు శరంబుల లోఁగ కేమియున్
గదనము సేయుచున్న బలి • గాడుపుపట్టిని జూచి సారథీ
పదిలముగాఁగ బోరు నల • వానరుపై మన తేరు పోవ ని
మ్మెదురక యుపేక్షచేయ బల • మెల్లను ద్రుంచు నతండు సుమ్మనన్. ౧౯౯౪

తాత్పర్యము

తన్నెదిరించి రాక్షస సమూహములు వేయు బాణములకు లోబడక యుద్ధము చేయుచున్న బలవంతు వాయుపుత్రునిజూచి సారథీ! యదిగో దిట్టముగ యుద్ధము చేయు నా వానరు మీఁదికి మన తేరిని పోనిమ్ము.ఇప్పుడు మన ముపేక్ష చేసితిమా సేన నంతయు నతఁడు ధ్వంసము చేయును.

—• ఇంద్రజిత్తు హనుమంతు నెదుర్చుట. •—

ఉ. సారథి యట్లసేయుటయు • సాయక సంహతి ఖడ్గవృష్టులన్
దారుణ పట్టిసంబుల ని • తాంత జవంబున శూలకోటులన్
మారుతి ముంచెఁ, గేసరి కు • మారుఁడు వానిని బాయఁ దట్టి యా
క్రూరునితోడ ని ట్లనియె • రోషము వేషముఁ గొన్న కైవడిన్. ౧౯౯౫

అర్థములు. సాయకసంహతిన్=బాణసమూహములచేతను, ఖడ్గవృష్టులన్=కత్తుల వర్షము చేతను, భయంకరములైన యుద్ధకత్తులచేతను శూలముల కోటుల చేతను మిగుల వేగముగా హనుమంతుని ముంచెను. హనుమంతుఁడును వానినెల్లఁ దొలఁగఁ దన్ని రోషము రూపము గొన్నయట్టులా క్రూరునితోడ నిట్లనియె.

శా. ఓరీ దుష్టనిశాట ! దుర్మతి ! రణో • ద్యోగంబునన్ నీవునున్
శూరుండేనియు రమ్ము యుద్ధమునకుం • జొక్కంపురీతిన్ బలో
దారున్ మారుతిఁ దాకి ప్రాణములతో • దైత్యేంద్రపుత్రా ! మఱిం
బోరా రెట్లు నియుద్ధకేళికిని రా • పో చూచెదన్ నీ గతిన్. ౧౯౯౬

తాత్పర్యము

ఓరీ దుష్ట రాక్షసుఁడా ! దుర్బుద్ధీ ! యుద్ధకార్యమునందు నీవు కూడ నొక శూరుఁడవేని చక్కని రీతి వంచనలేక యుద్ధమునకు రమ్ము. బలాతిశయము గల హనుమంతు నెదిరించి ప్రాణములతో నీవా పోఁగలవు.ద్వంద్వయుద్ధమునకు రమ్ము. నీగతి చూచెదను.

చ. ఎసఁగిన నాదుపోటు సహి • యించినచోఁ గద నీచ ! బంట నం
చనమున ధిక్కరించు పవ • నాత్మజు నేయ శరాసనంబుఁ దా
మసలక యెత్తుచుండ శత • మన్యుజితుండు సురారి వాఁడె యా
కెసఁ గను మంచుఁ జూపె నినీ • ద్రిమ్మరి తాఁడు సుమిత్రపట్టికిన్. ౧౯౯౭

తాత్పర్యము

దృఢత్వముచే పతితోయించిన నాచేతి పోటు నీవు సహించినఁగదా నీవుఁడా నీవు శూరుఁడవు. అని గర్వించి ధిక్కరించు హనుమంతునిపై బాణములు వేయుటకు విల్లెత్తుచున్న వాని నింద్రజిత్తుఁ జూచి విభీషణుండు లక్ష్మణా! యదిగోఁ జూడుము. వాఁడే యింద్రజిత్తని లక్ష్మణునకుఁ జూపెను.

కం. కవిసినవాఁ డనుమఘయిన్, జవమునఁ జని నీదుతీవ్ర♦శరముల వానిన్
భువిఁ గూల్పు మంచు గర్జా♦రవు ధరనిభ భీమబలుని♦రావణిఁ జూపెన్. ౧౯౯౦

తాత్పర్యము

హనుమంతుని మీఁదఁగవిసెను. త్వరగాఁబోయి నీ బాణములచే వాని నేలఁ బడఁగొట్టుమని పర్వతమువంటి వానిని గర్జించువానిని భయంకరబలుని నింద్రజిత్తును జూపెను.

—♦{ ౮౭-వ సర్గము. విభీషణుఁడు లక్ష్మణునకు నింద్రజిత్తు యజ్ఞముచేయు న్యగ్రోధముఁ జూపుట. }♦—

ఆ. చూపి యిట్లు ముదము♦సుబ్బఁగ లక్ష్మణుఁ దోడుకొంచుఁ బోయి♦తూర్ణగతిని
నవతిదూర మొండు♦వనముఁ బ్రవేశించి యందుఁ గానిపించె ♦ యజ్ఞవిధము.

అర్థములు. సుబ్బఁగన్=బయలుపడఁగా, అవతిదూరము=కొంచెముదూరము.

తాత్పర్యము

ఈప్రకారము చూపి యజ్ఞము విడిచి వచ్చినాఁడుగదా యను సంతోషము బయలుపడుచుండ లక్ష్మణుని పిలుచుకొనిపోయి సమీపమందున్న యొక్క వనము ప్రవేశించి యందింద్రజిత్తు చేయు యజ్ఞము విధమును జూపెను.

సీ. సౌమిత్రి మేచక♦జలదసంకాశంబు, ఘోరరూపంబు న్య♦గ్రోధ మిదియె
దైతేయసుతుఁ డిందు ♦ భూతబలుల్ దీర్చి, హోమంబు సాగించి♦యుద్ధమునకు
వచ్చు వచ్చినను నే♦వారికదృశ్యుఁడై, సంగ్రామ మొనరించుఁ♦జలులబలుఁడు
వధియించుఁ గొందఱ ♦ బంధించుఁ గొందఱఁ, జిత్రవధము సల్పు♦శత్రువరుల

ఆ. మరల నింద్రజిత్తు ♦ మఱ్ఱి డాయఁగ నీక, తీక్ష్ణశర నాశ్వ♦సారథిగను
బిలుకుమార్పు మన్న♦నలరుచు లక్ష్మణుం, డల్లె యనుచు మీటె♦వసముగుణము.

అర్థములు. మేచక జలదసంకాశంబు=నల్లని మేఘముతో సమానము, ఘోరరూపంబు=భయంకర స్వరూపము గలది, న్యగ్రోధము=మఱ్ఱి, పిలుకుమార్పుము=చంపుము, గుణము=అల్లెత్రాడు.

తాత్పర్యము

లక్ష్మణా! నల్లని మేఘముతో సమానమై భయంకరాకారమైన మఱ్ఱి యిదియే, ఇచ్చట నింద్రజిత్తు భూతములకు బలులిచ్చి హోమంబు పూర్తి చేసి

యుద్ధమునకు వచ్చును. వచ్చినా యెవ్వరికిఁ గానరాక యుద్ధము చేయును, శత్రువుల కొందఱఁ జంపును. కొందఱఁ గట్టివేయును. కొందఱను చిత్రవధము చేయును. మరల నింద్రజిత్తు మఱ్ఱి దగ్గఱకు రాకుండునట్లు తేరితో గుఱ్ఱములతో సారథితోఁ జంపుము. అనిన లక్ష్మణుండు సంతోషించి యట్లు లేచే సెదనని యల్లెత్రాడు మీటెను.

ఆ. అగ్నివర్ణమైన • యరదంబుపై నెక్కి, కవచి ధన్వి ధ్వజియు • ఖడ్గియగుచు
రావణాత్మజుండు • గ్రక్కున నటకు రాఁ జండకోపి లక్ష్మ • ణుండు పలుకు. ౨౦౦౧

అర్థములు. కవచి = కవచము దొడిగికొనిన వాఁడు, ధన్వి = ధనుస్సు బట్టినవాఁడు, ధ్వజి = ధ్వజము గలవాఁడు, ఖడ్గి = కత్తిగలవాఁడు, యజ్ఞము చేయు ఋత్విజుని వేషము వదలి దాని యాశ మానుకొని యుద్ధవీరుని వేషము వేసెనని దీని భావము.

తా త్ప ర్య ము

అగ్నికాంతిగల తేరెక్కి కవచము తొడిగికొని విల్లు తీసికొని ధ్వజము గలవాఁడై ఖడ్గము ధరించి హనుమంతునితో యుద్ధము చేయుచున్న యింద్రజిత్తు మఱ్ఱియొద్దనున్న లక్ష్మణు నొద్దకు రాఁగా మిగుల కోపించి లక్ష్మణుఁ డిట్లనియె.

కం. వచ్చితి వెదకుచు నీకై, యిచ్చటికి రణాతిథేయ • మిమ్మా నిను నే
నిచ్చగఁ బిలిచెద రమ్మా, కుచ్ఛితుఁడా! నీదు మాయ • కొనసాగ దికన్. ౨౦౦౨

అర్థములు. రణాతిథేయము=యుద్ధమనెడి యతిథిభిక్ష, ఇచ్చగన్ = నిండు మనస్సుతో, కుచ్ఛితుఁడా=మోసగాఁడా.

తా త్ప ర్య ము

నిన్ను వెదకుకొనుచు వచ్చితిని, యుద్ధభిక్ష పెట్టుము. మనసారఁ బిలుచుచున్నాను. వంచకుఁడా ! నీ మాయ లిఁక సాగవు.

—• ఇంద్రజిత్తు విభీషణు నధిక్షేపించుట. •—

కం. అనఁ దత్పరిసరవర్తిని, బినతండ్రి విభీషణాఖ్యు • వీక్షించి మనన్
మన మెరియఁగ గోపంబునఁ, గనుఁగవ నిప్పుకలు రాల • గర్వం బెసఁగన్. ౨౦౦౩

అర్థములు. తత్ పరిసరవర్తిని = ఆయనకుఁ బ్రక్కనున్న వానిని, ఎరియఁగన్=మండఁగ.

తా త్ప ర్య ము

లక్ష్మణుఁ డిట్లు చెప్పఁగా నాయన ప్రక్కన నుండిన తన పినతండ్రిని విభీషణుని జూచి కోపముచే మనస్సు మండుచుండఁగా రెండు కన్నుల నిప్పులు రాలుచుండ గర్వముతో నిట్లనియె.

కం. రూక్ష! యిటఁ బుట్టి పెరిఁగితి, సాక్షాదనుజుఁడవు నాదు • జనకునకును నో
రాక్షస! పినతండ్రివి ప్రత్యక్షపుద్రోహంబు తగునె • తనయుని పట్లన్? ౨౦౦౪

అర్థములు. రూక్ష=కఠిన చిత్తుఁడా!, ఇటన్ = ఈ కులము నందు, సాక్షా దనుజుఁడవు=సొంత తమ్ముఁడవు.

### తా త్ప ర్య ము

కఠిన చిత్తుఁడా! యీ కులమునందు ఈ వంశమందు పుట్టితివి. పెరిఁగితివి. నా తండ్రి నీవొక తల్లిబిడ్డలు. కావున నీవు నాకుఁ బినతండ్రివి అయ్యు కొడుకు విషయమున నన్నుఁ జంపింప వలయు నను నిటువంటి ప్రత్యక్షద్రోహము తగునా?

ఉ. చుట్ట మటన్న మాట యది • సున్న, స్వజాత్యభిమాన మేని క
న్పట్టదు, స్నేహభావ మె యు•భావము, లేదు ప్రమాణబుద్ధియేన్
గట్టిఁడి! ధర్మచింతనము • కానఁగ రాదుగ, దుష్టబుద్ధి! తోఁ
బుట్టినవాఁడ టన్నమతి • పుట్టని నీకును ధర్మదూషణా! ౨౦౫

అర్థములు. కట్టిఁడి = నియమహీనుఁడా, ధర్మదూషణా = ధర్మమును దూషించువాఁడా.

### తా త్ప ర్య ము

ధర్మద్రోహీ! దుష్టబుద్ధీ! నీయందు చుట్టము నను మాటయు లేదు. నేను నీకుఁ జుట్టమని రవంతయైనఁ దోఁచి యుండిన నీవిట్టి పని చేయుదువా? చుట్టమను నభిప్రాయము లేకుండిన మన జాతివాఁడు కదా యని తోఁచినను నీవిట్లు చేయుదువా? జాత్యభిమానము లేకున్నఁబోనీ, ఇంతకాలము కూడి యుంటిమే యను స్నేహభావ ముండిన నిట్లు చేయుదువా? అది లేకుండినఁ బోనీ, మర్యాదానియామకమైన గలదా? అది లేకుండిన ధర్మవిచారమైనఁ గలదా? ఇట్టివి యేదియు లేని నీకు నీకఁ దోడబుట్టినవాఁడు, వీనికి ద్రోహము చేయరాదన్న బుద్ధి కూడఁ బుట్టునా?

కం. తనవారి విడిచి పరులన్, బనివాఁ డయి కొలుచు నియ•వస్థం గని స
జ్జనవిందనీయ! నీయొక, మన మతిదుఃఖంబుచేత • మఱిఁ గెడుఁ గుమతీ! ౨౦౬

అర్థములు. పనివాఁడు=సేవకుఁడు, మఱిఁగెడున్=సంతాప పడుచున్నది.

### తా త్ప ర్య ము స్పష్టము.

కం. ఎక్కడి స్వజనావాసం, బెక్కడి పరజనులసేవ • యీమాత్రము నీ
కక్కట భేదము, దోఁపద, చక్కఁగ నీచులకు బుద్ధి•చతురత గలదే? ౨౦౭

అర్థములు, స్వజనావాసము=తనవారిలో వసించుట.

### తా త్ప ర్య ము

తన బంధువులలోఁ గలసి మెలసి సమానబుద్ధితో నుండు టెక్కడ? ఇతరుల యొద్ద సేవచేయుచుఁ బడియుండు టెక్కడ? ఈమాత్రము నీకు భేదము తెలియ దాయెఁగదా. నీచులకు బుద్ధి నేర్పుగలదా?

కం. తనవార లగుణు లేనియు, ఘనగుణములచేతఁ బరులు • గ్రాలిర యేనిన్
గన నుత్తము లగుణులె యగు, తనవారలె, పరులు పరులె•తథ్యము కుమతీ!.

అర్థములు. కుమతీ=కుచ్ఛితపుబుద్ధి గలవాఁడా! అగుణులు = గుణము లేనివారు, "శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్, స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" యను భ. గీ. శ్లోక మిట ననుసంధింపనగు. గుణవంతు లాశ్రయింపఁ దగినవారు, తనవారు గుణవంతులు కానపుడు వారినట్లు ఆశ్రయింప నగు నందురేమో!

తాత్పర్యము

తనవారు గుణహీనులైనను ఇతరులు గొప్ప గుణములు గలవారైనను గుణములు లేని తనవారే యుత్తములు గాని పరులెన్నఁటికైనను బరులే. ఇది నిజము.

కం. తమవారి విడిచి పరపక్షముఁ గొల్చెడివారు స్వజన♦సంఘము నిర్మూ
లము గాఁగ బిదపఁ దామును, విమతులచేఁ జెడుట నిజము ♦ వెంగలివిత్తా,

అర్థములు. వెంగలివిత్తా = బుద్ధిహీనుఁడా!, పరపక్షము = శత్రువుల పక్షము, విమతులచేన్=విరోధులచే.

తాత్పర్యము

తన బంధువుల వదలి శత్రువుల నాశ్రయించి వారికి సాహాయ్యము చేయువాఁడు తనవారందఱు నిర్మూలమైన పిదప నా శత్రు పక్షము వారిచేతనే తానును జెడును. శత్రువులు వీని సాహాయ్యముచే వీనివారిని వధియించి తరువాత శత్రుశేష ముండనీయరాదని వీనినే వధింతురు (మనదేశపు రాజులు నాశమైనదీవిధముగనే)

కం. దయ యన్న మాట లేకిటు, నయహీనా! తెగితె యింత ♦ నాశపుఁ బనికి
క్రియ ఘోరకృతికి నెవ్వఁడు, మెయికొనుఁ జుట్టమవు నీవు ♦ మిగిలినఁ దండ్రీ!

అర్థములు. నయహీనా = నీతిమాలినవాఁడా! ఇటు = ఈప్రకారము, నేను చేయు హోమము విఘ్నము చేయింప లక్ష్మణుని బిలుచుకొని వచ్చునంతటి పనికి. తెగితె = సాహసించితివా, ఘోరకృతికిన్=క్రూరమైన కార్యము చేయుటకు, మెయికొనున్=అంగీకరించును.

తాత్పర్యము

దయ యను మాటయైన లేక నీతిమాలిన వాఁడా! యిటువంటి కొడుకును జంపించు ఘోరకార్యముచేయ తండ్రివి చుట్టమవైన నీవు తప్ప మఱియొకఁడు సాహసించునా?

—♦ విభీషణుఁ డింద్రజిత్తునకు సమాధానముఁ జెప్పుట ♦—

తే. అనుడు నాయన్నకొమరున♦కని విభీష,ణుండు రాక్షసనాథసు♦తుండ! యనయ
శీల! నాశీల మెఱుఁగని♦లీల నేల,పదర? గౌరవవశమునఁ♦బదర వలదు. ౨౦౧౧

అర్థములు. గౌరవవశమునన్ = పినతండ్రి నను గౌరవముచేత, పదర వలదు=తొందరపడి మాటలాడవలదు, రాక్షసనాథ సుతుఁడ ననుటచే, ఆ తండ్రికిఁ దగిన కొడుకవే నీవు, అనయశీల=దుర్నీతియే స్వభావముగాఁ గలవాఁడా.

తాత్పర్యము

అని యిట్లు తన్ను దూషించు నన్నకొడుకునకు విభీషణుం డిట్లనెను. రాక్షస రాజకుమారుఁడా! నీ వా తండ్రికిఁ దగిన కుమారుఁడవే. నన్ను నీవు నయహీనుఁడ వంటివి. కాని నీవలె నేను అనయవంతుఁడనుగాను. ఏలన నా స్వభావము నడవడి నీ వెఱుఁగనిది కాదు. నే నేనాఁడైన నీతికి విరుద్ధమైన కార్యము చేసితినా? ఏల యిట్లు వదరెదవు? నేను నీకుఁ బినతండ్రినని నాయందు నీకు గౌరవము కలదా నేను నీవు అన్న కొడుకని తలంచుటకు? నీకు నేను బిన్నతండ్రియను గౌరవబుద్ధి యుండెనేని యిప్పు డిట్లు మాటలాడుదువా? ఆనాఁడు సభలో "నీదు తమ్ముఁడె విభీషణుం డొక్కఁడె సుమ్ము తండ్రి యీ, యార్యకులంబునం బ్రభవ మందెను దుర్యశోముం గడింపఁగన్" అని మాటలాడుదువా? నన్ను నీవు సభలో నింత చులకనగా మాటలాడినపుడు నీయందు నాకెట్లు వాత్సల్య ముండఁగలదు? ఆనాఁడు నీవు మాటలాడినవి పిన్నతండ్రి ననవలసిన మాటలా? ఈ బంధుత్వము ఈ గౌరవము నేఁడే కనఁబడు చున్నది కాఁబోలు.

కం. జననము క్రూరాసురకుల, మున నైనను నేమి? గుణమె ♦ ముఖ్యము గాదా
జనులకుఁ? గావున గుణమున, వినరా రాక్షసుఁడఁగాను ♦ వేమాఱులకున్. ౨౦౧-౨

తాత్పర్యము

ఓరీ నీవు చెప్పినట్లు నేను రాక్షసులలోఁ బుట్టితిని, రాక్షసులలోఁ బెరిగితిని. కాదనను. కులము ప్రధానమా, గుణము ప్రధానమా? గుణము ప్రధాన మగు నేని నేను రాక్షసుఁడఁగానని వేయిమార్లు చెప్పెదను.

కం. రుచియింపవు దారుణములు, రుచియింప దధర్మ మెపుడు ♦ క్రూరుఁడ! నాకున్
గుచరిత్రుఁ డన్న యెవ్వఁడు, వచియించుఁ బోకాలు మనుచు ♦ భ్రాతన్ సభలోన్?

అర్థములు. దారుణములు = క్రూరకార్యములు, పోకాలు = ఛీపో.

తాత్పర్యము

మీరు చేయు క్రూరకార్యములు నా కెన్నఁడు రుచించినవి కావు. వానిని నే నామోదించిన వాఁడనుగాను. ఏనాఁడైన నే కార్యమందైన మీతోఁ డఁగలసివచ్చి పనిచేసితినా? మీకు నేను సహాయము పడితినా? అధర్మము నాకు రుచించినది కాదు క్రూరుఁడా! అన్నను విడనాడితి వంటివి. ఎంతటి నీచపు నడవడి కలవాఁడైనను తా నన్నయని నేను తమ్ముఁడనని తలంపుఁ గలవాఁడు నిండుసభలో ఛీపో నాయొద్ద నుండకు మని విడనాడునా? నా మాటలు తన కిష్టము లేకున్న వినియూరకుండ రాదా? నీ యాలోచన నాకు సరిపడ లేదనరాదా? తమ్ముని సభలో నవమానించుట, చంపుటకాదా? నిష్కారణముగ నాశ్రితుని వెడలఁగొట్టుట చంపుట కాదా? అన్నదమ్ముల వావి నేఁడే తెలిసెను కాఁబోలు.

కం. ధర్మవిహీనునిఁ గల్మష,కర్మునిఁ గరగతముఁ బాము♦కరణిని విడి స
 త్కర్మం బిహమునఁ బరమున, శర్మంబుల ననుభవించు ♦ జాల్మూఁడ వింటే.

అర్థములు. జాల్మూఁడ = బుద్ధి లేనివాఁడా! ధర్మము విడిచిన వానిని, నంతతోఁబోక పాపకర్మములు చేయువానిని చేత దొరకిన పామును వదలినట్లు వదలి పుణ్యకార్యములు చేయువాఁడు ఇహమందుఁ బరమందుఁ గూడ సుఖముల ననుభవించును. ఇంటి దీపమని యెవ్వఁడైన ముద్దుపెట్టుకొనునా? పాము చేతికి దొరకినదని దానితో నెవ్వఁడైన నాడుకొనునా? కావున నెవవారినైనను ధర్మవిహీనుల వదలవలయును. ధర్మగుణము లేనివారినే వదలవలసి యుండఁగా పాపకార్యములు కూడఁ జేయువారిని వదలుట చెప్పనేల?

కం. పరధనములఁ బరదారల, హరియించుట హింస యీ దు♦రాచారంబుల్
 పురుషుఁడు మండెడుగేహము, కరణిన్ విడనాడవలయుఁ ♦ గలుషాత్మకుఁడా!

తాత్పర్యము

పాపపు మనస్సు, పాప స్వభావము గలవాఁడా! పరుల ధనములను పరుల భార్యలను హరించుట హింస గావించుటయును నీ దుష్టపు నడవడులను మండుచున్న యింటిని వదలినట్లు పురుషుఁడు వదలవలయును. ఇది నా యిల్లెయని యభిమానము వహించి కాలెడి యింటిలో నుండిన నెట్లు చచ్చునో పరస్త్రీలను పరధనములను హరించు వానితోను, క్రూరునితోను బంధువుగదా యని కలిసియుండిన వానితోడ వీఁడుట యిచ్చుట నిజము.

కం. పరవిత్త మపహరించుట, పరదారలఁ గోరుచుంట ♦ స్వసుహృత్ తతి ని
 ర్భరశంకయు నీ మూఁడును, దురితాత్మ! వినాశ హేతు♦దోషంబు లగున్.

తాత్పర్యము

పరుల ధనము నపహరించుట పరులభార్యల కాశపడుట తన మేలు కోరువారి యందు సందేహబుద్ధి-యీ మూఁడును వినాశకారణములు. ఈ దుర్గుణము లన్నియు నీ తండ్రియం దున్నవి. తన మేలుగోరి నేను జెప్పఁగా నన్ను శత్రుపక్షమునఁ జేరిన వాఁడనని తనకీడు కోరుచున్నాననికదా నీ తండ్రి నన్ను సందేహించెను. నాయందు వానికి శత్రుబుద్ధి యున్నప్పుడు నేనందుండిన మాత్రము వాఁడు నన్ను మిత్రుఁడని భావించునా? నీవు నాకుఁ బ్రత్యక్షశత్రువని సభలోఁ జెప్పిన తరువాతఁ గూడ నే నందుంటి నేని నేనేదో కీడుచేయుట కున్నాననియేకదా వాఁడు తలంచును. అట్టిహత్తునో నేనెట్లు బ్రతుకఁగలను?

చ. విను మునికోటిహింసనము ♦ వేల్పులతో నెడలేని పోరులున్
 గనలును బద్ధవైరమును ♦ గర్వము నన్యులమేలు సైపమిన్
 మనుగడ సర్వసంపదలు ♦ మాన్పెడి దోషము లివ్వి యన్న యం
 దనయము నిల్చి డాఁచె సుగుణావళిఁ గొండను మేఘముల్వలెన్. ౨౧౬

### తాత్పర్యము

ఓరీ! నాతండ్రియందు సుగుణములు లేవా, దుర్గుణములే చెప్పెదవే యందు వేమో! నే నా మాట చెప్పలేదు. నీతండ్రియందు సుగుణములు కలవు కాని, మును లను హింసించుట, దేవతలతో విడువని కలహము, మిగులఁ గోపము, పగకు కంక ణము కట్టుకొనుట, పొగరు, ఇతరుల మేలు చూసి సహింపలేకుండుట, ఇవి జీవిత మును సర్వసంపదలు నాశము చేయుగుణములు. దుర్గుణము లన్నయందుండి కొం డను మేఘములు క్రమ్మి కొండ కానరాకుండఁ జేసినట్లు వాని మంచి గుణములను మఱుగుపఱిచెను. అయినను నీవు గుణములే గ్రహింపరాదా? దుర్గుణముల నేల గ్రహింపవలె నందువేమో? విషము కలిపిన యన్నమును తేనెను పూర్ణముగఁ బరిహరింపక స్వీకరించు టెట్లు?

కం. ఈదోషము లుండుటచేఁ, గాదే నాయన్న నీదు ♦ కన్నయ్యను నే
మోదమున విడుచుటిలపై, లే దీపురి నీవు లేవు ♦ లేఁడు జనకుఁడున్. ౨౦౧౮

### తాత్పర్యము

ఈ దోషము లుండుటచేఁ గదా నా కన్నయు, నీకు దండ్రియు నగు వానిని సంతోషముతో వదలి వచ్చితిని. ఇఁక భూమిమీఁద నీ లంక లేనిదే. నీవు లేని వాఁడవే. నీ తండ్రి లేనివాఁడే. మీ రందఱు నాశమైతి రని నమ్ముము.

కం. అతిమానివి బాలుఁడవు, స్మృతిహీనుఁడ వెఱుఁగ వీవ ♦ ణంకువ నైవ
స్వతపాశబద్ధుఁడవు నీ,మతిఁ దోఁచినదెల్ల వదరు ♦ మా వైధేయా! ౨౦౧౯

అర్థములు. వైధేయా = మూర్ఖుఁడా, అతిమానివి = మిగుల గర్విష్ఠుఁడవు, వైవస్వత పాశబద్ధుఁడవు = యమపాశములచేఁ గట్టఁబడిన వాఁడవు.

### తాత్పర్యము

నేనే బలవంతుఁడను, బ్రహ్మవరములు గలవాడను, నాకెవ్వ రెదురను గర్వము నీ యందు విస్తారముగఁ గలదు. దానికిఁదోడు పిల్లవాఁడవు. తాఁకు దబ్బలు తెలి యని వాఁడవు. బాలుఁడైనను మంచిచెడ్డ యాలోచించు శక్తియు లేనివాఁడవు. వినయ మనునది యెట్టిదో నీ వెఱుఁగవు. యముని పాశములచేఁ గట్టఁబడి చావ సిద్ధపడి యున్నావు. కావున నోరి మూర్ఖుఁడా! నీ నోటికి వచ్చినదెల్ల వదరుము.

ఉ. చేటుఘటిల్లె నీ కిపుడు ♦ చేసెడి దే మిఁక నీవు? రిత్తవా
కాటులతోడ నే మగును ♦ గ్రమ్మఱ మట్టిని జేర లేవు, సం
స్ఫోటమునందు రాఘవుల ♦ ముంగల జీవము నిల్ప లేవు, నీ
కూటరణంబు చెల్ల దిఁకఁ ♦ గూల్చును లక్ష్మణుఁ డిప్డు నిన్ననిన్. ౨౦౨౦

అర్థములు. వాకాటులు = వాగ్వాదములు, సంస్ఫోటమునందు=యుద్ధము నందు, కూటరణంబు = మోసయుద్ధము.

తాత్పర్యము

ఓరీ! నీ కేమో కీడుమూడినది. ఇప్పుడు నీవు చేయఁగల దేమున్నది? ఉత్తవాక్కలహముతో నీవు నన్నని, నేను నిన్నని వాదించిన రాఁగల లాభమేమి? నీవు మరల మఱ్ఱిచెట్టుకడకుఁ బోలేవు. హోమము చేయలేవు. ప్రత్యక్ష యుద్ధమందా నీవు లక్ష్మణుని యెదుట బ్రదుకలేవు. ఇదివఱకుఁ జేసిన మాయాయుద్ధము లిఁక సాగవు. యుద్ధమందు లక్ష్మణుఁడు నిన్నిప్పుడే చంపును.

చ. చని యెదురింపు మీ యముని ♦ సంయమినిన్ నిజదేవతార్చనన్
దనుబలమంతయున్ సకల ♦ దారుణశస్త్రములున్ వ్యయంబుగాఁ
బొనరుపు మీ, సుమిత్రసుతు ♦ భూరిశరాళికి గోచరుండవై
చనుటయ కల్ల యిమ్మెయిని ♦ సైన్యము నీవును లంకలోనికిన్. ౨౦-౨౧

తాత్పర్యము

నీ విచ్చటఁ జేయఁదలఁచిన దేవతార్చనము యముని సంయమనీపురమునకుఁ బోయి యచ్చటఁ జేయుము. నీ దేహబలము శస్త్రబలము అస్త్రబలము సర్వమిచ్చటనే వ్యయము చేయుము. లక్ష్మణుని బాణములకు గోచరించి నీవు బ్రతుకుట యబద్ధము. ఈ దేహముతో సేనతోడ నీవు లంకకుఁ బోఁజాలవు.

—♦ ౮౮-వ సర్గము. ఇంద్రజిల్లక్ష్మణుల సంభాషణము ♦—

సీ. అనవుడు నామాట♦లాలించి కోపించి, యుక్తతాయుధుఁడయి♦యుగ్రవృత్తిఁ
బ్రళయాంతకునిఁబోలి ♦ భయదచాపం బెత్తి, కలికి బాణంబులు♦కాంతు లీన
దృఢరథస్థితుఁడయి ♦ తేజుచే దీపించు, నుదయాద్రిగతభాను ♦ నొప్పు గలిగి
హనుమంతుమూఁపుపై ♦ నాసీనుఁడగువాని, సౌమిత్రి శత్రుహిం♦సనసమర్థుఁ
ఆ. గాంచి యను మదీయ♦కార్ముక ప్రవిముక్త, ఘోరదుస్సహాశు ♦ గోరువృష్టి
వింట నుండి కురియ♦మికి కెక్క రేగతిఁ, జూడు నీవు నీదు♦తోడివారు. ౧-౨

అర్థములు. ఉద్యయతాయుధుఁడు=ఎత్తఁబడిన యాయుధము గలవాఁడు. ఉదయాద్రిగతభానున్=తూర్పుకొండపై నున్న సూర్యుని, శత్రుహింసన సమర్థున్=విరోధులఁ జంపుటయందు శక్తి గలవాని, మదీయ=నాయొక్క, కార్ముక=వింటినుండి, ప్రవిముక్త=విడువఁబడిన, ఘోర=భయంకరమైన, దుస్సహ=సహింపరాని, ఆశుగ=బాణముల, ఉరువృష్టిన్=గొప్పవాన. చూడు అను క్రియకు నీవు నీతోడివారు అనునవి కర్తృపదములు. "ఒకానొకచో నహోర్థంబున యుష్మదస్మదర్థంబు లభిహితంబు లగునపుడు క్రియలు తత్కర్తృకంబులు విభాషనగు. ప్రౌ. వ్యా. క్రియ. ౨౬. 'మహద్బహుకర్తృకక్రియకు నేకవచనంబు విభాష నగు' ప్రౌ. వ్యా. క్రియ. ౬. నీ తోడివారి తోడ నీవు చూడు మని యన్వయము.

తా త్ప ర్య ము

విభీషణుఁ డిట్లు చెప్పఁగా విని కోపించి యాయుధ మెత్తినవాఁడయి విల్లు తీసికొని ప్రళయాంతకునివలెనై వాఁడి బాణంబులు మెఱయుచుండఁగా గట్టి రథమందుండి తూర్పుకొండమీఁద ప్రకాశించు సూర్యునివలె హనుమంతు మూఁపుమీఁద నున్నవాని శత్రువుల సంహరించుటయందు సమర్థుఁ డగువాని లక్ష్మణుఁ జూచి యిట్లనియె.నా వింటనుండి బయలువెడలు ఘోరమై సహింపరానిదైన బాణముల జడివానవలన నీ తోడివారితోడ నీ వెట్లు దుఃఖించెదవో చూడుము.

ఉ. ఇప్పుడు నిన్ను నీ బలము♦నెల్లను మత్కరముక్తబాణముల్
గప్పి దహించుఁ దూలికలఁ ♦ గాల్చెడు నగ్నినిబోలి లక్ష్మణా !
యిప్పుడె మీర లందఱును ♦ నేఁగెద రొక్కటఁ గాలుప్రోలికిన్
దప్పక మల్లఘుప్రదర ♦ దారుణవృష్టుల నోర్చు నెవ్వఁడో. ౨౦.౨౩

అర్థములు. తూలికల = ఏకుల, ప్రదర = బాణముల, దారుణవృష్టి = భయంకర వర్షము.

తా త్ప ర్య ము

ఇప్పుడు నిన్ను, నీ సేనను నేను ప్రయోగించు బాణములు నిప్పులు దూదేకులఁ గాల్చునట్లు దహించును. లక్ష్మణా! యిప్పుడె మీరందఱు యమపురికేఁ దప్పక పోవుదురు. ఎవరు నా బాణవర్షమును సహింపఁగలరు ?

చ. మఱచితివేమొ లక్ష్మణుఁడ ♦ మత్పవితుల్యకలంబధారలన్
గొఱకొఱ యూర్పుతోఁ దెలివి ♦ గోల్పడి ధారిణిఁ ద్రెళ్ళి యుండుటన్
మఱవక యున్నచో యముని♦మందిరముం జనఁ గోరి వచ్చితో
కఱకరి సర్పముం జెనయఁ♦గా నిట వచ్చితివేమొ బేలవై. ౨౦.౨౪

అర్థములు. మత్ = నాయొక్క, పవితుల్య = వజ్రాయుధముతో సమానములైన, కలంబధారలన్ = బాణముల వర్షధారలచే, కఱకరి = క్రూరమైన, బేలవై = మూఢుఁడవై.

తా త్ప ర్య ము

లక్ష్మణా! వజ్రముతో సమానమైన నా బాణముల ధారలచే తెలివి తప్పి భూమిమీఁద కొనయూపిరితోఁ బడియుండుట మఱచితివా ? అది మఱవవేని యముని యింటికిఁ బోదమని వచ్చితివా ? క్రూరసర్పమును జెనకుటకై తెలివి మాలినవాఁడవై యిచ్చటికి వచ్చితివేమి ?

కం. అనవుడు నభీతవదనుం,డును క్రోధియు నగుచు లక్ష్మ♦ణుఁడు పల్కెను శ
తనుగాని పగ్గెలాడితి, వని దీర్చి వచించువాఁడు ♦ ప్రాజ్ఞుం డెందున్. ౨౦.౨౫

అర్థములు. అభీతవదనుఁడు = భయపడని ముఖము గలవాఁడు, క్రోధియున్ = కోపము గలవాఁడు, పగ్గెలు = పౌరుషవాక్యములు - ప్రజ్ఞలు.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా ముఖమున భయచిహ్నములు లేక కోపచిహ్నములు గలఁవాఁడై లక్ష్మణుఁ డిట్లనెను. చేతగాని ప్రతిజ్ఞ లేల కలిగెదవు? పనిచేసి చెప్పువాఁడుగదా బుద్ధిమంతుఁడు.

ఆ. పనికిరానికొన్ని ♦ పలుకులు పలుకుచు, నేరి కలవిపడని♦కారియములఁ
జలిపినట్లు చెప్పి ♦ సంతోష పడియెదు, ధన్యతముఁడ వనుచు ♦ దాశకంఠి!

తా త్ప ర్య ము స్పష్టము.

కం. ఎరికిని గోచరింపక, యారే యుద్ధమున మఱఁగి ♦ యటు లోనరింపన్
బౌరుష మెచ్చునె? యదియును, జోరునిమార్గంబు గాక ♦ శూరుని విధమే?

అర్థములు. రే=రాత్రి, మఱఁగి=చాటుగనుండి, పౌరుషము=మగతనము.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. నీశరపథమున నిల్చితి, నాశరవర! నీవు దొల్లి ♦ యగపఱచిన బా
హాశక్తిఁ జూపుమీ కన, నాసించితి ఫలము గలదె♦వ్యర్థోక్తులచేన్. ౨౦౮

అర్థములు. శరపథమునన్ = బాణముల మార్గమున, ఆశరవర=రాక్షస శ్రేష్ఠుఁడా!, బాహాశక్తి=భుజబలము.

తా త్ప ర్య ము స్పష్టము.

—♦ ఇంద్రజిల్లక్ష్మణయుద్ధ ప్రారంభము ♦—

ఉ. నావుడుఁ గోపఘూర్ణనయ♦నద్వయుఁడై నిశితాశుగంబు లెం
తేవడిఁ బ్రైపయిం దెఱపి ♦ నింతయు నీక మహోద్ధతంబుగా
రావణి వైచె, వైచిన శ♦రప్రకరంబులచే విధూమ మౌ
పావక మో యనం బొలిచెఁ♦బార్థివుఁడున్ క్షతజార్ద్రగాత్రుఁడై. ౨౦౯

అర్థములు. కోపఘూర్ణనయన ద్వయుఁడై = కోపముచే కలఁతచెందిన రెండు కన్నులు గలవాఁడై, నిశిత ఆశుగంబులు=పదునైన బాణములు, విధూమము=పొగలేనిది, పావకము = అగ్ని, క్షతజార్ద్రగాత్రుఁడై=నెత్తుటిచేఁ దడిసిన దేహము గలవాఁడై.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా నింద్రజిత్తు కోపముచేఁ దిరుగుచుపడుచున్న కన్నులు గలవాఁడై పదునగు బాణములు మిగుల వేగముగ మీఁద మీఁద సందులేక ప్రయోగించెను. అట్లు వాఁడు వేసిన బాణముల సమూహములచే లక్ష్మణుఁడు నెత్తుటఁ దడిసిన దేహము గలవాఁడై పొగలేని యగ్నివలెఁ గనఁబడెను.

ఉ. దానవ పొంగి తీర్చితిఁ గ♦దా కెలసం బని రాక్షసుండు గ
ర్జానినదార్భటిన్ నభము ♦ ప్రయ్యఁగఁ జేయుచుఁ బల్కు లక్ష్మణా?

మానితమద్ధనుర్గళిత • మార్గణ కుండలి మండలంబు నీ
ప్రాణసమీరణంబుల దు • రంబున నిప్పుడు గ్రోలుఁ జూడుమీ. ౨౦౩౦

అర్థములు. దానన = దానిచేతనే, కెలసము = కార్యము, గర్జానిన దార్భటిన్ = మేఘ ధ్వనివంటి ధ్వనితో, మానిత=గౌరవింపఁబడిన, మత్ = నా యొక్క, ధనుర్గళిత = వింటినుండి బయలువెడలిన, మార్గణ = బాణములను, కుండలి = పాముల, మండలంబు = సమూహము, నీ ప్రాణసమీరణంబుల = నీ ప్రాణవాయువులను, దురంబునన్=యుద్ధమందు, గ్రోలున్=త్రాగును.

తాత్పర్యము

తన బాణముల నివారింపలేక గాయపడెను గదా, యింకఁ గార్యము చక్కఁ జేసితినని పొంగి యింద్రజిత్తు మేఘధ్వనివలె గర్జించి యాకాశము వగులఁజేయుచు నిట్లనెను. లక్ష్మణా! పూజ్యములైన నా బాణము లను సర్పములు నీ ప్రాణవాయువుల నిపుడే త్రాగును చూడుము.

కం. నక్కలు డేగలు గ్రద్దలు, గ్రిక్కిఱియుచు వ్రాలి నా వ • రిష్ఠశరములన్
దిక్కఱి కూలిన నిన్నుం, బొక్కలి పొడుచుచును దినుతఁ•బోరుచుఁ దమలోన్.

తాత్పర్యము స్పష్టము.

చ. కవచము తునకలై ధనువు • ఖండితమై పరిభూతశీర్షమై
తెవి పడియున్న దుష్టుని న • ధీరుని భక్తవరేణ్య క్షత్రబం
ధువు నినుఁ జూచుఁ బో పరమ • దుర్మతి రాముఁ డటంచుఁ బల్క నా
పౌవరుఁ డుటారపు న్నుడికి • భూవరుఁ డాడు సహేతుకోక్తులన్. ౨౦౩౨

అర్థములు. పరిభూతశీర్షము = ఎగురఁ గొట్టఁబడినతల, ఐ = కలిగి, తెవి = తెగి, అధీరుని = పిఱికిని, క్షత్రబంధువు = నీచక్షత్రుని, తుటారము = పరుషము.

తాత్పర్యము

నీవు తొడిగిన కవచము తునకలై, విల్లు విఱువఁబడినదై, తల యెగురఁ గొట్టబడినదై చచ్చి పడియున్న నిన్ను దుష్టుని పిఱికిని తన భక్తుని నీచ క్షత్రియుని పరమదుష్ట మనస్సుగల రాముఁడు చూచును గాక యని పలుకఁగా నా పొగరుతోఁ గూడిన పరుషపుమాటకు సకారణములైన మాటల లక్ష్మణుఁ డిట్లనియె

కం. పలువా! వాగ్బల మేలా, పలికితి వెది నీవు సలుపు • వాఁడ వటంచున్
పలువుగ నది దీరిచి కీర్తులఁ బొందఁగ రాదె రిత్త • దూషణ మగునే? ౨౦౩౩

అర్థములు. పలువా = పలు+వాయి=అనేక విధములుగ వదరువాఁడు, బహుభాషి, రిత్తదూషణము=వ్యర్థముగ నిందించుట.

తాత్పర్యము స్పష్టము.

కం. అగ్గించు కొనెదు దేనిని, నిగ్గింపక మున్న నీవ • నిష్ఠురచరితా
యెగ్గింపుము నీ పల్కిన, వగ్గలు నెఱవేర్చి నన్ను • వాఁడను నేనున్. ౨౦౩౪

అర్థములు. అగ్గించు కొనెదు = నిన్ను నీవే పొగడుకొనెదవు, నిగ్గింపక = నిర్వహింపక, ఎగ్గింపుము = నిందింపుము.

తాత్పర్యము

నీవేపనియుఁ జేయకముందే నిన్ను నీవే పొగడుకొనుచున్నావు. కఠినశీలుఁడా! నీవు పలికిన పౌరుషములు నెఱవేర్చి నన్ను నిందింపుము. నేను నమ్మెదను.

కం. కఱకులు ప్రేలక యేనియుఁ, గొఱఁతల నిడఁబోక పొగడు • కొనక నీవు డీ
కొఱకు శరంబుల నీ తల, నొఱగించెద నేల నాదు • నొఱపు రహింపన్. ౨౦౩౫

అర్థములు. ఒఱపు=ప్రకాశము, రహింపన్=ప్రకాశింపఁగా.

తాత్పర్యము స్పష్టము.

కం. అని యాకర్ణాపూరిత, సునిశితశరపంచకంబుఁ • జొప్పించెను న
ద్దనుజాని యురమున నవి వెలిఁగెను ఱొమ్మునఁ దీవ్రకరుని • కిరణము లనఁగన్.

అర్థములు. ఆకర్ణాపూరిత = చెవివఱకు నిండ లాగఁబడిన, సునిశిత = పదునైన, శరపంచకంబు=ఐదు బాణములు, తీవ్రకరుని=సూర్యుని.

తాత్పర్యము

చెవి వఱకుఁ బూర్ణముగా లాగఁబడిన పదునైన బాణములైదు ఆ రాక్షసుని ఱొమ్మున నాటింపఁగా నవి వాని ఱొమ్మున సూర్యుని కిరణముల వలె వెలిఁగెను.

తే. దాన రావణి నొచ్చి ని • తాంతరోష, కలితుఁడై నైచె మూఁడు మా • ర్గణములు ఉఱక
రాముతమ్మునిమీఁదఁ బరస్ప • రజయ, వాంఛలను బోరి రిద్ద ఱ • వారితముగ.

అర్థములు. నితాంతరోష కలితుఁడై = మిగులఁ గోపము కలవాఁడై, ఉఱక=లక్ష్యములేక, అవారితముగ=అడ్డము లేక.

తాత్పర్యము

అట్లు బాణములు నాటుటచే నింద్రజిత్తు నొచ్చినవాఁడై మిగులఁ గోపించి లక్ష్యము సేయక మూఁడు బాణములు లక్ష్మణుపై ప్రయోగించెను. ఇట్టిద్దఱు జయము గోరి యడ్డములేక పోరిరి.

ఉ. ఇద్దఱు విక్రమాన్వితులు • నిద్దఱు భూరిభుజాబలాఢ్యు లా
యిద్దఱు సుప్రసిద్ధులును • నిద్దఱు శస్త్రవరాస్త్రకోవిదుల్
తద్దయు దుర్జయుల్ హరిప • దంబునఁ బోరు గ్రహంబు లట్లిరై
యుద్ధిగఁ జెంగిపోక రణ • ముగ్రతఁ జల్పిరి దుష్ప్రధర్షణుల్. ౨౦౩౭

అర్థములు. విక్రమాన్వితులు = పరాక్రమముతోఁ గూడినవారు, భూరిభుజబలాఢ్యులు = గొప్పభుజబలము గలవారు, సుప్రసిద్ధులు = మిగుల ప్రసిద్ధిగాంచినవారు, శస్త్రవరాస్త్రకోవిదులు=శ్రేష్ఠములగు నస్త్రశస్త్ర విద్యయందుఁ

బంధితులు, తద్దయున్ = మిక్కిలి, దుర్జయుల్ = జయింపరానివారు,హరిపదంబునన్=ఆకాశమందు, అట్టిరు = అట్టివారు, ఉద్దిగన్ = సమానముగ, చెంగిపోక = వీడిపోక, దుష్ప్రధర్షణుల్=తిరస్కరింపరానివారు.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. సింగము సింగముఁ దాఁకిన, భంగిని బెనఁగిరి నితాంత • పౌరుషయుతు లై
లొంగక సడలక నిర్జర, పుంగవవృత్రులన మనుజ•పుంగవ దనుజుల్, ౨౦౩౯

అర్థములు. నితాంత = అధికమైన, పౌరుషయుతులై = పౌరుషముతోఁ గూడినవారై, లొంగక=లోపడక, సడలక = వదలక, నిర్జరపుంగవ వృత్రులు= ఇంద్రుఁడు, వృత్రుఁడు, మనుజపుంగవ దనుజుల్=నరశ్రేష్ఠుఁడు, రాక్షసుఁడు.

తా త్ప ర్య ము

సింహము సింహము నెదిరించిన విధముగా మిగులఁ బౌరుషము గలవారై యొకరి కొకరు లోపడక వదలక, యింద్రుఁడు వృత్రుఁడు యుద్ధము చేసినట్లు లక్ష్మణుఁడు ఇంద్రజిత్తు యుద్ధము చేసిరి.

ఉ. ఒండొరు మీఱు సంతసము • నొండొరు మీఱెడిసాహసంబు దా
రొండొరు మీఱు శౌర్యమును • నొండరు మీఱు రణాభిలాష ము
ద్దండధనుఃకళానిపుణ • తల్ శరవేగము మీఱు చుండఁగా
నొండొరు ముంచి రుగ్రమహి • తోగ్రకలంబకదంబకంబులన్. ౨౦౪౦

అర్థములు. రణాభిలాష = యుద్ధకాంక్ష, ఉద్దండ=వాఁడిమి గల, ధనుఃకళానిపుణతల్ = ధనుర్విద్యయందలి చమత్కారము, కలంబకదంబకంబులన్ = బాణసమూహముచే.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. ఒక్కరుఁ డేయుమార్గణము • లొండొకరుం డెడఁ ద్రుంచి వైచు వే
ఱొక్కఁడు వేయులోన మఱి • యొక్కఁడు ముంచు శరాళి నిట్లు దా
రెక్కువ తక్కువల్ తొడర • కేడ్తెఱ శంబరవాసవాభు లై
మిక్కిలి తెంపు పెంపునను • మేటిలి పోరిరి జల్లజంపు లై. ౨౦౪౧

అర్థములు. ఎడన్ = నడుమనే, ఏడ్తెఱన్ = పరాక్రమముతో, శంబర వాసవాభులై =శంబరుతోను ఇంద్రునితోను సమానులై,జల్లజంపులు=సాహసులు.

తా త్ప ర్య ము స్పష్టము.

—• ౮౯-వ సర్గము. ఇంద్రజిత్తు లక్ష్మణబాణంబులచే నొచ్చుట •—

సీ. శ్రవణావతంసిత • జ్యాలతికుం డయి, సౌమిత్రి క్రుద్ధ భు • జంగ మనఁగ
నిట్టూర్పుచును గడు•బెట్టిదంబుగ నొక్క, దొడ్డనారసమును • దొడిగి యేయఁ

దద్గుణటంకృతి♦ధ్వానసమాకర్ణనంబున మోము లే♦జంబు వాయ
వెల్ల వెల్లనయి♦జిల్లపాటున శ్రీర, వైరి లక్ష్మణు మోము ♦ వంకఁ గనిన
ఆ. వానివిధ మెఱింగి ♦ ప్రధనసంయుక్తుఁ బృథ్వీతలేంద్రజుని వి♦భీషణుండు
చేరి వైరియందుఁ♦జిహ్నముల్ గన వాఁడు, చెడుట నిజము త్వరయుఁ♦జేయవయ్య.

అర్థములు. శ్రవణావతంసిత జ్యా లతికుండయి=చెవియందలి పుష్పముగాఁ జేయఁబడిన తీఁగవంటి యల్లెత్రాడు గలవాఁడై, క్రుద్ధభుజంగము = కోపించిన పాము, తొడిగి = సంధించి, తత్, గుణటంకృతి = అల్లెత్రాటి టమ్మనునట్టి, ధ్వాన=ధ్వనియొక్క, సమాకర్ణనంబునన్ = వినుటచే, ప్రధన సంయుక్తున్ = యుద్ధకార్యమునందుఁ గూడిన వానిని, అనఁగా బాణములు వేయుటయందే మనస్సుంచినాఁడే కాని లక్ష్మణుఁడు వైరిస్థితి చూచినవాఁడు కాఁడనుట.

తాత్పర్యము

లక్ష్మణుఁడు చెవి వఱకు వచ్చునట్లు లల్లెత్రా డీడ్చి కోపించిన పామువలె నిట్టూర్పు విడుచుచు మిగులఁ గ్రూరమగు నొక గొప్ప బాణము సంధించి వేయఁగా నా నారిధ్వని వినుటచేతనే ముఖమునఁ గాంతి చెడి తెల్లపాఱి సత్త్వము చెడి యింద్రజిత్తు లక్ష్మణు మోము చూడఁగా వాని తీరు చూచి యుద్ధమందే మనస్సు నిలిపిన లక్ష్మణుని సమీపించి విభీషణుఁడు వైరియందలి లక్షణములు చూడఁగా వాఁడు చెడుట నిజము. నీవు త్వర చేయుము.

ఆ. అనుడు నగ్నిశిఖల ♦ కనుగుఁదోఁబుట్టు లౌ, వాలు రంపగములఁ ♦ బాఁపపిండు
పుట్టలోనఁ దూఱు ♦ పోలుపున నాతని, మేను దూఱ నేసె ♦ మెత్తఁబడక.

అర్థములు. అగ్నిశిఖలకు = అగ్నిజ్వాలలకు, అనుగుఁ దోఁబుట్టువులు సమానములు, వాలు + అంపగములన్=నిడుపాటి బాణసమూహములను, పాఁప పిండు=పాముల సమూహము.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా మెత్తఁబడకయ యగ్నిజ్వాలలవంటి బాణసమూహములను బాములు పుట్టలోఁ దూఱునట్లు వాని దేహమునఁ దూఱనేసెను.

మ. బలభిత్సాధనతుల్యబాణచయసం♦స్పర్శంబునన్ వాఁడు వ్యా
కులసర్వేంద్రియుఁడై జడుండయి వ్యథా♦కుంఠీభవత్కార్యుఁడై
కలనన్ మేడ్పడి యుండి తెప్పఱిలి ని♦ష్కంపప్రభావాఢ్యు ను
జ్జ్వలతేజున్ నృపసూతిఁ గాంచి యనె వా♦చాగర్వ మేపారఁగన్. ౨౦౪౪

అర్థములు. బలభిత్+సాధన+తుల్య = ఇంద్రుని యాయుధమగు వజ్రముతో సమానమైన, బాణచయ=బాణసమూహముయొక్క, సంస్పర్శంబునన్ = తాఁకుటచే, వ్యాకుల = కలఁతగల, సర్వేంద్రియుఁడై =సమస్తములైన యింద్రియములు గలవాఁడై, జడుండయి = నిశ్చేష్టుఁడై, వ్యథా=బాధచే, కుంఠీభవత్ =

మొక్కపోయిన, కార్యుఁడై=పనిగలవాఁడై, కలనన్ = యుద్ధమందు, మేద్పడి = తెలివి తప్పి, నిష్కంప ప్రభావాఢ్యున్ = చలింపని ప్రభావసంపన్నుని, ఉజ్జ్వల తేజన్=మిగుల జ్వలించు తేజస్సుగలవాని, వాచాగర్వము=నోటి పొగరు.

వజ్రమువంటి బాణముల తాఁకున వాఁడు సర్వేంద్రియములు కలఁతపడఁగా మొద్దుపాటి బాధచే నే కార్యము చేయలేనివాఁడై యుద్ధమందు తెలివి తప్పిన యట్లుండి మరలఁ దెలివి తెచ్చుకొని తెప్పరిల్లి, చలింపని ప్రభావము గలవానిని, ప్రకాశించు తేజస్సు గలవానిని లక్ష్మణుఁ జూచి నోటి పొగ రతిశయింపఁగా నిట్టులనెను.

చ. తొలిదివసంబు యుద్ధమున ♦ ధూళిని ద్రుంగుచు నేలఁ బొర్లఁగా
బలితపుశస్త్రపాశముల ♦ భ్రాతల మి మ్మటు కట్టినై చుటల్
తలఁపున లేదె? లేమిఁ గద ♦ దార్కొన వచ్చితి నన్నుఁ బోరిలోఁ,
బిలుచుచు నున్నదో యముని♦పే ర్పటుగా కిటు వచ్చువాఁడవే. ౨౦౮౫

అర్థములు. ద్రుంగుచున్=మునుఁగుచు, తార్కొనన్=ఎదిరింపఁగా.

తాత్పర్యము

మొదటిదినము యుద్ధమందుఁ నేలఁబడి దుమ్ములోఁ బొర్లునట్లు బలిష్ఠము లైన శస్త్రపాశముల మిమ్మిద్దఱ నన్నదమ్ములను కట్టివేయుటయు మఱచితివా? అది నీకు మనస్సునందు లేకుండుటచేతనే నన్ను యుద్ధమున నెదిరింప వచ్చితివి. అటుగాక జ్ఞప్తియందుండియు యమపురము పిలుచుచున్న కారణముచేత వచ్చితివో? అటుగాకుండిన వత్తువా?

కం. ప్రథమదినంబున జరిగిన, ప్రధనంబున నాబలంబుఁ ♦ బరికింపనిచోఁ
బ్రథితంబుగఁ జూపెద నిర్మథితుని నినుఁ జేసి నిమిష♦మాత్రము నిలువిఁకా.

అర్థములు. ప్రథమదినంబునన్ = మొదటి దినమందు, దినమనఁగా రాత్రి పగలు కలిసిన కాలమని యర్థము. దినదినప్రవర్ధమానులై యిత్యాదులయం దీ యర్థము గవనగు, ప్రధనంబునన్ = యుద్ధమందు, ప్రథితంబుగన్ = ప్రసిద్ధిగ, నిర్మథితుని = చంపఁబడినవానిని.

తాత్పర్యము

మొదటి దినము జరిగిన యుద్ధమున నా బలము నీవు చూడనియెడల నిన్నుఁ జంపి నేఁడు స్పష్టముగాఁ జూపెదను. అల్పకాలము నిలుము.

చ. అని శరసప్తకంబున నృ♦పాత్మజునిం బడిటన్ మరుత్సుతున్
జెనుఁగినుకన్ విభీషణుని♦భీషణబాణశతంబునన్ దశా
స్యునితనయుండు నైచుటయుఁ ♦ జూచి సుమిత్రసుతుండు చీరికిన్
గొన కవి నవ్వ చివ్వియ మొ♦కో యరులం బర దూలఁ జేసెడిన్. ౨౦౮౬

అర్థములు. శరసప్తకంబునన్ = ఏడు బాణములచే, పదిటన్ = పది బాణములచే, భీషణబాణ శతంబునన్ = భయంకరములైన నూఱు బాణములచే.

తాత్పర్యము

అని యేడు బాణముల లక్ష్మణుని పది బాణముల నాంజనేయుని మిక్కిలి కోపముతో నూఱు బాణముల విభీషణుని నింద్రజిత్తు వేయఁగా నవి సరకుగొనక లక్ష్మణుఁడు ఇట్టి బాణములచేతనా నీవు శత్రువులను జెఱుపఁ గలవాఁడవు.

ఉ. లెక్కయె హా ప్పటంచు నవ•లీల శరంబులఁ ద్రుప్పునాతఁడున్
 జిక్కఁగ నేయు బాణములు • చిందఱవందఱ సేయు చిట్లనున్
 రక్కసుఁడా! భవచ్ఛితశ•రంబు లొకో యివి యిట్టివానిఁ బా
 నుక్కరిశత్రువున్ వయిచు•నో యెవఁ డేనియు గెల్వఁ గోరినన్. ౨౦౪౮

అర్థములు. ఉక్కరి = బలము గలవాఁ డగు.

తాత్పర్యము

భీ పో యివి బాణములని లెక్కింపవలయునా యని యవలీలగా బాణము చిమ్మఁగా నింద్రజిత్తు సందు లేకుండ నేయు బాణములను చెదరగొట్టియు నిట్లనియె. రాక్షసుఁడా! ఇవా నీ పదునైన బాణములు, ఇట్టి వానినా గెల్వఁగోరినవాఁడు బలవంతుఁ డగు విరోధి మీఁద వేయవలసినవి?

తే. లఘువులును నల్పవీర్యముల్ రా•క్షసుండ!
 త్వచ్ఛరంబులు వ్యథ లేదు • తగులు చున్న
 నిట్టి వానిని నేయునే • దిట్టబంట
 టంచుఁ గవచంబు వ్రయ్య శ•రాళిఁ గురిసె. ౨౦౪౯

అర్థములు. లఘువులు = బెండువలెఁ దేలికయైనవి, అల్పవీర్యముల్ = బలము లేనివి, త్వచ్ఛరంబులు = నీ బాణములు, దిట్టబంటు = బలముగల శూరుఁడు, వ్రయ్యన్ = చీలిపోవునట్లు.

తాత్పర్యము

ఓరీ నీ బాణములు తేలికయైనవి, నిస్సారములైనవి, అవి తగులుచున్నను బాధ లేదు. గట్టిశూరుఁ డిట్టి బాణముల వేయునా, యని వాని కవచంబు చీలునట్లు గొట్టెను.

—• ఇంద్రజిత్తు లక్ష్మణులు ఘోరంబుగఁ బోరుట •—

ఉ. ఆవిశిఖోగ్రవృష్టికిని • హాటక భూషితవర్మ మంతయున్
 వావిరి తునకతునక లయి • వ్రాలె రథంబున మింటనుండి వే
 వే వసుధం దొరంగు నుడు•బృందములో యనఁ గృత్తవర్ముఁ డై
 రావణి బాణవిద్ధుఁ డయి • రాజిలె నప్డు ప్రరూఢశైలమై. ౨౦౫౦

అర్థములు. విశిఖోగ్రవృష్టికి = బాణముల బలమైన వర్షముచేత, హాటక భూషితవర్మము=బంగారు నగలచే నలంకరింపఁ బడిన కవచము, ఉడుబృందములు= నక్షత్ర సమూహములు, కృత్తవర్ముఁడై = ఖండింపఁబడిన కవచము గలవాఁడై, బాణవిద్ధుఁడయి=బాణములచే బెజ్జములు గొట్టఁబడినవాఁడై, ప్రరూఢశైలమై = చెట్లచేఁ బెద్దదైన కొండయై.

### తాత్పర్యము

తీవ్రమైన యా బాణవర్షము వలన బంగారుచే నలంకరింపఁ బడిన కవచ మంతయు నాకాశమున నుండి నక్షత్రములు గుంపులై నేల రాలినట్లు తునుకలు తునుకలై రథమునందుఁ బడెను. ఈ ప్రకారము ఖండింపఁబడిన కవచము బాణములు గ్రుచ్చుకొనిన దేహము గలవాఁడై చెట్లచే వృద్ధినొందిన పర్వతమువలె నింద్రజిత్తుండెను.

ఉ. అంతఁ బరస్సహస్రభయ ♦ దాంబకవృష్టి సుమిత్రపట్టి మే
నంతయుఁ గప్పి నిస్తులిత ♦ మైన తనుత్రముఁ ద్రుంచి వైచి య
త్యంతకభీకరుండు కృతి ♦ కష్ట ప్రతిన్ ఘటియించె, నిట్టు ల
త్యంతరుషావశాత్ములయి ♦ యన్నిఱిజోదులు సాటిదీటుగన్. ౨౦౪౧

అర్థములు. పరస్సహస్ర = వేయికి మించిన, భయద = భయము కలిగించు, అంబకవృష్టిచేన్ = బాణవర్షముచే, నిస్తులితమైన = అసమానమైన, తనుత్రము = కవచము, అత్యంతకభీకరుఁడు = యమునికంటె మిగుల భయంకరుఁడు, అత్యంతరుషావశాత్ములయి = మిగులఁ గోపమునకు వశపడిన మనస్సులు గలవారు, నిఱిజోదులు = అధిక శూరులు, సాటిదీటుగన్=సరిసమానముగ.

### తాత్పర్యము

అంతట వేయికి మించిన భయంకరములైన బాణముల వర్షముచే లక్ష్మణుని దేహము గప్పి యాయన దొడిగికొని యుండిన యసమానకవచమును ఖండించి యమునికంటె భయంకరుఁడైన యా రాక్షసుఁడు లక్ష్మణుఁడు చేసిన దానికి బదులప్పుడే చేసెను. ఈవిధముగ నిరువురు మిక్కిలి కోపవశులై సరిసమానముగ యుద్ధము చేయుచుండిరి.

కం. పోరుచు నన్యోన్యాశుగ, దారిత సర్వాంగు లగుచుఁ ♦ దనియక జయముం
గోరుచు నెత్తురు గార్చుచుఁ, గారణ నూర్పుచును దీర్ఘ ♦ కాలము పోరన్. ౨౦౪౨

అర్థములు. అన్యోన్యాశుగ = ఒకరు వేసిన బాణములచే మఱియొకరు దారిత = చీల్పఁబడిన, సర్వాంగులు=అన్ని యవయవములు గలవారు, కారణ = తీవ్రవేదనచే; "కారణాతు యాతనా తీవ్రవేదనా" అమరము ఊర్పుచును=శ్వాసములు పుచ్చుచు.

తాత్పర్యము

యుద్ధము చేయుచు నొకరు వేసిన బాణములచే మఱియొకరు చీల్పఁబడిన దేహము గలవారగుచు జయము రావలయునని కోరుచు నెత్తురు కార్చుచు మిగుల బాధచే నార్పులు పుచ్చుచు నిట్లు చాలఁగాలము యుద్ధము చేయఁగా.

చ. తనువుల నూటకాల్వల వి ♦ ధంబున నెత్తురు గాఱ గర్జలన్
నినుచుచు ఘోరరూపముగ ♦ నింగి పయోధరసంచయంబు మా
డ్కిని శరవృష్టులం గురిసి ♦ కీడ్పడ కేమియు గాసి లేక యా
ద్దనుజనరేంద్రపుంగవులు ♦ ధైర్యము శౌర్యము తుల్యరూప మై. ౨౦౯౩

అర్థములు. నింగి = ఆకాశము, పయోధర సంచయము = మేఘముల గుంపు, కీడ్పడక=కీడుపొందక.

తాత్పర్యము

దేహమునందు నూటకాల్వలవలె నెత్తురుగాఱగా సింహనాదములు చేయుచు ఆకాశమునందలి మేఘములగుంపువలె బాణవర్షములను గురియించుచు కొంచె మైనను బాధగాని, యలసటగాని లేక యా మనుజ దనుజశ్రేష్ఠులు ధైర్యము శౌర్యము సమానముగా.

కం. దీపింపఁగఁ బోరుచు దృఢ,చాపంబులు గుడుసువడఁగ ♦ శస్త్రాస్త్రంబుల్
పై పయిఁ గురియుచు విశిఖ,వ్యాపారము చేత మింటి♦బంధించి రొగిన్. ౨౦౯౪

అర్థములు. దీపింపఁగన్ = ప్రకాశింపఁగా, గుడుసువడఁగన్ = గుండ్ర ముగఁ గాఁగా.

తాత్పర్యము

ప్రకాశింపఁగా యుద్ధము చేయుచు బలముగల విండ్లు గుండ్రము లగునట్లు శస్త్రముల నస్త్రముల మీఁద మీఁదఁ గురియుచు బాణములచేత నాకాశమును బంధించిరి.

చ. ప్రిదులని బాణవేగములు ♦ పీడని చిత్రపరాక్రమంబులున్
వదలని లాఘవంబులును ♦ ప్రాలని చాపకళాచమత్కృతుల్
పొదలినరోషము ల్వెలయఁ ♦ బోరిరి వారి తలప్రహారముల్
నదములు వజ్రఘోషము ల ♦ నన్ విన నయ్యెను వేయు వేయుగన్. ౨౦౯౫

అర్థములు. ప్రిదులని = తగ్గని, ప్రాలని = పడిపోని, పొదలిన = వృద్ధి నొందిన, తలప్రహారముల్ = అఱచేతి దెబ్బలు.

తాత్పర్యము

బాణవేగములు తగ్గనీయక, చిత్రముగాఁ బరాక్రమించుటలు నదలక, లాఘవంబులు విడువక, విలువిద్య నేర్పులు పడిపోనీయక రోషములు వృద్ధి చెందఁగా యుద్ధము చేసిరి. వారి చేతిదెబ్బలు, ధ్వనులు, పిడుగుచప్పుడు లన వేయువేయుగా వినవచ్చు చుండెను.

సీ. జనములు కంపించు • చటుల గర్జార్భటుల్, శరముల తాఁకుల • చప్పుడులును
బధిరతాపాదు లౌ • భయదగుణ ధ్వను,లాశుగంబుల హతి • నైన యులివు
లేకంబుగాఁ దప్త • హేమపుంఖాంకిత, బాణంబులను మేన • వ్రణము లెసఁగఁ
గాఱెడి నెత్తుటి • కాల్వలతోడను, బుష్పితాశోకముల్ • పొలుపు దాల్చి
తే. యని యొనర్పఁగ వారి శ • రాళి తనులు
గాఁడిపాఱి వసుంధరా • గర్భసీమఁ
దూఱె నొకకొన్ని నభమున • ద్రుంగిపోయె
మఱియు నొక కొన్ని యెదిరియం • బకము లణఁచె. ౨౦౫౬

అర్థములు. గర్జార్భటుల్=సింహనాదధ్వనులు, బధిరతాపాదులు=చెవుడు గలిగించునవి యగు, భయద = భయము గలిగించు, గుణధ్వనులు = అల్లెత్రాటి చప్పుడులు, ఆశుగంబుల = బాణముల, హతిన్=ఒకదాని నొకటి కొట్టుటచేఁ గలిగిన, ఉలివులు = ధ్వనులు,ఏకంబుగాన్=ఒక్కటిగాఁగా, తప్తహేమపుంఖాంకిత= పుటము వేసిన బంగారుపింజలు గల, వ్రణములు = గాయములు, పుష్పితాశోకమున్ = పూచిన యశోక వృక్షములయొక్క, తనులు=దేహములు.

తాత్పర్యము

జనులను వణఁకఁజేయు మేఘధ్వనులవంటి యఱపులు, బాణములు తాకుచు చప్పుడులు, చెవుడు కలిగించు నల్లెధ్వనులు, బాణములు తాఁకుకుల ధ్వనులు నన్నియు నొక్కటిగాఁ గలయఁగా బంగారు పింజలు గల బాణములచే దేహమున గాయము లేర్పడఁ గాఱుచున్న రక్తప్రవాహములతో పూచిన యశోకముల చందము గలిగి వారు యుద్ధము చేయఁగా వారి బాణములు కొన్ని దేహములలోఁ దూఱిపోయి భూమియందుఁ బ్రవేశించెను. కొన్ని యాకాశమున బోయెను. కొన్ని యెదుటివారి బాణముల నణఁచెను.

ఆ. వెలుఁగు నగ్నియుగము • కలిమి దర్భమయంబు,క్రతు వనంగ దాశ • రథి దాశ
రథుల రణము వెలిఁగె • బ్రకటమార్గణమయ,మగుచు విబుధలోక • హర్షదమయి.

తాత్పర్యము

వెలుఁగుచున్న రెండగ్నులు కలిగి దర్భలవిశేషముగఁ గల యజ్ఞమువలె లక్ష్మణేంద్రజిత్తుల యుద్ధము విస్తారముగ బాణములచే నిండినదై దేవతాసమూహములకు సంతోషప్రద మయ్యెను. లక్ష్మణేంద్రజిత్తులు రెండగ్నులనియు, బాణములు దర్భలనియు, విబుధహర్షము రెంట సమాన మనియు నెఱుఁగునది.

ఉ. రావణి లక్ష్మణుల్ దెగి ప • రస్పర సంజ్ఞకనాభిలాషు లై
కేవల రౌద్రమూర్తు లయి • ఉన్నతి నొందక యీడఁబోక లెం
పావహిలంగఁ బ్రాణముల • నాశ వహింపక మిన్ను మన్ను బా
ణావృతముం బొనర్చిరి ర • వంతయు స్రుక్కక పెద్దకాలమున్. ౨౦౫౭

అర్థములు. పరస్పరసంజిఘాంసాభిలాషులై = ఒకరి నొకరు సంహరించు కోరిక గలవారై, ఉడుగక = వెనుదీయక.

తాత్పర్యము

ఇంద్రజిత్తు లక్ష్మణుఁ డిరువురు సాహసించి యొకరి నొకరు చంపు కోరిక గలవారై, కేవలము భయంకరాకారము గలవారై ఖేదపడక వెనుదీయక సాహసము గలవారై ప్రాణములమీఁది యాశవదలి కొంచెమైనను దగ్గక దీర్ఘకాలము భూమి, ఆకాశము బాణములచేఁ గప్పిరి.

కం. ఆకొక్కటియును లేక, స్తోకం బలయిలఁ జెలంగి • సాబగగు రక్తా
 శోకంబులు బూరుగు లనఁ, బాకారిజితుండు రాము•భ్రాత వెలుంగన్. ౨౦౫౯

తాత్పర్యము

ఆకు అనునది యొక్కటియైన లేక విశేషముగఁ బూలు గలిగి యందమైన యెఱ్ఱని యశోకము బూరుగులవలె నింద్రజిత్తు లక్ష్మణుఁడు వెలిఁగిరి. ఒక్కటైన లేవి దనుటచే గాయము తగులని నెత్తురు క్రమ్మని భాగము వారి దేహములందు లేవయ్యెనని భావము.

కం. కలహపరిశ్రమ నింద్రజిఁ, బొలియింప విభీషణుండు • పొరిఁ బ్రియహితమున్
 గలిగింపఁగ నపరాజిత,బలుఁడగు లక్ష్మణుని కలని•సజ్జన యుండెన్. ౨౦౬౦

అర్థములు. కలహపరిశ్రమున్ = యుద్ధము నందవలసిన, ఇట్లనుటచే నీ యుద్ధమందు లక్ష్మణుకంటె నింద్రజిత్తు మిక్కిలి బడలెనని గ్రాహ్యము. పొరిన్ = మిక్కిలి, ప్రియ=ప్రియుఁడైన లక్ష్మణునకు, హితమున్ = మేలును, అపరాజిత బలుఁడు=ఓటమి లేని బలముగలవాఁడు. దీనిచే లక్ష్మణుఁడు బడలక పై చేయిగానే యున్నాఁడని భావము.

తాత్పర్యము

యుద్ధమునం దలసిన యింద్రజిత్తును జంపుటకుఁ దన ప్రియుఁడగు లక్ష్మణునకు మేలు గలిగించుటకు విభీషణుండు పరాజయ మెఱుఁగని బలముగల లక్ష్మణునకుఁ బ్రక్కనే యుండెను. ఈ యుద్ధమందు విభీషణుఁ డెక్కువ శ్రద్ధ వహించి పనిచేయు చున్నాఁడు. తక్కువయందు తొక్కయెత్తు వీఁడొకయెత్తు, కనుఱెప్పపాటు ఏమఱిన నేదైన మాయ చేయును. ఆకారణముచే నతని విభీషణుఁడు కనిపెట్టియే యుండెను. అదియునుగాక రావణుఁడుతప్పఁ దక్కినవారిలో మిగిలినవాఁడు వీఁ డొక్కరుఁడే. వీఁడు చచ్చెనా రావణుఁడు చచ్చినవాఁడే. కర్ణునితో భారతయుద్ధము, ఇంద్ర జిత్తుతో రామాయణయుద్ధము ముగింపనియే చెప్పనగును.

—• ౯౦-వ సర్గము. విభీషణుఁడు కపులఁ బ్రోత్సాహపఱచుట •—

శా. అన్యోన్య ప్రతిఘాత నైషణులను• ర్యద్వేషి మిత్రాన్వయుల్
 జన్యాటోపము మీఱ గర్జితపన• స్తంబేరమద్వంద్వసా

మాన్యంబుం దలఁపించుచుం బెనఁగుచో • త్స్మానాథపుత్రుండు వ
ర్జన్యారాతిపయి న్నిగిడ్చె శితధా•రాఘోరనారాచముల్. ౨౦౬౧

అర్థములు. అన్యోన్యస్య ప్రతిఘాత నైషణులు = ఒకరినొకరు చంపఁ గోరిక గలవారు, ప్రతిఘాతన + ఏషణ = ప్రతిఘాతనైషణ, ప్రమాపణం నిబర్హణం, నికారణమ్ నిశారణం ప్రవాసనం పరాసనం నిషూదనం నిహింసనమ్ నిర్వాపణం సంజ్ఞపనం నిర్గంథన మపాసనమ్ని స్తర్హణం, నిహననం, క్షణనం పరివర్జనమ్ నిర్వాసనం విశసనం, మారణం ప్రతిఘాతనమ్ ఉద్వాసన ప్రమథన క్రథనోజ్జాసనానిచ ఆలంభ పింజ విశర ఘాతోన్మాథ వధా అపి॥ అమరము—ఇవి యన్నియుఁ జంపుటకుఁ బేర్లు, అమర్త్యద్వేషి మిత్రాన్వయుల్ = రాక్షసవంశమున సూర్యవంశమునఁ బుట్టినవారు, జన్యాటోపము = యుద్ధమందలి వేగిరపాటు, గర్జిత = ఘీంకరించు, వనస్తంబేరమద్వంద్వసామాన్యంబున్ = అడవియేనుఁగుల జంటతోడి సమత్వమును, తలఁపించుచున్ = జ్ఞప్తికిఁ దెచ్చుచు, పర్జన్యారాతిపయిన్ = ఇంద్రవిరోధి యగు నింద్రజిత్తుమీఁద, శితధారా = వాఁడి వాదరగల, ఘోర = భయంకరమైన, నారాచముల్ = బాణములు.

తాత్పర్యము

ఒకరి నొకరు చంపుకోరిక గలవారును రాక్షస వంశమున సూర్యవంశమునఁ బుట్టిన వారును నగు నింద్రజిల్లక్ష్మణులు యుద్ధసంభ్రమ మతిశయింప గర్జించు అడవి యేనుఁగుల జంటవలె యుద్ధము చేయునపుడు లక్ష్మణుఁడు ఇంద్రజిత్తు మీఁద వాఁడి వాదరగల ఘోరబాణములను వైచెను.

కం. బర్హిశ్శుష్మనిభేషులు, బర్హిర్ముఖవైరిసేనఁ • బడి ప్రతిభట ని
స్తర్హణ మొనరించెఁ బాకని,బర్హణుకులిశంబు శైల•వారముఁ బోలెన్.

అర్థములు. బర్హిశ్శుష్మ = అగ్నిహోత్రునితో, నిభ = సమానమైన, ఇషులు = బాణములు 'బర్హిషో దర్భాః శుష్మ బల మస్యేతి బర్హిశ్శుష్మే త్యేకంవా పదం' దర్భలు బలముగాఁ గలవాఁడు. గు — బా — ప్ర. బర్హిర్ముఖ వైరిసేన = దేవవిరోధియగు రాక్షసుని సేనయందు, ప్రతిభట నిస్తర్హణము = విరోధి వధము, పాకనిబర్హణు = ఇంద్రుని యొక్క, కులిశంబు = వజ్రము, శైల వారమున్ = పర్వతసమూహమును, దుష్కరప్రాసము.

తాత్పర్యము

అగ్నితో సమానములైన బాణములు రాక్షస సేనమీఁదఁబడి యింద్రుని వజ్రాయుధము పర్వతముల నాశము చేసినట్లు నాశము చేసెను.

తే. భీషణబలాఢ్యులైన వి•భీషణాను, చరులు శూలాసిపట్టిస•సాయకముల
గములు గములుగ రాక్షస•కోటిఁ గూల,వైచిరప్పుడు తమ కేలి•వాఁడి మెఱసి

అర్థములు. భీషణ బలాఢ్యులు=భయంకర బలసంపత్తి గలవారు, విభీషణానుచరులు=విభీషణుని వెంటనుండు వారు, నలువురు మంత్రులు, వాఁడి=తీక్ష్ణత.

తాత్పర్యము

భయంకర సంపన్నులగు విభీషణుని మంత్రులు శూలముల చేతను పట్టిసముల చేతను బాణముల చేతను రాక్షసులను తమ చేతి బలాతిశయమున గుంపులు గుంపులుగఁ బడఁగొట్టిరి.

కం. గున్నేనుంగుల నడుమం, దున్నమదగజంబుమాడ్కి ♦ నొప్పెడి దృఢ శౌ
ర్యోన్నతుఁడైన విభీషణుఁ, డన్నగచరకోటిఁ గనియె ♦ హర్షము గదురన్.

అర్థములు. గున్నేనుఁగులు=పొట్టి యేనుఁగులు, అగచరకోటికిన్=వానర సమూహమునకు.

తాత్పర్యము స్పష్టము

ఉ. ఎక్కటి బంటులార! వినుఁడీ దశకంఠున కీఁ డొక్కఁడున్
చిక్కిన యాబలం బిది ♦ శేషము, వీఁ డిటఁ ద్రెళ్ళె నేనియున్
దక్కను లెల్లనుం దెగిర ♦ రావణుఁ డొక్కఁడు దక్కఁ, గాన మీ
యుక్కు జవంబునున్ మెరసి ♦ యుగ్రతఁ జంపుఁడు వీరి నందఱన్. ౧౦-౧౪

అర్థములు. ఎక్కటి బంటులార=అసహాయ శూరులార.

తాత్పర్యము

అసహాయ శూరులారా! నామాట వినుఁడు. దశకంఠునకు యుద్ధవీరులలో మిగిలినవాఁడీ యింద్రజిత్తొక్కఁడే. ఇక్కడనుండు నీసేన మిగిలెను. తక్కినయందఱు చచ్చిరి. ఇక్కడ వీఁడు చచ్చెనా రావణుఁడు తప్పఁ దక్కిన యందఱు చచ్చినవారే, కావున బలము వేగము ప్రకాశింపఁజేసి వీరి నందఱఁ జంపుఁడు.

సీ. కుంభకర్ణుండును ♦ కుంభనికుంభ ప్రహస్తసుప్తఘ్న ధూ♦మ్రాక్ష వికట
సంహ్రాది దుర్ధర♦జంబుమాలులు వజ్రదంష్ట్రిమహామాలి ♦ తపనదములు
యశనిప్రభుండును♦యజ్ఞకోపుండును, బ్రఘసప్రఘసులు♦రశ్మికేతు
వగ్ని కేతుండును ♦ సర్కశత్రుండును, జంఘప్రజంఘులు ♦ చక్రమాలి
తే. కంపనుండు ద్విజిహ్వుఁ డ♦కంపనుండు, తీక్ష్ణవేగసుపార్శ్వులు ♦ ధీరనిఘ్నుఁ
డల్ల దేవాంతకనరాంత♦కాదులెల్ల బవరమునఁ గూలి రీతఁ డే♦పాటి మీకు.

తాత్పర్యము

కుంభకర్ణుఁడు, కుంభుఁడు, నికుంభుఁడు, ప్రహస్తుఁడు, సుప్తఘ్నుఁడు, ధూమ్రాక్షుఁడు, వికటుఁడు, సంహ్రాది, దుర్ధరుఁడు, జంబుమాలి, వజ్రదంష్ట్రుఁడు, మహామాలి, తపనదములు, అశనిప్రభుండు, యజ్ఞకోపుఁడు, ప్రఘసుఁడు, ప్రఘాసుఁడు, రశ్మికేతువు, అగ్నికేతువు, సూర్యశత్రుఁడు, జంఘప్రజంఘులు, చక్రమాలి, కంపనుఁడు, ద్విజిహ్వుఁడు, అకంపనుఁడు, తీక్ష్ణవేగుఁడు, సుపా

ఘ్నుఁడు, ధీరనిఘ్నుఁడు, దేవాంతక నరాంతకులు మొదలగు వారందఱు యుద్ధమునందుఁ జచ్చిరి. వీఁ డొక్కఁడు మీ కేమాత్రము ?

కం. వారల నెల్ల వధించిన, వీరుల కీయసురుఁ ద్రుంప • వింతయె పారా
వారముఁ గరముల నీఁదిన, యీరలు గోష్పదము నీఁది • యొసఁగుఁడు కీర్తిన్.

తాత్పర్యము

మీరు వారినందరఁ జంపిన వీరుల. ఈ యొక్క రాక్షసుని ద్రుంచుట యాశ్చర్యమా? సముద్రమును చేతులతో నీదిన మీరీ గోష్పాదమంత యీఁది కీర్తిని సంపాదింపుఁడు.

కం. మీ రింకఁ జేయ మిగిలిన, కారియ మీసేన యమున • గారంబునకున్
వారక పనుచుటె క్రొవ్విన, వారెల్లరుఁ జనిరి మున్నె • వరుసలు గొనుచున్.

తాత్పర్యము

మీ రింకఁ జేయుటకు మిగిలిన కార్య మీ సేనవంతయుఁ జంపుటే. తక్కిన వారందఱు ముందే వరుసగాఁ జచ్చిరి.

ఉ. నాసుతు నేన చంపుట య• నంగ నయుక్తపుఁగార్య మైనను
వాసిగ రామహేతువునఁ • బాసి దయన్ వధియింపవచ్చు నే
దోసము లేదు పో యితనిఁ • ద్రుంపఁగ నాస వహించు నా కనుల్
మాసరబాష్పపూరములు • మాటికి నప్పళించెడిన్. ౨౦౯

అర్థములు. అప్పళించు=కప్పు, మాసర=దీర్ఘములు, విశేషముగ.

తాత్పర్యము

నా కొడుకును నేనే చంపుట యనునది యుచితమైన పనిగాదు. అయినను రాము నిమిత్తమై దయవదలి చంపవచ్చును. దానివలన నే పాపమురాదు. నిశ్చయము. కావున నా కా పాపభయము లేదు. కాని వీనిని జంప నాశవహించుట నా కన్నులను దీర్ఘముగఁ గన్నీరు కాల్వలుగాఁ మీఁదమీఁద గప్పుచున్నవి. నేను గన్నీళ్ళు తుడుచుకొందునా? వీనితో యుద్ధము చేయుదునా ?

దీనివలన స్వార్థపరత్వమునఁగాక భగవత్ప్రీత్యర్థమై యేకార్యము చేసినను దోషములేదని భావము.

ఉ. కావున వీని లక్ష్మణుఁడె • గండడంచుం గపులార! మీరు నే
లా వితయూరకుండ లివ • లావు వెలుంగఁగ నింద్రజిత్సమీ
పావనిసేనఁ ద్రుంప దగ• వన్నఁ గపుల్ చెలరేగి శత్రుసే
నావళి డాసి పోరిరి య•పారభుజావిభవంబు లేర్పడన్. ౨౧౦

అర్థములు. గండడంచున్ = చంపును, విత = వ్యర్థముగా, లివ = లాఘవము, లావు = బలము, ఇంద్రజిత్ సమీపావని సేనన్=ఇంద్రజిత్తునకు సమీపమందున్న సేనను.

## తాత్పర్యము

కావున వీనిని లక్ష్మణుఁడే చంపఁగలఁడు. కపులారా! మీరేల వ్యర్థముగా నూరకున్నారు. మీలాఘవము బలము దెలియునట్టు లింద్రజిత్తునకు సమీపమందున్న సేనను వధింపుఁడనఁగా వానరులు చెలరేఁగి శత్రుసేనల సమీపించి యపరిమితమైన భుజబలసంపదచేత యుద్ధము చేసిరి.

తే. కారుమబ్బులఁ గాంచి మ♦యూరసమితి, యుబ్బి కేకలు వైచెడి♦కొప్పు దోఁప
యామినీచరసైన్యంబు♦నారఁగాంచి, గర్జల నొనర్చె శాఖామృ♦గములపిండు.

అర్థములు. కారుమబ్బులన్=వర్షాకాల మేఘములను, మయూరసమితి=నెమిళ్ళగుంపు, యామినీచర = రాక్షసుల, శాఖామృగముల పిండు = వానరుల సమూహము.

## తాత్పర్యము

వానమబ్బులను జూచి సంతోషించి నెమిళ్ళు కేకలు వేయునట్లు రాక్షసుల సేనలఁజూచి వానరసమూహము సింహనాదములఁ జేసెను.

సీ. వారిలోపల జాంబ♦వంతుండు నిజయూథ,వృతుఁడయి రాక్షస♦వితతిమీఁదఁ
గవిసి పోరొనరింపఁ♦గలఁక లేకసురులు, చుట్టుముట్టిరి వాని♦ మట్టుమీఱి
శిరములఁ బట్టిస♦పరశు తోమరముల, భల్లాకపతిమీఁద♦ జల్లువోలెఁ
గురిసె నొప్పించిన♦ నరకుసేయ కతఁడు, పోర భీభత్సమై♦ఘోరమయ్యె
తే. దేవతాసురయుద్ధంబు♦ తెరువు దోఁప, నల్లభీమస్వనంబులు♦ వెల్లగయఁగ
గాడ్పుపట్టియుఁ గ్రుద్ధుఁడై♦తన్మరుహమున, నేటునకు వేవురిఁగూల♦నెగసిచంపె.

అర్థములు. జల్లు = వాన, గాడ్పుపట్టి = హనుమంతుఁడు, వేవురు = వేయిమంది, లక్ష్మణునితో యుద్ధము చేయుచుండిన యింద్రజిత్తు లక్ష్మణుని విడిచి విభీషణుని జంపవలెనని యతనితో యుద్ధము నారంభించెను. అప్పుడు హనుమంతుఁ డూరకుండనేల యని లక్ష్మణుడించి రాక్షసులపై పడెను.

## తాత్పర్యము స్పష్టము.

చ. తన పితతండ్రితోఁ బెనఁగి♦ దానవనాథసుతుండు వెండియున్
దనుజనికారణున్ దశర♦థప్రభుపుత్రకుఁ గిట్టి తాఁకినన్
హనుమయు లక్ష్మణుం గొలిచె♦ నంతట వారికిఁ బోరు చెల్లె ఘా
తనివహహృత్ప్రకంపనని♦ దానము నిర్జరరోమహర్షమై. ౨౦౭౩

## తాత్పర్యము

అర్థములు. పెనఁగి = యుద్ధముచేసి, దనుజనికారణున్ = రాక్షసులఁ జంపువానిని, కిట్టి = సమీపించి, ఘాతనివహ = ప్రాణుల సమూహముయొక్క, హృత్=హృదయముల, కంపన నిదానము = అదరుటకుఁ గారణము, నిర్జరరోమహర్షము=దేవతలకు గగ్గురుపాటు కలిగించునది.

తాత్పర్యము

ఇంద్రజిత్తు తాను విభీషణునితో యుద్ధము చేయుచుండ లక్ష్మణుఁడు రాక్షస సేనను ధ్వంసము చేయుచుండుట చూచి విభీషణునితో యుద్ధము చాలించి మరల లక్ష్మణునిపైఁ గవిసెను. ఆంజనేయుఁడును రాక్షసవధ చాలించి మరల లక్ష్మణునకు వాహనమయ్యెను. అప్పుడు లక్ష్మణేంద్రజిత్తులకు ప్రాణికోటుల గుండెలదరఁ జేయునదియు దేవతలకు గగ్గురుపాటు గలిగించునదియు నగు యుద్ధము జరిగెను.

—♦ ఇంద్రజిల్లక్ష్మణులు ఘోరంబుగఁ బోరుట ♦—

కం. ప్రావృట్కాలంబున, రవి, శైవాతృక బింబయుగము ♦ శరధరసంఘా
తావృత మగుచందంబున, నా వీరయుగంబు మఱఁగె ♦ నాశుగతతులన్.

అర్థములు. ప్రావృట్ + కాలంబునన్=వానకాలమున, రవిశైవాతృక బింబయుగము=సూర్యచంద్రబింబముల జత, శరధర=మేఘముల, సంఘ = సమూహముచే, ఆవృతము=ఆవరింపఁబడినది, మఱఁగెన్ = చాటయ్యెను, ఆశుగ తతులన్ = బాణ సమూహములచే.

తాత్పర్యము

వర్షాకాలమున మేఘములచే మఱుఁగుపడిన సూర్యచంద్రుల బింబములవలె బాణసమూహములచే నా వీరు లిరువురు మఱుఁగుపడి కానరాక పోయిరి.

కం. తీయుట తొడుగుట దిగియుట యేయుటకై మార్పు లక్ష్య♦వీక్షించుటయున్
బాయుట డాయుట దురమున, లాయుట గనరాదు వారి ♦ లాఘవగరిమన్.

అర్థములు. లాయుట = విజృంభించుట.

తాత్పర్యము

అంబులపొదినుండి బాణము దీయుటగాని వింట సంధించుటగాని అల్లెత్రాడు లాగుటగాని బాణమును విడుచుటగాని గుఱిచూచుటగాని, ఎదిరి బాణములు తప్పించుకొనఁ దొలఁగి పోవుటగాని ఎదిరిని సమీపించుటగాని యుద్ధమున విజృంభించుటగాని వారి లాఘవాతిశయమున నేదియుఁ గానవచ్చినది కాదు.

తే. చాపవేగవినిర్ముక్త ♦ శరవితాన, ములను నద్దియుఁ దోఁప దే♦తలమునందు
నెందుఁ జూచినఁ బఱచెడి♦క్రిందఁబడెడి, తాఁకుచుండెడి బాణసం♦తాన మేచె.

అర్థములు. చాపవేగ=వింటి వేగముచే, వినిర్ముక్త=విడువఁబడిన, శర వితానములను=బాణసమూహములచే, తోఁపదు = కానరాదు, ఏచెన్ = అతిశయించెను.

తాత్పర్యము

అతివేగముగ బాణములను వింటినుండి విడుచుటచేత నేత్రములమందైనను ఏపదార్థమైనను నగపడలేదు. ఎక్కడఁజూచినను వేగముగఁ బోవుచున్న బాణములు క్రిందఁ

బడుచున్న బాణములు ఒక దానితో నొకటి కొట్టుకొనుచున్న బాణములే యతిశయించెను.

తే. ఒండొరులమీఁద వార లుద్దండవృత్తిఁ,జిమ్ము కాండంబు లభ్రప థమ్మునందుఁ
బందిరి ఘటించినట్లు క ప్పట్టుచుండెఁ జిమ్మచీకట్లు ధరణిని ముమ్మరముగ.

అర్థములు. కాండంబులు = బాణములు, అభ్రపథమ్మునందు = ఆకాశమందు, ముమ్మరముగన్=అధికముగ.

తాత్పర్యము

ఒకరిపై నొక రతివేగముగ వేయు బాణము లాకాశమునఁ బందిరి పెట్టినట్లుండెను. ఆ కారణముచే భూమిమీఁద గాఢాంధకారము వ్యాపించెను.

ఉ. వారలబాణవేగములు వారలశౌర్యవిజృంభణంబులున్
వారలహస్తలాఘవము వారల తెంపును బెంపుఁ జూఁడగా
నేరికొ గెల్పు వీరి కిద మిత్థ మటంచు వచింపరాక పెం
పారుచు నుండె నా కదన మబ్బురపోవుచుఁ జూడ ఖేచరుల్. ౨౦౭౪

అర్థములు. ఇదమిత్థమ్ = ఇది యిట్లు యగును అనఁగా లక్ష్మణుఁడే జయించునని కాని, యింద్రజిత్తే యోడిపోవు నని కాని చెప్ప సాధ్యపడినదికాదు.

తాత్పర్యము స్పష్టము

కం. దెసలును మూలలు బాణ ప్రసరంబులచేత నిండ రవి లేనియెడన్
ముసరెడి పెంజీకటినా, నెసఁ గెను సంతమస మపుడు దృగ్భీకరమై. ౨౦౭౫

అర్థములు. ప్రసరంబుల చేతన్=సమూహములచేత, ముసరెడి=క్రమ్ముకొను, సంతమసము=గాఢాంధకారము, దృక్+భీకరమై=చూడ్కికి భయంకరమై.

తాత్పర్యము

నాలుగు దిక్కులు నాలుగు మూలలు అష్టదిక్కులు బాణ సమూహముల చేత నిండఁగా సూర్యుఁడు లేనప్పుడు క్రమ్మెడి గాఢాంధకారమువలె చూడ్కికి భయంకరమై కాఱుచీకటి వ్యాపించెను.

సీ. నెత్తురుటేరులు మొత్తంబులై పాఱెఁ, గ్రవ్యాదములు నించెఁ గరవరుతము
లనలుండు జ్వలియింపఁ డనిలుండు వీవఁడు, స్వస్తిలోకేభ్య యటంచుఁ బలికె
ఋషిసంచయంబులు బృందముల్ గట్టి, వీక్షించు గంధర్వాది ఖేచరతతి
సాధ్వసంబునసహ చారణమై దవ్వు, చని నిల్చె నదియె నా సమయమునను

ఆ. సుకృతహస్తుఁడైన సౌరుండు లక్ష్మణుం, డసురసింహు హాట కాంచితముల
నీలసైంధవముల నాలుగింటిని నాల్గు, వాలురమ్ము లేసి పటిమ మాన్చె

అర్థములు. క్రవ్యాదములు = మాంసము దిను జంతువులు, తోడేళ్ళు నక్కలు మొదలైనవి, కరవరుతములు = పరుషధ్వనులు, అనలుండు = అగ్నిహోత్రుఁడు, అనిలుండు = వాయువు, స్వస్తిలోకేభ్యః = ప్రపంచమునకు మేలు

కలుగునుగాక, అనుకరణము పరమగుటచే విసర్గమునకు లోపము, బృందముల్ = గుంపులు, ఖేచరతతి=ఆకాశమున సంచరించు వారి సమూహము, సాధ్వసంబునన్ =బాణములు తమకుఁ దగులు నను భయముచే, సుకృతహస్తుఁడు = గురితప్పక కొట్టువాఁడు, "కృతహస్తస్సుప్రయోగవిశిఖః కృతపుంఖవత్" అమరము. హాట కాంచితములన్=బంగారు నగలచే నొప్పువానిని, నీలసైంధవములన్=నల్లని గుఱ్ఱములను, వాలురమ్ములు = వాలు+అమ్ములు = నిడుపాటి బాణములు, పటిమ = దృఢశక్తి, మాన్చి = తగ్గునట్లు చేసి.

### తాత్పర్యము

నెత్తురులు వెల్లువలై పాఱెను. మాంసముదిను జంతువులు పరువముగా నటిచుచుండెను. అగ్ని మండదయ్యెను. గాలి వీవదయ్యెను. ఋషులు లోకమునకు మేలు కలుగుఁగాక యనుచుండిరి. ఆకాశమున గుంపులుగట్టి తిరుగుచుండు గంధర్వాదులు చారణులతో తమకు బాణములు తగులు నను భయముచే దూరముగాఁ బోయి చూచుచుండిరి. ఆ సమయమున గురి సూటిగాఁ గొట్టఁగల లక్ష్మణుఁడు నాలుగు నిడివి బాణములచే నింద్రజిత్తు నాలుగు నల్లగుఱ్ఱముల బలము దగ్గునట్లు కొట్టెను.

### —♦ లక్ష్మణుఁ డింద్రజిత్తుసారథిని జంపుట ♦—

కం. వేఁడిమిఁ బిడుగుల కెనయై, వాఁడి మిగిలి మేలిగఱుల ♦ వఱలుచు డాలుం
బోడిమిగలయమ్మున న,వ్వాఁడిమగనిసూతు శిరము ♦ వసుధం గూల్చెన్.

అర్థములు. ఎనయై=పోలికయై, వాఁడి=పదును, మేలిగఱుల=శ్రేష్ఠములైన ఱెక్కలచే, డాలుంబోఁడిమి=కాంతిచే నందము, వాఁడిమగని = శూరునియొక్క, సూతుశిరము=సారథితల.

### తాత్పర్యము

వేఁడిమియందుఁ బిడుగుతో సమానమై పదును గలదై మంచి ఱెక్కలచేఁ బ్రకాశించుచు కాంతిసంపద గల బాణముచే శూరుఁడైన యింద్రజిత్తు నొక్క సారథి శిరస్సు లక్ష్మణుఁడు నేలఁబడ గొట్టెను.

ఉ. సారథిఁ జంపి తత్క్షణమ ♦ చాపముఁ ద్రుంచిన దాశకంఠియున్
దేరిని దాన తోలుచును ♦ దేఁకువఁ గార్ముక మొండు పూని య
వీరుఁడు పోరుట ల్మిగుల♦వింతలు గొల్పెను, సూతకృత్యమున్
దీరుచువేళ లక్ష్మణుఁ డు♦దీర్ణరయంబునఁ ద్రుంచి వింటినిన్. ౨౦౮

అర్థములు. దాశకంఠి = ఇంద్రజిత్తు, తేఁకువన్ = ధైర్యముతో, ఉదీర్ణ రయంబునన్ = మిగుల వేగముచే.

### తాత్పర్యము

సారథిని జంపి వెంటనే విల్లు ఖండింపఁగా నింద్రజిత్తు రథమును దానే నడుపుచు ధైర్యమున వేఱొకవిల్లు తీసికొని వాఁడు యుద్ధముచేయుట మిగుల నాశ్చర్యకరముగ నుండెను. వాఁడు సారథిచేయు కార్యము చేయువేళ వింటిని ఖండించి.

ఉ. చాపము నొకండు పుచ్చుకొను • సంయమున వాజుల నొంచె నొంచఁ దా
నేపు దొలంగకా యసురుఁ • డెంతయు ధీరతఁ దాను వైచు బ
ల్తూపులలోన మార్మలయఁ • దూర్ణము బాణపరంపరాహతిన్
జోపు గొనంగఁ జేయఁ దన • సూతుని చావున కంగలార్చుచున్. ౨౦౭౩

అర్థములు. వాజులన్=గుఱ్ఱములను, ఏపు=పరాక్రమము, తొలంగక = వదలక, ధీరతన్=ధైర్యముతో, తూపులలోనన్=బాణములలో, మార్మలయన్= ఎదురు దిరుగఁగా, తూర్ణము = త్వరగా, చోపు = కలఁత, అంగలార్చుచున్= వ్యసనపడుచు.

తాత్పర్యము

వేఱొక విల్లుపుచ్చుకొను నడిమి కాలములో గుఱ్ఱముల నొప్పించెను. ఇట్లు నొప్పించినను పరాక్రమము విడువక యారాక్షసుఁడు ధైర్యముతో లక్ష్మణుఁడు వేయు బాణములలోనే యెదురు తిరుగు చుండుట చూచి వేగముగ బాణపరంపరల దెబ్బలచేఁ గలఁత పడునట్లు కొట్టఁగా తన సారథి చచ్చెనని వాఁడు దుఃఖపడుచు.

ఉ. తేజ దొలంగియున్న నర • దేవవిరోధిముఖంబుఁ గాంచుచున్
భూజచరావళుల్ పొగడ • భూధవపుత్రకు సాధువాక్యులన్
వాజులపేర్మి నాతఁ డని • వారణశక్తిఁ జరించుచుంటచే
రోజనచేసి శౌర్యమద • యుక్తులు నల్వురు వానరేశ్వరుల్. ౨౦౭౪

అర్థములు. తేజ = ముఖకాంతి, భూజచరావళుల్ = వానరుల సమూహములు, వాజులపేర్మిన్ = గుఱ్ఱముల వేగాతిశయముచే, అనివారణ శక్తిన్ = నివారింపరాని శక్తిచే.

తాత్పర్యము

కాంతి మాసియున్న యింద్రజిత్తు ముఖముఁ జూచి వానరులు మేలుమేలని లక్ష్మణుఁ బొగడిరి. తోలెడివాఁడు లేకపోయినను గుఱ్ఱములు తమంతఁ దామే గుఱికిఁ జిక్కక తిరుగుచుండుటచూచి శౌర్యముగల నలుగురు వానరు లాలోచించి.

చ శరభుఁడు గంధమాదనుఁడు • సారబలుల్ రభసప్రమాథులు
ద్ధురగతిఁ జివ్వన న్నెగసి • దూఁకి హయంబుల నాలుగింటినిన్
ధరణిని గూల్చి రావణి ర • థంబును దున్కలు చేసి వెండి ని
ల్చిరి త్రుటిలోన లక్ష్మణుని • చెంతఁ గపీంద్రులు తమ్ము మెచ్చఁగన్. ౨౦౭౫

తాత్పర్యము

శరభుఁడు గంధమాదనుఁడు రభసప్రమాథు లను వారు మిగుల వేగముగఁ జివ్వున నెగసి దూఁకి నాలుగు గుఱ్ఱముల జంపి తేరువిఱిచి కుప్పపెట్టి నిమిషములో మరలివచ్చి లక్ష్మణు ప్రక్క కపులు తమ్ము మెచ్చుచుండఁగా నెప్పటివలె నిలిచిరి.

కం. హతతురగుఁడు హతసారథి, హతనిర్జరరాజుఁ డపుడు ♦ క్షితి నిలఁబడి క్ష్మా
పతిసుతు నెదిరిన నాతఁడు, శితశరముల నతనియుదుటు♦ చెఱిచెం ద్రుటిలోన్.

అర్థములు. హతనిర్జరరాజుఁడు = కొట్టఁబడిన యింద్రుఁడు గలవాఁడు. బహువ్రీహి సమాసమున రాజు రాజుఁడని యగును. హతతురగుఁడు=గుఱ్ఱములు చంపఁబడినవాఁడు, హతసారథి=సూతుఁడు చంపఁబడినవాఁడు, ఉదుటు=గర్వము.

తాత్పర్యము

గుఱ్ఱములు సారథి చావఁగా నింద్రజిత్తు నేల నిలువఁబడి లక్ష్మణు నెదిరింపఁగా బాణపరంపరలచే నతని బలగర్వమును నిమిషములో నాయన చెఱిచెను.

## ౯౧-వ సర్గము. ఇంద్రజిత్తు కపుల వంచించి లంకకుఁ బోయి రథికుఁడై వచ్చుట

ఉ. మానక కాండము ల్గురియ ♦ మానవనాథసుతున్ సురారి నా
నానిశితాస్త్రసంతతు ల ♦ నంతముగాఁ గురియింప నిర్భరున్
మానము మచ్చరంబు విసు ♦ మానముగాఁ బెరుఁగంగఁ బోరుచో
వానరరాక్షసావళులు ♦ వారల ప్రాపున వైరిసంఘముల్. ౨౦౭

అర్థములు. విసుమానము=ఆశ్చర్యము. విస్మయశబ్దభవము.

తాత్పర్యము

అంతలో వదలక బాణములు గురియఁగా లక్ష్మణుని నుద్దేశించి పెక్కులు పదునైన బాణసమూహములు అంతము లేకుండఁ గురియింపఁగా నిర్భరము అభిమానము మాత్సర్యము ఆశ్చర్యకరముగా వృద్ధిచెందఁగా యుద్ధము చేయుచుండ వారి సాహాయ్యమున వానరులు రాక్షసులు తమ విరోధుల గుంపులు.

కం. కుతిలపడఁ బెనఁగుచుం దమ, పతులన్ రక్షించుకొనుచుఁ ♦ బలువిధముల ను
ద్ధతిఁ జూపఁగ నపు డాహరి,జితుఁ డసురుల మెచ్చి పొగడి♦చేరి యిటులనున్.

అర్థములు. కుతిలపడన్ = బాధపడునట్లు, పెనఁగుచున్ = యుద్ధము చేయుచు, ఉద్ధతి=గర్వము, హరిజితుఁడు=ఇంద్రజితుఁడు.

తాత్పర్యము స్పష్టము.

సీ. సకలకకుప్పుల ♦ సంతమసం బటి,గాఢమై పర్వె రా ♦ కాసులార!
మనవారిఁ బెఱవారి♦గనిపింపఁగారాదు, సలుపంగఁ దగు నొండు♦సాహసంబు
తెలివినింతయు నీక♦తికమక నొనఁగపుల్, మునరిపోరుఁడు వారు♦మోహపడఁగ
క్షణములో నరుదెంతు ♦ స్యందనస్థితుఁడనై, యుంకిలి లేక నే ♦ లంక కరిగి
తే. వార లెఱిఁగిన నడ్డము♦వచ్చు వారు, వారలను మోసగింపఁగ♦వలయునీరు
శక్తిసామర్థ్యముల కిది♦సమయ మన్న,వారు వల్లె యటంచును♦బోరుచుండ.

అర్థములు. సకలకకుబ్బులన్ = అన్నిదిశల, సంతమసము = గాఢాంధకారము, అతిగాఢమై = మిగుల దట్టమై, తెఱపి = సందు, విరాముడు — స్యందనస్థితుఁడనై = రథమందున్నవాఁడనై, అంకిలి లేక = అడ్డము లేక.

తాత్పర్యము

రాక్షసులారా! యన్ని దిక్కులయందుఁ జీఁకట్లు మిగుల దట్టముగ వ్యాపించియున్నవి. మనవారెవరో పరులెవ్వరో తెలిసికొనఁగూడ లేరు. ఇప్పుడొక సాహస కార్యము చేయవలసియున్నది. మీరు కొంచెమైన నెడమీయక వానరులు తికమిక లాడునట్లు గుంపులై క్రమ్ముకొని యుద్ధము చేయుఁడు. వారు నేనిందున్నానని తలపోయవలయును. అట్లు మీరు చేసితిరేని నడ్డము వచ్చువారు లేక నేను లంకకుఁ బోయి వేఱొక రథమును దీసికొని క్షణములో వచ్చెదను. ఈ వార్త వానరు లెఱిఁగిరా నాకడ్డము వత్తురు. ఊరిలోనికిఁ బోనీయరు. వారిని మీరు మోసగింపవలెను. మీరు మీ శక్తిసామర్థ్యములు చూప నిదియే సమయము అని చెప్పఁగా వా రామాట నంగీకరించి యుద్ధము చేయుచుండఁగా.

కం. పురికిం జని కనకాలంకరణోపేతంబు రథము ♦ ఘన ముసల గదా
కరవాలపూర్ణ ముత్తమ,తురగము హితసారథికముఁ ♦ దోర సమకూర్చెన్.

అర్థములు. కనకాలంకరణోపేతంబు = బంగారు సొమ్ములతోఁ గూడినది, ఘన = గొప్పదగు, ముసల = రోకండ్లచేతను, గదా = గదలచేతను, కరవాల = కత్తులచేతను, పూర్ణము=నిండినది, ఉత్తమతురగము=శ్రేష్ఠతములైన గుఱ్ఱములు గలది, హితసారథికము=హితుఁడైన సూతుఁడు గలది, తోరన్=శీఘ్రముగ.

తాత్పర్యము

ఊరిలోనికిఁబోయి బంగారు సొమ్ములచే నలంకరింపఁబడి రోఁకండ్లు గదలు కత్తులు వీనితో నిండి మేలి గుఱ్ఱములు కట్టఁబడి హితుఁడైన సారథిగల రథమును త్వరగా సమకూర్చెను.

ఉ. పూని రథస్థుఁడై భటుల ♦ పుంజము వెంబడి రాఁగ వాఁడు లం
కానగరంబు వెల్వడియెఁ ♦ గాలుఁడు దన్ బెరరేప వచ్చి రా
మానుజు నివ్విభీషణుని ♦ నద్రిచరావళి శాతబాణ ధా
రానికరంబులం బొదివె ♦ రాక్షసు లందఱు మేలు మే లనన్. ౨౦౯౧

అర్థములు. పెరరేపన్ = ప్రేరేపింపఁగా, శాతబాణధారానికరంబులన్ = వాఁడియైన బాణవర్ష ధారల సమూహములచే.

తాత్పర్యము

రథము నందున్నవాఁడై యుద్ధభటుల సమూహము తన వెంబడి రాఁగా లంక విడిచివచ్చి యముఁడు తన్నుఁ బ్రేరేపింపఁగా లక్ష్మణుని విభీషణుని, వానరుల గుంపును వాఁడి బాణముల వర్షముచే రాక్షసు లందఱు మేలుమేలనుచుండఁ గప్పెను.

కం. అతనిజవలాఘవముల, కాతతవిస్మయము గాంచి • రగచరులు సుమి
త్రాతనయవిభీషణులును, జేతంబున నితఁడె యోధ • శేఖరుఁ డనుచున్.

అర్థములు. జవము = వేగము, లాఘవము = లఘుత్వము, చురుకుగాఁ బని చేయు తనము, అతత విస్మయము=మిక్కిలి యాశ్చర్యము, చేతంబునన్=మనస్సునందు, యోధశేఖరుఁడు=యోధులందు శ్రేష్ఠుఁడు.

## తాత్పర్యము

వానివేగమునకుఁ జురుకుఁదనమునకు లక్ష్మణవిభీషణులు వానరులు మిక్కిలి యాశ్చర్యపడి యోధ యనిన వీఁడే యోధ యని మిగుల నాశ్చర్యపడిరి.

## —• లక్ష్మణుఁ డింద్రజిత్తు నొప్పించుట •—

ఉ. రక్కొను క్రోధమూర్ఛఁ గపి•రాజుల రావణి నూర్లు వేలుగన్
జక్కఁగ సొల్పడన్ నిశిత•సాయకము ల్నిగిడింపఁ దక్క వా
రుక్కఱి రాఘవానుజుని • యోలముఁ జేర సురారిచాపమున్
ముక్కలు ముక్కలై విఱుగ • ముల్కి నిగిడ్చె సుమిత్రపట్టియున్. ౨౦౯౩

అర్థములు. రక్కొను = వర్ధిల్లు, రూ — రెక్కొను సొల్పడన్ = సొలుపడన్=వరుసగాఁ బడఁగా, ఉక్కఱి=బలము చెడి, ఓలము=మాటు.

## తాత్పర్యము

వృద్ధియగుచున్న క్రోధముచే దేహము తెలియక రావణి వానరసమూహములను నూర్లువేలుగ బాణములు వేసి వారు చాలుగా నేలఁ బడఁ జేయఁగాఁ దక్కిన వానరులు లక్ష్మణుని మఱుఁగునకుఁబోయిరి. అప్పుడు లక్ష్మణుఁడు ఇంద్రజిత్తు విల్లు తునుకలు తునుకలై పడ నొక బాణము వేసెను.

చ. సరభసవృత్తి నయ్యసుర • చాప మొకొండు గుణంబుఁ గూర్చి చేఁ
దిరపడి మూఁడు బాణముల • దానిని ద్రుంచి సపక్షపన్నగో
త్కరములఁ బోలు నైదువిశి•ఖంబుల వక్షముఁ దూఱ నేయఁగా
నురవడి నవ్వి మే న్వెడలి • యుర్విని రక్తభుజంగమ క్రియన్. ౨౦౯౪

అర్థములు. సరభసవృత్తిన్ = త్వరతోఁగూడిన వ్యాపారముతో, సపక్షపన్నగోత్కరములన్=ఱెక్కలతోఁగూడిన పాముల సమూహములను, రక్తభుజంగమ క్రియన్=ఎఱ్ఱని పాములవలె.

## తాత్పర్యము

ఆ రాక్షసుఁడు త్వరపడి మఱియొక విల్లెత్తి యెక్కుపెట్టునప్పుడు వేగముగ మూఁడు బాణముల దానిని ఖండించి ఱెక్కలు గల పాములవంటి యైదుబాణములు వానిఱొమ్మునదూసిపోవునట్లు వేయఁగా నవి త్వరగా దూసిపోయి యెఱ్ఱపాములవలె.

ఉ. వ్రాలఁగ భిన్నవర్ముఁ డయి • రక్తముఁ గ్రక్కుచు గాఢసారమా
వాలు శరాసనంబుఁ గొని • పార్థివనందను నప్పురందరుం

బోలి శరోగ్రవృష్టులను ♦ ముంచిన సంభ్రమ మింత లేక యు
ర్యాలరిఁ బొఱిఁ జూచె నృపుఁ ♦ డద్భుతమున్ ఘటియించెఁ జూపఱన్.

అర్థములు. భిన్నవర్ముఁడయి=భేదింపఁబడిన కవచముగలవాఁడయి, వాలు=దీర్ఘమైన, పురందరుంబోని=ఇంద్రునివలె, శరోగ్రవృష్టులను=ఉగ్రశరవృష్టులను=భయంకరమైన బాణవర్షములచే, సంభ్రమము=తొట్రుపాటు, అలరిన్=దుష్టుని.

తాత్పర్యము

నేలఁ బడగా కవచము తునుగఁగా నెత్తురు గ్రక్కుచు మిక్కిలి బలముగల నిడుపాటి విల్లెత్తుకొని యింద్రునివలె లక్ష్మణుని బాణవర్షముచే ముంపగా లక్ష్మణుఁడు తొట్రుపాటులేక యా దుష్టుని బొఱిఁజూచెను. అది చూచువారికి నాశ్చర్యము కలిగించెను.

ఉ. అంతట లక్ష్మణుండు విల ♦ యాంతకు కైవడి రేఁగి విద్విష
త్సంతతి నొక్క నొక్కనిని ♦ దప్పక యేసియు మూఁడు మూఁడు జీ
వాంతక భల్లకంబు లసు ♦ రారి ధవాత్మజు ముంచె భీమ వి
క్రాంతి యొసంగఁగా బహుళ ♦ కాండములం గనువారు బెగ్గిలన్. ౨౦౯౮

అర్థములు. విద్విషత్సంతతిన్ = శత్రుసమూహమునందు, జీవాంతక = ప్రాణములు దీయు, భల్లకంబులన్=బాణములచే, బెగ్గిలన్=భయపడఁగ.

తాత్పర్యము

అంతట లక్ష్మణుండు ప్రలయకాల యమునివలె విజృంభించి శత్రువుల సమూహమందు నొక్కొక్కనిని దప్పక తగులునట్లు ప్రాణములు తీయఁజాలు బాణంబుల నేసియు నింద్రజిత్తును భయంకరపరాక్రమ మతిశయింపఁగా జూచువారు భయపడునట్లు అనేకబాణములచే ముంచెను.

ఉ. వాఁడును నీడఁబోక శర ♦ వాఁడి లకోరులఁ దీవ్రవేగుఁడై
వేఁడిమి చూప వాని నడు ♦ వీదిని దుక్కలు చేసి యొండు క్రొ
వ్వాడిశరంబునం దునిమెఁ ♦ బాతకి సూతుశిరంబు శిక్షచే
నాఁడెము లైన మావులు పె ♦ నంగక సారథి లేక యుండియున్. ౨౦౯౯

అర్థములు. ఈడఁబోక = వెనుదీయక, శరవాఁడిలకోరులన్ = మిక్కిలి పదునైన బాణములచే.

తాత్పర్యము

వాఁడును వెనుదీయక మిగుల పదునైన బాణములచే మిక్కిలి వేగము గలవాఁడై వేఁడిమి చూపఁగా వానిని లక్ష్మణుఁడు నడుమనే ఖండించి మఱియొక క్రొత్త పదును గల బాణము తీసికొని పాపాత్ముఁడైన వాని సారథి శిరస్సును ఖండించెను. ఆ గుఱ్ఱములు చక్కఁగా నేర్పఁబడినవి గావున సారథి లేక యున్నను పెనఁగు లాడక.

కం. మండలవిభ్రమణంబులఁ, గండడఁగక తిరుగ వింత • గలిగించె; మహా
కాండంబుల సౌమిత్రియు, గుండె లదరఁగొట్టె వానిఁ • గ్రూరుం డగుచున్.

అర్థములు. మండల విభ్రమణములన్=గుండ్రముగా తిరుగుటచే,గండడఁగక=బలము చెడక.

తాత్పర్యము

బలము చెడక యవి గుండ్రముగా దిరుగుచుండఁగా చూచినవా రాశ్చర్య పడిరి. లక్ష్మణుఁడును దయ వదలినవాఁడై గొప్ప బాణములచే వాని గుండె లదరఁ గొట్టెను.

ఉ. ఆతనియేపు సైఁపక మ • హాంబకముల్ కులిశాభము ల్జవ
స్ఫీతము లా సుమిత్రసుతుఁ జిమ్మిన నయ్యవి జోడు దాఁకి యు
ర్వీతలమందు వ్రాలఁగ న • భేద్యతనుత్ర మటంచు నెంచి శా
శాతశరత్రికంబుఁ దొడి • సత్వరుఁడై నొస లంట నేసెనన్. ౨౦౯

అర్థములు. కులిశాభముల్ = వజ్రాయుధముతో సమానమైనవి, జవస్ఫీతములు = వేగమునకుఁ బేరైనవి, జోడు = కవచమును, అభేద్యతనుత్రము = భేదింపరాని కవచము, ఇది యభేద్యకవచ మనుటచే ముందు కవచము చెడిన పిమ్మట నీ కవచము దొడిగికొనె నని యూహింపవలయును, శాతశరత్రికంబు=పదునైన మూఁడు బాణములు, తొడి=సంధించి.

తాత్పర్యము

లక్ష్మణుని పరాక్రమము సహింపలేక వజ్రమువంటి గొప్ప బాణములు మిగుల వేగము గలవి లక్ష్మణుని వేయఁగా నవి యాయన కవచము దాఁకి నేలఁ బడెను. అభేద్యకవచ మని తలఁచి మూఁడు వాఁడిబాణములను నొసలు దాఁక నేసెను.

కం. కరలాఘవమును నెఱపుచుఁ బరఁగించిన తచ్ఛరాళి • ఫాలమునందున్
గరమరుదుగ మెఱయఁగ నెఱ,సరి లక్ష్మణుఁడుం త్రిశృంగ • శైలం బనఁగన్.

అర్థములు. నెఱసరి=శూరుఁడు, త్రిశృంగశైలము = మూఁడు శిఖరములుగల పర్వతము, తచ్ఛరాళి=ఆ బాణములు.

తాత్పర్యము స్పష్టము

చ. వెలయుచు రోషసంక్షుభిత • వీక్షణుఁడై వడి నైదునారసం
బులఁ దొడి వైరిఫాలమున • భూరిబలుండు నిగిడ్చె నట్టులా
యరఘుపరాక్రముల్ మమల • నాఱని యీసున నొం డొకబ్బు మే
నులు దలుపింప జల్లెడల • నూల్గొని పోరిరి గెల్పుఁగోరుచున్. ౨౧౧

అర్థములు. రోషసంక్షుభిత వీక్షణుఁడై = కోపముచే కలఁత చెందిన చూపులు గలవాఁడై, వడిన్=వేగముగ, ఆఱని యీసునన్=వదలని యీర్ష్యచే,

తాత్పర్యము

పిమ్మటఁ గోపముచేఁ గలఁతచెందిన చూపుగలవాఁడై వేగముగ నైదు బాణముల సంధించి విరోధి నొసటఁ దగుల లక్ష్మణుఁడు వేసెను. ఇట్టు లా విస్తార పరాక్రమము గల వారిరువురు మనస్సులందు శమింపని యీర్ష్యచే నొకరి దేహముల నొకరు జల్లెడలను స్మరింపఁజేయునట్లు గొట్టుచు యుద్ధము చేసిరి.

మ. అతులామర్షణుఁ డా దశాస్యతనయుం ♦ డాకర్ణపూర్ణేషు ల
ద్భుత వేగంబున నవ్విభీషణునొసల్ ♦ దూఱంగ మూఁ డేసి తా
నితరోర్వీధరచారులం దవుల నే ♦ కైకాశుగం బేసినన్
తతరోషుండు విభీషణుండు గదచేఁ ♦ దద్వాజులం గూల్చినన్. ౨౧౦౨

అర్థములు. అతులామర్షణుఁడు = అసమాన కోపముగలవాఁడు, ఆకర్ణపూర్ణేషులు=చెవిదాఁక నించిన బాణములను, ఇతర ఉర్వీధర చారులన్ = ఇతర వానరులను, ఏకైకాశుగంబు=ఒక్కొక్క బాణము, తతరోషుఁడు = విస్తారకోపము గలవాఁడు, తత్ వాజులన్=ఆ గుఱ్ఱములను.

తాత్పర్యము

అసమానకోపముగల యింద్రజిత్తు బాణము లాకర్ణాంతములాగి యాశ్చర్యకరమైన వేగమున విభీషణు నొసలుదాఁక మూఁడేసి యితర వానరులఁ దవుల నొక్కొక బాణమేయఁగా నేనూరకున్నను వీఁడు నన్నుఁ గొట్టుచున్నాఁడుగదా యని మిగులఁ గోపించి విభీషణుఁడు వాని గుఱ్ఱములను గదచేఁ గొట్టి చంపెను.

—♦ ఇంద్రజిల్లక్ష్మణులు దివ్యాస్త్రంబులఁ బోరుట ♦—

చ. తురగము లీల్గినన్ ధరణి ♦ దూఁకి బలారివిరోధి శక్తిచేఁ
ద్వరితగతిన్ విభీషణుని ♦ వారక వైవ సుమిత్రపట్టి శీ
ఘ్ర శరముల బదిం దొడిగి ♦ క్ష్మాస్థలిఁ ద్రెళ్ళఁగ దాని నేసినన్
హరిహయసాధనాభ భయ ♦ దాశుగముల్ దన యన్న పుత్రుపై. ౨౧౦౩

అర్థములు. బలారివిరోధి = ఇంద్రజిత్తు, హరిహయసాధనాభ = ఇంద్రుని యాయుధ మగు వజ్రముతో సమానమయిన బాణములు.

తాత్పర్యము

గుఱ్ఱములు చావఁగా నేలమీఁద దూఁకి యింద్రజిత్తు విభీషణుని శక్తిచేఁ గొట్టెను. అది వచ్చుట చూచి లక్ష్మణుఁడు పదిబాణములచేఁ దానిని నేలఁ బడఁ గొట్టెను. విభీషణుఁడు వజ్రములవంటి బాణములను తన యన్నకొడుకు మీఁద.

ఉ. వేసె వెసన్ విభీషణుఁడు ♦ వ్రీలఁగ నొమ్మవి దూసి పాఱినన్
రోసముతోఁ బితృవ్యుపయిఁ ♦ గ్రూరచరిత్రుఁడు కాలదత్తమై
భాసిలు భీషణాస్త్రమును ♦ వైచిన స్వప్న కుబేరదత్త ది
వ్యాసమ దుర్నివహ్యపర ♦ మాస్త్రము లక్ష్మణుఁ డాని వైచినన్. ౨౧౦౪

అర్థములు. పితృవ్యపయిన్ = పినతండ్రిపై, కాలదత్తమై = యమునిచే నీయఁబడిన, స్వప్న=నిద్రయందు, కుబేరదత్త = కుబేరునిచే నీయఁబడిన, దివ్య = దేవసంబంధమైన, అసమ = అసమానమైన, దుర్విషహ్య=సహింపరాని, పరమాస్త్రము = గొప్ప యస్త్రము.

తాత్పర్యము

ప్రేసెను అవి యింద్రజిత్తు తొమ్ములోనుండి దూటిపోగా రోషించి పినతండ్రిపై యముఁడు తన కిచ్చిన భయంకరాస్త్రమును వేయఁగా లక్ష్మణుఁడు తనకుఁ గుబేరుఁడు స్వప్నమందిచ్చిన సహింపరాని యసమానమైన మహాస్త్రమును పూనివేసెను.

కం. బలవంతులు బలవద్ధనువుల బలవంతముగఁ దిగిచి • పుచ్చిన జ్యావ
ల్లులు క్రౌంచంబుల పోలిక, వెలయించెను ధ్వనులు సురలు • వెఱఁగొందంగన్.

అర్థములు. బలవత్ ధనువులన్ = బలముగల విండ్లను, బలవంతముగ = శక్తికొలఁది, తిగిచి = లాగి, పుచ్చినన్ = వేయఁగా, జ్యావల్లులు = తీఁగవంటి యల్లెత్రాడులు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఆ యస్త్రములు రెండు • ననలంబుఁ గక్కుచుఁ, బిడుగులమాడ్కి ని • వడిగఁ బాఱి
చదల నొండొంటిని • సరగ ఢీకొలుప, ఢీకొట్టుకొనుచు న • న్తోకధూమ
విస్ఫులింగంబులు విన్నెల్ల నలుమంగ, ఘోరగ్రహము లట్లు • పోరి పోరి
శతధాచ్ఛిదంబులై • న్యాస్థలి వ్రాలిన, సౌమిత్రియును శక్ర • శాత్రవుండు
ఆ. సిగ్గుకోపములను • జడిముడి పడి రంత, వారుణాస్త్రమును న్ప • పాలసుతుఁడు
వైవ రౌద్రశరము • వైచి రావణుపట్టి, దాని భిన్నపు నమ్మ • తముగ వణఁచె.

అర్థములు. అనలంబున్ = నిప్పును, చదలన్ = ఆకాశమందు, విస్ఫులింగంబులు=మిణుఁగురులు, మిన్ను = ఆకాశము, అలుమంగన్=ఆక్రమింపఁగా, శతధాచ్ఛిదంబులై = నూఱుగాఁ జీలినవై, చిడిముడిపడిరి = తొట్రుపడిరి, సిగ్గు రోషములను=తన యస్త్రము భగ్నమాయెనని యింద్రజిత్తు సిగ్గుపడెను. ఆయస్త్రమును సంహరించుటయేగాక తాను దలఁచినట్లు రావణిని దన యస్త్రము చంపఁజాలదయ్యెఁగదా యని లక్ష్మణుఁడు సిగ్గుపడెను......రామునితో సముఁడని తానెంచియున్న విభీషణుఁ గొట్టెఁగదాయని లక్ష్మణునకుఁ గోపము. తాను వేసినదానిని లక్ష్మణుఁడు కొట్టివేసెనని యింద్రజిత్తునకుఁ గోపము.

తాత్పర్యము

ఆ రెండస్త్రములు నిప్పులుగ్రక్కుచు బిడుగులవలెఁ ద్వరగాఁబోయి యాకాశమందు నొకదాని నొకటి ఢీకొలుప ఢీకొట్టి యధికమైన పొగచేతను మిణుఁగురుల చేతను నాకాశమంతయు నాక్రమించి పెద్దగ్రహములవలెఁ గలహించికలహించి నూఱు

తునకలై నేలఁబడఁగా ఇంద్రజిల్లక్ష్మణులు సిగ్గుచేతను రోషముచేతను దొట్రుపడిరి. అంత లక్ష్మణుఁడు ఇంద్రజిత్తుపై వారుణాస్త్రము ప్రయోగించెను. ఇంద్రజిత్తు రౌద్రాస్త్రము వేసి దానిబలము చెఱిచి ఖండించెను.

చ. ఉడుగక యంతలోనఁ గడు•నుగ్రత లోకములెల్లఁ గాల్చున
వ్వడువునఁ బావకాస్త్రమును • వాసవవైరి గుణంబుఁ గూర్చి నె
వ్వడి రఘురాము తమ్మునపయి • వైచిన నాతఁడు సౌరబాణముం
దొడిగి యణంచె దాని మదిఁ • దొట్రిల శత్రువరుండు నొండియున్. ౨౧౦౭

అర్థములు. వడువునన్ = విధముగ, పావకాస్త్రమును = ఆగ్నేయాస్త్రమును, నెవ్వడిన్=నెఱ+వడి = నిండు వేగముతో, సౌరబాణము = సూర్యసంబంధబాణము, సూర్యతిష్యాగస్త్యాదులందు యలోపము:—"సూరసూర్యాలర మా"యని యమరము.

తాత్పర్యము

వదలిపెట్టక యంతలోనే లోకమువంతయుఁ గాల్చువానివలె నాగ్నేయాస్త్రమును లక్ష్మణుపై మిగుల వేగముగాఁ బ్రయోగించెను. ఆయన సౌరాస్త్రము వేసి శత్రువు తొట్రుపడుచుండ దాని నణఁచెను.

కం. అసురబాణము వైచిన, భాసురముద్గరముసుంఠి•పరిఘగదాసుల్
రాసులుగ వెడలి రాఁగని, వ్రేసెన్ లక్ష్మణుఁడు రౌద్ర•విశిఖము సరగన్.

అర్థములు. ముద్గర=ఇనుపరోఁకలి, ముసుంఠి = కొయ్యరోఁకలి, ముద్గరముసుంఠి=ద్వంద్వసమాసము– "ద్వంద్వశ్చప్రాణి తూర్య సేనాంగానామ్" 'జాతిరప్రాణినామ్' అను సూత్రములచే నేకవచనము, పరిఘగదాసుల్=ఇనుపకట్ల గుదియలు, గదలు కత్తులు, ఆంధ్రమున నేకవద్భావము విభాష గావున నిచట బహువచన రూపము. ముసుంఠీ శబ్దము ఈకారాంతము గావున రెండుగా విభజింపఁబడును. ముసుంఠికి ముసుండి యనియు రూపాంతరముగలదు. సరగన్=శీఘ్రముగ.

తాత్పర్యము

ఇంద్రజిత్తు ఆసురాస్త్రము వేయఁగా దానినుండి యినుప రోఁకండ్లు కొయ్య రోఁకండ్లు ఇనుప గుదియలు గదలు కత్తులు గుంపులుగ వెడలి రాఁగా లక్ష్మణుఁడు రౌద్రాస్త్రము దానిపై వేసెను.

మ. అనివార్యంబు సమస్త శత్రుహననో•దారంబు రౌద్రాస్త్రమా
దనుజాస్త్రంబును నాఁగినన్ గగనభూ•తవ్రాతముల్ క్షుబ్ధమై
మనుజేంద్రాత్మజుఁ జుట్టియుండె, నసుర•క్ష్మానాథ యుద్ధంబు స్వ
ర్జనకార్చర్య నిదానమై భయదమై • సంభ్రాంతిదంబై కడున్. ౨౧౦౮

అర్థములు. అనివార్యంబు = వారింపరానిది, సమస్త శత్రు హననోదారంబు = సమస్త శత్రువులను జంపుటయందు గొప్పది, ఆఁగినన్=అడ్డగింపఁగా,

క్షుబ్ధమైన=క్షోభ చెందినదై, స్వర్గవతా=దేవతల సమూహమునకు,ఆశ్చర్య నిదానమై=ఆశ్చర్యకారణమై, భయదమై = భయము గలిగించునదియై, సంభ్రాంతిదంబై =తొట్రుపాటు గలిగించునదియై.

తాత్పర్యము

వారింపరానిదై యెట్టి శత్రువునైనఁ జంపఁగలదైన రౌద్రాస్త్రము ఆ యాసురాస్త్రమును నడ్డగింపఁగా నాకాశమందలి ప్రాణిసంఘములు క్షోభ చెంది లక్ష్మణుని జుట్టుకొని యుండెను. రాక్షస రాజకుమార యుద్ధము దేవతలకు నాశ్చర్యకరమై భయంకరమై తొట్రుపాటు గలిగించునదియై.

ఆ. వర్తిలంగ ఋషి సు♦పర్వగంధర్వాహి, గరుడతతులు గూడి ♦ హరిహయుండు
మున్నుగాఁగఁ గలవ ♦ సన్నుతిశీలు లక్ష్మణుని హెచ్చరికను ♦ గాచుచుండ.

తాత్పర్యము

ఉండఁగా ఋషులు, దేవతలు, గంధర్వులు,పన్నగులు,గరుడులు వీరందఱుఁ గూడి యింద్రుని ముందుగా నుంచుకొని సాధువులచే స్తోత్రము చేయఁబడు స్వభావము గల లక్ష్మణుని హెచ్చరికతోఁ గాచుచుండఁగా.

—♦ లక్ష్మణుఁ డింద్రజిత్తును వధించుట ♦—

సీ. అలఁతులఁ బోఁడు స♦ర్వాస్త్రవేది యితండ,టంచు రోషించి రా♦మానుజుండు
మును సురాసుర యుద్ధ♦మున హరి యొద్దానఁ, గీనాశసంఘంబు ♦ గీటణంచె
నట్టి వహ్నిస్పర్శ ♦ మసమసుపర్వంబు, సారపత్రంబు సు♦సంస్థితంబు
హాటకవికృతంబు ♦ నరినాశనకరంబు, దుర్నివారంబును ♦ దుస్సహంబు
ఆ. విబుధపూజితంబు ♦ విషధరప్రఖ్యంబు, నింద్రదేవతాక ♦ మైంద్రశరముఁ
గార్ముకోత్తమమునఁ ♦ గాండోత్తమంబును, బూరుషోత్తముండు♦పూని తిగిచి,

అర్థములు. అలఁతులన్ = అల్పముతో, సర్వాస్త్రవేది = అన్ని యస్త్రములు తెలిసినవాఁడు, హరి = ఇంద్రుఁడు, కీనాశసంఘంబున్ = రాక్షస సమూహమును, గీటణంచెన్ =చంపెను, వహ్నిస్పర్శము=అగ్నివలెఁ దాఁకునది, తాఁకినఁ గాల్చునది, అసమ=అసమానమైన, సుపర్వంబు = మంచి కణుపులు గలది, సారపత్రంబు = బలముగల తెక్కలు గలది, సుసంస్థితంబు = చక్కని సంస్థానము గలది, హాటకవికృతంబు = బంగారుచేఁ జిత్రింపఁబడినది, అరినాశనకరంబు=శత్రువుల నాశనము చేయునది, దుర్నివారంబును = నివారింపరానిది, దుస్సహంబు = సహింపరానిది, విబుధపూజితంబు = దేవతలచేఁ బూజింపఁ బడినది, విషధర ప్రఖ్యంబు = పాముతో సమానమయినది, ఈ ప్రఖ్యశబ్దము త్తరపద మయినపుడు సమానమను నర్థము గలదగును. ఇంద్రదేవతాకము=ఇంద్రుఁడు అధిష్ఠాన దేవత గాఁగలది, కావుననే ఐంద్రశరమను పేరు గలది, తిగిచి = లాగి.

### తాత్పర్యము

తాను వేసిన రౌద్రాస్త్రముకూడ నాసురాస్త్రము నణచుటతోఁ నిలిచి వానిని జంపజాలకుండుటచే వీఁడు కొంచెముతోఁ జచ్చువాఁడు కాఁడు. వలన నన్నియస్త్రములకుఁ బ్రతియస్త్రముల నెఱుంగును. బ్రహ్మాస్త్రమేసినను బ్రహ్మాస్త్రము బ్రయోగించునని యాలోచించి కోపించి లక్ష్మణుఁడు పూర్వము దేవాసురయుద్ధమున నింద్రుఁడు అసురుల దేనితో వధించెనో యాయస్త్రమును, దాఁకిన నిప్పువలెఁ గాల్చుదానిని, మంచి రెక్కలు గణుపులు గలదానిని, బలమయిన రెక్కలు గలదానిని, మంచి సంస్థానము గలదానిని (సన్నివేశము గలదానిని) బంగారుతోఁ జిత్రింపఁబడిన దానిని, శత్రువుల నాశము చేయుదానిని, నివారింపరానిదానిని, సహింపరానిదానిని, దేవతలచేఁ బూజింపఁబడినదానిని, పాముతో సమానమైనదానిని, ఇంద్రసంబంధ మంత్రముచేఁ నభిమంత్రింపఁబడినదానిని ఐంద్రాస్త్రమును ఉత్తమమైనవింట నుత్తమమైన బాణమున నుత్తమ పూరుషుఁడు సంధించి లాగి.

తే. సారధర్మాత్ముఁడును సత్య•సంధుఁ డేని, రామచంద్రుండు దశరథ•రాజసుతుఁడు
పౌరుషమునను నప్రతి•ద్వంద్వుఁ డేని, శరమ! యీ రావణాత్మజు•సంహరింపు.

### తాత్పర్యము

దశరథరాజకుమారుఁ డైన రామచంద్రమూర్తి మిగుల ధర్మాత్ముఁడును సత్యము దప్పనివాఁడును పౌరుషమున నసమానుఁడును నగునేని ఓ యస్త్రమా యీ యింద్రజిత్తును సంహరింపుము. దీనికి మూలమైన సంస్కృతశ్లోకమును శ్రీమద్రామాయణమునకు మూలమంత్రముగఁ బెద్దలనుగ్రహించి యున్నారు. దీనికి ఋషి, ఛందస్సు, అంగన్యాస కరన్యాసాదులు కలవు. అవి సదాచార్యముఖమున గ్రహింపనగు. ఆ వివరము పత్రపాఠమున ననర్థక మగునని వ్రాయలేదు. ఇది యథావిధి జపించు నిష్ఠాపరులకు నెట్టి శత్రువులవలనను, ఎట్టి క్షుద్ర ప్రయోగముల వలనను భయములేదు. తానే యెట్టి శత్రువునైన జయింపగలవాఁ డగును. ఇంద్రజిత్తు బ్రహ్మశిరోనామకాస్త్రముకూడ నెఱిఁగినవాఁడగుటచే నే యస్త్రము వేసినను బదులస్త్రము వేయును. దానివలన ఫలము లేదని తలఁచి యస్త్రమునకు బలిష్ఠమై యనివార్యమైన శక్తి గలిగింప దీనిని వచించెను. అటుగాకున్న నైంద్రాస్త్రము బ్రహ్మాస్త్రముచే హతము కావలసినదే. అట్లు లయ్యెనా రాముఁ డధర్మాత్ముఁడు, అసత్యసంధుఁడు నగును. అది సత్యమునకు విరోధము. ఆ కారణముచే నాయస్త్రమునకు సహజశక్తి గాక అభేద్యమైన విశేషశక్తి గలిగెను. దానివలన నది యేమైనది యింద్రజిత్తునకుఁ దెలిసినది కాదు. అతికాయునివలె దీనిని వారించుట కేదైనఁ బ్రయత్నమైనఁ జేసియుండును. కాని బ్రహ్మశాపమువలన నదియు తోఁచినది కాదు. నీ యజ్ఞము నాశము చేసినవాఁడు నిన్నుఁ జంపునని బ్రహ్మ చెప్పియుండెను గదా.

చ. అని నిజకార్యసాధక య♦థార్థ సుభాషణము ల్వచించి చ
య్యన దృఢముష్టి దృష్టిలఘు♦తాతిరయంబులు దోఁపగా దశా
స్యసుతుపై నిగుడ్చ నది ♦ సూర్యనిభప్రభ మై మహోగ్రతిం
జని సశిరస్త్రకుండలము ♦ శాత్రవు మూర్ధముఁ ద్రుంచె వ్రేల్మిడిన్. ౨౧౧౩

అర్థములు. నిజకార్యసాధక = తన కార్యమును సాధింపఁగల, యథార్థ సుభాషణముల్ =సత్యమైన మాటలను,ఇట్లు చెప్పుటచే రామచంద్రమూర్తి వాలి వధమందుఁ గాని మఱి యే విషయమందుఁ గాని యధర్మముగా వర్తింప లేదనియు అసత్యము పలుక లేదనియు సిద్ధాంత మగుచున్నది. దృఢ=గట్టియైన,ముష్టి=పిడికిలి, దృష్టి = చూపు, లఘుతా = లాఘవము, అతిరయము = మిగుల వేగము, సూర్యనిభప్రభమై = సూర్యునితో సమానమైన కాంతి గలదై, సశిరస్త్రకుండలము = శిరస్త్రాణముతోను కుండలములతోను గూడినది, శాత్రవుమూర్ధము=విరోధి తల, వ్రేల్మిడిన్=చిటికెవేయు నంతలో, ద్రుంచెన్ =ఖండించెను.

తాత్పర్యము

ఈ ప్రకారము తనకార్యము సాధించునట్టి సత్యమైన వాక్యములు చెప్పి వేగముగ దృఢమైన ముష్టితో బాణము సంధించి యింద్రజిత్తుపై చూపు దృఢముగా నిలిపి లాఘవముతోను వేగముతోను నింద్రజిత్తుపై వేయఁగా నది సూర్యుని కాంతి గలదై, మిగుల బలముగఁ జని శిరస్త్రాణముతోను, కుండలములతోను గూడిన తలను చిటిక వ్రేయునంతలో ఖండించెను.

చ. తెగిన శిరంబు హేమరుచి♦దీపితమై రుధిరోక్షితంబునై
బిగిచెడ కుర్విఁ గానఁబడె ♦ భిన్నశరాసము భిన్నవర్మమున్
నొగిలిన శీర్షకం బయి త♦నూగిరి ద్రెళ్ళ విభీషణుండునున్
నగచరులెల్ల వృత్రవధ ♦ నాఁటి దివౌకసు లట్లు మోదిలన్. ౨౧౧౪

అర్థములు. హేమరుచి దీపితమై = బంగారు కాంతిగలదై, రుధిరోక్షితంబునై =నెత్తుటితోఁ గూడినదై, బిగి = బిగువు, భిన్నశరాసము=విఱిగిన విల్లు, భిన్నవర్మము = చినిఁగిన కవచము, నొగిలిన = వికలమైన, శీర్షకము = తల కలదై, తనూగిరి=దేహమను పర్వతము, దివౌకసులు = దేవతలు, మోదిలన్ = సంతోషింపఁగా.

తాత్పర్యము

తెగినతల బంగారు కాంతి గలదై నెత్తుట దడిసినదయ్యు బిగువు చెడక నేలఁ గానఁబడెను. విఱిగినవిల్లు చినిగిన కవచము వికలమైన తలగలదై పర్వతము వంటి దేహము పడఁగా విభీషణుఁడును వానరులును వృత్రవధనాఁడు దేవతలు సంతోషించినట్లు సంతోషింపఁగా.

—• ఇంద్రజిత్తు మరణంబునకు లోకంబులు సంతోషించుట •—

కం. మింటను వేలుపులున్ వా, ల్గంటులు ఋషివరులు యక్ష•గంధర్వులు లో
 నంటిన సంతసమున రవ, గెంటింపక యుల్లసిలిరి • కేకలతోడన్. ౨౧౧౫

అర్థములు. వాల్గంటులు = స్త్రీలు, రవ = కొంచెమైన, గెంటింపక = చలనము లేక. తాత్పర్యము స్పష్టము.

ఉ. ఏలిక చావుఁ జూచి తము • వృక్షచరుల్ దఱుమంగ రాక్షసుల్
 రాలఁగ జేతికైదువులు • లంకకుఁ బాఱం గాందిశీకులై
 వేలకొలందిదిక్కులకు • భీతిలి పాఱిరి చొచ్చి రంబుధిన్
 శైలము లెక్కి రొల్లియలు • జాఱఁగ వ్రేలఁగ గేశబంధముల్. ౨౧౧౬

అర్థములు. ఏలిక=ఏలువాఁడు, ప్రభువు. కాందిశీకులై = కలఁత చెందిన వారై, దిక్కు తెలియని వారై.

తాత్పర్యము

తమ ప్రభువు చచ్చుట చూచి వానరులు తమ్ముఁ దఱుముకొని రాఁగా రాక్షసులు చేతి యాయుధములు నేలఁ బడఁగా కలఁత చెంది కొందఱు లంకకుఁ బరువెత్తిరి. వేలకొలఁదులు భయపడి దిక్కుల వెంటఁ బరువెత్తిరి. కొందఱు సముద్రములో దూఁకిరి. కొందఱు కట్టు వస్త్రములు జాఱఁగా తలవెండ్రుకలు ముడు లూడఁగాఁ గొండ లెక్కిరి. ఒల్లియలు జాఱుట, వెండ్రుకలు వ్రేలాడుట యందు నందఱు రాక్షసులకు సమానము.

చ. జలజహితుండు గ్రుంకఁ గర•సంతతి యాతని వెంటఁ బోవు న
 ట్లెలువునఁ గూలియున్న హరి•జిత్తును గాంచి సురారికోటిలో
 నిలువఁడ యొక్కఁడే నచట • నిర్వృతపావకుఁడో ప్రశాంత ర
 శ్మిల దినవాథుఁడో యనఁగ • శోరవరుం డతఁ డొప్పె నయ్యెడన్. ౨౧౧౭

అర్థములు. జలజహితుండు = సూర్యుఁడు, కరసంతతి=కిరణముల సమూహము, హరిజిత్తును = ఇంద్రజిత్తును, నిర్వృతపావకుఁడో = చల్లారిన యగ్నియో, ప్రశాంత రశ్మిల = వేఁడిమి తగ్గిన కిరణములు గల సూర్యుఁడో.

తాత్పర్యము

సూర్యుఁడు గ్రుంకఁగా కిరణము లతని వెంటనె పోవునట్లు చచ్చిన యింద్రజిత్తును జూచి రాక్షసుల గుంపులో నొకఁడైన నచట నిలిచిన వాఁడు లేఁడు. నేలఁ బడిన యింద్రజిత్తు చల్లారిన యగ్నియో, కిరణముల వేఁడిమి చెడిన సూర్యుఁడో యన్నట్లుండెను.

కం. దేవతలతోడ సంగ్రా, మావనికిన్ వచ్చి శక్రుఁ • డసురఁ గని హ
 ర్షావేశంబునఁ బొంగెను, ద్యోవీథిని నెసఁగె దేవ•దుందుభి రవముల్. ౨౧౧౮

అర్థములు. సంగ్రామావనికిన్ = యుద్ధభూమికి, నరిగా నాకాశమునకు,

శక్రుఁడు=ఇంద్రుఁడు, ద్యోవీథిని=ఆకాశమున, దేవదుందుభి రవముల్ = దేవతల నగారాధ్వనులు.

తాత్పర్యము స్పష్టము.

సీ. భాసురతేజుఁ డై ♦ భాస్కరుం డలరారె, శాంతదుఃఖము లయ్యె ♦ జగము లెల్ల
నాపదలను బాసి ♦ దీపించె లోకంబు, పాడిరి గంధర్వ ♦ వరులు మింట
నటియించి రప్సరో ♦ నాళీక వదనలు, కురిసెను బువ్వముల్ ♦ సురలగములు
నీరనిధానముల్ ♦ నిర్మలాకృతు లయ్యె, దెస లెల్ల నచ్ఛపుఁ ♦ దెలివిఁ దాల్చె
తే. సర్వలోకభయంకర ♦ శక్రవైరి, గూలిన యుదంతమును విని ♦ గుములు గట్టి
చూచి లక్ష్మణు శ్లాఘించి ♦ శుద్ధమతిని, దీవన లొసంగె దనుజర్షి ♦ దేవవితతి.

అర్థములు. భాసురతేజుఁడై=ప్రకాశించు తేజము గలవాఁడై, భాస్కరుఁడు = సూర్యుఁడు, ఇంతవఱకు నిర్భయముగా సూర్యుఁడు ప్రకాశింప లేదని భావము, శాంతదుఃఖములు = శమించిన దుఃఖములు గలవి, అప్సరో నాళీక వదనలు=అప్సర స్త్రీలు, నీరనిధానములు = సరస్సులు, ఉదంతము=వార్త.

తాత్పర్యము

సూర్యుఁడు నిర్మల కాంతితోఁ బ్రకాశించెను. జగముల దుఃఖము శమించెను. లోకము లాపద భయము లేనివయ్యెను. గంధర్వులు భయమువిడిచి యాకాశమున బాడిరి. అచ్చర లాడిరి. దేవతలు పూవులు గురియించిరి. సరస్సులులోనైనవి నిర్మలము లయ్యెను. దిక్కులు కాంతి గలవయ్యెను. అన్నిలోకములకు భయము కలిగించు నింద్రజిత్తు చచ్చె నన్న వార్త విని గుంపులు గట్టివచ్చి చూచి దనుజర్షులు దేవతలు లక్ష్మణు శ్లాఘించిరి.

కం. కలఁకయుఁ బరితాపము లే, కిల ధరణీనిర్జరాళి ♦ యిఁక నిర్భయమై
మెలఁగెడి నను చు ముదంబునఁ, బలికె సుపర్వోత్కరంబు ♦ బ్రహ్మర్షితతుల్.

అర్థములు. కలఁక = కొతుకు, భయము, ధరణీనిర్జరాళి = బ్రాహ్మణ సమూహము, నిర్భయమై=దిగులు లేక, సుపర్వోత్కరంబు=దేవతల సమూహము, బ్రహ్మర్షితతుల్ = బ్రహ్మర్షుల సమూహములు.

తాత్పర్యము

ఏహోమము చేసిన నే రాక్షసుఁడు వచ్చి ధ్వంసము చేయునోయని కలంకముగాని, చేసిన పిమ్మటఁ జెడిపోయెనే యని పరితాపముగాని లేక యిఁక బ్రాహ్మణులు నిర్భయముగా సంచరింతు రని దేవతలు, బ్రహ్మర్షులు పలికిరి.

ఉ. పొంగుచు జాంబవత్ప్రవన ♦ పుత్రవిభీషణు లోలి సమ్మహో
భంగపరాక్రముం దివిజ ♦ వల్లభశాత్రవు వధించి మించు రా
సింగముఁ జేరి సంస్తుతులఁ ♦ జేయుచుఁ దద్విజయంబు మెచ్చి వే
భంగులఁ దద్రణంబు నభి ♦ వర్ణన సల్పిరి శ్రద్ధధానులై. ౨౧ ౨౧

అర్థములు. దితిజ వల్లభ శైత్రున్=రాక్షస శ్రేష్ఠుఁడైన యింద్రజిత్తును జయించిన వానిని, రాసింగము=రాజసింహము, శ్రద్ధధానులై = శ్రద్ధగలవారై, ఇఁక రావణు చావు నిజమని నమ్మినవారై.

తాత్పర్యము

సంతోషముచే నుప్పొంగుచు జాంబవంతుఁడు హనుమంతుఁడు విభీషణుఁడు ఎదురులేని పరాక్రమము గలట్టియు, నింద్రజిత్తును జయించినట్టియు, నింద్రజిత్తును జయించి యతిశయించు రాజసింహము లక్ష్మణుని జేరి యామను గెలుపును మెచ్చుకొనుచు నాయనను స్తోత్రముఁ జేయుచు నా యుద్ధమును విశేషముగ వర్ణించిరి.

కం. అఱచుచు లాంగూలంబులఁ, జఱచుచు మముకమును లంక • సంక్షోభింపన్
బఱచుచు మెఱయుచు లక్ష్మణు, నెతే మెచ్చుచు నతనిఁ జుట్టి•నిలిచిరి కీశుల్.

అర్థములు. చఱచుచున్=కొట్టుచు, పఱచుచున్=పరువెత్తుచు.

తాత్పర్యము స్పష్టము.

కం. జే లక్ష్మణ జే లక్ష్మణ, జే లక్ష్మణ యనుచుఁ బ్లవగ• శేఖరు లన్యో
న్యాలింగనరతి రణకథ, లోలిన్ వినిపించికొనుచు • నుండిరి వేడ్కన్. ౨౧ ౨౩

అర్థములు. అన్యోన్యాలింగన రతి=ఒకరి నొకరు ప్రీతితోఁ గౌఁగిలించుకొనినవారై.

కం. విని ప్రియసుహృదుఁడు లక్ష్మణుఁ, డొనరించిన యసుకరంబు•నొగి నమ్మక తా
రనిభూమికిఁ జని కనుఁగొని, మనముల నుప్పొంగి చని ర•మర్త్యులు ప్రీతిన్.

అర్థములు. అసుకరంబు = సుకరము కానిది, అసు+కరంబు = ప్రాణములు కలిగించునది, ఇంద్రజిత్తు ప్రాణముతో నుండునపుడు దేవతలు ప్రాణము లుండియు లేనివారే.

తాత్పర్యము

లక్ష్మణుఁ డింద్రజిత్తును జంపినాఁడనిన ప్రాణదాయకమైన వార్త వినియును నమ్మఁజాలక యుద్ధభూమికి వచ్చి పీనుఁగును జూచి దేవతలు మనస్సులందు సంతోషించి పోయిరి.

—• { ౯౨ సర్గము. ఇంద్రజిత్తు వధ విని శ్రీరాముఁడు లక్ష్మణుఁ గొండాడుట. } •—

సీ. ఇంద్రజిత్తు వధించి • సాంద్రముదం బొంది, తోఁగుచు నెత్తుట•ద్రుమ చసులను
జాంబవంతుని వాయు•సంభవునిం జేరి, సుగ్రీవరాములఁ • జూడ మనము
పొదము వదుఁడని • పూని విభీషణు, మారుతి కేలు ల•క్ష్మణుఁడు వేగ
మహ కేంద్రుఁ జేరు బృ•హస్పతివిధమున, రామచంద్రుని డాసి • ప్రణతిఁ జేసి

తే. పలికెఁ దిన్నగ సంకోచ•పడుచు నింద్ర, జిద్వధంబును రాక్షస•శేఖరుండు
మనము పొంగఁగ సర్వంబు•వినిచె రాము, చంద్రుఁడల రారితత్కథా•శ్రవణమునను.

అర్థములు. తోఁగుచున్=స్నానము చేయుచు, ద్రుమచరులను=వానరులను.

తాత్పర్యము

ఇంద్రజిత్తును జంపి మిగుల సంతోషించి నెత్తుట స్నానము చేయుచు వానరులను జాంబవంతుని హనుమంతుని బిలిచి మనము రామసుగ్రీవులఁ జూడఁబోదమని యొకచేత విభీషణు చేయి మఱియొకచేత హనుమంతుచేయి పట్టుకొని లక్ష్మణుఁడు వేగముగ బృహస్పతి యొద్దకుఁబోవు నింద్రునివలె రామచంద్రమూర్తిని సమీపించి నమస్కరించి హనుమంతుని యెదుట కుప్పిగంతు లన్నట్లు రామచంద్రమూర్తితో నేనేమి గొప్ప కార్యము చేసితి నని యింద్రజిత్తును జంపినవార్త చెప్పుదునా యని సంకోచపడుచు చెప్పక తప్పదు కావున మెల్లగ నింద్రజిత్తు చచ్చెనని చెప్పెను. విభీషణుఁడు యుద్ధవిధ మంతయు వినిపించెను. అది విని రామచంద్రమూర్తి మిగుల సంతోషించెను.

శా. మేల్మేల్ లక్ష్మణ ! నిన్ను మెచ్చితి బలే ♦ మేల్చేసితీ వింక నా
జాల్మం డీల్గుట సర్వకార్యములు లె♦స్సల్ చుమ్మటం చాతనిన్
మేల్మిం బల్కుచు లజ్జమాను నతనిన్ ♦ నిల్పె న్నిజాంకంబునన్
బల్మిన్ శీర్షము మూర్కొనెన్ దృఢపరి♦ష్వంగంబునం గ్రుచ్చుచున్. ౧౧-౧౨

అర్థములు. జాల్ముఁడు=మూర్ఖుఁడు, లజ్జమానున్ = సిగ్గుపడు వానిని, తానెంత ఘనకార్యము చేసినను పెద్దలయొద్ద జెప్పుకొనుటకుఁ గాని యది యితరులు తన యెదుటఁ జెప్పినపుడుగాని శ్రేయస్కాముఁడు సిగ్గుపడ వలయును. అహంకార పడరాదు. నిజాంకంబునన్=తనతొడ యందు, దృఢపరిష్వంగంబునన్=గట్టిగా గౌఁగిలించుట చేత.

తాత్పర్యము

లక్ష్మణా! బలేబలే. ఎంతమేలు చేసితివి ? నిన్ను మెచ్చుకొంటిని ఆ మూర్ఖుఁడు చచ్చుటచే నింక సర్వకార్యములు చక్కనైనవే సుమా, అని మెచ్చుకోలుమాటలాడి తొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని బలవంతముగ నతని తల వాసన చూచి గట్టిగాఁ గౌఁగిలించెను.

కం. తనువెల్ల నిమురుచుం దమ్ముని మఱి మఱి చూచి దేహ♦మున శల్యసుసా
ధనకృతవ్రణముల రోఁజఁగ, మనమున వగచుచును దాను♦మాటికి నూర్చెన్.

అర్థములు. తనువెల్లన్ = దేహమంతయు, నిమురుచున్ = తడుముచు, శల్యసుసాధన కృతవ్రణములన్=ఇనుప ములుకులు గల యాయుధములచేఁ జేయబడిన పుండులచే, రోఁజఁగ = దీర్ఘమైన నిట్టూర్పులు విడువఁగా, కృతవ్రణముల —నిందుత కారము గురువు గాదు.

తాత్పర్యము

దేహమంతయుఁ జేతితోఁ దడవి తమ్ముని మఱి మఱి చూచి దేహమున

నినుప ములుకులు గల యాయుధములతోనైన వ్రణములచే నూర్పుచుండఁగా మనస్సులో విచారపడి దాను గూడఁ దమ్మున కింత కష్టము వచ్చెఁగదా యని నిట్టూర్పులు విడిచెను.

కం. తడవును శిరమున్ మూర్కొను, నొడువును ననునయములన్ మ•నోరుజ దీఱన్
గడునరి వాఁ డెంతగ నినుఁ, గడగండ్లం బెట్టె ననుచుఁ•గళవళమందున్. ౨౧ ౨౨

అర్థములు. అనునయములన్=ఓదార్పుమాటలను, మనోరుజ=మనస్సున గల బాధ, గడుసరి=కఠినుఁడు, కడగండ్లన్=బాధలను, కళవళమందున్ = సంతాపించును.

తాత్పర్యము

దేహము తడవును, శిరస్సు వాసన చూచును, మనోబాధ క్షయించు నట్లూరార్పు మాటలఁ బలుకును. కఠినుఁడు నిన్నెంత కష్టపెట్టె నని సంతాపపడును.

కం. అన్నా! నీ వొనరించిన, యిన్నిటి దుష్కరము పో య•దెవ్వరికేనిన్
జెన్నారె శుభము లిఁక మన, కన్నిచ్చఁడు రావణుండు•హతుఁ డాత్మజుతోన్.

అర్థములు. ఇన్నిటి = ఈ పరాక్రమము, దుష్కరముపో = నిజముగా మహాకష్టసాధ్యమైనది- ఇతరులకు సాధ్యముకానిది. పోమ్ము నిశ్చయార్థంబునం దగు. ప్రౌ. వ్యా. వాక్య. సూ. ౨౨. రావణుండు హతుఁడాత్మజుతోన్=కొడుకుతోడ రావణుఁడు చచ్చినవాఁడే. కొన్ని యెడలఁ ద్వరితార్థసూచకంబయి భావిని భూతంబు చూపట్టెను- ప్రౌ. వ్యా. క్రియ. ౭.

తాత్పర్యము

అన్నా! నీవు చేసిన యీ పరాక్రమ మెవ్వరికైనను చేయ సాధ్యము కానిదే సుమా. మనకింక శుభము లతిశయించెను. ఇంకను ప్రధాన శత్రువు రావణుఁ డున్నాఁడుకదా యందువేమో. ఎప్పుడు కొడుకు చచ్చెనో యప్పుడే తండ్రియుఁ జచ్చినవాఁడే. ఇఁకఁ జచ్చిన వానిని జంపు టెంతటి కార్యము.

సీ. రావణునకు నవు•రావణియే సుమ్ము, దక్షిణబాహువు•తండ్రి! కలన
నట్టిపాలసుని నీ•వంతంబు నొందింప, నిపుడుగా నేను జ•యించినాఁడ
నెన్నఁగా శక్యమే•యావిభీషణవాయు, సంభవుల్ సలిపిన•సాహసంబు
మూఁడహోరాత్రముల్•వేఁడిమి మై పోరి, చచ్చెఁగా యెట్టెట్లొ•శక్రజితుఁడు
ఆ. ఆత్మతనయు మరణ•మాలకించిన యంతఁ, గలబలంబుతోడఁ•గదలి వచ్చు
నసురవరుఁడు సంగ•రాతిథ్య మిఁక నిచ్చు, నన్న! నాదుబలిమి•నతఁడు చచ్చు.

అర్థములు. పాలసుని = దుష్టుని, మూఁడహోరాత్రముల్ = మూఁడు పగళ్ళు మూఁడు రాత్రులు, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, తిథులు- ఎట్టెట్లో = అతికష్టముమీఁద.

తాత్పర్యము

రావణునంత చులుకనగాఁ జెప్పెదవేమి యనెదవా? యుద్ధమందు రావణునకు నింద్రజిత్తే కుడిచేయి. కుడిచేయి పోయిన వానిని యుద్ధములో జయించుట కష్టకార్యమా? రావణాసురునికి నన్నివిధముల సాహాయ్య పడుచుండిన వానిని నీవు చంపితివి. ఇప్పుడుకదా నేను నిజముగా జయించిన వాఁడను. వాఁడున్నంతవఱకు నాకు జయము సందేహామే యనితలఁచుచుంటిని. ఈయుద్ధమందు నీ విభీషణుఁడు, ఈ యాంజనేయుఁడు చేసిన సాహస కార్యములు చెప్పశక్యమా? వారిరువురు లేకుండిన మనము వానిని జంపి యుండఁ జాలము. మూఁడుపగళ్ళు మూఁడు రాత్రులు విడువక యుద్ధముచేసి యింద్రజిత్తు ఎట్లెట్లో చచ్చెఁగదా. ఇఁక దన కొడుకుచావు వినినంతనే రావణుఁడు మిగిలిన సేనతోడఁ గదలి వచ్చును. యుద్ధభిక్ష నిచ్చును. నాచేతజచ్చును.

కం. నాకిట దిక్కై యి నీ వా, నాకపతివిరోధిఁ ద్రుంచి • నంగద నేనా
 త్మాకన్యను రాజ్యంబును, జేకొనఁగాఁ గలిగితిన్ వి•శిష్ట చరిత్రా. ౨౧౩౧

అర్థములు. ఇట = ఈయుద్ధమందు, ఈ లంకలో, ఈ కష్టదశయందు, దిక్కై యి=రక్షకుఁడవయి, త్రుంచినంగద=త్రుంచుట చేతఁగదా, నేనా త్మాకన్యను రాజ్యంబును జేకొనఁ గలిగితిని, అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమాన భూతము లగు, సు. వ్యా. వాక్య. ౭౧.

తాత్పర్యము

• సాధుశీలా! నాకిచ్చట నీ వమయంబున రక్షకుఁడవై యింద్రజిత్తును జంపుటచేఁ గదా నాకా సీత లభించును. రాజ్యము లభించును. నీ వా పని చేయకుండిన నాకా రెండును లేనివే కదా. తన నిమిత్తముగాఁ గాని లోకక్షేమమునకుఁ గాని నెవ్వరైన గొప్ప కార్యము చేసినపుడు తగిన రీతి వారిని బహూకరింప వలయునని దీనిచే సూచితము లక్ష్మణుఁడు చంపకుండిన రాముఁ డింద్రజిత్తును జంపలేఁడా యేమి? అది కాదు లెక్కింపవలసినది. చేసిన పనిని శ్లాఘింపవలెనుగాని యితరులా పని చేయఁగలవా రున్నంత మాత్రమునఁ జేసిన వారిని బహూకరింపక మానరాదు. పనిచేయుట గొప్పగాని, చేయఁగలుగుట మాత్రము గొప్ప గాదు.

చ. అని యిటు లాశ్వసించి బిగి • యారఁగఁ గ్రుచ్చి సుషేణుఁ బిల్చి యీ
 యనఘుని మిత్రవత్సలు మ • హామతి స్వస్థునిఁ జేయ వయ్య యీ
 యన మెయి నాటియున్న యుని • యమ్ములమ్ములుఁ గూలచే విభీషణున్
 వనచరఋక్షశూరులను • స్వస్థులఁ జేయుము శీఘ్రకారివై. ౨౧౩౨

అర్థములు. ఆశ్వసించి = ఊరార్చి, స్వస్థుని = ఆరోగ్యవంతుని, శీఘ్రకారివై=త్వరఁగా బనిచేయు వాఁడవై.

తాత్పర్యము

అని యూరార్చిఁ గట్టిగఁ గౌగిలించుకొని సుషేణుఁ బిల్చి యీ దోవ రపి

తుని, మిత్రులందుఁ బ్రేమగలవానిని, గొప్ప మనస్సు గలవానిని, నారోగ్యవంతునిఁ జేయుము. ఈయన దేహమునందు నినుప ములుకులు నాటుకొని యున్నవి. వాని నెల్ల వెలికిఁ దీయుము. ఆప్రకారమే విభీషణుని వానర భల్లూక శూరులను శీఘ్రముగ నారోగ్యవంతులఁ జేయుము.

ఉ. వారును వీరు నేల మన•వారుగ సంగరకేళి నొచ్చిన
వ్వారలకెల్ల వేగముగ • బాధఁ దొలంపు మటన్న నాతఁడున్
సారతిరౌషధిన్ నృపతి•చంద్రున కిచ్చెను, దాని మూరొ్కనన్
గూరె సుఖంబు దక్షి ణము•కూలెను ములు్కలు మానె గాయముల్. ౨౧౩౩

అర్థములు. మనవారుగ = మనపక్షమువారుగ.

తాత్పర్యము

వారు వీరని పేరు చెప్పనేల? మనపక్షమునఁ బోయి యుద్ధమం దెవరెవరు గాయపడిరో వారికందఱకు వెంటనే చికిత్సచేయుము. బాధ నివారింపుము, అని చెప్పఁగా నాతఁడును లక్ష్మణునకు సారవంతమైన యొక మూలిక వాసన చూడుమని యిచ్చెను. అది వాసన చూడఁగానే దేహములో నాటిన ములుకులన్నియుఁ బడిపోయి గాయములన్నియు మానెను. సుఖము కలిగెను.

తే. మఱివిభీషణునకుఁ, దక్కు•మర్కటులకుఁ, జలిపెను జికిత్స రాముని•శాసనమున
దక్షిణంబున లక్ష్మణ•తరుచరేంద్రు, లెల్లరును వీతబాధులై•యుల్లసిలిరి. ౨౧౩౪

అర్థములు. మఱి=ఆపిమ్మట, వీతబాధులై=బాధ తొలఁగినవారై.

తాత్పర్యము స్పష్టము.

తే. రామచంద్రానుజుండు ని•రామయుండు, గాఁగ వానరభల్లూక•కాండపతులు
నవ్విభీషణుఁడును జాల•హర్ష మంది, రనుజ వెండియు మెచ్చె నీ•తాత్మవిభుఁడు.

అర్థములు. నిరామయుండు=బాధతొలఁగినవాఁడు, సుఖము గలిగినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

—• ౯౩-వ సర్గము. ఇంద్రజిత్తు మరణమునకు రావణుఁడు విలపించుట •—

చ. తరుచరవర్యు లిందుఁ బ్రమదంబునఁ దేలఁగ నందు రాక్షసే
శ్వరునచివుల్ బలారిజితు•వార్త వినిన్ సువినిశ్చితాత్ములై
యురలఁగ బాష్పవారి యసు•రోత్తమ నీయనుజుండు తోడ్పడం
బోరిగొనెనంట లక్ష్మణుఁడు • ఘోర భవత్సుతు నింద్రజిత్తునిన్. ౨౧౩౬

అర్థములు. ఇందు = వానరసేనా సన్నివేశమందు, రామచంద్రమూర్తి యున్నచోట - అందు = లంకయందు - రావణుఁడున్నచోట - వినిన్ = విని యును నమ్మఁజాలక, దృఢపఱచుకొనక రావణునకుఁ జెప్ప ధైర్యము లేక, సువినిశ్చితాత్ములై = మిక్కిలి విశేషముగ నిశ్చయించుకొన్నవారై, అనఁగా ఇంద్రజిత్తు పడినచోటికిఁబోయి శవమునుజూచి ప్రాణము పోయినదని నిశ్చయించుకొన్నవారై,

ఉరలఁగన్=కూలఁగా, పొరిఁగొనెనంట=పొరిఁగొనెనని చెప్పుటకు ధైర్యము చాలక యిట్లు చెప్పిరి.

### తాత్పర్యము

వానరశ్రేష్ఠులిచ్చట నీవిధముగ సంతోషమున నుబ్బితబ్బిబ్బులగుచుండఁగా నచ్చట లంకలోఁ రావణుని మంత్రులు ఇంద్రజిత్తు చచ్చినవార్త వినియును,నమ్మఁజాలక సమక్షము పోయి చూచి నిశ్చయించుకొని కన్నీరు కార్చుచుండఁగా రాజా! నీ తమ్ముఁడు సహాయపడఁగా లక్ష్మణుచేత నీ కొడుకింద్రజిత్తు యుద్ధములో చచ్చెనని యీ రాక్షసులు చెప్పుచున్నారని చెప్పిరి.

ఉ. శూరవరుండు జన్యమున • స్రుక్కు కుఱుంగఁడు, శక్రజైత్రుఁడై
ధారిణిఁ గీర్తి కెక్కెఁ, బల•ధాముఁడు నీసుతుఁ డట్టివాఁడు నీ
దారమణానుజుం డొడరి • తద్దయు హావడి పుట్టఁ జేసి దు
ర్వారశరాళి వీరజన•భావితలోకము చేరెనం చనన్. ౨౧౩౭

అర్థములు. జన్యమునన్=యుద్ధమందు, హావడి=ఉపద్రవము, దుర్వారశరాళిన్ = వారింపరాని బాణ సమూహములచే,వీరజనభావిత లోకము=వీరులచే గౌరవింపఁబడు లోకము.

### తాత్పర్యము

• శూరులందు శ్రేష్ఠుఁడు. యుద్ధమున నింతవఱకు బాధ యెట్టిదో యెఱుఁగఁడు. ఇంద్రుని జయించి కీర్తి కెక్కెను. బలమునకు స్థానమైన వాఁడు ఇటువంటివాఁడు నీ సీతాపతి తమ్ముని నెదిర్చి మిగుల నుపద్రవము కలిగించి వారింపరాని బాణములచే వీరులగు వారికిఁ బొంద యోగ్యమైన లోకము చేరెనని చెప్పఁగా.

ఉ. దారుణహృద్విదారణ సు•తప్రలయంబును విన్నమాత్రలో
ఘోరపుమూర్ఛ ద్రెక్కొనఁగఁ • గుంభిని ద్రెళ్ళి విసంజ్ఞుఁ డౌచు లం
కారమణుండు దీర్ఘతర•కాలమునం దెలివొంది క్రమ్మఱన్
వారని పుత్రశోకమున • వ్యాకులుఁడై పలవించె దీనుఁడై. ౨౧౩౮

అర్థములు. దారుణ = తీక్ష్ణమైనది, హృత్+విదారణ=గుండెలు పగులఁదీయునది యగు, సుతప్రలయంబును = కొడుకు చావును, కుంభిని=భూమిమీఁద, విసంజ్ఞుఁడు=స్మృతి తప్పినవాఁడు, దీర్ఘతర కాలమునన్=చాలకాలమునకు.

### తాత్పర్యము

మిగుల భయంకరమై గుండెలు పగులఁ జీల్చునది యగు కొడుకు చచ్చిన వార్త విన్నయంతనే గొప్పమూర్ఛ తన్ను క్రమ్మఁగా నేలపైఁబడి స్మృతి దప్పినవాఁడై రావణుఁడు చాలకాలము నట్లుండి మరల తెలివి వచ్చినవాఁడై ,అంతము లేని పుత్రశోకమున మనస్సు కలఁత చెందినవాఁడై, దుఃఖితుఁడై యేడ్చెను.

సీ. హా పుత్రరత్నమా! హా మహారథవర్య!, హా రాక్షసవ్యూహ•వీరముఖ్య
నా పెన్నిధానంబ! నా పాలిభాగ్యమా!, ననుఁ బాయ నీ కెట్లు • మనసు వచ్చె
వాసవు నంతటి•వాని జయించియు, సౌమిత్రిచే నెట్లు • సమసితయ్య ?
కాలాంతకుని నైనఁ•గాలుఁ గూర్చెదు నీదు,నాశుగశక్తి యే•మయ్యెఁ దండ్రి!
తే. మందరము శృంగములనెల్ల • మహిని ద్రోయఁ
జాలు దోశ్శక్తి యెట్టులు • సమసెఁ బుత్ర
యట్టి నీ శౌర్య మా సుమి•త్రాత్మజాతు
నణఁపఁజాలని దయ్యెనా • హా కుమార ! —౨౧౩౯

అర్థములు. ఆశుగశక్తి=బాణశక్తి, దోశ్శక్తి=భుజబలము.

తాత్పర్యము స్పష్టము.

కం. కాలుండు నాకుఁ బూజ్యుఁడు, వాలాయము నేఁడు నిన్ను•వంటి బలాఢ్యున్
గాలగతిఁ గూర్చె నౌరా!, కాలముగతి నెవ్వఁ డెఱుఁగఁ•గాఁగలఁ డెందున్.

అర్థములు. కాలుండు=యముఁడు, పూజ్యుఁడు = గౌరవింపఁదగినవాఁడు, వాలాయము=నిర్బంధముగా, కాలగతిన్=మృతి.

తాత్పర్యము

నేఁడు యముఁడు నాకు బలవంతముగా నైనఁ బూజ్యుఁడు. ఏలన నీవంటి బలవంతుని చంపెనుగదా. ఔరా! కాలగతి నెందైన నెవ్వఁ డెఱుఁగును.

శా. అన్నా! నాసుతరత్నమా! యిదియ పో • యర్హంపుమార్గంబు శౌ
ర్యోన్నత్యంబునఁ గ్రాలువారికి సమ•స్తామర్త్యమర్త్యాలిక
స్ఖలన్నస్థైర్యుల కాత్మభర్తకయి త్య•క్తప్రాణు లౌవారి, కా
త్మన్నాదుస్థితి దిక్కులేనివిధముం • దర్శించి దుఃఖించెదన్. —౨౧౪౦

అర్థములు. ఇదియపో = ఇదియే, శౌర్యోన్నత్యంబునన్ = అధిక శౌర్యముచే, సమస్త అమర్త్య మర్త్యాలికి=దేవతలకైనను, మనుష్యులకైనను అందఱకు, అస్ఖలన్నస్థైర్యులకున్ = తగ్గిపోని నిలుకడ గలవారికి,ఆత్మ భర్తకయి=తమ ప్రభువుల నిమిత్తమై, త్యక్తప్రాణులు=ప్రాణములు వదలిన వారికి.

తాత్పర్యము

అన్నా ! కుమారరత్నమా ! మనుష్యులకైనను దేవతలకైనను అతిశయ శౌర్యముగల వారికి,చెడని స్థైర్యము గలవారికి, తమ భర్తలకయి ప్రాణములు విడుచు వారికి నిదియే మార్గము. కావున నీవంటివాఁ డేమార్గమునఁ బోవలెనో యా మార్గముననే నీవు పోయితివి.కావున నీకై నేను దుఃఖింపను గాని యొక్కఁడైన బంధు వనువాఁడు లేకపోయిన నాదుస్థితి తలంచి నావాఁడని నేను జెప్పఁగలవాఁడు లేఁడాయెఁ గదా యని నాదీనదశకై నే నేడ్చెదను.

కం. ఎన్నండు నన్నుఁ బాయవు, కన్నాకై నన్ను బలముఁ గాచెద వీక నా
కున్నారె దిక్కు నీకుం, జన్నె నను నొంటి విడిచి జముపురి కరుగన్. ౨౧౮౨

అర్థములు. కన్నాకై = కంటికి తెప్పవలె రక్షకుఁడవై, జముపురికి = యముని పట్నమునకు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఇప్పుడు పో యమరులును గకుప్పపతులు ఋషులు నీదు కూలుట వినుటన్
మెప్పితము లేనిముదము, చిప్పిల్లఁగ నాద మఱచి నిద్రింత్రు సుతా. ౨౧౮౩

అర్థములు. కకుప్పపతులు = దిక్పాలకులు, మప్పితము = మితము, ఆద మఱచి నిద్రింతు రనఁగా నిర్భయముగా సుఖింతురని యర్థము. దేవత లస్వప్నులు కావున మనుష్యులవలె నిద్రింతురని చెప్పరాదు. ఆదమఱచి నిద్రించుట యనునది లోకోక్తి, చిప్పిల్లఁగన్=ఉబుకు.

తాత్పర్యము

దేవతలు, దిక్పాలకులు, ఋషులు నీవు చచ్చినవార్త విని అమిత సంతోషము లోపలనుండి యుబికి పైకిరాఁగా హాయిగా సుఖింతురు.

ఆ. పురము నగరు లున్న భూమి యాకస మున్న, వనములున్న శైల వరము లున్న
జీవరత్న మింద్రజిత్కుఁడొక్కరుఁడు లేమి,సర్వశూన్య మగుచు జగముదోఁచె.

అర్థములు. జీవరత్నము = ప్రాణమిచ్చు రత్నము, సర్వశూన్యము = ఏమియు లేనిది, పాడుపడినది.

తాత్పర్యము స్పష్టము.

కం. అక్కట యంతఃపురముల, రక్కసకన్నియల దుఃఖరవములు గుహాలన్
దిక్కేది యఱచు కరిణుల, వెక్కసపుం ధ్వనులు వోలె విన నయ్యె నహో.

అర్థములు. దిక్కేది = దిక్కులేక, కరిణుల=ఆఁడేనుఁగుల.

తాత్పర్యము

అహో! అంతఃపురము లందుండు రాక్షస స్త్రీల యేడ్పు ధ్వనులు దిక్కులేక గుహాలం దేడ్చు నాఁడేనుఁగుల ధ్వనులవలె వినవచ్చుచున్నవి.

ఉ. నన్నును యౌవరాజ్యమును నాయన! లంకను రాక్షసాళి నీ
యన్నులమిన్ననున్ జనని నందఱ వీడి యొకండ పోవఁగాఁ
జన్నె కుమార! నీవు కద నల్పఁగ నర్హము ప్రేతకార్యముల్
మున్నుగఁ జన్న నాకు, విధి మోసమునన్ విపరీతమై చనెన్. ౨౧౮౪

అర్థములు. అన్నుల మిన్ననున్ = స్త్రీలయందు శ్రేష్ఠురాలు, నీభార్యను.

తాత్పర్యము

తండ్రియగు నన్ను యౌవరాజ్యమును, లంకను, రాక్షస సమూహములను నీ భార్యను నీ తల్లిని నందఱ వదలి నీ వొకండవే నాయనా! పోవుట ధర్మమా

ముందు నేను బోయిన నాకు నీవు కదా ప్రేతకార్యములు చేయ వలయును. అటు వంటిది దైవము మోసగించుటచే నేను నీకుఁ జేయవలసి వచ్చెను.

ఉ. రాముఁడు లక్ష్మణుండు కపి ♦ రాజును బ్రాణములతోడ నుండఁగా
నా మనమందు గాటముగ ♦ నాటిన శల్యము లట్ల యుండఁగా
నే మని తీవ్రవేదనల ♦ కీగతిఁ బాలొనరించి నన్ను బు
త్రా! మహిలోర్ధ్వలోక సుఖ ♦ రాజికి నాస యొనర్చి తక్కటా. ౧౭౨

**తాత్పర్యము**

రాముఁడు లక్ష్మణుఁడు సుగ్రీవుఁడు ప్రాణములతో నుండఁగా నిచ్చట నా హృదయమున నాటుకొనిన ములుకు లట్లే యుండఁగా వారిని జంపక నాకు సుఖము గలిగింపక నన్నీ విధముగఁ దీవ్ర దుఃఖముల పాలొనరించి నాయనా! నీవు మాత్ర మూర్ధ్వలోక సుఖము లంద నేమని పోయితివి.

ఉ. నాయనరక్తి మర్వ నగు ♦ నా యను నిర్జితనిర్జరాళినే
నా యను బాహువీర్యపద ♦ నా యను నీతలిదుఃఖ మార్పరా
దా యను జాయఁ దేర్పఁగద ♦ దా యను నీచల మేల? మేఘనా
దా యను నీవె దిక్కువు గ ♦ దా యను నా తనుజాతరత్నమా! ౧౭౩

**తాత్పర్యము స్పష్టము.**

## —♦ రావణుఁడు రాక్షసులతోఁ దన పరాక్రమంబు దెలుపుట ♦—

చ. అని విలపించు చున్న సహ ♦ జాధికకోపనుఁడైన రాక్షసేం
ద్రునకు సుతార్తిసంభవము ♦ రోషము భీషణమై మనంబునన్
జననము నొంద వేసఁగిని ♦ సంజ్వలదశ్ములు రశ్మిమాలికిన్,
ఘనతరతీక్ష్ణతం గొలుపు ♦ కైవడి నైన నతండు మండుచున్. ౧౭౪

అర్థములు. సహజాధికకోపనుఁడై = స్వభావము చేతనే మిగులఁ గోప గుణము గలవాఁడు, సుతార్తిసంభవము = పుత్రశోకమువలనఁ గలిగినది, వేసఁగిన = ఎండకాలమందు, సంజ్వలదశ్ములు = మండుచున్న కిరణములు, రశ్మిమాలికిన్ = సూర్యునికి, ఘనతర తీక్ష్ణతన్ = మిగుల నధికమైన వేఁడిమి.

**తాత్పర్యము**

ఇట్లేడ్చుచున్న స్వభావము చేతనే కోపగుణము గల రావణాసురునకు పుత్ర శోకము వలన స్వభావము చేతనే వేఁడి కిరణములు గల సూర్యునకు నెండకాల మందుఁ గిరణములు మిగుల వేఁడియైనట్లు కోప మతిశయింపఁగా నతండు మండుచు.

సీ. సహజనక్రకల్లోల ♦ సాగరుం డన నొప్పెఁ, గుటిలభ్రుకుటిలతా ♦ నటనయుక్త
ముఖుఁడు కోపవిజృంభ ♦ మున వాని వక్త్రింబు, నింగలంబులఁ గ్రక్కు ♦ వృత్రునోరు
దలపించె సహజర ♦ క్తంబులు నేత్రముల్, క్రోధాగ్ని నెండియు ♦ రూక్ష మయ్యె
బ్రకృతిఘోరం బగు ♦ వపువు కింకను రేఁగ, రుద్రరూపముతోడ ♦ మాద్రియయ్యె

ఆ. మండువత్తినుండి • మండు నూనియబొట్లు, పోలెఁ గనులనుండి • రాలె నీటి
విప్రుషములు, దనుజ• వేప్యమానమహిత, యంత్రరవముఁబోలె•నసురవిభుఁడు.

అర్థములు. సహనక్రకల్లోలసాగరుఁడు = మొసళ్ళతోను పెద్ద యలలతోను గూడిన సముద్రుఁడు, కుటిలభ్రుకుటి లతావలన యుక్త ముఖుఁడు=వంకరలైన తీఁగవంటి కనుబొమల ముడియొక్క చలనముతోఁ గూడిన ముఖము గలవాఁడు, కోపవిజృంభణంబునన్ = కోపాతిశయముచే, వాని వక్త్రంబు = వాని ముఖము, ఇంగలంబులు = నిప్పులు, సహజరక్తంబు=పుట్టుపుతోనే యెఱ్ఱనైనవి, క్రోధాగ్నిన్=కోపమనెడియగ్నిచే, రూక్షము=పరుషము, ప్రకృతిఘోరంబు=స్వభావముచేతనే భయంకరము, వపువు=దేహము, కింకను = కోపముచే, రేఁగి = అతిశయించి, విప్రుషములు=బిందువులు, వేప్యమాన=త్రిప్పఁబడుచున్న.

తాత్పర్యము

వంకరలైన తీఁగవంటిదైన కనుబొమలముడి యదరుటచేత కోపాతిశయము గల వాని ముఖము మొసళ్ళతోను, పెద్ద యలలతోను గూడిన సముద్రమువలె నుండెను. కోపాతిశయమున వాని నోరు నిప్పులు గ్రక్కుచున్న వృత్రునోటిని స్మృతికిఁ దెచ్చెను. సహజముగ నెఱ్ఱనగు కన్నులు కోపాగ్నిచేత మఱింత పరుషమయ్యెను. స్వభావముగ భయంకరమైన వాని దేహము కోపముచే విజృంభించి రుద్రుని రూపముతో సమానమయ్యెను. రుద్రుఁడు తామస దేవత కావున నీ యుపమానము. సంహారకర్తకు సాత్త్వికశాంతి యెట్లుండగలదు? మండుచున్న వత్తినుండి మండుచుఁ బడుచున్న నూనెబొట్లవిధమునఁ గన్నులనుండి వేఁడి బాష్పజలబిందువులు రాలెను.

రాక్షసులచేఁ ద్రిప్పఁబడిన పెద్దగానుగ యంత్రధ్వని వలెనని పై పద్యముతో నన్వయము.

కం. దంతములు కొఱుకు చప్పుడు, నంతకుగతి నతని చూపు•లడరిన యాయా
ప్రాంతముల నసురవీరులు, స్వాంతంబులు చెదర భీతిఁ • బఱచిరి గుములై.

అర్థములు. అంతకుగతిన్=యముని వంటి.

తాత్పర్యము

రావణుఁడు పండ్లు గొఱికిన చప్పుడులు బోలియుండెను. యముని చూపులవలె నతని చూపులు వ్యాపింపఁగా నాచూపులు పడిన ప్రదేశముల నుండు రాక్షసులు మనస్సులు చెదరి భయపడి గుంపులు గట్టి పరువెత్తిరి.

తే. అపుడు తనవారికెల్ల భ•యంబు దీఱ,దిటము కలుగంగ నిట్లనుఁ•బటపటంచుఁ
బండ్లు కొఱుకు రాక్షస•వర్యులార?,వినుఁడు నాశక్తి యొకింతయు•విశదముగను.

తాత్పర్యము

అపుడు ఇంద్రజిత్తుకూడఁ జచ్చెనే. యిఁక నీలంకను గాపాడు వారెవరు? లంకలోఁ బ్రవేశించి వానరు లేమి చేయుదురో యనియు, నింతకోపము గలవాఁ

డెవ్వరినేమి చేయునో యనియు భయపడినవారి భయము తీఱునట్లును వారికి ధైర్యము వచ్చునట్లును రోషముచేఁ బటపటపండ్లు గొఱుకుచు నిట్లనెను. రాక్షస శ్రేష్ఠులారా! మీరేల భయపడెదరు? నాశక్తి విశదముగఁ జెప్పెద వినుఁడు.

సీ. వర్షసహస్రముల్ ♦ పరమతపం బుండి, విధి నప్పుడపుడు మె ♦ ప్పించినాఁడఁ
దపము బలంబున ♦ ధాతవరంబున, లేఖాసురభయంబు ♦ లేనివాఁడ
భిదురంబుచే నైన ♦ భేదింపఁగారాని,కవచంబు బ్రహ్మచేఁ ♦ గాంచినాఁడ
నట్టి చాపముఁ బూని♦స్యందన స్థితుఁడనై, నాతోను లే కుర్వి♦మలయువాఁడ

ఆ. కంజజాతదత్త ♦ కార్ముకశరములఁ, బూని నిలువ యుద్ధ♦భూమి నల్ల
యింద్రుఁ డేని నన్ను ♦ నెదిరింప నేర్చునే, రామలక్ష్మణాదు ♦ లేమి లెక్క.

అర్థములు. లేఖాసుర భయంబు = దేవతల వలన నసురుల వలన చావు, భిదురంబు = వజ్రము, స్యందన స్థితుఁడనై =రథమందున్న వాఁడనై, కంజజాత దత్త=బ్రహ్మచే నీయఁబడిన, కార్ముక శరముల = విల్లు బాణములను.

## తాత్పర్యము

వేలకొలఁది సంవత్సరములు గొప్పతపస్సు అప్పుడప్పుడు చేసి బ్రహ్మదేవుని మెప్పించి నాఁడను.దీనివలన వీనికి లభించిన యభేద్య కవచము లోనైనవి మొదటి సారి తపంబున లభించినవి కావు.నదుమ నదుమఁ దపస్సుచేసి సంపాదించుకొన్న వే యని యేర్పడు చున్నది.ఆ తపము బలము దేవాసురులచేఁ జావులేకుండ బ్రహ్మచే వరములు పొందినాఁడను. అంతియ కాదు, వజ్రముచేనైన భేదింపరాని కవచము బ్రహ్మచేతనే పొందినాఁడను. అట్టి చాపము చేతఁదీసికొని రథమందుండి యెదు రెవ్వరులేక రణభూమిఁ దిరుగువాఁడను. బ్రహ్మచే నీయఁబడిన విల్లు బాణములు ధరించి యుద్ధభూమి యందు నిలువఁబడితి నేని యింద్రుఁడైన నన్ను నెదిరింప నేర్చునా? ఇంక రామలక్ష్మణులు నాకు లక్ష్యమా.

కం. తెండీ తూర్యశతంబుల, నిండారురవంబుతోడ ♦ నిస్తులధనువున్
జెండెద రాముని లక్ష్మణుఁ, జండాంశుసమానశాత♦సాయకతతులన్. ౨౧౯౮

అర్థములు. తూర్యశతంబుల = అనేక వాద్యముల యొక్క, చండాంశు సమాన = సూర్యునితో సమానమైన, శాత = పదునైన, సాయకతతులన్=బాణ సమూహములచే.

## తాత్పర్యము

అనేక వాద్యధ్వనులు విస్తరింపఁగా నా విల్లు తీసికొని రండు. సూర్యునితో సమానములైన బాణ సమూహములచే రామలక్ష్మణులను నఱికి వైచెదను.

## —♦ రావణుఁడు సీతను జంపఁ బోవుట ♦—

కం. అని సుతవధసంతప్తుఁ డ,తనురోషవశంగతుండు ♦ దశవదనుఁడు తా
జనకజఁ జంపఁగ నెంచుచు, వనిఁజొచ్చెన్ దీనస్వరమున ♦ నసురావళికిన్. ౨౧౯౯

తాత్పర్యము

కోపముతో నిట్లు మాటలాడియు మరల కొడుకు స్మరణమునకు రాఁగా నతఁడు చచ్చెనే యని సంతాపపడుచు మిగులఁ గోపము గలవాఁడై సీతను జంప నాలోచించి దీనస్వరమున రాక్షసులతో నిట్లనియెను.

ఉ. నాతనయుండు సంతురతనంబు వనేచరవంచనార్థమై
సీతయనంగ నొక్క- తెను సృష్టి యొనర్చి వధించె దాని, నే
నాతరళాక్షి క్షత్రియకు లాధమరక్త విదేహకన్య నే
నే తెగవ్రేయుదుం గనుఁడు పీడ తెగున్ మన కా మృగాక్షితోన్. ౨౧౫౬

అర్థములు. సంతురతనంబు = కొడుకులలో మణి వంటి వాఁడు. సంతాన భవము సంతు. వనేచర వంచనార్థమై=వానరులను మోసగించుకొఱకు, క్షత్రియ కులాధమరక్తను=క్షత్రియకులమందు నధముఁడగు వానియందు ప్రేమ గలది.

తాత్పర్యము

పుత్రరత్నమగు నా కొడుకు వానరుల వంచించుటకై సీత యను దాని సృష్టి చేసి దానిని వధించెను. నేనో యీ వాస్తవ సీతనే, క్షత్రియాధమునందుఁ బ్రేమ గల దానినే, జనకరాజు పుత్రికనే యిదిగో నిప్పుడే తెగవ్రేసెదను. దానితో మన పీడ తెగిపోవును.

చ. అని విమలాంబరద్యుతిస మంచితమై సుమహార యుక్తమై
గొన బగు చంద్రహాసమును గొబ్బునఁ గైకొని పుత్రశోక సం
జనితభృశార్తిఁ జత్తమన శంబుగ జానకి యున్నచాయకై
చనియె జవంబునం దనదు జాయలు మంత్రులు వెన్నడింపఁగన్. ౨౧౫౭

అర్థములు. విమలాంబరద్యుతిసమంచితమై = నిర్మలమైన ఆకాశము కాంతితో నొప్పినదై, కత్తులు నలుపని కవి సమయము — పుత్రశోక సంజనిత భృశార్తిన్ = పుత్రుని మరణము వలనఁ గలిగిన శోకమువలన జనించిన గొప్ప వ్యసనముచే, అవశంబుగన్=స్వాధీనము తప్పిపోఁగా, జాయలు=భార్యలు, వెన్నడింపఁగన్ = వెంటరాఁగా, ఇట్లు చెప్పుటచే పీడేద్చుచోటికి భార్యలుకూడ వచ్చి యుండిరని సూచన.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి నిర్మలమగు నాకాశకాంతితో నందమై పూలదండలు గలదై ప్రకాశించు చంద్రహాసమును దటాలునఁ దీసికొని పుత్రశోకమువలనఁ గలిగిన మహావ్యథచే మనస్సు స్వాధీనముతప్పి యిది చేయవచ్చును, ఇది చేయరాదను తెలివి తప్పిపోఁగా సీత యున్నచోటికి తన్ను భార్యలు మంత్రులు వెంబడించి రాఁగా త్వరగాఁ బోయెను.

సీ. చనురాక్షసేంద్రుని • గనిఘోష లిడుచు నొం, డొరులతో నని రందు • నున్నవారు
 సామాన్యుఁడా వీఁడు • సకలదిక్పాలుర, నాహవంబునఁ దోలి • నట్టివాఁడు
 ఇట్టి వీనిని గని • పృథ్వీశనందను, లేగతిఁ బోదురో • యెవ్వఁ డెఱుఁగు
 దేవాదులను గెల్చి • త్రిభువనరత్నాళిఁ, దివిరి బలాత్కృతిఁ • దెచ్చినాఁడు
తే. విక్రమంబున బలమున • వీనిపాటి, యెవని, జెప్పంగ నీరేడు • భువనముల న
 టంచు భాషించుచుండ నా • యసురవరుఁడు, చనియె నశోకవనమున • చాయఁబట్టి.

అర్థములు. ఘోషలు=ధ్వనులు, త్రిభువన రత్నాళి = మూఁడులోకము లందలి శ్రేష్ఠ పదార్థములను- 'రత్నం స్వజాతి శ్రేష్ఠేపి' అమరము. బలాత్కృతి= బలవంతముగా, ఈరేడు=ఇరు+ఏడు = పదునాలుగు, వనమున చాయ = వనము యొక్క చాయ; షష్ఠ్యర్థమున నకారాగమము.

తాత్పర్యము

ఇట్లు పోవుచున్న రావణాసురునితోడ ధ్వనులు చేయుచుఁ గొంద అందున్నవా రిట్లనుకొనిరి. వీఁడేమి సామాన్యుఁడా? దిక్పాలకుల నందఱ యుద్ధమునఁ దఱిమి కొట్టినవాఁడు, ఇట్టి వాని బారిఁ బడి రాజకుమారు లేమగుదురో యెవ్వఁ డెఱుఁగు? దేవాదులను గెల్చి వారి యొద్దనున్న యమూల్య వస్తువుల నెల్ల బలాత్కారముగఁ దెచ్చినాఁడు. ఈ పదునాలుగు లోకములలో వీనికి సమానుఁ డని యెవనిఁ జెప్పవచ్చును? అని మాటలాడుచుండ రావణుఁ డశోకవనమున దిక్కుగాఁ బోయెను.

చ. వల దని మంత్రు లాడినను • బంధువు లందఱు వద్దగించినన్
 జెలిమరు లాఁకఁగొన్నను వి • శిష్టమతుల్ దగ దంచు జెప్పినన్
 నిలువక రోహిణిం బఱచు • నిష్ఠురదుష్టఖగంబువోలెఁ దాఁ
 జెలుచన సీతపైఁ బఱచె • భీమగతిం గనువారు బెగ్గిలన్. —౨౧౫౯

అర్థములు. చెలిమరులు = చెలిమి+అరులు=మిత్రులు, ఆఁకఁగొన్నను = అడ్డగించినను, విశిష్టమతుల్ = గొప్ప మనస్సు గలవారు, నిష్ఠుర = క్రూరమైన, దుష్ట=చెడ్డ, ఖగంబు=గ్రహము, అంగారకుఁడు, బెగ్గిలన్=భయపడునట్లు.

తాత్పర్యము

సీతను జంపవలదని మంత్రులు చెప్పినను,బంధువు లందఱు నడ్డము వచ్చినను, మిత్రులు నివారించినను, పెద్దవారు దగదని చెప్పినను నిలువక, రోహిణి మీఁదికిఁ బోవు నంగారక క్రూరగ్రహమువలెఁ గోపముతోఁ జూచువారు భయపడునట్లు సీతను జంపఁ బరువెత్తెను.

—• రావణునిఁ జూచి సీతాదేవి దుఃఖించుట. •—

ఉ. వచ్చెడువానిఁ, గేలఁ గర • వాలముఁ దాల్చినవానిఁ, గిన్కచే
 హెచ్చినవాని, స్నిగ్ధజన • బృందము లడ్డము వచ్చువాని, నా

సచ్చరిత్రాగ్రగణ్య రఘు•చంద్రముతో యలి గాంచి యయ్యో యీ
వచ్చెడిజాడఁ జూడఁగ వ•వశ్యము నన్ను వధింప గోరెడిన్. ౨౧౬౦

అర్థములు. కరవాలము = కత్తి, స్నిగ్ధజనబృందములు = స్నేహితుల సమూహములు.

తాత్పర్యము

చేతఁ గత్తితీసికొని కోపముచే వచ్చుచున్నవానిని స్నేహితు లడ్డగించినను నిలువనివానిని పతివ్రత యగు రాముని దేవి సీత చూచి యయ్యో వీఁడు వచ్చెడి విధముఁ జూడ నన్నుఁ జంపఁగోరి యున్నాఁడు.

కం. దిక్కులకు నెల్లఁ దానే, దిక్కయిన మహావ్రతుండు • దిక్కుగఁ గల న
న్నక్కట, యనాథవలె నీ • ముక్కిడిరక్కసుఁడు నేఁడు • ద్రుంపఁగ దలఁచెన్.

అర్థములు. దిక్కులకు నెల్ల = అన్ని దిక్కులకు, ప్రపంచము నంతయు, (అ) రక్షకులని చెప్పఁబడువారి కందఱకు, దిక్కు=రక్షకుఁడు, మహావ్రతుఁడు = అట్టి సర్వరక్షణమే వ్రతముగాఁ గలవాఁడు, దిక్కుగ=రక్షకుఁడుగ, అనాథవలెన్= దిక్కులేనిదానివలె, ముక్కిడి=నీచుఁడు, అల్పుఁడు.

తాత్పర్యము

సమస్త ప్రపంచమునకు రక్షకు లనఁబడువారికెల్ల రక్షకుఁడై, యట్లు రక్షించుటే మహావ్రతముగాఁ గలవానిని రక్షకునిఁగా గల నన్ను అయ్యో! యీ నీచ రాక్షసుఁడు నేఁడు చంపఁదలఁచెను గదా.

సీ. పతిదేవతను నన్నుఁ • బలుమాఱు నీ పాపి, భయనయంబులఁ దన•పత్నిగాఁగ
బతిమాలి ఛీకొట్టఁ•బడి నిరాశుండయి, పేసరిమోహంబు • రోష మాత్మఁ
బెనఁగొన నను ద్రుంపఁ•జను దెంచు చున్నాఁడు, సత్యంబు లే దిందు•సందియంబు
అటుగాక నాకొఱ•కమ్మహానుభావుల•, జంపెనో రామల•క్ష్మణుల వీఁడు
తే. ఇన్ని నీ మన్నినిమిత్తంబు•నృపతనూజు, లంతమొందిరో దైవమా!•యెంతపుట్టెఁ
గాక యీ పాపిపుత్రశో•కమున వారిఁ, జంప లేకిటు వచ్చె నన్•ద్రుంపఁగోరి.

తాత్పర్యము

భర్తయే దైవమని నెంచియుండు నన్ను నీ పాపాత్ముఁడు మంచి మాటలచేత, బెదరింపులచేత బలుమాఱు తన భార్యగమ్మని ప్రార్థించి నేను ఛీ కొట్టఁగా నిఁక నిది లోపడ దని నా యాశ వదలి విసిఁగి మోహము రోషము మనస్సున బెనఁగులాడ నన్నుఁ జంపుటకు వచ్చుచున్నాఁడు. ఇది నిజము సందేహము లేదు. నన్నుఁ జంపవచ్చుటకిది యొక కారణమై యుండవచ్చును. లేదా మహానుభావులైన రామలక్ష్మణులవీఁడుచంపి యట్టులేయిచ్చటికివచ్చుచున్నాఁడేమో! అయ్యయ్యో! నానిమిత్తము రాజకుమారులు మరణించిరేమో! దైవమా! యెంత పుట్టెను ?

అదియును గాదని తోఁచుచున్నది. ఈ పాపాత్ముఁడు కొడుకులు చచ్చెనన్న దుఃఖముచే రామలక్ష్మణులను జంపలేక నన్నుఁ జంపవచ్చు చున్నాఁడేమో?

దీనివలన సీతాదేవికి యుద్ధవార్త యేదియుఁ దెలియరాదని యేర్పాటులు చేసినను, సరమాదేవివలనఁ దెలియుచుండెనని యేర్పడుచున్నది.

ఉ. ఎంతటిబుద్ధిహీన హిత ♦ మెంచిన సమ్మతిమంతుఁడౌ హనూ
మంతునిమాటలం గొనక ♦ మాలితి, నాతనిమాటఁ బట్టి ని
శ్చింతత వీఁపు నెక్కి చనఁ ♦ జిక్కొక టేనియు లేక హాయి నే
నింతకు నాథునంకమున ♦ నిమ్ముగ నుండనె యిట్టు లేడ్తునే? ౨౧౬౩

తాత్పర్యము

నేను మిక్కిలి బుద్ధిలేని దానను నా మేలుగోరి మతిమంతుఁడైన హనుమంతుఁడు చెప్పినమాట విననిదానఁగాను. ఆయన చెప్పినట్లు విని వీఁపెక్కిపోయి యుండినచో వారికిఁగాని నాకుఁగాని యే చిక్కు లేక యిప్పటికి హాయిగా నాభర్త తొడమీఁదఁ గూర్చుండి యుందునుగదా. ఇట్టు లిచ్చట నేడ్చుచుందునా?

సీ. ఎంతశోకించునో ♦ యేకపుత్రిక సాధ్వి, కౌసల్య కొమరుండు ♦ కదనసీమ
హతుఁడైన నుడి విని ♦ యార్యపుత్రునిఁ దాను, గానక కానక ♦ కన్నవిధము
బాల్యసంక్రీడలఁ ♦ బ్రజ ముద్దుబిడ్డఁడై, ముద్దులసుద్దుల ♦ మురిపె మిడుట
యౌవనమందుఁ దా ♦ నర్మిలిఁ దనయొడఁ జూపెడిభక్తియు ♦ శుద్ధచరిత
తే. ధర్మకార్యానురూపతఁ♦దలఁచితలఁచి,గుండెలవియఁగ నిఁక నేటి♦కొడుకటంచు
నాసలను మాని శ్రాద్ధకా♦ర్యములఁదీర్చి తానుజితియందొనీటియం♦దో నశించు.

అర్థములు. ఏకపుత్రిక = ఒంటికొడుకును గలది, కదనసీమ=యుద్ధభూమియందు, హతుఁడు=చంపఁబడినవాఁడు, ఆర్యపుత్రుని=నామగనిని.

తాత్పర్యము

ఒంటికొడుకునుగలది, సాధ్వి, కౌసల్యాదేవి, తన కుమారుఁడు యుద్ధమందుఁ జచ్చెనన్న మాటవిని యెంత శోకించునోకదా. లేక లేక యెంతో వ్రతానుష్ఠానములచే శ్రమపడి నా భర్తను గనిన విధము, బాల్యమందాయన యాడుకొను చుండిన విధము, ప్రజల కందఱకు వారి వారి ముద్దుబిడ్డలవంటివాఁడై యద్దుముద్దు సుద్దుల ప్రేమకలిగించు చుండినవిధము, వయస్సువచ్చిన పిమ్మట ప్రేమతో నాయన తన్ను భక్తితోఁ బూజించుచుండిన విధము, శుద్ధమైన నడవడి, ధర్మకార్యములందు తగిన విధముగా వర్తించుట తలఁచితలఁచి గుండెలు పగులఁగా నిఁక నా కెక్కడి కొడుకని యాసలుమాని శ్రాద్ధకార్యములు దీరఁగానే తాను అగ్నియందో నీటియందో పడి నశించును. అటుచేయకున్న నీ దుఃఖ మెట్లు సహింపగలదు? ఎంతకాలమని సహింపఁ గలదు?

కం. ఇంతకు మూలం బా జగ, జంత యపతి కుబ్జ దుష్ట ♦ చరితయ యిస్సీ
 యెంతటిదుఃఖం బా సు, స్వాంతకుఁ గౌసల్య కొదవె♦నా మంథరచేన్.

అర్థములు. జగజంత = పెద్దధూర్తురాలు, అపతి = లంజియ, దుష్టచరితయ=చెడునడవడికలది, సుస్వాంతకు=మంచి మనస్సు గలదానికి.

తాత్పర్యము

ఇంత యనర్థమునకు మూలము ఆ పెద్ద ధూర్త లంజ, పొట్టిది, చెడునడవడి గల దాసిగదా. ఛీ. ఆ మంథరచే మంచి మనస్సుగల కౌసల్యకు నెంత దుఃఖము సంభవించెను. తనకుఁ గలిగిన దుఃఖము కంటెఁ గౌసల్యా దేవికిఁ గలిగిన దుఃఖము నకై పలుమారు విశేషించి సీతాదేవి దుఃఖించుటచే నామెకు నత్తగారియం దెంత ప్రేమయో యీ కాలపుఁ గోడండ్రు ఆలోచించి యనువర్తింతురు గాక. ఇది యార్యస్త్రీల లక్షణము.

## —♦ సుపార్శ్వుఁడు రావణునకు నీతిఁ దెలిపి మరలించుట ♦—

చ. అని యిటు భర్తృహీన యయి ♦ యల్లగ్రహంబున బారిఁబడ్డ చం
 ద్రునిసతిఁబోలి యేడ్చు నృప ♦ తో యజలోచనఁ గాంచి ధీయుతుం
 డును శుచి యాసుపార్శ్వుఁడు న♦నుత్తమమంత్రి హితావళీనిరు
 ద్ధుని దశకంధరుం గదిసి ♦ తూర్ణ మపల్కె మనంబు దాఁకఁగన్. ౨౧౬౬

అర్థములు. భర్తృహీన = సమీపమందు భర్తలేనిది, అల్లగ్రహంబున బారిన్=ఆ క్రూరగ్రహమైన యంగారకుని యొక్క బారి, షష్ఠ్యర్థమున నకారాగమము. అనుత్తమ మంత్రి=మంత్రులయందు మిక్కిలి యుత్తముఁడు, హితావళీ నిరుద్ధుని = హితుల గుంపులచే నడ్డగింపఁబడిన వానిని, దశకంధరున్ = పదితలల వానిని. ఇప్పుడు వీఁడు పదితలలతో నున్నాఁడు కనుకనే ౨౧౮౯ వ పద్యంబున భ్రుకుటి యనునది సంస్కృతమున బహువచనముగఁ బ్రయోగింపఁబడెను. మనంబు దాఁకఁగన్=మనస్సునకుఁ దగులునట్లు.

తాత్పర్యము

ఈ ప్రకారము భర్త యొద్ద లేనిదై యంగారకుని బారిఁబడ్డ రోహిణివలె యేడ్చు రాచకన్నియను జూచి బుద్ధిమంతుఁడును, పవిత్రగుణము గలవాఁడు నగు సుపార్శ్వుఁడను గొప్ప మంత్రిసత్తముడు హితులచే నివారింపఁబడిన రావణుని యొద్దకు త్వరగాఁబోయి వానికి మనస్సునకుఁ దగులునట్లు ఇట్లు చెప్పెను.

ఉ. ఓర! దశాస్య! బ్రహ్మకుల ♦ మందు జనించి, కుబేరుతమ్ముఁడై,
 పారము ముట్ట వేదములు ♦ వల్లియ నైచి, వ్రతంబు లన్నియుం
 దీరిచి, స్నాతకుండ వయి ♦ నిత్యవిజోచితకర్మశీలి వై
 నీరజనేత్రనా తునుమ ♦ నీవు తెగించితి? వీరసత్తమా! ౨౧౬౭

తాత్పర్యము

ఓరా పదితలలవాఁడా! బ్రహ్మవంశమందుఁ బుట్టి, కుబేరు నంతటి వానికిఁ దమ్ముఁడవై వేదము లన్నియుఁ దుదముట్ట నధ్యయనము చేసి వ్రతము లన్నియుఁ దీర్చి స్నాతకుండవై ప్రతిదినము చేయవలసి నీ కుచితమైన కర్మములు చేయుచున్న వాఁడవై కడపట నాఁడుదానినా చంపఁ దెగించితివి ? ఎంతటి వీరుఁడవు !

కం. కోపంబు చేత నెంతటి, పాపం బొడిగట్ట వలసెఁ ♦ బరికింపవుగా
యేపగిది ధర్మమంచును, నీ పాపం జంపఁబూని ♦ తీ వసురేంద్రా !

తాత్పర్యము

కోపము చేత నెంత పాపము సంపాదింప నెంచితివో నీవాలోచింప వైతివిగదా. ఈ స్త్రీని జంపుట ధర్మమని యేవిధముగా నాలోచించితివో చెప్పుము.

ఉ. మానవతీ సురూపమహి♦మంబును జూడుమ, యెట్లు లోకకాం నీ
కీ నవలా వధింపఁ జేయి ♦ యెత్తఁగఁ జిత్తము వచ్చె? రాక్షసే
శా! నెఱశూరు లైన మము ♦ సాయముగాఁ గొని రామచంద్రుపై
మానితభంగి నీదు మెద ♦ మండెడు కోపము. మెచ్చు లోకముల్. ౫౧౬౯

అర్థములు. మానవతీసురూప మహిమంబును = ఈ స్త్రీ సౌందర్యము యొక్క యతిశయమును, నవలాన్ = ఆఁడుదానిని, నెఱశూరులు = మిక్కిలిశూరులు.

తాత్పర్యము

ఈమె యెంతటి సౌందర్యవతియో యది యెనఁ జూడుము. ఇట్టి దానిని జంపుటకై చేయి యెత్త నీకు మనస్సెట్లు వచ్చెను? గౌరవింప వలసిన పదార్థమును హింసింప వచ్చునా ? రాక్షసరాజా ! మిక్కిలి శూరులైన మమ్ము సహాయులుగాఁ దీసికొని, నీలో మండుచున్న కోపమును రామచంద్రునిపై వదలితివేని లోకము నిన్ను శూరుఁడని మెచ్చునుగాని నీ కే యపరాధము చేయని, నీపై యుద్ధమునకు రాని, నీ కే కీడు చేయని యాఁడుదానిని జంపిన నిన్ను మగవాఁడని పౌరుషశాలి వని శూరుఁడ వని లోకము దలఁచునా ?

తే. కృష్ణపక్ష చతుర్దశి ♦ నిపుడు లేచి
యభ్యమిత్రుండ వగుచుఁ బ్ర♦యాణసన్న
హన మొనర్చి యమావాస్య ♦ యగుట జేవ
బలఁగములతోడ నని కేగి ♦ గెలుపుఁ గొనుము.

తాత్పర్యము

ఈ దినము కృష్ణపక్ష చతుర్దశి, ఇపుడు లేచి శత్రువుపై దండు వెడలు ప్రయాణ సన్నాహము చేసి రేపు అమావాస్య గావున సేనతోడఁబోయి యుద్ధము చేసి జయింపుము.

"యో గచ్ఛత్యలం విద్విషతః ప్రతిసోఽభ్యమిత్రోఽభ్యమిత్రీయోఽభ్యభ్యమి

త్రీణ ఇత్యపి," అమరము. శత్రువుల కెదురుగాఁ బోవువాఁడు అభ్యమిత్రుఁడు, అభ్యమిత్రీయుఁడు, అభ్యమిత్రీణుఁ డనఁబడును.

ఒక మతమున పున్నమనాఁడు సువేలారోహణము. కృష్ణపక్ష ప్రథమయందు యుద్ధారంభము. ఆ రాత్రి నాగపాశబంధము. విమోచనము. ద్వితీయ యందు ధూమ్రాక్ష వధ. తృతీయయందు వజ్రదంష్ట్రి వధ. చతుర్థియం దకంపన వధ. పంచమియందుఁ బ్రహస్త వధ. షష్ఠిని రావణ మకుటభంగము. సప్తమి కుంభ కర్ణ వధ. అష్టమి అతికాయాదుల వధ. నవమి నింద్రజిత్తు యుద్ధము. ఆరాత్రి కుంభ నికుంభ వధ. దశమి మకరాక్షవధ. ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి ఇంద్ర జిత్తు యుద్ధము అని కొందఱు,

నవమినాఁడు యుద్ధారంభము. రెండు దినములలో రావణేంద్రజిత్తులు మూల బలము తప్పఁ దక్కినవా రందఱు చచ్చుట. ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి ఇంద్ర జిత్తు యుద్ధము, వధ. చతుర్దశి, మూలబల యుద్ధము. తాను స్వయముగ వచ్చెద నని రావణుఁడు చెప్పుట. ఈ విషయము ముందు చర్చింపఁబడినది.

కం. శూరుండవు, ధీరుండవు, సారతరకృపాణి వీవు • స్యందనగుఁడవున్
ధీరతుఁడవు రథి వై చని, శ్రీరామునిఁ జంపి సీతఁ • జేకొను మధిపా! ౨౧౭౧

అర్థములు. సారతరకృపాణివి = మిక్కిలి బలముగల కత్తిగలవాఁడవు. ఇది కైలాసము పెల్లగించినపుడు శివుఁడిచ్చినది. చూ. ఉత్తర. ౩౪౦ ప. స్యందన గుఁడవున్ = బ్రహ్మ యిచ్చిన రథముగలవాఁడవు, ఇట్టినీవు - ధీరతుఁడవు అయి = బుద్ధిమంతుఁడవై, ఇట్లు చెప్పుటచే నీ విప్పుడు చేయఁబూనినది బుద్ధిలేని కార్యమని భావము. నీవు సీతను గ్రహింపఁ దెచ్చితివా? ఆమెను జంపఁ దెచ్చితివా? ఆమెను జంపుట నీ యుద్దేశమేని నానాఁడే యచ్చటనే చంపియుండ వచ్చును. అటుగాక గ్రహింపనెంచితివా? ఇప్పుడు చంపిన నీ కోరిక యెట్లు నెఱవేఱును. నీ కోరిక నెఱవేఱవలసి యుండిన రామునిఁ జంపవలెను. ఇప్పుడు నీవు ఈమెను జంపినఁజచ్చిన నీ కొడుకులు లేచివత్తురా? రామునితో యుద్ధము తప్పునా? ఆయన మఱింత కోపముతో లంకను నిన్ను మమ్మునందఱను నాశము చేయునుగాని మానఁడు. కావున నీకు యుద్ధమెట్లును దప్పదు. అట్లు తప్పనప్పుడు నీవే శూరుఁడవై ధీరుఁడవై సాయుధుఁడవై పోయి యుద్ధము చేయుము జయింపుము. నీ కోరిక నెఱవేఱును. సీత నీకు స్వాధీనపడును మార్గమదిగాని యిదిగాదు. సీతను జంపిన మనపీడ పోవునంటివి. అది యెట్లుపోవును? నీ వానాఁడే చంపియుండిన యెడల లంకానాశము గాకుండును. నీ బంధువులు చావక యుందురు. అప్పుడేదియుఁ జేయక యంతయు మించిన తరువాత నిట్టి నీచకార్యము తలపెట్టిన నీ వేమి బుద్ధిమంతుఁడవు? కావున బ్రహ్మ యిచ్చిన రథము మీఁదఁబోయి రామునిఁజంపి సీతను గ్రహించి నీ యిష్టము దీర్చుకొనుము

రామునిమీఁదికియుద్ధమునకుఁబోయిన జయింపలేనుజత్తునని నిశ్చయించుకొంటివా? అట్లయినను సీతను జంపిన రాఁగల లాభమేమి? ఇప్పుడు నీవు సీతను జంపితి వనుకో యుద్ధమున నీవు జయించితి వనుకో, అప్పుడు సీత యెందుండి వచ్చును ?

తే. అనిన దుష్టాత్ముఁ డా ధర్మ్య♦మైనపలుకు, లాలకించి గృహంబున♦కరిగి యిష్ట
సచివజనసంయుతుండయి♦సభను దీరి, కేసరి యనంగ నూర్పుచు♦రోసమునను.

అర్థములు. దుష్టాత్ముండు=దుష్టమైన మనస్సుగలవాఁడైనను, ధర్మ్యము= ధర్మయుక్తము, ఇష్టసచివజనసంయుతుండయి = ఇష్టులతోను, మంత్రులతోను స్నేహితులతోను గూడిన వాఁడై.

### తాత్పర్యము

అని చెప్పఁగాఁ జెడుమనస్సు గలవాఁడైనను ధర్మములోఁ గూడిన యా మాటలు విని యింటికిఁబోయి ఇష్టులతో మంత్రులతోఁ గూడి సభతీరి రోసముచే సింహమువలె శ్వాసములు పుచ్చుచుండెను.

## —♦ ౯౪-వ సర్గము మూలబల యుద్ధము. ♦—

సీ. పరమదుఃఖితుఁ డయి♦బహుళ దైన్యంబున, బలముఖ్యవర్యులఁ♦బాఱఁ జూచి
కడుపుదుఃఖమునన్నుఁ♦గాల్పఁగఁ జేమోడ్పు, ఘటియించియనుఁగార్య♦ఘటకులార !
హస్త్యశ్వయుక్తంబు♦స్యందనభటరాజితం బగు సేనతో♦దాడి వెడలి
రాము నొక్కనిఁ జుట్టి♦ప్రావృడబ్దములన, శరవర్షముల ముంచి♦చంపుఁ డీరు
ఆ. రేపు నేను మీకుఁ♦బ్రాపుగఁ జనుదెంచి
జానకీశుఁ ద్రుంచి♦జగ మెఱుంగ
జయముఁ గాంచి♦మిమ్ము సత్కరించెద నన్న
వారు వల్లె యనుచు♦బయలు వెడలి ౨౧౬౩

అర్థములు. బలముఖ్యవర్యులన్ = బలాధిపతులను, ముఖ్యనాయకులు ప్రహస్తాదులు చచ్చిరి. బలనాయకులు మిగిలినవారు, చేమోడ్పు ఘటియించి = నమస్కరించి, దీనికిఁగారణము శోక వేదన, తిరస్కారభయము, కార్యఘటకులార= కార్యమును సాధించువారలార, హస్తి, అశ్వ, యుక్తంబు=ఏనుఁగులతోను గుఱ్ఱములతోనుగూడినది, స్యందనభటరాజితంబు = తేర్లచే భటులచే ప్రకాశించునది, దాడి=ధాటి శబ్దభవము, ప్రావృడబ్దములు = వానకాల మేఘములు రేపు నేను మీకుఁ బ్రాపుగఁ జనుదెంతుననుటచే, ఈదినమంతయు రామునకు వీరితో యుద్ధము చేయుటతో సరిపోవునని రావణుని యభిప్రాయము, గాని మూఁడుముక్కాలు గడియలలో వీరందఱు చచ్చిరి.

### తాత్పర్యము

అయిన వారందఱు చచ్చిరే యని మిగుల దుఃఖము గలవాఁడై మిక్కిలి

దీనుఁడై బలాఢ్యతములను జూచి పుత్రశోకము దన్నుఁ గాల్పఁగ వారికి నమస్క
రించి యిట్లనెను. కార్యసాధకులారా! మీరు చతురంగ సేనతో దండు వెడలి
పోయి వానరులతోఁ బెనఁగులాడక యొక్క రాముని మాత్రము చుట్టుకొని వర్షా
కాలమేఘమువలె శరవర్షములచే ముంచి చంపుఁడు. చంపఁజాలరేని గాయములు
పడి యలయునట్లు గొట్టుఁడు. నేను వచ్చునప్పటికతఁ డలసి యుండిన నదియు
నాకు సాహాయ్యమే. రేపు నేను మీకు సహాయుఁడనై వచ్చి రాముని జంపి
జగత్ప్రసిద్ధముగ జయముగొని మీ కందఱకుఁ దగిన బహుమానము లిచ్చెదను.
అనిన వారు సంగీకరించి బయలు వెడలి.

కం. నానానీకంబులతో, సేనాపతులెల్ల వెడలి ♦ సితపట్టిససం
తానంబులఁ బరిఘంబుల, వానరవీరులను వైచి ♦ బవరము సేయన్. ౨౧౭౮

అర్థములు. నానా+అనీకంబులతోన్=పెక్కు సేనలతో, సిత=పదునైన,
పట్టిస=అడ్డకత్తుల, సంతానంబులన్ = సమూహమును, పరిఘంబులన్ = గుదియ
లను, బవరము=యుద్ధము.

తాత్పర్యము

ఆబలాఢ్యతము లందఱు నానాసేనలతో బయలుదేఱి వాఁడి యగు నడ్డ
కత్తులను గుదియలను వానరుల మీఁద వేసి యుద్ధము చేయఁగా.

సీ. భాస్కరోదయ వేళఁ ♦ బ్రధనకేళికి నయి, దశకంఠుబలములు ♦ దాఁకుటయును
వానరవీరులు ♦ వసుధారుహంబుల, వసుధాధరంబుల ♦ వైచి వైచి
పోరొనరింపఁగ ♦ ఘోరఖడ్గాముల, గదల రాక్షసకోటి ♦ కసిమసంగి
చంపనిట్లని వచి ♦ యింప రాకుండ సంగ్రామ మవ్వేళను ♦ భీమ మయ్యె
తే. చరణనిహతిసముద్భూత♦ధరణిరజము, క్షతజకూలంకషల చేత ♦ శాంత మయ్యె
రక్తనదులందు నౌకలై♦రథములమరెఁ, గీశరాక్షస సంగ్రామ ♦ ఖేలనమున.

అర్థములు. భాస్కరోదయ వేళ = సూర్యోదయ సమయమున, చతుర్దశి
నాఁడు, ప్రధనకేళికి = యుద్ధక్రీడకు, వసుధారుహంబులన్ = చెట్లను, వసుధా
ధరంబులన్=పర్వతములను, కసిమసంగి = విజృంభించి, చరణనిహతి = కాలిదెబ్బ
లచే, సముద్భూత=పుట్టిన, ధరణిరజము=నేలదుమ్ము, క్షతజ = నెత్తుటి, కూలంక
షల చేతన్ = నదులచే, శాంతమయ్యెన్ = అణఁగెను, రక్తనదులందు=నెత్తుటి
యేళ్ళయందు, నౌకలై = నావలై, ఖేలనమునన్ = ఆటయందు.

తాత్పర్యము

సూర్యోదయ వేళ యుద్ధక్రీడకై రావణు సేనలు దాఁకఁగా వానరవీరులు చెట్లు
గుట్టలు వేసివేసి యుద్ధము చేయగా రాక్షసులు విజృంభించి కత్తుల చేతను గదల చేతను
జంపఁగా యుద్ధమిట్లు జరిగెనని చెప్పశక్యపడని విధముగ మహాభయంకరమయ్యెను.
వారల కాలిదెబ్బలచే లేచినదుమ్ము నెత్తురు వెల్లువలచే శమించెను. వానర రాక్షస
యుద్ధమను నుత్సవమున నెత్తుటి యేళ్ళయందు రథములు నావలై యొప్పెను.

కం. కరిరథచయకూలంబులు, తురగఝషంబులు శరీర•తుంగోడుపముల్
గురుకేతనభూరుహములు, పరఁగెన్ రుధిరాపగానివహములు దళచై. ౨౧౬౭

అర్థములు. కరిరథచయ కూలంబులు = ఏనుఁగుల తేరుల సమూహము లనెడి యొడ్డులు, తురగఝషంబులు=గుఱ్ఱములను చేఁపలు, శరీరతుంగోడుపముల్ = కళేబరము లను నెత్తైన పడవలు, గురుకేతనభూరుహములు = పెద్ద ధ్వజము లను చెట్లునను, రుధిరాపగా=నెత్తురు టేర్లు, నివహములు=సమూహములు, దళచై = విశేషించి.

### తాత్పర్యము

ఏనుఁగులు రథ సమూహము లొడ్డులుగను, గుఱ్ఱములు చేఁపలుగను, శరీరములు నెత్తయిన పడవలు గను, పెద్దచెట్లు ధ్వజములుగను నెత్తుటి యేళ్ళ సమూహములు విశేషించి పాఱెను.

కం. నెత్తురులఁ దోఁగుచుం జెను, హత్తుల ఘోటులను ధ్వజచ•యంబులఁ బైపై
మొత్తముగ నెగిరి యెగిరి ప్రమత్తత దొరఁగించిరిలను•మర్కట వీరుల్.

అర్థములు. తోఁగుచున్=స్నానము చేయుచు, మునుఁగుచు, హత్తులన్= ఏనుఁగులను, ఘోటులను=గుఱ్ఱములను, ధ్వజచయంబులన్ = టెక్కెముల సమూహములను, ప్రమత్తతన్=మిగుల మత్తుచేత.

### తాత్పర్యము

వానరులు నెత్తుటిలో మునుఁగుచు పైపై కెగిరి యెగిరి యేనుఁగులను, గుఱ్ఱములను, ధ్వజములను, నేలఁబడఁద్రోచిరి.

తే. జానుగుల నాసికలను నో•సళ్ళ వెంద్రుకలను గోళ్ళను రదముల • బలము మెఱయ
బెఱుకుచును గోఱుకుచుఁ దెగ • నఱకు చిట్టు
లసురవర్యుల వేధించె • నగచరాళి. ౨౧౬౮

అర్థములు. జానుగులన్ = చెవులను, రదములన్ = పండ్లచేతను, వేధించెను = బాధించెను.

### తాత్పర్యము

చెవులను ముక్కులను నొసళ్ళను వెండ్రుకలను గోళ్ళచేతను దంతముల చేతను దమ బలము ప్రకాశించునట్లు పెఱుకుచుఁ గోఱుకుచు నఱకుచు నీప్రకారము రాక్షసులను వానర సమూహము బాధించెను,

కం. పండినవృక్షమునకు ఖగ, కాండంబులు పఱచునట్లు • కపు లోకైకమా
ర్తుం డగు నసురకుఁ గవిసిరి, దండిమగలు నూర్లకోలఁది•దర్పము మెఱయన్.

అర్థములు. ఖగకాండంబులు = పక్షుల గుంపులు, పఱచునట్లు = పరువెత్తునట్లు, మార్తుండు = విరోధి.

తా త్ప ర్య ము

పండిన వృక్షమునకై పక్షులు పాఱునట్లు లోకోత్కృష్ట రాక్షసుని మీఁదికి శూరులైన వానరులు నూర్లకొలఁది కవిసిరి.

చ. ప్రతిభటు లోహటింపక వ • రశ్వధశూల కృపాణవల్లరీ
శితపరిఘాశుగంబులను • జీల్చిరి కూల్చిరి నొంచి త్రుంచి వే
కుతిలపడంగ డీలుపడఁ • గొందల మందఁగఁ దల్లడిల్ల లో
వెతఁగొనఁ బాఱఁదోలిరి కపి • ప్రవరధ్వజినీచయంబులన్. ౨౧౦౦

ప్రతిభటులు = విరోధులు, ఓహటింపక = వెనుదీయక, పరశ్వధ=గండ్ర గొడ్డండ్ల చేతను, కృపాణవల్లరీ=తీఁగలవంటి కత్తుల చేతను, కపిప్రవరధ్వజినీ చయం బులన్=వానరవీరుల సేనాసమూహములను, కుతిలపడంగన్=బాధపడ, డీలుపడన్= డిల్లఁబోవఁగ, కొందల మందఁగన్ = క్షోభిల్లఁగా, తల్లడిల్లన్=తత్తఱపడఁగా.

తా త్ప ర్య ము

విరోధులగు రాక్షసులు వెనుదీయక గండ్రగొడ్డండ్ల చేతను, శూలముల చేతను, తీఁగలవలె పోఁగలైన కత్తుల చేతను, పదునుగల గుదియలు బాణముల చేతను, వానర వీరుల సేనాసమూహములను బాధపడునట్లు, డిల్లఁబోవునట్లు, కలఁత పడునట్లు, తత్తఱలాడునట్లు చీల్చిరి, నేలఁ బడఁగొట్టిరి నొప్పించిరి, ఖండించిరి, పాఱఁదోలిరి.

కం. సురవైరిచయము లెగవఁగ, హరులెల్లరు విఱిగి దశర • థాత్మజు రామున్
బరమార్తశరణ్యునిఁ గని, శరణంబును జొరఁగ రామచంద్రుం డలుకన్.

అర్థములు. ఎగవఁగన్ = తఱుమఁగా, హరులు = వానరులు, విఱిగి= చెదరి, పరమార్త శరణ్యునిన్=ఆర్తుల రక్షించువారిలో నుత్తముని.

తా త్ప ర్య ము స్పష్టము.

## —• శ్రీరాముఁడు మూలబలంబు సంహరించుట. •—

చ. పరమశరాసనంబుఁ గొని • పార్థివవర్యుఁడు శత్రుకోటిలోఁ
జొరఁబడి బాణవర్షమున • జోరున ముంపఁగ సూర్య మేఘముల్
దరిఁ జనలేని చందమున • దావమహాగ్ని ని డాయ రాని య
క్కరణిని నొక్కఁడేని కనఁ • గానఁడు డాయుట చెప్పనేటికిన్. ౨౧౦౨

అర్థములు. పరమశరాసనంబునన్=శ్రేష్ఠమైన వింటిని. దరిన్ = సమీప మందు, దావమహాగ్ని ని=పెద్దకాఱు చిచ్చును, డాయరాని = సమీపింపరాని, కనఁగానఁడు=చూచుటకు శక్తిగలవాఁడు గాఁడు.

తా త్ప ర్య ము

ఉత్తమమగు విల్లు తీసికొని రామచంద్రమూర్తి శత్రు సమూహములోఁ బ్రవేశించి జోరుమని బాణవర్షముచే ముంపఁగా సూర్యుని మేఘములు సమీపింప

లేనట్లు కాలు చిచ్చు నొద్దకుఁబోవ సాధ్యపడునట్టు లాయన నొకఁడైనఁ గన్నులఁ జూడఁ గలిగినవాఁడు కాఁడు ఇఁక సమీపింప లేదని చెప్పనేల?

చ. శిఖశిఖ లొక్కటం గవియ ♦ చెల్వునఁ గ్రక్కుచు నిప్పు సర్వతో
ముఖ మయి రాము బాణముల ♦ ముమ్మర మై పఱవంగ నమ్మహా
ప్రఖరశితేషువుల్ దగిలి ♦ వ్రయ్యఁగ మేనులు పోఁతులున్ మరు
త్సఖపరిదగ్ధ మూ మిషుత ♦ దండులఁబోలి రొకింతసేపులోన్. ౨౧౮౩

అర్థములు. శిఖశిఖలు = అగ్నిజ్వాలలు, ఒక్కటన్ = ఒక్కసారిగ, సర్వతోముఖము = అన్నిప్రక్కల ముఖముగలది, అన్నిదిక్కులఁ బోవునది, ముమ్మరమై = విశేషముగ సందు లేకుండ, ప్రఖర=మిగులఁ గఠినములైన, శితేషువుల్=పదునైన బాణములు, వ్రయ్యగన్=చీలఁగా, పోఁతులున్ = రాక్షసులు, మరుత్సఖ=అగ్నిచే, పరిదగ్ధమూ=బాగుగఁ గాలిన.

తాత్పర్యము

ఒక్కసారిగ నగ్నిజ్వాలలు మీఁదఁ బడినట్లు నిప్పులు గ్రక్కుచు రాముని బాణములు దట్టముగ నన్ని దిశలఁ బాఱఁగాఁ గఠినములైన యా బాణములు దవిలి దేహములు చీలఁగా రాక్షసులు గాలిసహాయముగాఁ గల యగ్నిచే మిడుతల దండువలెఁ గాలిరి.

ఉ. ఇట్టి దటంచు నేరు పచి ♦ యింపఁగరాని జవంబునన్ నృపా
లేట్టు చలద్విరోధిబలుఁ ♦ డేప రొసంగ మహారథావళిన్
దిట్టినఁ గూలునట్లు కడుఁ ♦ దీవ్రతఁ ద్రుంప నరణ్యవీథులన్
గొట్టు మహాశుగంబుఁ గనఁ ♦ గూడనిభంగిగ నయ్యె వారికిన్. ౨౧౮౪

అర్థములు. నృపాలేట్టు = రాజశ్రేష్ఠుఁడు, చలత్ + విరోధి బలుఁడు= చలించుచున్న శత్రుసేన గలవాఁడు, ఏప=విజృంభణము, మహాశుగంబు = పెద్ద గాలి, కనఁగూడని భంగిగన్=చూడ లేని విధముగ.

తాత్పర్యము

ఇంతటి వేగమని చెప్ప సాధ్యపడని వేగముతో రాజశ్రేష్ఠుఁడు, తన బాణముల తాఁకునఁ జలించుశత్రుసేనలు గలవాఁడు నగు రామచంద్రమూర్తి విజృంభింపఁగా మహారథుల గుంపులును శపింపఁగా వెంటనే నేలఁబడినట్లు మిగుల వేగముతో ఖండింపఁగా నడవులందు తీవ్రమైన వీచుగాలిని జూడ సాధ్యముగాని విధమున నయ్యెను.

ఇచ్చట నోరుగాలి యని యుపమించుటచే గాలి కానరానట్లు రామచంద్ర మూర్తియు వేగాతిశయమునఁ గానరా లేదనియు, వీచుటచే చెట్లు పడుటచే గాలి యున్నదని యూహించునట్లు రాక్షసులు చచ్చుటచేత బాణములు తగులుట చేత రామచంద్రమూర్తి యునికి ననుమానింప వలసి యుండెననియు భావము. హస్త

లాఘవముచే బాణములు విడుచుట కానరాకుండుటయే కాదు. దేహలాఘవముచే గమనవేగముచే రామచంద్రమూర్తియుఁ గానరాఁడయ్యెను. దూరమున నుండి బాణములు ప్రయోగించుచుండిన ముందున్నవారికి మాత్రమే తగులును. ఆప్రకారము పడఁగొట్టఁ బూనిన నింతసేనను జంపుటకు నెంతో కాలము పట్టును. కావున నా మార్గము వదలి తానే సేనలోఁ జొరఁబడి నాలుగు ప్రక్కల దిరిగి ధ్వంసము చేయ నారంభించెను.

కం. ఛిన్నము భిన్నము విభవ,స్కన్నము సన్నఁబు నగుచు • సైన్యము శరసం
ఛన్నం బయ్యె మహీస్థలి, కన్నులు కడు గోరగింపఁ•గాఁ జూపఱకున్.

అర్థములు. ఛిన్నము=ఖండింపఁబడినది, భిన్నము = చీల్పఁబడినది, విభవస్కన్నము = స్కన్నవిభవము = కాంతి సంపద చెడినది, సన్నము = క్రమ క్రమముగా పలుచఁ బాఱినది, శరసంఛన్నము=పీనుఁగులచేఁ గప్పఁబడినది.

తాత్పర్యము

చీలి తునకలై కాంతిచెడి క్షీణించి యా సైన్యము భూమిని పీనుఁగులచేఁ గప్పినదిగ చేయఁగా చూచువారికిఁ గన్నులు గోరగించుచుండెను.

కం. కూలెడితల, తూలెడితల ప్రేలెడితల దగ్ధభగ్న • పీడితతనువుల్
చాల నెటుచూడఁ దోచెన్, జాలమువలెఁ గానరాఁడు • జనపతి యొచటన్.

అర్థములు. తూలెడితల = సగము తెగుటచే కదలుచుండు తల, దగ్ధ = కాలినది, భగ్న = విఱిగినది, పీడిత = బాధింపఁబడినది, తనువుల్ = శరీరములు, జాలము = ఇంద్రజాలము చేసినట్లు.

తాత్పర్యము

ఏప్రక్క చూచినను నేలఁబడిన తలలు, కదలుచుండుతలలు, ప్రేలాడుతలలు, కాలినదేహములు, విఱిగిన దేహములు, బాధపడుదేహములు, కానవచ్చుచుండెను. కాని ఇంద్రజాలము చేయువాఁడు గానరానట్లు రామచంద్రమూర్తి కానరాకుండెను.

ఉ. ఆ వ్వని నచ్చి బాణములు • తొమ్మున నాటుట తోఁచు గాని యా
చివ్వను క్షిప్రకారి రఘు • శేఖరుఁ డెందును గానరాఁడుగా
యవ్విధి యింద్రియార్థముల • కై మెయి నిల్చిన యాత్మఁబోలె; నా
నెవ్వడిఁ దత్ప్రచారముల • నేర్పును జెప్పఁగ నెట్లు శక్యమా. ౨౧౮౭

అర్థములు. చివ్వను=యుద్ధమందు, క్షిప్రకారి=త్వరగా పనిచేయువాఁడు, ఇంద్రియార్థములకై=ఇంద్రియార్థముల విషయముల ననుభవించుటకై, మెయిన్=దేహమందు, ఆత్మ=జీవాత్మవలె, విషయములను నింద్రియముల మూలమున ననుభవించుటచే జీవాత్మ యున్నాఁడని మన మూహించుచున్నామే కాని జీవాత్మను జూచికాదు. అట్లులే కార్యములచే రాముఁ డున్నాఁడని చేయుచున్నాఁడని

యూహింపవలసి యుండెను. కాని రాముని జూచికాదు, నెవ్వడి = నెఱవడి = పూర్ణ వేగము, తత్ = ఆయన యొక్క, ప్రచారముల నేర్పు = సంచార సామర్థ్యము.

తాత్పర్యము

ఆ యుద్ధమునందు అవ్వలివచ్చి బాణములు తమ ఱొమ్మున నాటుట మాత్రము తెలియుచుండెనే కాని యతివేగముగ సంచరించి పనిచేయు రామచంద్ర మూర్తి కానరాఁడయ్యెను. ఎట్లన దేహమునందుండి యింద్రియముల మూలమున విషయముల ననుభవించుటచే జీవాత్మఁ డున్నాఁడని యూహించుచున్నాము గాని ప్రత్యక్షముగఁ గాదుగదా అట్టులే బాణములు తమ్ముఁదగులుటచే రామచంద్ర మూర్తి యున్నాఁడని యూహింపవలసియుండెను. ఇట్లుండుటచే నా వేగము ఆసంచారవిధము నెట్లు చెప్ప సాధ్యపడును ?

మ. నరచూడామణి రామభూవిభుఁడు గాంధర్వంబునన్ మాన్పుచోఁ
బరసేనాతతి మోహితాత్మ మయి దిగ్భ్రాంతిం గొనెన్ వే పర
స్పరమున్ రాముఁడు కాఁ దలంచుచును తత్సాదృశ్యముం దోఁపఁగాఁ
బోరి నన్యోన్యముఁ గ్రుద్ధచిత్తులగుచుం బోకార్చి రా రాక్షసుల్. ౨౧౦౮

అర్థములు. నరచూడామణి = మనుజశ్రేష్ఠుఁడు, గాంధర్వంబునన్ = గంధర్వాస్త్రముచే, మోహితాత్మమయి = మోహము చెందిన మనస్సు గలదై, దిగ్భ్రాంతిన్ = దిగ్భ్రమను = దిక్కు తెలియక పోవుటను పరస్పరమున్ = రాక్షసులే యొకని నొకని నొకఁడు, రాముఁడకా = రాముఁడేయని, తత్ + సాదృశ్యమున్ = సమత్వము, పోకార్చిరి = చంపిరి. తాత్పర్యము

నరోత్తముఁడగు రామచంద్రమూర్తి గంధర్వాస్త్రము ప్రయోగించి శత్రువులను గాల్పఁగా శత్రుసేనాసమూహము ఏదియుఁ దెలిసికొనఁజాలక దిగ్భ్రమ గొనెను. వారిలో వారొకరి నొకరు రాముఁడని తలంచుచు ఆ సమత్వము కన బడఁగాఁ గోపించి యొకరి నొకరు చంపిరి.

ఈ యుద్ధమందు వాస్తవ రాముఁడు కానరాలేదనియు గాంధర్వాస్త్ర బలముచే నొక్కొక్క రాక్షసునకు నొక్క రాముఁడు కానవచ్చె ననియుఁ జెప్పఁబడెను గదా. ఆ కారణముచే పరసేనాతతి మోహితాత్మ మయ్యెనని చెప్పఁబడెను గదా ! ఇది యింద్రజిత్తు చేసిన మాయాయుద్ధము వంటిదగునా కాదా యని సందేహము.

ఇంద్రజిత్తు అతివేగముగ సంచరించెననుట సత్యమే కాని యిది వాని స్వశక్తిచే నైనది కాదు. స్వశక్తిచేతనే సంచరింపఁగలిగినవాఁ డయ్యేనేని లక్ష్మణునితో యుద్ధము చేసినప్పు డాశక్తి కనఁబఱిచియే యుండును. వాని యాశక్తి యభిచార హోమము వలన లభించిన రథరథ్యాదు లందుఁగలదు. కాని వానియందు లేదు. అట్లు వేగముగ సంచరించినను వాఁడు కానరాకుండినది గమనవేగముచేఁగాదు. మాయాశక్తిచేఁ బొగ గల్పించుకొని అది మబ్బువలె నడ్డముండఁగా దాని చాటుననుండి కొట్టెను.

రామచంద్రమూర్తి గమన బలముచేఁ గానరాఁడయ్యెఁగాని యస్త్రబలమునఁగాదు. రామచంద్రమూర్తి గానరాక పోయినదిలేదు కానవచ్చుచుండెను. కాని లక్ష్యమునకు నిలిచినవాఁడు కాఁడు. కొఱవిని మన మతివేగముగ గుండ్రముగఁ ద్రిప్పితిమేని నిప్పు కానరాకపోదు. కానవచ్చుచునే యుండునుగాని ఆ నిప్పుండు స్థలము మనము నిర్దేశింపలేము. ఏల? అతివేగ గమనముచే మనము తెప్పవాల్చునపు డెందుండునో తెలియునప్పటికది యందుండదు. అది యొక ప్రదేశమునుండి మఱియొక ప్రదేశమున కెంత వేగముగఁ బోవునో యంత వేగముగ మన దృష్టులు దానియందుఁ బడఁజాలవు. అతివేగముగఁ దిరుగు చక్రమునం దొక చుక్కయుంచి యా చుక్కను మనము బాణముతోనో తుపాకి గుండుతోనో కొట్ట యత్నించితిమేని గుండు తుపాకిని విడిచి చక్రము నొద్దకుఁ బోవులోపల ఆ చుక్క స్థలముమాఱి యుండును గావున ఆ చుక్కకు దెబ్బతగులక మఱియొందో తగులును గాని తెల్లగా నా చుక్క సర్వత్ర కానవచ్చుచునే యుండును. ఆ చుక్క స్థలము మనము తెలిసికొన లేకపోవుట మన దృష్టిదౌర్బల్యము చేతనేకాని చుక్క చేసిన యింద్రజాల మహేంద్రజాలముల చేఁగాదు. ఆ చుక్కకుఁ బ్రాణముండి మరలఁ మనలఁ గొట్టినేని మనకా దెబ్బ తగులునుగాని మన దెబ్బ దానికిఁదగులదు. కాఁబట్టి యీ చక్రవేగ మెట్టిదో రామచంద్రమూర్తి గమనవేగ మట్టిదే. అందు నింద్రజాలాదులు లేవు. ఒక రాక్షసునియందు రామచంద్రమూర్తి యాకారము కానరాఁగా నామూర్తి నుద్దేశించి కొట్టఁగా దెబ్బపడులోపల రామచంద్రమూర్తి మఱియొక చోట నుండిన కారణముచే నా దెబ్బ యెదురుగ నుండిన రాక్షసునకుఁ దగులుచుండెను. ఆ కారణముచే రాక్షసు లొకరి నొకరు కొట్టుకొనిరిగాని రాక్షసులు రామమూర్తులుగాఁ గానరాలేదు.

*గాంధర్వాస్త్రముచేఁ బెక్కురూపులు కానవచ్చెననుట సరిగాదు. అట్లు వాల్మీకి చెప్పలేదు. గాంధర్వాస్త్రముచే రాక్షసులను మాడ్చెనని చెప్పెను అనఁగా నట్లు సంచరించు నపుడు రిత్తచేతుల సంచరింపక గంధర్వాస్త్రము సాధనముగఁ దీసికొని దానిచే రాక్షసులను సంహరించెను. ఒక యాకాశబాణము చిచ్చువిడిచిన నది పైకి బోయి యచ్చట బగులఁగా నందుండి నానాబాణము లెట్లు పుట్టునో యట్లే కొన్ని మహాస్త్రములందుండి నానాయుధములు నానా స్త్రములు కూడఁ బుట్టును. ఇంద్రజిత్తు వేసిన ఆసురాస్త్రమునందుఁ గొన్ని శస్త్రములు పుట్టెఁగదా అట్టులే యిదియును. చూ. ౨౪౯౩-౨౪౯౭ పద్యములు. అది చేయఁగల కార్యమంతయే కాని తన్నుఁ బ్రయోగించిన వానికిఁ బెక్కుమూర్తులు గలిగించు శక్తి దానికిలేదు. భారతాదులందీ యస్త్రప్రయోగము చెప్పఁబడినచోట నిట్టిశక్తి చెప్పఁబడలేదు. ఒకచోటనుండి రామచంద్రమూర్తి యీ యస్త్రము ప్రయోగించియుండిన నది స్పష్టమై యుండును. కాలవిలంబనము సహింపలేక సంచారము చేయుచు దానిని

నలుముఖములఁ బ్రయోగించెను. ఈయస్త్రము నే రావణుఁడు శ్రీరామచంద్రుపైఁ బ్రయోగించెను. అప్పుడిట్టి మహిమము రావణునందుఁగాని రామునందుఁగాని యున్నట్లు చెప్పబడలేదు. చూ. ౨౬౦౧-౨౬౪౯ ప. ఇట్టి శక్తి తన యందును జగత్సర్వ సంహార సమయమున రుద్రునందుఁ గల దని రామమూర్తి చెప్పెను. జనస్థాన యుద్ధమందు (అరణ్యకాండమున) ౮౦౮-౬౪౯ పద్యము చూచునది. కావున జనస్థాన వధమందును మూలబలవధమందును రామ గమనవేగ మభివర్ణితముగాని యింద్రజాలము గాదు.

సీ. ఈయేనుఁగుల ద్రుంచు•నీతఁడే శ్రీరాముఁ, డీహయంబులఁగూల్చు•నితఁడె రాముఁ
డీరథికులఁ దీర్చు•నీతఁడే రఘురాముఁ, డీపదాతుల మాడ్చు•నితఁడె రాముఁ
డీశరంబులఁ జిమ్ము•నితఁడె సీతారాముఁ, డీ పట తెంచెడి•యితఁడె రాముఁ
డీవన్నుఁ జూచెడి•యితఁడె కోసలరాముఁ, డిదొ క త్తియె త్తిప•యితఁడె రాముఁ
తే. డంచు జగమెల్ల రామమ•యంబుగాఁగ
నీవ రాముఁడు రాముఁడ•వీవ యనుచు
నొండొరులఁ దాఁకి రాక్షసుల్•దండిశస్త్ర
సంహతులఁ గూలి మడసిరి•సంఘములుగ, ౨౧౦౯

మీఁద సంగ్రహముగఁ జెప్పినదే యిందు వివరింపఁ బడెను.

తాత్పర్యము స్పష్టము

కం. ఒక్కనికిం బెక్కురుగను, బెక్కుర కొక్కండు గాఁగ•భీమశరాసం
బక్కజము కొఁలవిఁ ద్రిప్పిన, యక్కరణిం ద్రిప్పఁ గోటి•యగపడెడి బలే.

అర్థములు. భీమ శరాసనంబు = భయంకరమైన విల్లు, కోటి=వింటికొన, అక్కజము = ఆశ్చర్యము, కొఁలవిఁద్రిప్పిన యక్కరణిన్, అను నీ యుపమానము, మాయన గమనవేగమును సూచించుచున్నది. కొఁలవి ద్రిప్పినపుడు నిప్పు చక్రము గాన వచ్చుట త్రిప్పెడివాని వేగశక్తి చేతనే కాని యింద్రజాలముచేఁ గానట్టులు రామచంద్రమూర్తియు వింటిని ద్రిప్పి వేగముచే నొక్కనికిఁ బెక్కురుగను పెక్కుర కొక్కఁడుగను గానవచ్చు చుండెను.

తాత్పర్యము స్పష్టము.

సీ. అంగనాభియును స•త్త్వార్చి శరారంబు, నేమిచాపంబు జ్యా•నిస్వనార
వంబు తేజోబుద్ధి•వరగుణజ్వాలంబు, దివ్యాస్త్రధారంబు•దీపితంబు
రాక్షసాంతకరంబు•రామచక్రంబును, గాలచక్రమువోలెఁ•గనిరి ప్రజలు
పదివే లనీకముల్•పవనవేగంబులు, పెనురథంబులు పదు•నెనిమిదియును
తే. వేలదంతు లనీకముల్•వీతిచయము, గ్రాల సాదులు పదునాల్గు•వే లనీక
ములు పదాతులురాక్షసుల్•పూర్ణశతస,హస్రయుగ్మంబనీకంబు•లపుడెకూలె.

అర్థములు. ఈ పద్యమున రామచంద్రమూర్తి సుదర్శనచక్రమునకుఁ

బోలుపఁబడుచున్నాఁడు. అంగమను దేహమే - నాభి=చక్రమునకు నడుమనుండు మిట్టప్రదేశము. రామదేహమే నాభి. సత్త్వార్చి, సత్త్వము=బలమే, అర్చి=జ్వాల 'వహ్నేర్ద్వయో ర్జ్వాలకీలా వర్చిర్హేతి శ్శిఖా స్త్రియామ్'అమరము సత్త్వము పర సంతాపకారణమగుటచే జ్వాలగాఁ జెప్పఁబడెను. శరారంబు, శర=బాణములనెడి, అరంబు = ఆకులు గలది, సుదర్శనము సహస్రారము = వేయి యాకులు గలది, "స్ఫురత్సహస్రార శిఖాతితీవ్ర" మ్మని సుదర్శనస్తోత్రము. బాణములు ఆకులుగా చెప్పుటచే ఆకుల నడుమనుండి నానాముఖములుగా అంచునకుఁ బోవునట్లు బాణ ములు వింటినుండి వేలకొలఁదులు నానా ముఖముగాఁ బోయె నని గ్రాహ్యము. నేమి = చక్రము, కడకమ్మ చాపంబు = గుండ్రముగాఁ జేయఁబడిన విల్లు, ఈ విల్లు నేమిగాఁగలది నేమిచాపము. ఈ చక్రమునకు రామశరీరము నాభియని, నేమి చక్రమని- చెప్పుటచే వింటిని మండలముగా నీడ్చినప్పుడు రామునకంటె ధనుస్సు మహోన్నతమైన దని సూచితము. నడుమనున్న చంద్రునికంటెఁ బరివేషము గొప్పదిగదా. జ్యానిస్వనారవంబు=జ్యానిస్వన=అల్లెత్రాటి మ్రోతయే,ఆరవంబు= సుదర్శనచక్రము యొక్క- జ్వాలల మ్రోఁత,సుదర్శనము జ్వాలామాల చేత విడువని ధ్వనిగలది కావున నిట ఘోషము చెప్పఁబడెను. తేజోబుద్ధి=తేజస్సు, పరాక్రమమే బుద్ధి, ఇచ్చట బుద్ధియనఁగా అక్షము = బండికన్ను. బుద్ధియనఁగా బండికన్నని యెట్లు చెప్పవచ్చుననిన "ప్లవగసైన్య ములూకజితా జితమ్"=వానరసేన ఉలూక (గూబ) జితునిచే జయింపఁబడెను, అనుచోట ఇంద్రజిత్తు ఉలూకజితుఁడని చెప్పఁ బడెను. కౌశిక శబ్దమునకు ఉలూకము (గూబ) ఇంద్రుఁడని రెండర్థములు గలవు. కావున ఉలూక శబ్దము లక్షణచే కౌశికశబ్దమును లక్షించి యింద్రుఁడని చెప్పఁ బడి ఉలూకజితుఁడనఁగా నింద్రజిత్తని చెప్పఁబడినట్లు ఇచ్చట బుద్ధిశబ్దము బుద్ధి జనకమైన అక్షలక్షణచే అక్షప్రదేశమని చెప్పఁబడెను. వరగుణజ్వాలంబు=గుణము శరీరకాంతి, అదియే జ్వాల=ప్రభ, దివ్యాస్త్రధారంబు=దివ్యాస్త్రములే ధారగాఁ గలది, ధార = వాదర, ఖండించునదియేకదా. కాలచక్రము = జ్యోతిశ్చక్రము, "యత్ర కాలచక్రం ప్రతిష్ఠితమ్" అని విష్ణుపురాణము. రామచంద్రమూర్తిచేఁ జచ్చినసేన సంఖ్య చెప్పఁబడుచున్నది, రథములు పదివేల యనీకములు. అనఁగా నేడుకోట్లు,ఇరువదితొమ్మిదిలక్షలు పదునెనిమిది వేలు;ఏనుఁగులు పదునెనిమిది వేల యనీకములు అనఁగా పదుమూడుకోట్లు, పంద్రెండులక్షలు, ఇరువది వేలు. ఏతి చయము=గుఱ్ఱములసమూహము,సాదులు=రౌతులు పదునాలుగు వేల యనీకములు. పదికోట్లు ఇరువది లక్షలు అఱువది వేలు, రాక్షసభటులు పూర్ణముగ నూట నలుబదియైదుకోట్లు ఎనుబదిలక్షలు, కూలెన్ = చచ్చెను.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి ధనుస్సనెడి సుదర్శనచక్రమునకు రాము దేహమే

నడిమి మిట్ట ప్రదేశము. బలమే జ్వాల. బాణములే అకులు, నేమియే చాపము, అల్లెత్రాటి మ్రోఁతయే జ్వాలల ధ్వని, తేజస్సే కన్ను, శరీరకాంతియే ప్రభ, దివ్యాస్త్రములే ధార, ఈవిధముగఁ బ్రకాశించుచు రాక్షసుల నాశము చేయు రామ చక్రమును జ్యోతిశ్చక్రమువలెఁ బ్రజలు చూచిరి. ఈ యుద్ధమందుఁ—

రథములు — ౭౨౯౧౫౦౦ = ౨౯౧౬౭౨౦౦౦
గజములు —౧౩౧౨౨౦౦౦౦ = ౨౬౨౮౮౦౦౦౦
తురగములు—౧౦౨౦౬౦౦౦౦= ౧౦ ౨౦౬౦౦౦౦
పదాతులు—౧౮౪౫౦౦౦౦౦= ౧౮౪౫౦౦౦౦౦

రథములు గజములు అని చెప్పుటచే రథమునకు ఒక రథికుఁడు ఒక సారథి, ఇరువురు చక్రరక్షకులైన నుందురు. ఇవిగాక గుఱ్ఱము లుండును. గజము లన్నప్పుడు మావటివాఁడొకఁడు. యోధ యొకఁడిద్దఱైన నుందురు. పవనవేగములని చెప్పుటచే అల్పవేగముగలవి మఱియెన్నో తెలియదు, ఇంత సేన హతమయ్యెను. ఈ సందర్భమున నీ శ్లోకము ననుసంధింపఁదగు, 'నాగానా మయుతం తురంగనియుతం, సార్థం రథానాం శతం, పాదాతం శతకోటిక ర్తనవిధా వేకః కబంధో రణే,ఏవం కోటికబంధన ర్తనవిధౌ కి చిద్ధ్వనిః కింకిణీ, ర్యామార్ధం పరమాత్మనో రఘుపతే కోదండ ఘంటారవమ్' ఏనుఁగులు అయుతము (పదివేలు), గుఱ్ఱములు నియుతము (లక్ష); రథములు నూటయేఁబది లక్షలు, పదాతులు నూఱుకోట్లు ఇది యొక కబంధము, ఇట్టి కబంధములు కోటి చచ్చిన రామచంద్రమూర్తి వింటి గజ్జియలు క్షణమాత్రము మ్రోగును. అటువంటి గజ్జెలు మూలబలము చచ్చినపుడు సగము జాము, ఒక్కటిన్నర గంట వికువక మ్రోఁగెను.

తే. మూఁడుముక్కాలుగడియలో • వేడిమిగల,వాఁడిమిుఁలుకులరాముఁడు • పాదచారి
 నిస్సహాయుఁడునై యిట్లు • నేలపాలు,సలిపె స్వచ్ఛందరూపుల • శాత్రవులను.

తాత్పర్యము

ఇంతసేనను రామచంద్రమూర్తి కాలినడకతో సహాయుఁడు లేక యొంటరిగా మూఁడుముక్కాలు గడియలలో (ఒకటిన్నర గంటలో) కామరూపులైన రాక్షసుల నేలపాలు చేసెను.

కం. హతరథులును హతతురగులు, హతకేతను లగుచుఁ గొంద • ఱరిగిరి పురికై
 హతశేషులు హతగజహరి,తతిభటసముదాయు లగుచు • దైన్యము గొనుచున్.

అర్థములు. హతరథులు = రథికులు చచ్చినవారు, హతతురగుల = గుఱ్ఱములు చచ్చినవారు, హతకేతనులు = ధ్వజములు విఱిగినవారు, హతశేషులు = చావఁగా మిగిలినవారు, హత = చంపఁబడిన,గజ = ఏనుఁగుల హరి=గుఱ్ఱముల, తతి = సమూహములు, భటసముదాయులు = భటుల గుంపులు గలవారై, దైన్యముగొనుచుఁ=దుఃఖించుచు.

తా త్ప ర్య ము

కొందఱు రథికులు లేక సారథులు తేర్లు మిగిలినవారు కొందఱు, గుఱ్ఱములు చావఁగా సారథులు మిగిలినవారు కొందఱు, ధ్వజములు విఱుగఁగా నూరక మిగిలినవారునై చావఁగా మిగిలినవారు ఏనుఁగులు గుఱ్ఱములు భటులు చచ్చిన వారై దుఃఖించుచు లంకకుఁ బోయిరి.

కం. క్రుద్ధుం డగుఫాలాక్షు న, మిద్ధాక్రీడం బనంగ ♦ నెసఁగెన్ ధరయున్
శుద్ధ పరాక్రము రాముని, సిద్ధఋషులు మే లటంచుఁ ♦ జేసిరి వినుతుల్. ౨౯౪

అర్థములు. క్రుద్ధుండు = కోపించినవాఁడు, ఫాలాక్షు = రుద్రునియొక్క, సమిద్ధ=ప్రసిద్ధికెక్కిన, ఆక్రీడనము=క్రీడాస్థానము, స్మశానము.

తా త్ప ర్య ము

కోపించిన రుద్రునియొక్క క్రీడాస్థాన మగు స్మశానమో యన భూమి యొప్పుచుండెను. శుద్ధమైన పరాక్రమముగల రామచంద్రుని సిద్ధులు ఋషులు మేలు మేలని శ్లాఘించిరి.

ఉ. అంతయుఁ దీఱ నంతఁ బ్లవ ♦ గాధిపు రాక్షసనాథునిన్ హనూ
మంతుని బ్రహ్మజున్ ద్వివిద ♦ మైందులఁ దక్కిన కీశవీరులన్
బొంతకుఁ జీరి మీఱకనిన ♦ భూరితరాస్త్రజవంబు శక్తి క
ల్పాంతకుఁ డౌ త్రిలోచనుని♦యందును నా యెడఁ గానవచ్చెడిన్. ౨౯౫

అర్థములు. అంతయుఁదీఱన్ = శత్రుసేన యంతయు హతమైపోఁగా, పొంతకున్ = సమీపమునకు, చీరి=పిలిచి, మీఱకనిన=మీరుచూచిన, భూరితర= మిగుల గొప్పదగు,అస్త్రజవంబు=అస్త్రము వేగముగ ప్రయోగించు శక్తి, కల్పాంతకుఁడై=ప్రలయకాలమందు లోకము నాశముచేయు, త్రిలోచనునియందును = రుద్రుని యందును, నాయెడన్=నాయందును, కానవచ్చెడిన్=చూడఁబడును.

తా త్ప ర్య ము

రాక్షససైన్యమంతయు నాశము కాఁగా సుగ్రీవుని విభీషణుని హనుమంతుని జాంబవంతుని మైందద్వివిదులను తక్కిన వానర నాయకులను బిలిచి తా నేదైన మాయ చేసితినని వారు తలంతురేమో యని యాశ్చర్యపడుచున్న వారికి నీ యస్త్రమును నింత వేగముగఁ బ్రయోగించు శక్తి యెవ్వఁడు దలఁచిన నవ్వఁడు నాయందును లోకముల నన్నిటిని ధ్వంసము చేయు ఫాలనేత్రుని యందును ప్రలయకాలమందు కాన నగును. మఱి యెవ రీ యస్త్రము గలవా రైనను నింత వేగముగఁ బిరుగ లేరు.

కం. అన విని కూలిన రాక్షస, జనముం గని యబ్రపడుచు ♦ నమ్మదమున నిం
తొనరించి గాసిఁగానని, మనుజేంద్రుఁ గృతాస్త్రి దేవ♦మండలి పొగడున్.
౨౯౬

అర్థములు. పొగడున్=పొగడుచున్నా రనుటచే నిప్పటికిని దలఁచుకొని పొగడుదు రని భావము.

తాత్పర్యము

అని చెప్పఁగా విని చచ్చిన రాక్షస జనముఁ జూచి యాశ్చర్యపడి సంతోషించి, యింత చేసియు గాసి యెట్టిదో యెఱుఁగని రామచంద్రుని, అస్త్రవేత్తను దేవతలు పొగడుచున్నారు.

## —•౯౪-వ సర్గము. రాక్షసస్త్రీ విలాపము•—

ఉ. రావణ సంప్రయుక్త మసు•రధ్వజినీనిచయుంబు రామ బా
ణావళి మూలముట్టుగ స•నాగము సాశ్వము సధ్వజంబుగాఁ
జేవ యడంగిపోక హత•శేషులు చెప్పిన రాక్షసాంగనల్
ప్రోవులు గట్టి హా యనుచుఁ•బొక్కిరి యేడ్చుచు వాడవాడలన్. ౨౧౯౭

అర్థములు. రావణసంప్రయుక్తము = రావణుచేఁ బంపఁబడినది. అసుర ధ్వజినీ నిచయుంబు = రాక్షస సేనాసమూహము, సనాగము=ఏనుఁగులతోఁ గూడినది, సాశ్వము = గుఱ్ఱములతోఁ గూడినది, సధ్వజంబుగాన్ = ధ్వజములతో గూడినదిగ.

తాత్పర్యము

రావణుఁడు పంపిన సేనయంతయు రామబాణములచే సమూలముగ నేనుఁగులు, గుఱ్ఱాలు, ధ్వజములతోడ నాశముచెడి చచ్చెనని, చావఁగా మిగిలినవారు చెప్పఁగా విని రాక్షసస్త్రీలు గుంపులు గట్టి హా యని వీథివీథి నేడువ సాగిరి.

కం. హతపతులున్ హతసుతలున్, హతబాంధవ లైన రాక్ష•సాంగన లెల్లన్
క్షితిఁ బడి పొరలుచు నేడ్చుచు,వెతఁ దలతలఁ గొట్టుకొనుచుఁ•పెద్దరవములన్.

అర్థములు. హతపతులున్=భర్తలు చచ్చినవారు, హతసుతలున్=కొడుకులు చచ్చినవారు, హత బాంధవలు=చుట్టములు చచ్చినవారు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఏమిటి కేగెనో•యా ముసలిపడుచు, మిట్టపండ్లది ప్రేలు•పొట్టతోడఁ
జేటంత గోళ్ళతోఁ•జంపిరి తలతోడ, నేనుంగుఁ జెవులతో•గూనితోడ
మిడిమిడిగ్రుడ్లతో•మిడిమేలముగఁ బోయి,యడవిలో నెచటనో•యడఁగియున్న
కందర్పసుందరుఁ•గసుకుమారుని, శృంగారసదనుఁ బూ•ర్ణేందువదను

ఆ. భూరిశక్తి సకల•భూతహితాసక్తు, లోకనింద్య సర్వ•లోకవంద్యు
సర్వసుగుణహీన•సర్వగుణాఢ్యుని, జెనకి గాదె యింత•చేటు దెచ్చె. ౨౧౯౮

అర్థములు. సకలభూతహితాసక్తు = అన్ని ప్రాణులకు మేలుచేయుట యందాసక్తిగలవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

సీ. తానేడ నిండారు • దళుల మోముకుమూప, యతఁడేడ రాకాసు • ధాంశుముఖుఁడు
తా నేడ నంసిన • తలవెండ్రుకలపోఁకొ, యతఁ డేడ నిందింది • రాలకుంతు
తా నేడ నవగుణ • తతులకుఁ బుట్టిని,ల్లతఁడేడ సుగుణర • త్నాంబురాశి
తా నేడ నుత్తాల • తాలభీకరహస్త, యతఁ డేడ నాగక • రాభబాహు
తే. తనకుఁ దనరూపమునకును • దగినవాఁడు
రాముఁడా తోఁచె ? నయ్యయో • ప్రజలు విన్న
నవ్వరా ? తిట్టరా భూజ • నంబు ? లిట్టి
యాగడంబులు • వింటిమే • యనని నెందు. ౨౨౦౦

అర్థములు. తళుల మోము = ముకుతిలుగల ముఖము, ఈ యర్థమున నిది బహువచనమందే ప్రయోగము. రాకాసుధాంశుముఖుఁడు = పదాఱు కళలతోడి చంద్రునితో సరియగు ముఖము గలవాఁడు. ఇందిందిరాలకుండు=తుమ్మెదలవంటి ముంగురులు గలవాఁడు, అవగుణతతులకు=దుష్టచేష్టలకు, సుగుణరత్నాంబురాశి= సద్గుణముల నెడి రత్నములకు సముద్రుఁడు, ఉత్తాల = ఎత్తైన, తాల=త్రాటిచెట్టు వంటి, భీకర = భయంకరములైన, హస్త = చేతులుగలది, నాగకరాభబాహుఁ ఏనుఁగు తొండములవంటి చేతులు గలవాఁడు, ఆగడంబులు=అకార్యములు, దీని వలన లంక పాడగుటకు మూలకారణము శూర్పణఖయని యందఱకుఁ దెలిసినట్లు తేర్పడుచున్నది. ఈ వార్త సీతాదేవివలనఁ దెలిసి యుండవలెను. ఆమె త్రిజటా సరమ లోనగు వారికి చెప్పియుండును. వారు లంకలో నందఱకుఁ గ్రమక్రమముగఁ జెప్పఁగా వ్యాపించి యుండును. అంకుతనము దొంగతనము దాఁగదు. మనుష్యులలో నాకాలమున దశరథు కంటెను, రాక్షసులలో రావణు కంటెను గొప్పవారు లేరు. ఇద్దఱు నాశమగుటకు స్త్రీలే మూలకారణము. కాముకుఁడై ముద్దుల పెండ్లామని నమ్మి దశరథుఁడు చచ్చెను. అంకుముండ చెల్లెలిమాట విని రావణుఁడు సమూలము నాశమయ్యెను. 'స్త్రీబుద్ధిః ప్రలయంకరీ' యనుట సత్యమయ్యెను. రాముఁడు గాక మఱియొకఁడై యుండినఁ గైకకోరిక సఫలమై సూర్యవంశము ధ్వంసమై యుండును. ఇట్టి యాఁడువారు, అట్టి మగవారు నేటికిని గలరు. ఆఁడువారి మూలమున నాశమైన గొప్ప కుటుంబము లెన్నియో గలవు. కనుక నే గొప్ప విషయము లం దాఁడువారితో నాలోచింపరాదు. వారు చెప్పినంత మాత్రమున న్యాయముగ నాలోచింపక గొప్ప కార్యములు చేయరాదు. వా రెప్పటికి స్వార్థపరలే.

తాత్పర్యము స్పష్టము.

కం. వనమున ఖరదూషణులకుఁ, బెనుమిత్తిగ నయ్యెఁ దాన • వేరముఁ బెంచెన్
మనుజాసుర నాథులకును, మనదురదృష్టం బదిట్లు • మల్లడి పెట్టన్. ౨౨౦౧

అర్థములు. పెనుమిత్తిగన్ = పెద్ద మృత్యుదేవత, వేరము = విరోధము, మల్లడిపెట్టన్=బాధింపఁగా, పరితాప పెట్టఁగా.

తాను చేసిన దుష్టచేష్ట దాఁచిపెట్టి యడవియందు ఖరదూషణులకు మృత్యు దేవత యయ్యెను. ఆ కారణముచే రామ రావణులకు విరోధము పెంచెను. ఇంతను నిర్భాగ్యదశ మనలను బాధింపఁగా నింతయుఁ ఘటిల్లించెను. వారి కట్టి బుద్ధులు పుట్టుటకు మన దురదృష్టమే కారణము.

చ. నిజగళకాలపాశ మన•సీసుతఁ దాఁ గొనివచ్చెఁ గాని భూ
మిజ నతఁ డేమి పొందు టది • మిథ్య. వృథాబలవద్విరోధము
ర్విజపతితోఁ ఘటిల్లెఁ బృథి•వీజను గోర, విరాధుఁ డన్మహా
భుజబలిమిన్ గతించె నదె•పో తగినంత నిదర్శనం బిటన్. ౨౨౦౨

అర్థములు. నిజగళకాలపాశము = తన మెడకు యముని పాశము వంటిది. మిథ్య = అసత్యము, వృథా=వ్యర్థముగ, బలవద్విరోధము=బలవంతులతోఁ బగ, ఉర్విజపతితో = రామచంద్రమూర్తితో.

తాత్పర్యము

తన పాలిటి యమపాశము దెచ్చుకొన్నట్లు సీతాదేవిని దెచ్చెఁగాని రావణుఁడు వానికోర్కె తీర్చుకొనుట యసత్యము. వాఁడు చచ్చునే కాని వాని కోరిక నెఱవేఱదు. ఇఁకఁ గలిగిన ఫల మేమనఁగా సీతను గోరుటచే రామునితో బలవద్విరోధము ప్రాప్తించెను. బలవద్విరోధ మని ముందుగా నెట్లు తెలియుననిన రావణునితో సమానమైన బలశాలి విరాధుఁడు రామునిచేఁ జచ్చెను. అదియే దీనికిఁ జాలినంత నిదర్శనము.

చ. పదియును నాల్గువేలు బల•వంతులు రాక్షసు లొక్కెపెట్ట పె
న్నుదుటున రామునిం దొడరి • యొక్కఁడు చిక్కక కూలి రా మదా
స్పదులు ఖరుండు దూషణుఁడు • సత్త్వధనుం డగు నా త్రిశీర్షుఁడున్
బొదివిరి చచ్చి రల్ల యది•పో తగినంత నిదర్శనం బిటన్. ౨౨౦౩

అర్థములు. బలవంతునితో విరోధ మనుటకు మఱియొక నిదర్శనము చెప్పుచున్నారు. పెన్నుదుటున=మిగుల బలగర్వముతో, తొడరి = ఎదిరించి.

తాత్పర్యము

పదునాలుగువేల రాక్షసు లొకసారిగ, బలగర్వమున రాము నెదిరించి యొక్కఁడైన మిగులకయుండఁ జచ్చిరి. మదమునకు స్థానభూతు లగు ఖరుఁడు, దూషణుఁడు బలశాలి త్రిశీర్షుఁడు నెదిరించిరి, చచ్చిరి.

ఇదియే బలవద్విరోధ మనుటకుఁ జాలినంత నిదర్శనము.

కం. యోజనబాహుఁడు శోణిత, భోజనుఁడు కబంధుఁ డతుల•ఘోరిబలుం డం
భోజాక్షునిచేఁ జచ్చెను, యోజింప నిదర్శనం బిఁకొండును వలెనే. ౨౨౦౪

మఱియొక నిదర్శనము చెప్పుచున్నారు.

అర్థములు. యోజనబాహుఁడు=యోజనము పొడవుగల చేతులుగలవాఁడు, శోణిత భోజనుఁడు = నెత్తురు ఆహారముగఁ గలవాఁడు, అతుల భూరిబలుండు = అసమానమైన గొప్ప బలముగలవాఁడు.

తాత్పర్యము

ఆమడ పొడవు చేతులు గలిగి మాంసము నెత్తురు నాహారముగాఁ గలిగిన మహాబలశాలి కబంధుఁడు రామచంద్రునిచేఁ జచ్చెను. రాముఁడు బలవంతుఁ డనుటకు నింతకంటె నిదర్శనము కావలెనా ?

కం. మేరునిభసారు బలిఁ బాకారితనూజాతు వాలి ♦ నాశుగ మొకటన్
ధారిణిం గూల్చిన రాముని, వీరతకు నిదర్శనంబు ♦ వేఱొం డేలా ? ౨.౨౦౫

అర్థములు. మేరునిభసారున్ = మేరుపర్వతముతో సమానమైన బలము గలవానిని, పాకారితనూజాతున్=ఇంద్రుని కుమారుని, వాలిని, ఆశుగ మొకటన్= ఒకబాణముతో.

తాత్పర్యము

మేరు పర్వతము వంతబలము గలవానిని, ఇంద్రుని కుమారుని వాలిని నొక్క బాణముతోఁ జంపెను. రాముఁడు రావణునికంటె బలవంతుఁ డనుటకు నీ యొక నిదర్శనము చాలదా?

కం. దీనుఁ డయి యాస చెడి తన, ప్రాణమునకు ఋశ్యమూక ♦ మందు నవయు నా
భానుజు రాజొనరించిన, జానకిపతి బలిమి కొండు ♦ సాక్ష్యం బేలా? ౨.౨౦౬

తాత్పర్యము

దుఃఖపడుచు బ్రదుకు మీఁది యాశ చెడి ఋశ్యమూకమందుఁ గృశించుచున్న సుగ్రీవుని రాజుగఁ జేసెను. అట్టి రామచంద్రుబలమునకు వేఱొక సాక్ష్యము కావలయునా ?

ఇన్ని కారణములచేత రామచంద్రమూర్తి బలవంతుఁ డని తెలియదా ? తెలియదని చెప్పరాదు, వినవ.

చ. తలఁగక సర్వరాక్షసహి ♦ తప్రదదక్షము నర్థధర్మసం
కలితము నైన నీతులు దె ♦ గంబడి వీనుల నిల్లు కట్టుకొం
చలఘుగుణాఢ్యుఁ డా సుమతి ♦ యాడె విభీషణుఁ డీ దశాస్యుతో
బలితపు మోహపాశముల ♦ బద్ధుఁడు గాన రుచింప వా నుడుల్. ౨.౨౦౭

అర్థములు. సర్వరాక్షస హితప్రద దక్షము = సర్వరాక్షసులకు మేలు కలిగించుట యందు సామర్థ్యము గలది, అర్థధర్మ సంకలితము = అర్థముతోను ధర్మముతోను కూడినది, తెగంబడి=రావణునకుఁ దక్కిన వారివలె భయపడక యేమైనఁ జేయునిమ్మని సాహసించి, అలఘుగుణాఢ్యుఁడు = గొప్ప గుణములచే సంపన్నుఁడు, సుమతి=బుద్ధిమంతుఁడు.

తాత్పర్యము

తనమాట యొకటి రెండు సార్లు చెప్పిన వినకున్నను, వదలిపెట్టక సమస్త రాక్షసులకు మేలైనవియు ధర్మార్థములతోఁ గూడినవి యగు నీతులు ప్రాణము నకుఁ దెగించి చెవిలోఁ గాఁపురము చేసి యా గొప్పసుగుణసంపత్తి మంచిబుద్ధిగల విభీషణుఁడు ఇవి యన్నియు రావణునితోఁ జెప్పెను గదా! కావున వానికిఁ దెలియదని చెప్పరాదు. అట్టైన నేల యీపని జేసెనందురా బలమైన కామపాశ ములఁ గట్టుపడినవాఁడు కావున 'కామాంధోఽపి నపశ్యతి' కాముకులగు వారికెందుఁ గన్నులుగలవే' యన్నట్లు వానికా మాటలు రుచించినవి కావు. రావణుఁడు కేవల కామమోహితుఁడు కావున ధర్మార్థములు వానికి రుచింపలేదు.

ఉ. అనుడు లాలకించి ధన ♦ దానుజుఁ డప్పుడు నీతి నీయలం
కానగరం బిడేటి కిటు ♦ కష్టదశం గని వల్లకా డగున్?
మానవివంతసందరము ♦ నన్ జన మేటికి మున్గి చచ్చు? న
య్యో నెఱిమాల జేఁ డదియు ♦ నూరక పోవునె? గాసి పెట్టదే? ౨౨౦౮

అర్థములు. వల్లకాడు = స్మశానము, వంతసందరమునన్=దుఃఖసముద్ర మందు, నెఱి మాలన్ + జేఁడు=జేఁడు నెఱిమాలినన్=రాజు నీతి మాలినవాఁ డైనపుడు, మాలజేఁడు=మాలప్రభువు.

తాత్పర్యము

ఆ విభీషణుఁడు చెప్పిన మాటలు విని నీతను- రావణుఁడు మరల రామున కిచ్చి యుండిన యొకల లంక యేల యిట్లు స్మశానమై నీచదశకు వచ్చును. జనము విడువని దుఃఖ సముద్రమున నేల మునిఁగి చచ్చును? రాజు నీతిమాలినవాఁ డైనచోఁ బ్రజలకుఁ గీడు తప్పునా?

ఉ. రామునిచేత నిస్తుల ప♦రాక్రముఁ డా ఘటకర్ణుఁ డీల్గటల్
రాముని తమ్ముచేఁ బరదు ♦ రాసదుఁ డా యతికాయు పాటునున్
భీమజవుండు శక్రజితు ♦ బిద్దుట యిన్నియుఁ జూచి యైన నా
రా మతి యింతయుం గొనఁడు ♦ రావణుఁ డయ్యయొ యెంతమూర్ఖుఁడో.

అర్థములు. నిస్తుల పరాక్రముఁడు=అసమాన పరాక్రమము గలవాఁడు, ఈల్గుట = చచ్చుట, పరదురాసదుఁడు = శత్రువులకు సమీపింప రానివాఁడు, భీమజవుఁడు = భయంకరవేగము గలవాఁడు, బిద్దుట=చచ్చుట.

తాత్పర్యము

రామునిచేఁ బరాక్రమమం దసమానుఁడైన కుంభకర్ణుఁడు చచ్చెను. రాముని తమ్మునిచే యుద్ధమునందు శత్రువులకు సమీపింపఁగానైన సాధ్యపడని యతికా యుఁడు, మిగుల వేగముగల యింద్రజిత్తు చచ్చిరి. ఇన్నియుఁ గన్నులారఁ జూచి యైన రావణుఁడు సంధిచేయ మనస్సున నెంచినవాఁడుకాడు. అయ్యో! యెంత మూర్ఖుఁడోకదా.

కం. నా తనయుఁడ! నా యన్నా!,నా తమ్ముఁడ! తండ్రి! ప్రాణ•నాథా! యని యా
ర్తాతతరవములె వినఁబడె, నేతట్టును జూడఁ బురిని • నింటింటికడన్. ౨౨౧౦

తాత్పర్యము స్పష్టము.

సీ. రథముల వాజివా•రణముల సేనల, లక్షలకోలఁదిని • రాక్షసులను
నొక్క-రాముఁడ వింట•నుగ్రుఁడై వధియించె,విష్ణువో రుద్రుఁడో•విబుధవరుఁడొ
శ్రీరామరూపంబుఁ • జేకొని త్రుంచె స్వ,యమ్ముగా వచ్చెనో•యంతకుండు
పోటుబంటులు గూలి • రేటికీవిత మిఁక, నాపద తొలఁగెడి•యనువు లేదు
ఆ. దిక్కు-మాలి మనము • దేవురించుచు నుండ, రామువలనఁ దనకు • రాఁగలట్టి
ముప్పు గాన లేఁడు• మొప్పె దశాస్యుండు,కలవు వరము లనుచు•గర్వపడెడు.

అర్థములు. వాజివారణములను=గుఱ్ఱములను ఏనుఁగులను, విబుధవరుఁడొ=ఇంద్రుఁడో, అంతకుండు=యముఁడు, పోటుబంటులు = శూరులు, అనువు=ఉపాయము, దిక్కు-మాలి = దిక్కు- లేక, దేవురించుచు=దైన్యము నొందుచు- దుఃఖించుచు, ముప్పు=కీడు, మొప్పె=మూర్ఖుఁడు.

తాత్పర్యము

రథములను గుఱ్ఱములను ఏనుఁగులను లక్షలకొలఁది రాక్షసులను నొక్క-రాముఁడు ఒక్క-వింట,భయంకరముగ వధించెను.ఇట్లుచేయుటకు నీయన సామాన్య మనుష్యుఁడా ? కాఁడు. విష్ణువో రుద్రుఁడో ఇంద్రుఁడో శ్రీరాముని రూపము గ్రహించి వచ్చెను. కాదేని యంతకుఁడే స్వయముగ వచ్చెనో, శూరులందఱుఁ జచ్చిరి. ఇఁక మనమెట్లు బ్రదుకఁగలము? ఈ యాపదతొలఁగు నుపాయముకూడఁ గానరాలేదు. ఏలన మనము దిక్కు-లేక యిట్లు లేడ్చుచుండఁగా రావణుఁడు తన చావు సిద్ధమగుట తెలియక తనకు వరములు గలవని గర్వపడుచున్నాఁడు. ఆ వరములు వాని నేమి కాపాడఁగలవు ? చచ్చిన వారిలో వరములు లేనివారెవరు ? రావణుఁడుకూడ రామునిచేఁ జచ్చునని యెట్లు చెప్పఁగల రందురా ?

కం. శ్రీరాముకారిఁ జిక్కి-న, వారిన్ రక్షింప లేరు • వసురాక్షసబృం
దారక గంధర్వు లిఁ కే,తీరున దశముఖుఁడు బ్రదుకు• తెరువుంగనునో. ౨౨౧౨

తాత్పర్యము

శ్రీరాముని యెదుఁటబడిన వారిని రాక్షసులును గంధర్వులును దేవతలైనను గాపాడలేరు. వీనికి వారి సాహాయ్యమును లేదు ఇఁక వీఁడెట్లు బ్రదుకఁ గలఁడు?

తే.రావణుఁ డొనర్చుచున్నట్టి•ప్రతిరణంబు,లోనను త్పాతములు పెక్కు-•గానవచ్చె
రావణుఁడు సంగరంబున• రాముచేతఁ, జచ్చునని వానఁ దోఁచెడి•సత్యముగను.

తాత్పర్యము

సహాయసంపత్తి లేకపోవుట, యున్న దేమో నాశమగుట,గాక రావణుఁడు చేయు ప్రతి యుద్ధమందు రాక్షసులకు నవశకునములే కానవచ్చుచున్నవి. ఒకటి

దైన శుభశకునము లేదు. ఆ శకునముల ఫలము చూచుచున్నాము. వానిని బట్టి చూడఁగా రావణుఁడు కూడ రామునిచేఁ జచ్చుట నిజము అని తోఁచుచున్నది.

చ. కమలజు నీ దశాననుఁడు • గాటపు రక్తి వరంబు వేఁడుచో
సమరఖగాహిరాక్షసచ • యాదుల మృత్యువు లేమిఁ గోరి గ
ర్వము మెయి మర్త్యులన్ విడిచె • వారక తత్ఫల మిప్పు డిట్లు ప్రా
ణముఁ గొన వచ్చె, రక్కసుల • నాశము సిద్ధము పంక్తికంఠుతోన్. ౨౫

అర్థములు. కమలజున్ = బ్రహ్మను, అమరులయు, ఖగ=గరుడాది పక్షులయు, అహి=సర్పములయు, రాక్షస=రాక్షసులయు, చయ = సమూహములు, ఆదులన్ = మొదలగు వారిచే, మర్త్యులన్ =మనుష్యులను.

తాత్పర్యము

ఈ రావణుఁడు బ్రహ్మదేవుని వరములు గోరునపుడు దేవ పన్నగ గరుడ రాక్షసాదులచేఁ జావు లేకుండ వరము గోరి మనుష్యులు నన్నేమి చేయఁ గలరను గర్వముతో వారిచేఁ జావులేకుండ వరము గోరినవాఁడు కాఁడు- దాని ఫల మిప్పుడిట్లు ప్రాణాంతకమై వచ్చెను. ఇది రావణాసురునితోఁ బోవునది కాదు. వానితోపాటు సర్వరాక్షసులు నాశము కావలసిన వారే.

సీ. వరదానమదమునఁ • బంక్తికంఠుండు పెట్టు,హోవడి కోర్వక • యమరవరులు
ధాతతో మొఱవెట్ట•దానవరాక్షసు, లిది మొదల్ భయమున • మెదలువారు
జగముల బ్రోం డన,శంకరుఁ బురహరు, వృషభధ్వజునిఁ జేరి • వేఁడికొనిన
సుప్రసన్నుం డయి•సురలార ! మీ మేలు,కై పుట్టు నొకయింతి•యసురహంత్రి
ఆ. దానవులకు మున్ను • దాపరించిన క్షుత్తు,పోలె రాక్షసులను•బొలియఁ జేయు
ననుచుఁ జెప్పె సీత•యాయింతి రావణు, నసురకులము ద్రుంగ•నరుఁగుదెంచె.

అర్థములు. వరదాన మదమునన్=బ్రహ్మదేవుఁడు తనకు వరమిచ్చెనను గర్వముచే, హోవడి = బాధ, అసురహంత్రి = రాక్షసులఁ జంపునది, క్షుత్తు = ఆఁకలి. దేవతలకు అమృతము పంచిన తరువాత, దానవరాక్షసుల్ = మందోదరీ మయాదులు దానవులు, ఈమెను సంబంధించినవారు కొందఱు లంకయందుఁ గలరని గ్రాహ్యము. రావణాది పౌలస్త్యులు రాక్షసులు.

తాత్పర్యము

బ్రహ్మవరము వలని గర్వముచే రావణుఁడు పెట్టు నుపద్రవమునకు సహింపలేక దేవతలు బ్రహ్మదేవునితో మొఱలు పెట్టుకొనఁగా నాయన ప్రతివిధానము చెప్పిన రాక్షసులు దానవులది మొదలు భయముతో వర్తింతురు పొండని చెప్పెను. అంతటవారు శివుని యొద్దకుబోయి వేడుకొనఁగా నాయన యనుగ్రహించి దేవతలారా ! మీ మేలుకై రాక్షసులఁజంపు స్త్రీ నొకతె పుట్టును. ఆమె దానవులను ఆఁకలి చంపినట్లు రాక్షసకులమును నాశము చేయఁగలదని చెప్పెను.ఆమెయే సీత.

రావణుని రాక్షస వంశమును నాశము చేయవచ్చినది.

ఆ. కుటిలబుద్ధి దెల్వి • గోరంతయును లేదు, నీతిహంతc బోని • పాతకుండు
వంక్తిముఖుcడు వీని• పాపంబుచేc బురి, పాడుపడియె దుఃఖ•పాటు గలిగె.

అర్థములు. కుటిలబుద్ధి=వంచన బుద్ధి గలవాcడు.

తాత్పర్యము

రావణుcడు నీతిమంతుc డైనచో రాక్షసుల కీగతి యేల వచ్చును? వాcడు వంచన బుద్ధి గలవాcడే కాని ఋజువర్తనము గలవాcడు కాcడు. కొంచెమైన నిది కాcకు ఇది తప్పు అను వివేకము లేనివాcడు. నీతిసమీపమునకైన పోని పాపాత్ముcడు. ఇట్టి వీcడు చేసిన పాపముచే లంక పాడుపడెను. మన కిటువంటి దుఃఖము ప్రాప్తించెను.

కం. లయకాలయమునిపోలిక, భయమున్ ఘటియించు రామ•భద్రునివలనన్
భయ ముడిపి కావ భువన, త్రయి నెవ్వరు లేరు మనకుc•దథ్యము సుండీ.

తాత్పర్యము

ప్రలయకాల యముని వలె మనకు భయము గలిగించు చున్న రామభద్రుని వలన మనకు భయములేకుండ రక్షింపc గలవాcడు మూcడు లోకముల నెవ్వcడు లేcడు. ఇది సత్యము.

కం. వనదహన వేష్టితం బగు, వనకరిణీయూథ మనcగ • ననరుచు నుండన్
గనుcగొని శరణ్యుc డగు నా, ఘనుc డెవ్వcడు దిక్కు-మాలి•కాలెడి మనకున్.

అర్థములు. వనదహన వేష్టితంబు = కార్చిచ్చుచేc జుట్టుకొనc బడినది, వనకరిణీ యూథము=అడవి యందలి యాcడేనుcగుల గుంపు.

తాత్పర్యము

కార్చిచ్చు చుట్టుకొనcగా నాcడేనుcగులవలె దుఃఖించుచు దిక్కు-లేక కాలుచుండెడి మనకు రక్షింపcదగు గొప్ప వాcడెవ్వcడు గలcడు ?

తే. విమలనీతిరతుండు వి•వేకశాలి
యవ్విభీషణుc డర్హంబు • నాచరించెc
గలిగె భయ మెందు నద్దానిc • దెలిసి యాతc
డందుc జని యాశ్రయించి భ•యంబు వాసె. ౨౧౯

అర్థములు. విమల నీతిరతుండు=శుద్ధమైన నీతియందుc బ్రీతిగలవాcడు, వివేకశాలి = ఇది తప్పని ఇది యొప్పని తెలిసిన వాcడు.

తాత్పర్యము

పరిశుద్ధమైన నీతి తెలిసినవాcడు వివేకముగలవాcడు నగు విభీషణుcడు యోగ్యమైన పనిచేసెను. ఎవరి వలన భయము గలుగు నని తోcచెనో వారినే యాశ్రయించి నిర్భయుcడయ్యెను.

కం. అని రజనీచరతరుణులు, ఘనభుజ నొండొరులఁ గ్రుచ్చి•పలవించుచు హా
యని యేడ్చిరి దివి ముట్టఁగ, పెనురవముల మాఱుమ్రోయ•విదిశలు దిశలున్.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుకొనుచు రాక్షసస్త్రీలొకరి నొకరు పట్టుకొని దుఃఖపడుచు హా యని గొంతెత్తి బిగ్గఱగా నేడ్చిరి. వారి యీ ధ్వనికి దిక్కులు విదిక్కులు మాఱుమ్రోసెను

—• ౯౭-వ సర్గము. రావణుఁడు పౌరుషోక్తులు పలుకుట •—

ఉ. ఈవిధి నింట నింట జని•యించు మహోత్తిరవంబు ఘోరమై
రావణుకీనులం బడ భ•రంబుగ నూర్పుచు ధ్యానయుక్తుఁడై
రేఁచి మహారుషం గనులు • ద్రిప్పుచు భీతభయంకరాస్యుఁడై
యావిలయాగ్నివోలె నసు•రాళికి నేఁయు దుర్నిరీక్షుఁడై. ౨.౨.౨౧

అర్థములు. రేఁచి = రేఁగి = విజృంభించి, దుర్నిరీక్షుఁడు = చూడఁ గష్టమైన వాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారమింటింటఁ బుట్టుచున్న యేడుపు ధ్వని మహాఘోరమై రావణు చెవులలోఁబడఁగా విశేషముగ నూర్పుచ్చుచు నేమి చేయుదునా యని యాలోచించి మిగులఁ గోపముచే విజృంభించి గ్రుడ్లు ద్రిప్పుచుఁ జూచువారికి భయంకరమైన ముఖము గలవాఁడై ఆ ప్రలయాగ్నివలె వాడుకగాఁ జూచు రాక్షసులకు గూడఁ జూడరానివాఁడై.

కం. కటకట రదములు కొఱుకుచుఁ,బటఫుట రక్తంబు మోవి•బొడమఁగ నొఱకుచున్
మటమట లాడుచు భీత్యాస్ఫుటవచనుం డనియె దాపు•పోఁకులగమికిన్. ౨.౨ ౨.౨

అర్థములు. మోవిన్ = పెదవియందు, భీత్యస్ఫుటవచనుఁడు=భయముచే స్పష్టముగాని మాట గలవాఁడు, అంత సేన యొకటిన్నర గంటలోఁ జచ్చె ననిన నెవఁడు భయపడకుండును.

తాత్పర్యము

పటపటపండ్లు కొఱుకుచు పెదవి కొఱకుటచే నెత్తురు పుటపుట పులకరింపగా గోపముచే మటమట లాడుచు భయముచే స్పష్టముగాఁ దెలియని మాటలచే దగ్గఱనున్న రాక్షసులతో నిట్లనియె.

సీ.మా యాజ్ఞ మేరకు•మహితసైన్యముతో మ,హాపార్శ్వుఁడును విరూ•పాక్షుఁడును మ
హోదరుండును వేగ•యుద్ధమునకుఁ బోవఁ, బయనింపుఁడీ యని•పలుకుఁ డనిన
వారట్ల తమరాజు • పనుపున నొనరించి, దశవాయు లఖిలంబు • దంపు దీర్చి
భయమున దరిఁ జేరి•ప్రాంజలు లగుచును,నృపుజయంబును గోరి•నిలిచి యుండ

తే. నన్విరూపాక్షుఁ డాదియా•నసురవరులఁ, జూచి యిట్లను సంవర్త•సూర్యకల్ప
మార్గణంబుల రామల•క్ష్మణులఁ దోలుతఁ, జెండితైన చెదమద్బాహు•చండిమమున.

అర్థములు. మా యాజ్ఞ మేరకు = ఇచ్చట బహువచనము ఆత్మగౌరవ ద్యోతకము, దళవాయులు = సేనాపతులు, సంవర్త = ప్రళయ మండలి, సూర్య కల్ప = సూర్యునితో సమానమైన, మార్గణంబులన్ = బాణముల చేత, మద్బాహు చండిమమునన్ = నా భుజ బలము వేడిచేత.

తాత్పర్యము

మహాపార్శ్వుఁడు విరూపాక్షుఁడు మహోదరుఁడు యుద్ధమునకుఁ బోవఁ బ్రయాణము గండని నేనాజ్ఞాపించితి నని చెప్పెఁడు. అనిన వారు తమరాజు నాజ్ఞా ప్రకారము పోయిచెప్పిరి. సేనాపతులు దండు సర్వము ప్రోగుచేసి భయముతో సమీపించి చేతులు కట్టుకొని నిలిచి యుండఁగా నా విరూపాక్షుఁడు లోనగు వారిని జూచి రావణుఁ డిట్లనియె. ప్రళయకాల సూర్యునితో సమములైన బాణములచే నా భుజబలము వేడిమి చేత మొట్టమొదట రామలక్ష్మణులను నఱికి వైచెదను.

చ. ఖరహరిజిత్ప్రహస్తఘట•కర్ణులకున్ ఋణ మేను దీర్చెదన్
వరుసగ రామలక్ష్మణుల•వానరనాథుల నెల్లఁ ద్రుంచి మ
ద్గురుతర బాణవారిధర•కోటుల దుర్దినమున్ ఘటించి సా
గరగగనక్ష్మాధరని•కాయము లేర్పడకుండఁ జేసెదన్. ౨ ౨-౨౮

అర్థములు. గురుతర = మిగుల గొప్పవగు, బాణవారిధరకోటులన్ = బాణములను మేఘములచే, దుర్దినమున్ = సూర్యుఁడు కానరాని దినముగా, సాగరగగనక్ష్మాధర నికాయములు = ఇది సముద్రము ఇది ఆకాశము ఇది భూమి ఇవి కొండలు అని.

తాత్పర్యము

ఖరునకు, ఇంద్రజిత్తునకు, ప్రహస్తునకు, కుంభకర్ణునకు - వారు నాకై చచ్చిరి. కావున నేను వారికి నప్పుపడి యున్నాను. దానిని రామలక్ష్మణులఁ జంపి తీర్చెదను. వరుసగ రాముని లక్ష్మణుని వానరసమూహములను నందఱను సంహరించి నాగొప్ప బాణములను మేఘములచే సూర్యుఁడు కానరాకుండఁ జేసి భూమి ఆకాశము కొండలు గుర్తింప రాకుండఁ జేసెదను. భయశోకములచే మనస్సు స్వస్థత చెడుటచే తాఱుమాఱుగఁ బలుకుచున్నాఁడని గ్రహింపనగు.

సీ. కండలు కండలు•తుండెముల్ మొండెముల్, తుంటలు తుంటలు•దుమ్ము దుమ్ము
తుండెలుతుండెలు•తునుకలు తునుకలు, మ్రుక్కలు మ్రుక్కలు•వ్రక్కవ్రక్క
బ్రద్దలు బ్రద్దలు•పఱియలు పఱియలు, వ్రయ్యలు వ్రయ్యలు•వ్రప్పువ్రప్పు
తుంకలుతుంకలు•ఖండముల్ ఖండముల్, తునియలుతునియలు•తుటుముతుటుము

ఆ. పాలు దోఁకినట్లు • బాడిసఁ జెక్కిన, కొమరు అంపమునను • గ్రోఁతవండఁ
దఱిగినట్లు దోఁపఁ • దరుచరవితతుల, నఱుకువాఁడ మీఁద•నుఱుకువాఁడ.

అర్థములు. తరుచరవితతులన్ = వానర సమూహములను, క్రోధావేశముచే నొకసారిచెప్పినఁ దృప్తిలేక చెప్పినదానినే పలువిధములఁ జెప్పుచున్నాఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఇప్పుడు వానరసేనలఁ, గప్పెద ధనురుదధిజనిత•కాండోర్ములచేఁ
దెప్పిఱిలలేక కుప్పలు, కుప్పలుగా వారు నేలఁ • గూలంబడఁగన్. ౨౨౨౬

అర్థములు. ధనురుదధి జనిత = ధనుస్సనెడి సముద్రమునందుఁ బుట్టిన, కాండోర్ములచే=బాణములనెడి యలలచే.

తాత్పర్యము

ఇప్పుడు నా విల్లనెడి సముద్రమునందుఁ బుట్టిన బాణము లనెడి యలలచే వానరు లూపిరాడక కుప్పలు కుప్పలుగాఁ బడునట్లు కప్పెదను.

కం. కేసరవర్ణము నీరజ, భాసురకాంతియును నైన•ప్లవగేశ్వరయూ
థాసమసరసుల గజమన, వాసి చెడం గలచువాఁడ • బరమాస్త్రములన్.

అర్థములు. కేసరవర్ణము = అకరువులవన్నె, నీరజ భాసురకాంతి = కమలములు ప్రకాశించు కాంతి, ఐన = కల, ప్లవగేశ్వరయూథ=వానరశ్రేష్ఠుల సేనలను, అసమసరసులన్=పెద్దకొలకులను, గజమనఁగన్=ఏనుఁగో యనునట్లు.

తాత్పర్యము

అకరుల వన్నె పద్మముల కాంతిగల వానరుల సేనను కొలఁకులను నేనుఁగువలె నా పరమాస్త్రములచేఁ గలఁత నొందించెదను.

కం. కాడఁగ శరములు మోమున, వాఁడిమి చెడి నేలఁ బడిన•వానరుల తలల్
తూఁడులతోఁ గమలము లనఁ, బోఁడిమి గలిగించు సమర•భూతలమునకున్.

తాత్పర్యము

ముఖములందు బాణములు నాటుకొనఁగా బలముచెడి నేలఁబడిన వానరుల తలలును తూండ్లతోఁ గూడిన తామరపూవులవలె యుద్ధభూమిని నలంకరించును.

కం. ఒక్కొక్కశరముచేతనె, తక్కక వందలకొలంది • తరుచరవరులన్
జెక్కులు చెక్కులుగా ధర, నొక్కట నొఱగింతుఁ ద్రుంతు•నుదుటు న్మాన్తున్.

అర్థములు. ఒక్కటన్ = ఉగ్రముగా, ఉగ్రశబ్దభవము, ఉదుటున్ = గర్వమును.

తాత్పర్యము

ఒక్కొక్క బాణముచేతనే నూర్లకొలఁది వానరులను చెక్కులు చెక్కులుగా నఱకి యుగ్రముగా నేలపడఁద్రోయుదును. వారి గర్వము మానుతును.

కం. ఎవ్వారిపతు లెవ్వారిసుతు, లెవ్వారిసోదరులు కలన • నీల్గిరి యిపు డే
నవ్వారికనులనీటిన్, నెవ్వగఁ జన దుఃఖను నరుల • నిర్జించి యనిన్. ౨-౨౩౦

తాత్పర్యము స్పష్టము.

కం. చండభుజదండ ధృతకో, దండగళితనిశితకాండ • దండంబులచే
భండనకుంభినిఁ జూపఱ,గుండెలు పగులంగఁ ద్రుంతుఁ • గ్రోఁతుల దండున్.

అర్థములు. చండ=భయంకరమైన, భుజదండ=దండముల వంటి భుజములచే, ధృత = ధరింపఁబడిన, కోదండ = వింటినుండి, గళిత = జారిన, బయలు వెడలిన, నిశిత = పదునైన, కాండ=బాణములయొక్క, దండంబులచేన్=సమూహములచేత, భండనకుంభినిన్=యుద్ధభూమిని.

తాత్పర్యము

భయంకరమైన నా భుజదండములచే ధరింపఁబడిన కోదండముల నుండి వెడలుచున్న బాణసమూహములచే యుద్ధభూమి చూచువారి గుండెలు పగులునట్లు వానరుల దండును సంహరించెదను.

కం. గండడచి రిపులమేనులఁ, గండలు తెగఁ గోసి శాత • కాండంబులచే
మెండగు నక్కలు గ్రద్దలు, దండిగఁ దిన నిత్తుఁ గడుపు • దనియఁగ నిపుడే.

తాత్పర్యము స్పష్టము

## — రావణుఁడు యుద్ధమునకు వెడలుట —

ఆ. సన్నుమా రథంబు • వరచాపమును దెమ్ము, యిపుడ మిగిలియున్న • యెల్ల యసుర
లరుగుదేరవలయు • నాహవంబునకు నా, వెంట ననిఁబలుకు • వెంటనపుడ. ౨-౨౩౩

అర్థములు. సన్నుమా = సిద్ధము సేయుము, ఆహవంబునకున్=యుద్ధమునకు, పలుకువెంట=చెప్పిన తక్షణమే.

తాత్పర్యము స్పష్టము.

కం. దళవాయులార! యందఱు, వెలలుఁడు సంగ్రామమునకు • వేగమ యనుచున్
బలుక మహాపార్శ్వుఁడు వా, రలసత లేకింటికింటి • కరుగుచుఁ బిలువన్.

అర్థములు. దళవాయులార = సేనాపతులార, వెలలుఁడు = వెడలుఁడు, లడల కభేదము, అలసత=సోమరితనముచేత, సేనాభటులుగా నున్న వారందఱు చచ్చుట చేతను, కొందఱు గాయములుపడి యుద్ధమునకుఁబనికిరాని వారగుటచేతను ఇంటింటికిఁ బోయి నీవురా నీవురా యని సేనానాయకులు రాక్షసులఁ బిలచిరి.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఒక ముహూర్తములోన • నుగ్రదర్శనులైన, రాక్షసు లాయుధ • రాజితోడ
సడ్డకత్తులతోడ • దుడ్డుకట్టెలతోడ, బడితెలతోడను • బలకతోడ
బాగుదారులతోడ • వాయిదారులతోడఁ, గత్తులతోడ రోఁకండ్లతోడఁ
గంగ్రదగొడ్డండ్లతోఁ • గరవాలములతోడఁ, జబురుజంగులతో జ•జాలతోడఁ

తే. దళుకు(గలశస్త్రములతోడఁ • దరలి రాఁగ, దీప్యమానంబు భీమంబు • దేరి చెక్కి
సత్త్వగాంభీర్యముల కల్మి • సప్తతలంబు, గ్రీల దశకంఠుఁ డనికయి • వెడలె నపుడు.

అర్థములు. ఉగ్రదర్శనులు=చూడ భయంకరమైనవారు, బాగుదారులు= చిన్నకత్తులు, వాయిదారులు = వంకలుగల కత్తులు, జబురుజంగులు = చిన్న ఫిరంగులు, జజాలతో=ఇదియొక దినుసు ఫిరంగి, సత్త్వగాంభీర్యముల కల్మి = బలాతిశయ సంపదచే.

తాత్పర్యము = స్పష్టము.

సీ. అధిపునానతి విరూ • పాక్షమహాపార్శ్వులును మహోదరుఁడును • ఘనబలాఢ్యు
లాత్మశతాంగంబు • లధిరోహణ మొనర్చి, యార్పులు పెడబొబ్బ • లతిశయిల్ల
మేదిని భేదిల్ల • మేదురారవములు, నించుచు జయకాంక్ష • నిర్గమింప
నంతకుభంగి ను • ద్యత కార్ముకుం డయి, జవనాశ్వయుక్తమై • దివసకరుని
తే. భాతి వెలుగొందు రథమునఁ • బంక్తిముఖుఁడు
మహితజవమున రామల • క్ష్మణులు వెలుఁగు
చక్కటికి నల్లద్వారంబు • చాయఁ గదలి
కర్కశాసురసేనతోఁ • గదలి రాఁగ. ౨౩౬

అర్థములు. మహోదర మహాపార్శ్వులు=వీరు మంత్రులు, ఇది వఱకుఁ జచ్చినవారు యుద్ధోన్మత్త మత్తులను నామాంతరము గలవారు తమ్ములు; ఆత్మ శతాంగంబులు=తమ రథములు, అధిరోహణ మొనర్చి = ఎక్కి, మేదురారవ ములు = దట్టమైన ధ్వనులు, నిర్గమింపన్=బయలు వెడలఁగా, ఉద్యత = ఎత్తఁ బడిన, కార్ముకుఁడు=విల్లుగలవాఁడు, జవనాశ్వయుక్తము=వేగముగఁబోవు గుఱ్ఱ ములతోఁ గూడినది, దివసకరుని భాతిన్=సూర్యునివలె, అల్లద్వారంబు = ఉత్తర ద్వారము, కర్కశ = కఠినులైన, అసురసేనతో = రాక్షసుల దండుతో.

తాత్పర్యము

రాజాజ్ఞ చొప్పున విరూపాక్షుఁడు మహోదర మహాపార్శ్వులు నను మహా బలవంతులు తమ తమ రథములెక్కి యార్పులు పెడబొబ్బలు మిక్కుటముగాఁగా భూమి పగులునట్లు ధ్వనులు దట్టముగా నించుచు జయముగోరి బయలు దేఱఁగా రావణుఁడు విల్లెత్తికొని వేగవంతములైన గుఱ్ఱములుకట్టిన సూర్యునివలె వెలుఁగు రథమెక్కి రామలక్ష్మణు లున్న యుత్తర ద్వారము వైపుగ వేగముగ క్రూరు లైన రాక్షసుల సేనలతో రాఁగా

మూలబలము సూర్యోదయమున యుద్ధము ప్రారంభముచేసి యొకటి న్నర గంటలో (7-30) హతమయ్యెను. కావున నిప్పుడు ఎనిమిది ఎనిమిదిన్నర గంటలై యుండవలెను. చతుర్దశి తిథి, మూలబల యుద్ధ మొకనాఁడంతయు జరుగునని తలఁచి యమావాస్యనాఁడు తాను బయలుదేఱ నాలోచించెను గాని మూలబల మప్పుడే హత మగుటచే వెంటనే వాఁడును బయలుదేఱవలసి వచ్చెను.

## —♦ రావణున కవశకునంబు లగుట ♦—

ఉ. మాసె సరోజబంధు నతి♦మాత్రపుఁజీఁకటు లెల్లదిక్కులన్
రేసె వణంకె నెంతయు ధ♦రిత్రి పలాశశకుంతసంతతుల్
గూసె మహాస్రవృష్టి వడె ♦ గుంపులు గట్టి సృగాలజాలముల్
చేసె శుభేతరారవముఁ ♦ జేరి ధ్వజంబున వ్రాలె గృధ్రముల్. ౩-౩౩౮

అర్థములు. సరోజబంధువు = సూర్యుఁడు, అతిమాత్రపు = విస్తారమైన, రేసెన్ = అతిశయించెను, పలాశ = మాంసము దిను, శకుంతసంతతుల్ = పక్షి సమూహములు, మహాస్రవృష్టి=పెద్ద నెత్తురు వాన, సృగాల జాలముల్ = నక్కల గుంపులు, శుభేతర=కీడు తెలుపు, ఆరవము=ధ్వని, గృధ్రముల్=గ్రద్దలు.

తా త్ప ర్య ము

సూర్యకాంతి మాసెను. దట్టపుఁ జీఁకట్లు క్రమ్మెను. భూమి వణఁకెను. మాంసము దిను పక్షులు కూసెను. నెత్తురు వర్షము గురిసెను. నక్కలు పరుషముగఁ గూసెను. ధ్వజముపై గ్రద్దలు వ్రాలెను.

ఉ. వాజులు కాళ్ళు జాఱిపడె ♦ వామభుజేక్షణముల్ చలించె న
త్తేజము మాసె మోమునకు ♦ దీనత నొందె గళస్వరంబు స్వా
రాజవిరోధికిం, బిడుగు ♦ రాలెడిభంగిని నుల్క-రాలె, న
య్యాజిని కీడు దెల్పుచు శి♦వాళులు కాకులు గూసెఁ జుట్టుచున్. ౩-౩౩౯

అర్థములు. వాజులు=గుఱ్ఱములు, వామభుజేక్షణముల్ = ఎడమభుజము, ఎడమ కన్ను, గళస్వరంబు = కంఠధ్వని, ఉల్క = కొఱవి, శివాళులు=నక్కల గుంపులు, చుట్టుచున్=చుట్టు తిరుగుచు.

తా త్ప ర్య ము

గుఱ్ఱములు కాళ్ళుజాఱి పడెను. ఎడభుజము ఎడమకన్ను కదలెను. మొగమున కాంతి తొలఁగెను. రావణునకు కంఠస్వరమున హైన్య మావేశించెను. పిడుగులవలెఁ గొఱవులుపడెను. ఆ యుద్ధమందు వానికిఁ గీడు తెలుపుచు నక్కలు కాకులు వానిచుట్టు తిరిగెను.

కం. ఘోరోత్పాతము లీగతి, దారుణముగఁ దోఁచు చున్న ♦ దశముఖుఁ డాత్మన్
జేరంగనీక కాల, ప్రేరితుఁడై మోహమునను ♦ వేగమ చనియెన్. ౩-౩౪౦

అర్థములు. ఘోరోత్పాతములు = భయంకరములైన యపశకునములు, కాలప్రేరితుఁడై =మృత్యువుచేఁ బ్రేరింపఁ బడినవాఁడై, మోహమునను=జయము గలుగు నను నజ్ఞానముచే.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. వారి శతాంగఘోషముల ♦ వారల యార్పుల నాలకించి తెం
పార వనేచరుల్ మిగుల ♦ నాహవదోహలు లై యెదిర్చినన్

వారికి వీరికిన్ రణము • వారక చెల్లె భయంకరంబుగా
వారల నెల్ల మీఱి దశ • వక్త్రుఁడు చాపగుణంబు మీటుచున్. ౨౨౪౦

అర్థములు. శతాంగఘోషములన్ = రథముల ధ్వనులను, తెంపారన్ = సాహస మతిశయింపఁగా, ఆహవదోహలులై = యుద్ధమందాసక్తి గలవారై.

తాత్పర్యము

వారల రథధ్వనులు వారల యఱపులు విని వానరులు మిగుల సాహసవంతులై యుద్ధాసక్తులై వారి నెదిరింపఁగా వారికి వీరికి భయంకరమైన యుద్ధము జరిగెను. అప్పుడు రావణుఁడు వారినందఱ దాఁటిపోయి యల్లెత్రాడు మీటుచు,

—• రావణుఁడు కపిసేన నుఱుమాడుట •—

సీ. కాంచనమండిత • కాండప్రకాండంబు, లోండొండ మెండుగ • నుద్ధవిడిని
బఱప శిరంబులు • పగిలినవారును, గుండెలు దబ్బలై • కూలువారుఁ
జెవులు దెగినవారుఁ • జెంప చీలినవారుఁ, బ్రక్కలు డొక్కలు • పగులువారు
ముక్కులు తోఁకలు • ముక్కవోయినవారు, నావిరి తిరుగక • యురలువారుఁ
ఆ. గనులు లేనివారుఁ • గాళ్ళు దెగినవారు, మెడలు దెగినవారు • మిడుకువారు
నైరికీశవర్యు • లాతని రథమెందుఁ, బఱచె నందు సేన • పాడుపడియె. ౨౨౪౧

అర్థములు. కాంచన = బంగారుచే, మండిత = అలంకరింపఁబడిన, కాండ = బాణముల, ప్రకాండములు = సమూహములు, ఉద్ధవిడిని = మిగుల వేగముతో.

తాత్పర్యము స్పష్టము.

సీ. కత్తుల వఱకిన • యత్తెరఁ గొప్పార, బాడిసఁ జెక్కిన • పగిదిగాఁగ
అంపావఁ గోసిన • సొంపు సంపాదింపఁ, ద్రోపుడు పట్టిన • త్రోవఁ దవర
నులులను మలచిన • చెలువు దీపింపఁగఁ, దఱిమెన బెట్టు చం • దంబు దోఁపఁ
దుఱిమినచాప్పునఁ • దఱిగిన భంగిని, గొఱవులఁ జూఁడిన • తెఱఁగు వెలయ
ఆ. గారుచిచ్చు గవిసి • కాల్చినమాడ్కిని, నేపు మెఱసి పరుల • నూపు మాఁపెఁ
జండదీర్ఘ బాహుఁ • దాండవితశరాస, రాజదండుఁ డైన రావణుండు. ౨౨౪౨

అర్థములు. చూఁడిన = కాల్చిన, చండ = వాఁడిమిగల, దీర్ఘ బాహుఁ = నిడుపాటి చేతులచే, తాండవిత = నాట్యమాడు, శరాస రాజదండుఁడు = దండము వంటి శ్రేష్ఠమైన విల్లు గలవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఎందును దానయై • యేపారి తెంపారఁ, బిడుగులు గురియించు • నెడము లేక
యేచాయఁ దానయై • రోచులు గ్రక్కు బాణాళులఁ జించి చెం • డాడుచుండు
నేవంకఁ దానయై • యేవంకయును లేని, ములుకుల పోవలి • గలుగఁ జేయు
నేమూలఁ దానయై • యామూల మరులసైన్యంబులు పఱవఁ జీకాకు సేయుఁ

ఆ. ఎక్కసూటి పోవు ♦ బ్రక్కప్రక్కలు నొక్కఁ, గోణసీమలందు ♦ రాణ మెరయఁ
జక్రమండలములఁ ♦ జిందువం దొనరించు, నరిదివిల్లుకాఁడు ♦ సురలసూడు.

అర్థములు. ఎడము లేక = సందు లేకుండునట్లు, ఏ వంక = ఏ లోపము, హావళి = ఉపద్రవము, ఆమూలము = మొదలుముట్ట, కోణసీమలందున్ = మూల ప్రదేశములందు, చిందువందు = చెదరినది, అరిది = ఆశ్చర్యకరమైన, సురలసూడు = దేవతల విరోధి, రావణుఁడు.

తాత్పర్యము స్పష్టము.

౫౭-వ సర్గము.

కం. ఆశరనాథకరోజ్ఝిత, మాశరవారంబు దాఁకి ♦ వనచరసైన్యం
బాశుగసఖసంప్రోషిత, శలభవ్రాత రీతి ♦ నాకృతి మాఱెన్. ౨౧౭౭

అర్థములు. ఆశరనాథ = రాక్షస ప్రభువుయొక్క, కరోజ్ఝిత = చేతులతోఁ జిమ్మఁబడిన, ఆ = ప్రసిద్ధమైన, శరవారంబు = బాణముల సమూహము, ఆశుగసఖ = అగ్నిచే, సంప్రోషిత = కాల్పఁబడినది, శలభవ్రాతము = మిడుతల గుంపు, ఆకృతి = ఆకారము.

తాత్పర్యము

రావణాసురునిచే విడువఁబడిన బాణములు దాకి వానరసేన యగ్నిచేఁ గాలిన మిడుతల సమూహమువలె నాకారము మాఱినదయ్యెను.

ఉ. మారుతధూత మేఘముల ♦ మాడ్కి దవానలదహ్యమానకాం
తారగజంబులట్లసుర ♦ నాథశరార్దిత మర్కటాగ్రణుల్
పోరు దొలంగి పోయినదె ♦ పోకగఁ బాఱిరి కాందిశీకులై.
యారవపూరితాశులయి ♦ యాపద నొంది నలంగి దీనులై. ౨౧౭౮

అర్థములు. మారుత = గాలిచే, ధూత = ఎగురఁగొట్టఁబడిన, దవానల = కాఱుచిచ్చుచే, దహ్యమాన = కాల్పఁబడుచున్న, కాంతారగజంబులట్లు = అడవి యేనుఁగులవలె, అసురనాథ = రాక్షసరాజుయొక్క, శర = బాణములచే, అర్దిత = పీడింపఁబడిన, మర్కటాగ్రణుల్ = వానర ప్రముఖులు, కాందిశీకులై = దిగ్భ్రమ చెందినవారై, ఆరవ = ధ్వనిచే, పూరిత = నిండింపఁబడిన, ఆశులై = దిక్కులుగలవారై.

తాత్పర్యము

గాలిచే నెగురఁగొట్టఁబడిన మబ్బులవలె, కాఱుచిచ్చుచేఁ గాల్పఁబడుచున్న యడవి యేనుఁగులవలె రావణబాణములచేఁ బీడింపఁబడిన వానరశ్రేష్ఠులు కలత చెందినవారై యుద్ధము వదలి దిక్కులు నిండ ధ్వనించుచు నలఁగి దుఃఖితులై పోయినవారు పోయినట్లే పోయిరి.

—♦ సుగ్రీవుఁడు రాక్షసుల వధించుట ♦—

చ. ప్లవగులు మూల కొక్కఁడుగఁ ♦ బాఱ రఘూద్వహుపైఁ శరాంగమున్
జవమునఁ దోలఁ బంచెఁ దన ♦ సారథి నయ్యెడ సూర్యనందనుం

దవిరళకీశసైన్య మిటు ♦ లాఁడిపోవఁ దనంతవానిఁ గీ
శవిభు సుషేణు గుల్మమున ♦ స్థాపితుఁ జేసి రయంబెలర్పఁగన్. ౨౨౪౭

అర్థములు. అవిరళకీశసైన్యము = దట్టముగ నుండిన వానరసేన, ఆఁడిపోవన్ = వ్యర్థమై పోఁగా, తనంతవాని = తనతో సమానుఁ డగువాని, గుల్మమున = సేనాసన్నివేశమందు.

తాత్పర్యము

మూలకోటఁడుగ వానరులు పరువెత్తఁగా రావణుఁడు తన సేరిని రామచంద్రుఁపైఁ దోలించెను. ఆ సమయంబున వానరులు వ్యర్థులై పోవుటచూచి గుల్మమునఁ దన స్థానంబునం దనంతసామర్థ్యము గలవాని సుషేణుని నిల్పి శీఘ్రముగ.

ఉ. శూరులు యూథనాయకులు ♦ సూరెల రా ద్రుమశైలపాణులై
పేరిమిమీఱి రాక్షసుల ♦ పీఁచ మడంపఁ దొడంగి శైలముల్
భూరుహముల్ మహోగ్రగతి ♦ బోరున మేఘము కావలో శిలా
సారము పుల్గులం గురియు ♦ చందనమునం గురియించె నీసునన్. ౨౨౪౮

అర్థములు. సూరెలన్=ప్రక్కల, పీచము=మదము, రూ. పింఛము.

తాత్పర్యము

శూరులగు యూథపతులు తన ప్రక్కలఁ దన కండదిచ్చుటకై చెట్లను కొండలను చేతులఁ దీసికొనిరాఁగా పరాక్రమించి రాక్షసుల గర్వ మడఁగింపఁగోరి యుదధిలో మేఘములు పక్షులమీఁద జాలవాన గురియునట్లు రాక్షసులమీఁద కొండలు చెట్లు గురియించెను.

కం. లయసమయజనితపవనో,చ్చయనిహతిం ద్రెళ్ళు భూజ ♦ సముదయ మనఁ ద
ద్రయమునకుఁ దెరలి రాక్షస,చయములు సొల్పడియె నేల♦సత్త్వము దూలన్.

అర్థములు. లయసమయ = ప్రళయకాలమందు, జనిత = పుట్టిన, పవనోచ్చయ నిహతిన్=పెద్దగాలిదెబ్బచేత, భూజసముదయము చెట్లగుంపు, తత్ + రయమునకున్=ఆ వేగమునకు, సొల్పడియెన్=చాలుగాఁ బడెను.

తాత్పర్యము

ప్రళయకాలమందు మహావాయువు దెబ్బకు నేలఁబడు చెట్లగుంపు వలె, ఆ వేగమునకు రాక్షసుల గుంపు బలము చెడి చలించి నేలమీఁదఁ జాపపఱచినట్లు పడెను.

చ. అగచరనాథముక్తవివి ♦ ధాశ్మచయాహతిఁ జేసి శీర్షముల్
పగుల నరంబులుం దెగ మొ ♦ లల్ విఱుగం గరపాదజాలముల్
నొగులఁగ నెత్రు గ్రక్కుచును ♦ లోఁగుచు విచ్చుచు క్షీయమాణమై
మొగి నసురేంద్రశూరతతి ♦ మోడుపడెన్ మొగతప్పె బెగ్గిలన్. ౨౨౪౯

అర్థములు. అగచరనాథ=వానరరాజుచే, ముక్త=విడువఁబడిన, వివిధ =

నానావిధము లయిన, అశ్మచయ = జాలసమూహముల, ఆహతిన్ = దెబ్బచే, క్షీయమాణమై = నశించు చున్నదై, మోడుపడెన్ = మొద్దువలె నయ్యెను, ఖండిత మయ్యెను, మొగతప్పెన్=ముఖము తప్పించెను, బెగ్గిలెన్=భయపడెను.

తాత్పర్యము

సుగ్రీవుఁడు వేసిన జాలసమూహముచేత తలలు పగులఁగా నరములు తెగఁగా నడుములు విఱుగఁగా కాళ్ళుచేతులు బాధపడఁగా నెత్తురు గ్రక్కుచు లోపడుచు చెదరిపోవుచు క్షయించు చున్నదై రాక్షసవీరసమూహము కొమ్మలు పోయిన చెట్లమోడులవలె నయ్యెను. ముఖము తప్పించెను. భయపడెను.

—• సుగ్రీవుఁడు విరూపాక్షు వధించుట •—

ఉ. శిక్షితరాక్షసుండు హరి• శేఖరుఁ డీగతి మీటెనన్ విరూ
పాక్షుఁడు పేరు వాడుచు శ•తాంగము డిగ్గి గజంబు నెక్కి ప్ర
త్యక్షలయాంతకుం డన వ•నాటుల మూఁకఁని భానుసూనుపై
రాక్షసు లెల్ల మోదమున • రాజిల నైచెఁ గలంబసంతతుల్. ౨౨౫౦

అర్థములు. శిక్షితరాక్షసుండు = దండింపఁ బడిన రాక్షసుఁ డగువాఁడు, హరిశేఖరుఁడు = వానరశ్రేష్ఠుఁడు, పేరువాడుచున్ = తనపేరు చెప్పుచు, శతాంగము = తేరు, ప్రత్యక్షలయాంతకుం డనఁగన్ = కంటికి గోచరించు ప్రలయకాల యముఁడో యనునట్లు వనాటులన్ = వానరులను, కలంబసంతతుల్ = బాణసమూహములు.

తాత్పర్యము

సుగ్రీవుఁడు రాక్షసుల నీ ప్రకారము దండించుచు విజృంభింపఁగా విరూపాక్షుఁడు తనపేరు చెప్పుచు తేరు దిగి యేనుఁగు నెక్కి ప్రలయకాలయముఁడు ప్రత్యక్షమయినాఁడా యన్నట్లు వానరుల మూఁకని రాక్షసులు సంతోషింప సుగ్రీవుని మీఁద బాణసమూహము నైచెను.

ఆ. వానిబాణవృష్టి • వనచరపతి నొచ్చి, రూపు గొనిన యేపు•కోప మనఁగఁ
గుజమొకండు ద్రిప్పి•కుప్పించి యెగిరిత,ద్గజముముఖముమీఁదఁ•దాఁచుటయును.

తాత్పర్యము

ఆ బాణవర్షముచేత సుగ్రీవుఁడు నొచ్చినవాఁడై పరాక్రమము కోపము రూపముగొనె నన్నట్లు చెట్టు నొకటి దీసికొని త్రిప్పి కుప్పించి యెగిరి యేనుఁగు ముఖము మీఁదఁ గొట్టఁగా.

చ. కరివర మా ప్రహారమునఁ • గంపిలి యొక్కధను:ప్రమాణమున్
సురిఁగి పిఱిందికిన్ ధరణి•సోలె రవాన్వితమై సురారియున్
గరి విడనాడి ఖేటకము • ఖడ్గమునుం గొని ధీరవర్యుఁ డా
హరిపతిమీఁదికిం బఱవ • నాతఁడు నైచెను బ్రస్తరంబునన్. ౨౨౫౨

తాత్పర్యము

ఆ దెబ్బచే నాయుత్తమగజము వణఁకి యొక్క బారెఁడు దూరము వెనుకకు వెనుకకుఁబోయి ధ్వనించుచు నేలఁబడెను. ఆ రాక్షసుఁడా యేనుఁగును వదలి డాలు తరవారి తీసికొని ధైర్యశాలియగు సుగ్రీవునిమీఁదికిఁ బరువెత్తఁగా నతఁడు రాతితోఁ గొట్టెను.

ఉ. రాతిని తప్పఁదాఁటి యల♦రాక్షసుఁ డా యినసూతిఁ గత్తిచేఁ
జేతికొలంది మోఁదఁ ♦ జిక్కని ముష్టి నురంబు నొంపఁగా
వే తరవారి మైమఱువు ♦ వ్రీలఁగఁ జేసియుఁ గాలఁ దన్నినన్. ౨౨౫౩

అర్థములు. చేడ్పడి = బాధపడి, తేజి = తెప్పరిల్లుకొని లేచి, జాతరుషాతిరేకమున = పుట్టిన కోపాతిశయమున, తరవారి = కత్తి, మైమఱువు = కవచము, వ్రీలఁగన్= పగిలి పడిపోవునట్లు.

తాత్పర్యము

విరూపాక్షుఁడు రాతిదెబ్బ తప్పునట్లు లెగిరి యావలదూఁకి సుగ్రీవుని కత్తిచేఁ జేతిబలముకొలఁది కొట్టఁగా నతఁడు బాధపడిమూర్ఛపోయి లేచి కలిగిన కోపాతిశయముచే గట్టి పిడికిట వాని రొమ్మునమీఁద గ్రుద్దెను వాఁడును వేగముగ కత్తితో సుగ్రీవుని కవచము చీలునట్లు చేసి కాలితోఁ దన్నెను.

ఉ. ధారిణిఁ ద్రెళ్ళి లేచి తల♦తాడితుఁ జేసిన రాక్షసుండు త
ద్ఘోరతరప్రహారమును ♦ గ్రోవుచు పుచ్చి యురంబు మోదినన్
వీరుఁడు సూర్యసూతి తన♦ వ్రేటటు తప్పిన నందు వేచి యా
వైరిలలాటదేశమున ♦ బాఢదృఢోగ్రసుముష్టి గ్రుద్దినన్. ౨౨౫౪

అర్థములు. తలతాడితున్=అఱచేతితోఁ గొట్టఁబడినవానిని, ఘోరతరప్రహారమును = భయంకరమైన దెబ్బను, గ్రోవుడుపుచ్చి = తొలఁగి పోవునట్లు చేసి, బాఢ, దృఢోగ్రసుముష్టిన్=మిక్కిలి దృఢమైన మంచి పిడికిట.

తాత్పర్యము

ఆ దెబ్బవలన నేలఁబడి లేచి యఱచేతితో సుగ్రీవుఁడు రాక్షసునిఁ గొట్టఁగా రాక్షసుఁడా దెబ్బను చమత్కారముగఁ దప్పించుకొని రొమ్మునగ్రుద్దెను. వీరుఁడు సుగ్రీవుఁడు తన వ్రేటు తప్పిపోవుటచే సమయము కనిపెట్టి యా విరూపాక్షుని నొసట గట్టి పిడికిట గ్రుద్దెను.

కం. నెత్తురు గ్రక్కుచు దేహము, నెత్తుటఁ దడియంగ వికృత♦నేత్రుం డగుచున్
గుత్తుక మెదలఁగ నూపిరి హత్తిన వేదనను రోలి♦యవనిం ద్రెళ్ళెన్. ౨౨౫౫

అర్థములు. వికృతనేత్రుఁడు=వికారములైన కన్నులు గలవాఁడు, రోలి= విలపించి.

తాత్పర్యము

నెత్తురు గ్రక్కుచు దేహము నెత్తుటఁ దడియఁగా వికారపుఁజూపులు గల వాఁడై యావిరి కంఠమున నుండఁగా బాధచేఁ జావుకేక వైచి నేలపై బడెను.

కం. ఇలఁ బడి ప్రక్కలఁ బొరలుచు, విలవిల మని తన్నికొనుచు • వికృతరవంబుల్
బలియించు చెగిరిపడుచో, బలియు విరూపాక్షుఁ బ్లవగ•వర్గము చూచెన్.

అర్థములు. విలవిల మని = ధ్వన్యనుకరణశబ్దములకు ననుధాతువు పరం బగుచో గొన్నియెడల ముగాగమంబగు. ప్రౌ.వ్యా. సంధి-౯౯ సూ. విలవిల తన్ని కొనుచు ననియుఁ జెప్పవగు.

తాత్పర్యము

నేలఁబడి యాప్రక్కకు నాప్రక్కకుఁ బొరలుచు కాళ్ళుచేతులు విలవిల తన్నుకొనుచు వికారధ్వనులు చేయుచు నెగిరిపడుచు నుండఁగా బలవంతుఁ డగు విరూపాక్షుని వానరులు చూచిరి.

కం. ఇత్తెఱఁగున నయ్యసురుఁడు, హతిన్ మృతిన్ నిశాటు • లగచారులు ను
న్మత్తసురవాహినీగతి, నత్తఱి గనరయ్యె శోక•హర్షాధికతన్. ౨౨౫౮

అర్థములు. మృతిన్ హతిన్=చావఁగా, ఉన్మత్తసురవాహినీ గతిన్ = పిచ్చిపట్టిన గంగవలె, అనఁగా బదరీనారాయణమునకు హరిద్వారమునకు నడుమఁ గొన్నిచోట్ల గంగ దూఁకుచు సుడి దిరుగును. అప్పుడు పిచ్చిపట్టినవాఁడు దేహము తెలియక యెట్టివికారపుఁ జేష్టలు చేయునో యిట్లు గానవచ్చును. పాఱుడు నీళ్ళు, సుడినీళ్ళు, ఎదురుతన్ను నీళ్ళు అన్ని యొక్కచో గందరగోళముగా నుండును. శోకహర్షాధికతన్=క్రమాలంకారము, నిశాటులు=రాక్షసులు శోకాధికత, వానరులు హర్షాధికత గనరయ్యెను.

తాత్పర్యము

ఈ విధముగ విరూపాక్షుఁడు చావఁగా రాక్షసులు శోకాధిక్యము చేతను వానరు లతి సంతోషముచేతను పిచ్చి గంగవలెఁ గందరగోళపడిరి.

—• ౯౭-వ సర్గము. సుగ్రీవుఁడు మహోదరుఁ జంపుట •—

ఉ. ఈసున రెండుసైన్యములు నేడెఱఁ దాఁకి మహానిదాఘవే
ళాసరసీజలంబు లన•లావు దొఱంగి నశింప, నందు నా
త్మాసురసైన్యదుస్థితి బ•లాఢ్యవిరూపవిలోచనుండు స్వ
ర్యాసము బోక గాంచి దశ•వక్త్రుఁడు కోపము ముబ్బడింపఁగన్. ౨౨౫౯

అర్థములు. ఈసునన్ = కోపముచే, ఏడ్తెఱన్=పరాక్రమమున, మహానిదాఘవేళా=గొప్ప యెండకాలమందలి, సరసీజలంబులు=కొలనియందలి నీళ్ళు, ఆత్మాసుర సైన్య దుస్థితి = తన రాక్షససేన కష్టదశ, బలాఢ్య = బలసంపన్నుఁ

డగు, విరూప విలోచనుండు = విరూపాక్షుఁడు, వ్యావ్యాపముఁబోక = చచ్చుట, ముబ్బడింపఁగన్=మూడంతలు కాఁగా.

తాత్పర్యము

కోపముచే రెండు సేనలు పరాక్రమించి యెదురుకొనఁగా మంచి యెండ కాలమందలి కొలని నీటివలె బలము తొలఁగి నశింపఁగా దన సైన్యము యొక్క కష్టస్థితి, వానరుల యుబ్బు, విరూపాక్షుఁడు చచ్చుట చూచి రావణుఁడు కోపము మూఁడంతలు కాఁగా.

కం. గ్రావాలయు లఱుముటయును, దేవారులు విఱుగుటయును ♦ దేఁకువఁ గని చే
తో వేదన గొని వగచెన్, దైవవిపర్యాస మిట్లు♦తనరు నె యనుచున్. ౨౨౫౯

అర్థములు. గ్రావాలయులు=కొండలే యిండ్లు గాఁగలవారు, క్రోఁతులు, విపర్యాసము=వ్యత్యాసము, తలక్రిందగుట.

తాత్పర్యము

కొండలలోఁబడి యుండువారు పైపడి వచ్చుట, దేవతల జయించినవారు చెదరి పోవుట చూచి భయపడి రావణుఁడు ఆహా! దైవమింత దలక్రిందగునా యని మనస్సులో వేదన గొని దుఃఖించెను.

చ. వరబలుఁ డంతఁ జేయులఁతి ♦ వానరముఖ్యులఁ ద్రుంచు నమ్మహో
దరుఁ గని పల్కె నోయలఘు ♦ దర్పనిధీ! విను మజ్జయాశ త్వ
త్కరగత మయ్యె నీబలము ♦ గాఢపరాక్రమ మెల్లఁ జూపి యీ
పరుల వధింపు, వేళ యిది ♦ స్వామిఋణం బఖిలంబు దీర్పఁగన్. ౨౨౬౦

అర్థములు. చేయులఁతిన్ = సమీపమందు, మజ్జయాశ = నేను జయింతు నను నాశ, త్వత్ కరగతమయ్యెన్=నీ చేతిలోనున్నది, పరులన్=శత్రువులను.

తాత్పర్యము

ఉత్తమబలముగల రావణుఁడు సమీపమందు యుద్ధము చేసి వానరముఖ్యులఁ జంపుచున్న మహోదరునిఁజూచి యిట్లనియె. ఓ గొప్ప బలగర్వమునకు స్థానమైనవాఁడా! నేను జయింతు ననునాశ నీ చేతియందున్నది. నీ బలముపరాక్రమము నంతయుఁజూపి యీ శత్రువుల వధింపుము. ఇన్ని దినాలు నా సొమ్ముతినిన యప్పును దీర్చుకొను సమయ మిదే. దీనికేకదా యిన్నిదినాలు మిమ్ముఁ బోషించితిని.

చ. అనవుడు నల్లె యంచు నతఁ ♦ డగ్నిఁ బతంగమువోలె శత్రువా
హినిఁ జొరఁబాఱ జేనినుడు ♦ లెంతయుఁ దోడ్పడ నాత్మశక్తికిన్
వనచరనాథయూథమును ♦ వారక కిట్టి వధింప మర్కటుల్
ఘనకుజశైలసంతతుల ♦ గాటముగాఁ బ్రహరించి రాతనిన్. ౨౨౬౧

అర్థములు. పతంగము = పక్షి.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా నట్లే చేసెదనని యంగీకరించి మిడుత యగ్నిలో బడునట్లు శత్రుసేనయందుఁదూఱి తన శక్తికి రాజవాక్యములు తోడుపడఁగా వానరసేనను సమీపించి చంపఁగా క్రోఁతులు పెద్దచెట్లు కొండలగుంపులచే వానిని చక్కఁగాఁ గొట్టిరి.

సీ. అమ్మహోదరుఁడు రో • షావేశమునఁ దీవ్ర, శరవారముల శైల • చరుల నెల్ల
భిన్నపాదులుగ సం • భిన్నపాణులుగ ని, కృత్తోరువులుగను • నుత్తరింప
వెఱచి క్రోఁతులు పాఱ • వెఱవకుఁ డంచు సు, గ్రీవుండు వాని భం • గింప నొక్క
విపులపాషాణంబు • విసరివైచిన దానిఁ, దుత్తుమురుగఁ జేయఁ • దూర్ణముగను
ఆ. గృధ్రచక్ర మనఁగ • గిరగిర దిరుగుచు, ధరణిఁ ద్రెళ్ళఁ గాంచి • తిరణిసుతుఁడు
సాల మొండు ద్రిప్పి • చావుము రాక్షసా!, యనుచు వైవ దానిఁ • దునిమె నతఁడు.

అర్థములు. భిన్నపాదులుగన్=విరిగినకాళ్ళుగలవారిగ, సంభిన్నపాణులుగన్ = నఱకఁబడిన చేతులు గలవారిగ, నికృత్తోరువులుగను = కత్తిరింపఁబడిన తొడలు గలవారుగ, ఉత్తరింపన్=ఖండింపఁగా విపుల = వెడల్పైన, పాషాణంబు = ఱాయి, తుత్తుమురు - తుమురు + తుమురు = తుత్తుమురు, మిక్కిలి చూర్ణము, తూర్ణముగను=శీఘ్రముగ, గృధ్రచక్రము=గ్రద్దల సమూహము.

తాత్పర్యము

ఆ మహోదరుఁడు కోపావేశమున పదునైన బాణసమూహములచే వానరుల నెల్ల కాళ్ళు చేతులు తొడలు విఱిగినవారిగా ఖండింపఁగా వానరులు భయపడి పరువెత్తఁగా భయపడవలదని వారికి ధైర్యము చెప్పి వాని చంప నొక్క పెద్ద బండను విసరివేయఁగా వాఁడు దానిని పొడిపొడిగఁ జేసెను. అది గ్రద్దల సమూహమువలె గిరగిర తిరిగి నేలఁబడగాఁ జూచి సుగ్రీవుఁడు మఱియొక చెట్టు ద్రిప్పి రాక్షసా! చావుమని విసరి వైచెను. దానిని వాఁడు ఖండించెను.

చ. హరిపతి నేల నున్న పరిఘాయుధముం గొని త్రిప్పి యమ్మహో
దరురథసైంధవావళులఁ • దాఁచిన నయ్యవి నేలఁ గూలె వాఁ
డురవడి నేల దూఁకి యొక • యుక్కుగదం గొని, వీరు లిద్దఱుం
బరిఘగదాధరుల్ గెరలి • మార్కొని కోడెలువోలె ఱొప్పుచున్. ౨౨౬౩

అర్థములు. హరిపతి = సుగ్రీవుఁడు, పరిఘాయుధమున్ = ఇనుపకట్ల గుదియను, తాఁచినన్=కొట్టఁగా, ఉరవడి=మిగుల వేగముతో.

తాత్పర్యము

సుగ్రీవుఁడు నేలపైఁబడియున్న యొక్క యుక్కుగుదియను దీసికొని మహోదరుని తేరిని, గుఱ్ఱములను గొట్టఁగా నవి నేలఁబడెను. వాఁడు వేగముగా నేల దూఁకి

గొక యుక్కు-గదను దీసికొనెను. ఆ యిరువురు వీరు లొకరు గదను మఱియొకరు గుదియను దీసికొని యెదిరించి హుంకరించుచు.

చ. పెనఁగఁగ నమ్మహోదరుఁడు ♦ భీమగతిన్ గదఁ ద్రిప్పి వైచినన్
దినకరనందనుండు కడుఁ ♦ దీవ్రత నా పరిఘంబు వైచె ని
ట్లనుపమసాధనద్వయము ♦ లాహవభూమిఁ బరస్పరాహతిన్
మునిఁగి ధరాస్థలిం బడినఁ ♦ దూర్ణము వానరలోకనాథుఁడున్. ౨౨౮

తాత్పర్యము

యుద్ధము చేయఁగా నా మహోదరుఁడు గదను గిరగిర ద్రిప్పి సుగ్రీవునిపై వేసెను. సుగ్రీవుఁడు పరిఘమును వేసెను. ఆ రెండాయుధము లొకదాని నొకటి కొట్టుకొని విఱిగి నేలఁ బడఁగా వెంటనే సుగ్రీవుఁడు.

సీ. ముసలంబుఁ గాంచన ♦ లసితంబుఁ గైకొని, విసరి వైచిన వాఁడు ♦ వేఱొకండు
గద దాని నడిచిన♦ద్ధాని రెండునున్ వ్రాలె, నాయుధంబులు వ్యర్థ♦మగుటఁ జేసి
ముష్టియుద్ధమునకు ♦ మొనసి యయ్యిరువురు, మండెడునగ్నుల♦మాడ్కిఁ దనరి
బిగిఁ గిలారించుచు ♦ మొగిని గర్జించి ముష్టీముష్టి కదనంబు ♦ సేయుచుండ

ఆ. నలఘుసారుఁ డైన ♦ యసురాధినాయకుం, డనతిదూరవర్తు ♦ లైన ఖడ్గ
ఖేటకములఁ గొన వ♦నాటేశుఁ డట్టుల, వేఱొక త్తిడాలు♦ వే గ్రహించె. ౨౨౯

అర్థములు. కాంచన లసితంబు=బంగారుచేఁ బ్రకాశించునది, ముసలంబు= రోఁకలి, కిలారించుచున్ = కేకలు వేయుచు, ముష్టీముష్టి కదనంబు = పిడికిళ్ళ యుద్ధము, ముష్టీ ముష్టి=ఒకఁడు ముష్టితోఁ గొట్టిన మఱియొకఁడు ముష్టితోఁ గొట్టి చేయు యుద్ధము - వ్యధికరణబహువ్రీహి; దీనినిగుఱించి ఇదివరకే వ్రాయబడెను. అలఘుసారుఁడు = గొప్ప బలము గలవాడు, అనతిదూరవర్తులు = సమీపమునం దుండునవి, ఖడ్గఖేటకములన్=తరవారిని డాలును, వనాటేశుఁడు=సుగ్రీవుఁడు - వానరరాజు.

తాత్పర్యము

బంగారుచేఁ బ్రకాశించు రోఁకలి గైకొని విసరివేయఁగా వాఁడు గదతో దానిని గొట్టెను. అవి రెండు నేలఁబడెను. ఇట్లాయుధములు వ్యర్థములగుటఁ జూచి ముష్టియుద్ధము చేయువారై కిలకిల మని కేకలు వేయుచు మండెడు నగ్నులవలె నొకరినొక నెదిరించి పిడిగ్రుద్దులతోఁ గొట్టుచుండ మిగుల బలవంతుఁడైన రాక్షసుఁడు సమీపమందుఁ బడియుండిన డాలు తరవారులఁ దీసికొనెను. సుగ్రీవుఁడును వెంటనే వేఱొక డాలు తరవారిఁ దీసికొనెను.

మ. కడు విక్రాంతులు కేశరాక్షసులు ఖ ♦ డ్గాఖడ్గి పాటించుచో
గుడిగా మండలచారణంబులను సం ♦ కోచంబు లే కేమియున్

వడిగాఁ జుట్టుచుఁ దాఁకుచున్ మరలుచున్ • శౌర్యంబుమైఁ బోరుచోఁ
జెడుగం డా యసురుండు ఖడ్గమున నై • చెం జర్మమున్ నాటఁగన్. ౨౬౮

అర్థములు. విక్రాంతులు = పరాక్రమము గలవారు, ఖడ్గాఖడ్గి = ఖడ్గముతోఁ గొట్టఁగా మఱియొకరు ఖడ్గముతోఁ గొట్టుచు యుద్ధము చేయుచో, గుడిగాన్ = గుండ్రముగా, చెడుగండు = దుష్టుఁడు, చర్మమున్ = తోలుతోఁ జేయఁబడిన డాలును.

తాత్పర్యము

మిక్కిలి పరాక్రమవంతు లిరువురు కత్తులతో యుద్ధము చేయు సమయంబున గుండ్రముగా మండల ప్రచారములు చేయుచుఁ గొంచెమైన జంకక వేగముగా నొకరి నొకరు చుట్టి తిరుగుచుఁ దాఁకుచు, వెనుకకుఁ బోవుచు యుద్ధము చేయు నెడ దుష్టరాక్షసుఁడు డాలునందు నాటుకొనునట్లు తన కత్తితోఁ గొట్టెను.

ఉ. నాటినకత్తి దీయ నద • వంబుగ రాక్షసుఁ డూన నంతలో
హాటకరత్నకుండలస • మంచితమౌ సశిరస్త్రమూర్ధమున్
మీఁటె దివాకరాత్మజుఁడు • నిస్తులశాతకృపాణధార న
ప్పాట సురారిపాటుఁ గని • పాఱిరి తక్కిన రాక్షసాధముల్. ౨౬౯

అర్థములు. అదవంబుగ = మిక్కిలి, ఊనన్ = ప్రయత్నము చేయఁగా, హాటక రత్నకుండల సమంచితము = బంగారు, రత్నములు - వీనిచే ప్రకాశించు నదియై, సశిరస్త్ర = తల కవచముతోఁ గూడిన, మూర్ధమున్ = తలను. నిస్తుల శాత కృపాణధార = అసమానముగ పదునుగల ఖడ్గముధారచే.

తాత్పర్యము

డాలునం దిఱికికొన్న కత్తిని నూడఁబీక మిక్కిలి ప్రయత్నము చేయుచుండఁగా నంతలో బంగారు రత్నములుగల కుండలములతోను శిరస్త్రాణముతోను గూడిన తలను దనచేతి కత్తితో సుగ్రీవుఁ డెగురఁగొట్టెను. అప్పుడు రాక్షసుని పాటు చూచి తక్కిన రాక్షసులు పరువెత్తిరి.

కం. ఖరకరసుతుఁ డరిఁ గూలిచి, ఖరకరుఁడు స్వకాంతి వెలుఁగు • కరణి వెలుంగన్
సురయక్షసిద్ధసాధ్యులు, ధరణీభూతంబు లతనిఁ • దద్దయుఁ బొగడెన్.

అర్థములు. ఖరకరసుతుఁడు = సూర్యపుత్రుఁడు, అరిన్ = శత్రువును, ఖరకరుఁడు = వేఁడి కిరణములు గలవాఁడు — సుగ్రీవుఁడు.

తాత్పర్యము స్పష్టము.

**—• ౯౮-వ సర్గము. మహాపార్శ్వుఁ డంగదుచే హతుఁ డగుట •—**

సీ. దురమున నిటుమహో • దరుఁడు సుగ్రీవుచే, హతుఁ డౌటఁ గని మహా • ప్రతిఘుఁ డయిమ
హాపార్శ్వుఁ డుగ్రసా • యకవితానంబులఁ, గనుపు గొట్టెను వాలి • తనయు బలిమి
బెడిదపు గాలిని • దోడిమి లూడిన రాలు, ఫలములు నా నేలఁ • దలలు దొరలెఁ
గొందఱికరములు • గొందఱిచరణముల్, కొందఱిపార్శ్వముల్ • గూల్చె నై చె

ఆ. వానతీవ్రబాణ•వర్షంబు నోపక, విముఖ మగుచు శిరము • వ్రేలవైచి
విచ్చె బలఁగ మెల్ల • వీరుఁడు తారాసు,తుండు చూచి సమర•దోహలమున.

అర్థములు. దురమునన్ = యుద్ధమందు, మహాప్రతిఘుఁడు = మిక్కిలి కోపించినవాఁడై, కనుపు గొట్టెను=భంగపఱిచెను, విముఖము=వెనుక ముఖము, సమరదోహలమునన్=యుద్ధకాంక్షచే.

తాత్పర్యము

యుద్ధమందు సుగ్రీవుచే మహోదరుఁడు చావఁగా మహాపార్శ్వుఁడు మిగులఁ గోపించి భయంకర బాణసమూహములచే నంగదుని భంగించెను. మఱియు నోరు గాలికిఁ దొడిమ లూడిపడు పండ్లవలె తలలు నేలఁ దొరలెను. కొందఱ కాళ్ళు కొందఱచేతులు కొందఱప్రక్కలు చీల్చెను. వాని బాణవర్షము సహింపలేక వానరులు మాఱుమొగము పెట్టి తలల వ్రేలవైచి చెదరిపోయిరి. అప్పు డంగదుండు యుద్ధకాంక్షచే.

ఉ. పున్నమవార్ధివోలె మెయి • పొంగఁగఁ బట్టె మొకండు సూర్యతే
జ మ్మగుదానిఁ ద్రిప్పి సుర•సూదను వైవఁగ వాఁడు సూతుతోఁ
గ్రన్నన నష్టసంజ్ఞుఁ డయి • త్రాస్థలి దొర్లిన జాంబవంతుఁడున్
బన్నుగ భీకరాశ్మమున • వానికళాంగము నుగ్గు సేయుచున్. ౨౨౦

అర్థములు. పట్టెము = కత్తి, సురసూదనున్ = రాక్షసుని, నష్టసంజ్ఞుఁడయి=మూర్ఛపోయి, భీకరాశ్మమునన్=భయంకరమైన ఱాతిచే, కళాంగము=తేరు.

తాత్పర్యము

పున్నమనాఁటి చంద్రునిబోలె దేహముప్పొంగఁగాఁ సూర్యకాంతిగల కత్తి నొకఁటి దీసికొని త్రిప్పి రాక్షసుమీఁద వేయఁగా వాఁడు సారథితోడ మూర్ఛ పోయి పడెను. ఇంతలో జాంబవంతుఁడు పెద్దరాతితోఁ గొట్టి తేరిని నుగ్గు చేయుచు.

తే. వాజులను గూల్పఁగా మహా•పార్శ్వుఁ డింత,లోనఁ దెప్పిరి శక్రజా•సూను మేను
బాణవిద్ధంబుఁ గావించి•బ్రహ్మసుతుని,ఁబొమ్ముమూఁడుశరమ్ములఁ•గ్రుమ్మి
మఱియు.

అర్థములు. వాజులను = గుఱ్ఱములను, శక్రజాసూనుమేను = అంగదుని దేహము, విద్ధంబు=బాధింపఁబడినది.

తాత్పర్యము

గుఱ్ఱములను జంపఁగా నింతలో మహాపార్శ్వుఁడు తెలివి తెచ్చుకొన్నవాఁడై యంగదుని దేహము బాణములచే బాధించి జాంబవంతుని బొమ్మ మూఁడు బాణములచేఁ బొడిచి.

కం. ఋక్షచయనాయకునిని గ,వాక్షుని బహుశిలీముఖముల • వ్యథపెట్ట సహ
స్రాక్షుని మనుమఁడు క్రుద్ధర,క్తాక్షుండై పరిఘ మొకటి•యులవునఁగొనుచున్.

అర్థములు. ఋక్షచయ నాయకుని = భల్లూకపతి యగు జాంబవంతుని,

బహుశాంకములన్=అనేక బాణములచే, క్రుద్ధన్=కోపముచే, రక్తాక్షుండయి = ఎఱ్ఱని కన్నులు గలవాఁడై, పరిఘము=ఇనుపకట్ల గుదియ, అలవునన్ = బలముగ, పరిఘ మొకటి గొనుచు, అలవున త్రిప్పి త్రిప్పియని మీఁది పద్యముతో నన్వయము.

తా త్ప ర్య ము

జాంబవంతుని గవాక్షుని ననేక బాణములచే బాధపెట్టఁగా అంగదుఁడు కోపముచేఁ గన్నులెఱ్ఱచేసి గుదియ యొక్కటి తీసికొని బలముకొలఁది.

ఉ. రక్కసు నుక్కడంపఁగఁ గ♦రంబుల రెంటను ద్రిప్పి త్రిప్పి యా
సెక్కఁగ వైవఁ దద్ధతి మ♦హిం బడె బాణముతోడి చాపమున్
జెక్కని తచ్ఛిరస్త్రమును ♦ జేతిశరాసన మూఁడ వెంటనే
కుక్కడఁగ గ్రుద్దెఁ జెవి♦గూ బదరం దల దిమ్ముపట్టఁగన్. ౨.౨౨౩

అర్థములు. ఉక్కడంపఁగన్=చంపఁగా, తద్ధతిన్=ఆ దెబ్బచే, శిరస్త్రము= తల కవచము - పాగా, కుక్కడఁగన్=గుంతపడునట్లు.

తా త్ప ర్య ము

రాక్షసుని జంపు నిమిత్తమై రెండు చేతుల బలముకొలఁది త్రిప్పి త్రిప్పి కోప మతిశయింపఁగా వేయఁగా, నా దెబ్బచే నతఁడు పట్టుకొనిన బాణముతోడి విల్లు దట్టమైన తలజీరా నేలఁ బడెను. చేతివిల్లు నేలఁ బడఁగానే యంగదుఁడు వానిని చెవిగూబ యదరునట్లు తల దిమ్మపట్టునట్లు గ్రుద్దెను.

ఉ. దాన సురారి రోసపడి ♦ దారుణమా పెనుగంద్రగొడ్డలిన్
నూనె మెఱుంగు లీనుచు మ♦నోభయదం బగు దాని శైలముం
బోనిబలంబు దానిఁ గయిఁ ♦ బూని వెసం గపివామజత్రుం దే
శాన రయోద్ధతిన్ వయిన ♦ శక్రసుతాత్మభవుండు నేర్పునన్. ౨.౨౨౪

అర్థములు. మనోభయదంబు = మనస్సునకు భయము గలిగించునది, శైలముంబోని = పర్వతమువంటి, వామ = ఎడమ, జత్రు = మూపుసందలి సంధి యెముక.

తా త్ప ర్య ము

దానిచే రాక్షసుఁడు కోపించి భయంకరమై నిత్యము నూనె రాచుటచే మెఱుఁగులు గలదైన పెద్ద గండ్రగొడ్డలిని, భయంకరమై కొండవంటి బలముగల దానిని చేతఁ బట్టుకొని యంగదు నెడమభుజము సంధియెముక మీఁద మిగుల వేగముగ వేయఁగా నంగదుఁడు దానిని చమత్కారముగ.

తే. తొలఁగ దాఁటుచుఁ బితృతుల్య♦బలుఁడు మర్మ
విదుఁడు తారేయుఁ డాగ్రహా♦వేశమునను
గట్టిపిడికిలి వజ్రంబు ♦ వట్టిదానిఁ
బూని హృదయంబునను దాఁచెఁ ♦ బూర్వలేఖు. ౨.౨౨౫

అర్థములు. తోలఁగ దాటుచు=తప్పించుకొన నావలికి దాఁటి, పితృతుల్య బలుఁడు = తండ్రితో సమానమైన బలము గలవాఁడు, మర్మవిదుఁడు = యుద్ధ రహస్యము-ఎక్కడఁ గొట్టిన శత్రువు చచ్చునో యా రహస్యము తెలిసినవాఁడు, పూర్వ లేఖున్ = రాక్షసుని.

తాత్పర్యము

తప్పించుకొన నావల దూఁకి బలమునందుఁ దండ్రితో సమానుఁడైన యంగదుఁడు యుద్ధమర్మము ఆయుపుపట్టులు తెలిసినవాఁడై మిగులఁ గోపించి వజ్రము వంటి గట్టి పిడికిలి పట్టి రాక్షసుని హృదయమున గ్రుద్దెను.

కం. పోటున నసురుఁడు హృదయ,స్ఫోటముగఁ బరాసు వగుచు ♦ భువిఁ గూలఁ ద్రియా
మాటుల సేనలు కళవళ, పాటున సంక్షోభమంది ♦ పాఱం దొడఁగెన్.

అర్థములు. హృదయస్ఫోటముగన్ = గుండెలు పగులఁగా, పరాసువు= ప్రాణము పోయినవాఁడు, త్రియామాటులు=రాక్షసులు.

తాత్పర్యము

ఆ దెబ్బచే గుండెలు పగిలి రాక్షసుఁడు ప్రాణములు పోయి నేలఁ బడఁగా రాత్రించరుల సేనలు కళవళించి క్షోభ చెంది పరువెత్త నారంభించెను.

కం. వానరగర్జలచే లం,కానగరము సాట్టవప్ర ♦ ఘనసౌధం బై
మానక వణంకె ప్రీలెదు, నో నావపు డొప్పె రాక్ష ♦ సోత్కర మడలన్.

అర్థములు. సాట్టవప్రఘనసౌధంబై=బురుజులతో కోట గోడలతో పెద్ద మేడలతో. అడలన్=వడువగా.

తాత్పర్యము

యుద్ధమునకు వచ్చిన ముఖ్యయోధులు నలువురిలో రావణుఁడు తప్పఁ దక్కిన మువ్వురు చచ్చుట చూచి వానరులు సింహనాదములు చేయఁగా నాధ్వనికి బురుజులతో ప్రాకారములతో పెద్దమేడలతో లంకానగరము గూలునో యని రాక్షసు లేడ్చుచుండఁగా గడగడ వడఁకెను.

కం. నాకౌకోనాదములు వ,నౌకోగర్జలను బెరయ ♦ నుత్కటరోష
వ్యాకులుఁ డయి వింశతిభుజుఁ, డేకోద్యముఁ డగుచు నడచె ♦ వృక్షాటుల పై.

అర్థములు. నాకౌకోనాదములు=ఆకాశమున దేవతల ధ్వనులు, వనౌకో ధ్వనులు=భూమియందు వానరుల ధ్వనులు, ఉత్కటరోషవ్యాకులుఁడై = అధిక రోషముచేఁ గలఁత చెందినవాఁడై, వింశతిభుజుఁడు=ఇరువది చేతులు గలవాఁడు- ఏకోద్యముఁడు = ఒకటే ప్రయత్నము గలవాఁడు, వృక్షాటులపైన్ = వానరుల మీఁద, వనౌక శ్శబ్దము నిత్యసమాసము, వన + ఓకస్ - కావున నిందలి ఓకారమునకు ఉత్కటశబ్దములోని ఉకారమునకు యతి-నిత్యసమాసము లభయ యతులలోఁ జేరినవి.

[కం. లోకంబునఁ గర్ణాట వ,నౌకో ద్వీపాంత దీప • నాస్తి పదార్థా
 న్యేకా న్యోన్యజనార్థవ,నాకాదులు నిత్యసమన•నము లంద్రు బుధుల్-అప్పకవి]

తాత్పర్యము

ఆకాశమున దేవతల సంతోష ధ్వనులు, భూమియందు వానరుల సింహనాదములు కలిసికొనఁగా(అనఁగా వీరి ధ్వనులు వారికి వారిధ్వనులు వీరికి, వినవచ్చెనని భావము) మిగుల రోషముచే రావణుఁడు కలఁత నొందిన మనస్సు గలవాఁడై వానరులమీఁదికిఁ బోయెను.

—• ౧౦౦-వ సర్గము. రావణుఁడు కపులఁ బొలియించుట •—

సీ. ప్రబలశౌర్యులు మహా•పార్శ్వమహోదరు, లతులధీరుఁడు విరూ•పాక్షుఁ డట్లు
 హతులైన దుర్విష • హ్యాగ్రహంబున రథ, చోదకు ని ట్లను • శూరులైన
 మంత్రులు చచ్చిన • మహితదుఃఖంబును, రుద్ధపురార్తియు • యుద్ధభూమి
 మడియించి రామల•క్ష్మణులఁ బోకార్చెదఁ, దోలుమీ రథమతి•తూర్ణముగను
ఆ. హరిజవిధిజకుముద•హనుమన్నలాంగద, ద్వివిదమైందముఖ్య • వృక్షచారు
 లనెడుకొమ్మ లమరు•నవనిజాసుమఫల,ప్రదము రామకుజముఁ•బడఁగ నడుతు.

అర్థములు. దుర్విషహ్య=సహింపరాని, అగ్రహంబున=కోపముచే, రథచోదకున్=సారథిని, రుద్ధపురార్తియు = అడ్డగింపఁ బడిన పురమువలనఁ గలిగిన వ్యసనము, హరిజ = సుగ్రీవుఁడు, విధిజ = జాంబవంతుఁడు, అవనిజా సుమ ఫల ప్రదము=సీత యనెడి పూలు పండ్లు గలది, రామకుజము=రాముఁ డనెడిచెట్టు.

తాత్పర్యము

సుగ్రీవుఁడు జాంబవంతుఁడు కుముదుఁడు హనుమంతుఁడు నలుఁడు నీలుఁడు అంగదుఁడు మైందద్వివిదులు వీరు మొదలుగాఁగల వానరవీరు లనెడి కొమ్మలు గలిగి, సీతయనెడి పువ్వు పండ్లుగల రాముఁ డనెడి చెట్టును నేలఁ బడఁగొట్టెదను.

సావయవరూపకము

ఉ. సారథియున్ రథంబు రభ•సంబునఁ దోలె రథాంగనిస్స్వనం
 బార దిశాసమూహముల•యందుఁ బ్రతిధ్వను లుబ్బుచుండఁ గాం
 తారనదీమహీధరక•దంబసమేతవసుంధరాతలం
 బారవపూర్ణమై వణఁకె • నంబుధి వేల నతిక్రమింపఁగన్ ౧-౨౦

అర్థములు. రభసంబుగన్ = వేగముగ, రథాంగనిస్స్వనంబు=చక్రముల ధ్వని, ఆరన్=నిండఁగా, కాంతార = అడవులతోను, నదీ = నదులతోను, మహీధర=కొండలయొక్క, కదంబ=సమూహముతోను, సమేత = కూడిన, వసుంధరాతలంబు=భూప్రదేశము, ఆరవపూర్ణమై=ధ్వనిచే నిండినదై, అంబుధి=సముద్రము, వేలన్=చెలియలికట్టను.

తాత్పర్యము

సారథియుఁ దేరిని శీఘ్రముగఁ దోలెను. ఆ చక్రముల ధ్వని దిశలందుఁ బ్రతిధ్వను లిచ్చుచుండెను. అడవులతోను నదులతోను కొండలతోను గూడి భూమి వణఁకెను. సముద్రము చెలియలికట్ట దాఁటి భూమిమీఁదఁ బొరలెను.

కం. తామసుఁ డగు దశవక్త్రుఁడు, తామసపడక తా ప్లవంగ ♦ తతిపై నేసెన్
దామసబాణవరంబును, దా మసిఁ జేయంగఁ బూని ♦ తత్సైన్యంబున్. ౨౨౮౧

అర్థములు. తామసుఁడు = తమోగుణము ప్రధానముగాఁ గలవాఁడు, తామస పడక = ఆలస్యములేక, తామస బాణవరంబును = తామసమను పేరుగల యస్త్రమును, మసి = బూది.

తాత్పర్యము

తమోగుణము ప్రధానముగాఁగల రావణుఁడు వానరసైన్యము దగ్ధముచేసి బూడిద చేయఁదలచి యాలసింపక తామసాస్త్రమును వానరసేనమీఁదఁ బ్రయోగించెను.

ఉ. ధాతృవినిర్మితం బయిన ♦ దారుణమార్గణ మాఁగరాక త
ద్భీతికరార్చులం బ్లవగ ♦ వీరతతిన్ దహియింపఁగా నమి
ద్భూతలముం దొలంగి కపి ♦ పుంగవు లొక్కటఁ బాఱఁ దద్రజో
వ్రాతము కల్మిఁ జీఁకటులు ♦ పర్వె నిరంతర మక్షిరోధమై. ౨౨౮౨

అర్థములు. ధాతృ వినిర్మితంబు = బ్రహ్మచే నిర్మింపఁబడినది, ఆఁగరాక = అడ్డగింప సాధ్యపడక, తద్భీతికరార్చులన్ = ఆ భయంకర జ్వాలలచే, నమిత్ + భూతలము = యుద్ధభూమి ప్రదేశమును, తొలంగి = విడిచిపోయి, తద్రజో వ్రాతము = ఆ దుమ్ము సమూహము, అక్షిరోధమై = కన్నుల నడ్డగించినదై.

తాత్పర్యము

బ్రహ్మ కల్పించిన యీ యస్త్రము నివారింపరానిదై భయంకర జ్వాలల చేత వానర సేనను కాల్పఁగా వానరులు యుద్ధభూమి విడిచి పరువెత్తఁగా నా దుమ్ముచేఁ జీఁకటులు వ్యాపించి కన్నులు కానరాకుండఁ జేసెను.

కం. దానవుఁ డస్త్రమున ననే, కానీకములన్ దహించి ♦ యవనిం గలుపన్
గానీరా యని మహిజా,జాని శరాసనము గ్రహించె ♦ సంగరకాంక్షన్. ౨౨౮౩

అర్థములు. అనేకానీకములన్ = అనేకములగు ననీకసంఖ్యగల వానరులను.

తాత్పర్యము

రావణాసురుఁ డస్త్రముచే ననేకములైన యనీకసంఖ్యగల సేనలను కాల్చి నేలపాలు చేయఁగా శ్రీరామచంద్రమూర్తి కానీరా యని యుద్ధకాంక్షచేత విల్లందుకొనెను.

—• శ్రీరామ రావణ యుద్ధము •—

సీ. ఈలోన నసురుఁ డు•పేంద్రయుతుం డైన, శక్రుని బోలి ల•క్ష్మణునితోడ
నిలిచి కేలను మహా•నిరుపమధను వూని, మింటను లిఖియించు • దంటవోలెఁ
దనరారు నీరేజ•దళవిశాలాక్షుని, నాజానుబాహుఁ గా•లాంతకాభుఁ
గదియ రాముండును•గపిసంఘముల చేటు, పంక్తివక్త్రుఁడు వచ్చు•భంగిఁ గాంచి
ఆ. కుంది ముదము నొంది • కోపరక్తాక్షుఁ డై
చాప మెత్తి భూమి • శకలములుగ
గుణము మీటుటయును • గోత్రితులు రక్క-సుల్
గుములు గుములు గాఁగఁ • గూలి రవని. ౨౦౪

అర్థములు. నీరేజదళ విశాలాక్షుని = కమలము రేకులవలె విశాలము లైన కన్నులు గలవాని. ఆజానుబాహున్ = మోఁకాటివంటు చేతులుగలవానిని, ఈ యుద్ధసమయమున నీ సౌందర్యవర్ణన మప్రస్తుతమని తలంపఁగాదు. ఇంతటి సౌందర్యము గలవానిని జూచినంతనే సాష్టాంగపడి సేవించి బాగుపడుటకు మాని యుద్ధము చేయవచ్చెనే రావణుఁ డెంత నిర్భాగ్యుఁడని తెలుపుటకై యీ వర్ణనము చేయఁబడెను. కాలాంతకాభున్ = ప్రలయకాలమందలి యమునితో సమానుని, తక్కిన కాలములందు యముని రావణుఁడు గెల్చినవాఁడే, శివుని గెల్చినవాఁడే. ప్రలయకాలమం దట్లుజయింప సాధ్యపడదు. అట్టివానితో సమానుఁడు. కావున ఆ పరాక్రమము తలంచియైన రావణుఁడు రామచంద్రుని సేవించి యుండవచ్చును. అట్లునుజేసినవాఁడు కాఁడు. శకలములుగన్ = తునుక లగునట్లు, గుణము = అల్లెత్రాడు

తాత్పర్యము

ఇంతలో రావణుఁడు విష్ణువుతోఁ గూడిన యింద్రునివలె లక్ష్మణునితోఁ గూడి యసమానమై గొప్పదై యాకాశమంటు వింటిని కేల ధరించి యొప్పుచున్న తామరరేకులవంటి విశాలమైన కన్నులు గలవానిని, మోఁకాళ్ళనంటు చేతులు గలవానిని, ప్రలయకాల యమునివంటి వానిని సమీపింపఁగా వానరుల చేటు, రావణుఁడు పడెడిపాటు, వాఁడు వచ్చిన తీరు చూచి వానరులకై దుఃఖించి యున్నాళ్ళకు రావణుఁ డెదురుపడెఁగదా యని సంతోషించి కోపముచేఁ గన్నులెఱ్ఱజేసి విల్లెత్తి భూమి తునుక లగునట్లు అల్లెత్రాడు మీటఁగా వానరులు రాక్షసులు గుంపులు గుంపులుగా నేలమీదఁ బడిరి.

కం. ఆ రాజశేఖరాత్మజు, నారాచపథంబుఁ దఱిసి • నాళీకాప్తా
బ్జారుల డాసిన రాహువు, నా రజనీచారలోక•నాథుం డుండెన్. ౨౦౫

అర్థములు. ఆ రాజశేఖరాత్మజు = రాజశేఖరుని కుమారుఁ డగు రాముని తఱిసి = సమీపించి, నాళీకాప్త = సూర్యుని, అబ్జారులన్ = చంద్రుని, డాసిన =

సమీపించిన, రజనీచారలోకనాథుఁడు = రాత్రిం చరులైన రాక్షసుల సమూహము నకు ప్రభువు. సూర్యచంద్రుల సమీపించిన రాహువు అనుటచే కొంచెము కాలము రామలక్ష్మణులకుఁ గష్టము కలిగినను జయము వారికే యని భావము.

తాత్పర్యము

ఆ రాముని సమీపించి రావణుఁడు సూర్యచంద్రుల సమీపించిన రాహువు వలె నుండెను.

చ. తొలుత రణంబు సేయుతమిఁ • దూర్ణమ లక్ష్మణుఁ డా నిశాటుపై
జ్వలదనలాభ శాతశర•జాలముఁ గప్పిన వాని నన్నిటిన్
బలియుఁడు రావణుండు కర•పాటవ మేర్పడ నొంటి నొంట మూఁ
డలుగుల మూఁటిచేఁ బదిట • నన్నిశరంబులఁ ద్రుంచె క్రేల్మిడిన్. ౨౬

అర్థములు. తమిన్=కోరికతో, జ్వలత్ = మండుచున్న, అనలాభ = అగ్నితో సమానమైన, శాతశరజాలము = వాఁడిగల బాణసమూహము, కరపాటవము = చేతిసామర్థ్యము, క్రేల్మిడిన్=అల్పకాలములో.

తాత్పర్యము

మొదటఁ దాను యుద్ధముచేయు కోరికతో వేగముగ లక్ష్మణుఁ డా రాక్షసునిమీఁద అగ్నివలె మండుచున్న బాణములు వేయఁగా బలవంతుఁ డగు రావణుఁడు హస్తలాఘవమున నొక బాణమును నొక బాణముతో, మూఁటిని మూఁటితోఁ, బదిని పదింటితోఁ ద్రుంచెను.

చం. అతని నతిక్రమించి గిరి•యట్ల చలుండయియున్న రాముపై
శితవిశిఖోత్కరంబులను • జెచ్చెర నైచిన భల్లమూని త్వా
పతితనయుండు సర్వశర • వార మణంచి నిశాచరేంద్రుపై
శతములు నారసంబులు ప్ర•శస్తగతిం బరఁగించ నేర్పునన్. ౨౭

తాత్పర్యము

ఇట్లు లక్ష్మణు బాణములు ఖండించి యాయనను దాఁటుకొని కొండవలెఁ గదలకయున్న రామునిమీఁద వాఁడి బాణసమూహములను వేగముగ వేయఁగా రామచంద్రభూపాలుఁ డొక్క బాణముచే వాని నణంచి రావణునిమీఁద నూర్లకొలఁది బాణముల నైచెను.

శా. కాండీరద్వయ మద్వయాద్భుతలస•త్కాండప్రకాండంబు కో
దండారావవిభిన్నదిక్తటముగా • దర్పించి నైవంగ బ్ర
హ్మాండాంతర్గతభూతసంచయము హా•హాకారపూర్ణాస్యమై
మెం డాక్రోశ మొనర్చి గుండె లదరన్•మేడ్పాటు గాంచెం ద్రుటిన్. ౨౮

అర్థములు. కాండీరద్వయము=ఆ బాణముల పట్టినవారి జంట, అద్వయ= అసమానమైన, అద్భుత=ఆశ్చర్యకరమైన, లసత్ = ప్రకాశించు, కాండ=బాణ

ముల, ప్రకాండంబు=సమూహము, కోదండారావ=వింటిధ్వనిచే, విభిన్న = పగిలిన, దిక్తటముగాన్ = దిక్కుల ప్రదేశములు గలదిగా, బ్రహ్మాండాంతర్గత = బ్రహ్మాండము లోపలనుండు భూతసంచయము=ప్రాణి సమూహము హాహాకార పూర్ణాస్యమై=హాహాకారములతో నిండిన నోళ్ళుగలవై, ఆక్రోశ మొనర్చెన్ = ఏడ్చెను, మేడ్పాటు=స్మృతి తప్పుట.

తా త్ప ర్య ము

ఆప్రకాండరుపుర నసమానమై యద్భుతమై ప్రకాశించు బాణ సమూహమును వింటి ధ్వనిచే దిక్కులు పగిలిపోవునట్లు వేయఁగా బ్రహ్మాండములో నుండు జీవకోటులు హాహా యనుచు నేడ్చుచు నేమియుఁ జేయుటకుఁ దోఁపక యుండెను.

ఉ. సంతతసంప్రయుక్తశర • జాల మఖర్వగతిన్ నభస్స్థలిన్
బంతులు గట్టి పాఱఁగను • వార్షిక వారిధరాళి చంచలా
సంతతిదీప్తమై పఱచు • చందమువీాఱె గవాక్షముల్ దివిన్
దొంతర గూడెనో యనఁగఁ • నోఁచె శిలీముఖపంక్తు లయ్యెడన్. ౨౯

అర్థములు. సంతత = ఎడఁ దెగక, సంప్రయుక్త=ప్రయోగింపఁ బడిన, శరజాలము=బాణసమూహము, అఖర్వగతిన్ = మిగుల వేగముగ, నభస్ + స్థలిన్=ఆకాశ ప్రదేశమందు, వార్షిక వారధరాళి= వర్షాకాల మేఘములవరుస, చంచలా=మెఱుపుల యొక్క, సంతతిన్=సమూహముచే, దీప్తమై = వెలుఁగుచున్నదై, గవాక్షముల్=కిటికీలు, దొంతరగూడెనో=వరుసగాఁ గూడెనో, శిలీముఖపంక్తులు=బాణముల వరుసలు.

తా త్ప ర్య ము

విడువక విరామము లేక వారు ప్రయోగించు బాణసమూహములు ఆకాశమందు బారులు గట్టి పాఱఁగా మెఱుపులతోడ వానమబ్బులు పోవునట్లుండెను. ఆ బాణముల వడిమి పంక్తులు ఆకాశమున కిటికీ లేర్పఱచినట్లుండెను.

చ. అతులజవంబులై శితము • లై మఱి గ్రద్దగఱుల్ చెలంగు నా
యతిరథముక్తసాయక చ • యంబులు పర్వఁగఁ బ్రొద్దు గ్రుంకినన్
దత మగుమబ్బు గ్రమ్మినను • దట్టపుఁజీఁకటి వ్యాప్త మౌనటుల్
క్షితి పొలుపారె, వీరజన • శేఖరు లిద్దఱు నప్పు డుగ్రులై. ౩౦

అర్థములు. అతులజవంబులై = అసమానవేగము గలవై, శితములై = వాఁడులై, గ్రద్దగఱుల్=గ్రద్దయీఁకెలు తెక్కలుగాఁ గలవై, అతిరథ=అతిరథులచే, ముక్త=విడువఁబడిన, సాయకచయంబులు=బాణసమూహములు.

తా త్ప ర్య ము

మిగుల వేగము వాఁడిమి గ్రద్ద తెక్కలుగలవై యా యతిరథులచేత విడువఁబడిన బాణములు సూర్యుఁడస్తమింపఁగా మేఘములు దండిగ నావరింపఁగా కాఱు

చీఁకట్లు గ్రమ్మినట్లు భూమి యయ్యెను. అప్పుడు వీరశ్రేష్ఠు లిరువురు నుగ్రులై—
పెక్కు విలుకాండ్రతోఁ బోరు వీరిఁడు అతిరథుఁ డనఁబడును.

చ. కదిసి పరస్పరక్షణన • కాంక్ష బలారియు వృత్రదైత్యుఁడున్
గదనము సేయుభంగిఁ గర•కౌశల మొప్ప నచింత్యమున్ దురా
సదముగ నస్త్రశస్త్రసువి•శారదు లుగ్రశరాసనుల్ భయ
ప్రదబలధుర్యవర్యులు దు•రం బొనరించిరి రామరావణుల్. ౨-౩౧

అర్థములు. పరస్పర క్షణన కాంక్షన్ = ఒకరి నొకరు చంపు కోరికతో, అచింత్యము=ఊహింపరానిది, దురాసదము=పొందరానిది, భయప్రద=భయము కలిగించు, బలధుర్యవర్యులు = మహాబలవంతులలో శ్రేష్ఠులు.

తాత్పర్యము

ఒకరి నొకరు చంపవలయునని రామరావణులు ఇంద్రవృత్రులవలెయుద్ధము సేయువిధము వారి కరలాఘవము చూడ నిట్లగునని యూహింపరాకుండెను. ఇంతవఱకిట్లు యుద్ధము చేసినవారు లేకుండిరి. ఇరువురు నస్త్రశస్త్ర ప్రయోగములఁ దెలిసినవారు. ఇరువురు భయంకరములైన విండ్లు ధరించినవారు. ఇరువురు భయంకరమైన మహాబలము గలవారు.

కం. వాతహతిఁ గంధిభంగ, వ్రాతం బుప్పొంగురీతి • వారలశరసం
ఘాతంబు వారు చనియెడు, నా తెరువుల వరుస వరుస • లై ప్రసరించెన్.

అర్థములు. వాతహతిన్ = గాలిదెబ్బచే, కంధిభంగ వ్రాతము = సముద్రమునందలి యలలసమూహము.

తాత్పర్యము

తుపాను గాలిదెబ్బచే సముద్రమునందలి యల లుప్పొంగునట్లు వారి బాణముల సమూహములు వారు పోయెడి మార్గముల వరుసలు వరుసలై వ్యాపించెను. ఇరువురు పోయెడు తెరువు లనుటచే రామచంద్రమూర్తి పాదచారియైనను నొక్క చోటనే నిలఁబడి యుండలేదనియు వాఁడు రథమునఁ దిరిగినట్లే తానును వేగముగ మండలాకారముగఁ దిరుగుచుండెననియు గ్రాహ్యము.

ఉ. రక్కసమూఁకఱేఁడు నిజ•రౌద్రశరాసనముక్త బాణముల్
చక్కన రేంద్రఫాలతల•సంధిని లీలఁగవైవ నించుకేన్
లెక్కగొనండు రాముఁడు స•లీలవినీలకుమాలపంక్తినా
స్రుక్కక తాల్చె రోషమున • రుద్రమనూజ్జ్వల బాణసంతతుల్. ౨-౩౩

అర్థములు. నిజ = తన, రౌద్రశరాసన ముక్త బాణముల్ = రౌద్రాస్త్రముతోఁ గూడిన వింటినుండి విడువఁబడిన బాణములు, అనఁగా రౌద్రమంత్రములచే మంత్రించి విడువఁబడిన బాణములు, సలీల = అందముతోఁ గూడిన,

వినీల = నల్లని, కువాల=కలువల, పంక్తినాన్=వరుసయో యన్నట్లు,రుద్రమను=
రుద్రమంత్రముచే, ఉజ్జ్వల=ప్రకాశించు, బాణసంతతుల్=బాణసమూహములు.

తాత్పర్యము

రాక్షసరాజు రౌద్రమంత్రముచే మంత్రింపఁబడిన బాణములను రామ
చంద్రుని కనుబొమలనడుమ నాటునట్లు ప్రయోగింపఁగా రామచంద్రమూర్తి
వానిని లక్ష్యముసేయక వానిని నల్లకలువల వరుసలవలె ధరించి రోషించి రుద్ర
మంత్రముచే నభిమంత్రింపఁబడిన బాణములను.

చ. ధనపతితమ్ముఁ నేయుటయుఁ • దద్విశిఖంబు లవధ్యవర్మమున్
జెనకి వృథా మహిం బడిన • శీఘ్రకరుం డఖిలాస్త్రవేది యా
దనుజులలాట దేశము వి • దారితమై గొనబేద నేసె ధా
రణిపుతినాథుఁ డేను ప్రద • రంబులఁ బంచముఖాహు లట్లుగన్. ౨౯౪

అర్థములు. ధనపతి తమ్మున్ = కుబేరుని తమ్ముని, అవధ్యవర్మమున్ =
అభేద్యకవచమును, గొనబేదన్=అందము చెడునట్లు, ఏను ప్రదరంబులన్ = ఐదు
బాణములను, పంచముఖాహులట్లు=ఐదు తలల పాములవలె.

తాత్పర్యము

రావణుపై నేయఁగా నా బాణము లభేద్యకవచమును దాఁకి వ్యర్థములై
క్రిందఁబడగా చులుకుగఁ బనిచేయఁ గలట్టియు సర్వాస్త్రముల నెఱిఁగిన రామ
చంద్రమూర్తి యా రాక్షసునినొసలు చీలి కాంతి మాయునట్లు ఐదుతలలపాముల
వలె నైదు బాణములను వేసెను.

కం. వెండియు శర మేసిన సుర,ఖండనుఁ డది త్రుంచి వైచి • కలుషాత్మకుఁ డై
చండాసురాస్త్ర మేసెను, దండిజవంబునను రోష•తామ్రాక్షుండై. ౨౯౫

తాత్పర్యము

మఱియు నొక బాణము వేయఁగా దానిని రావణుఁడు కొట్టి యా పాపాత్మ
కుఁడు కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై మిగుల వేగముగ నాసురాస్త్రము
వైచెను.

సీ. పంచాస్య శార్దూల • వాయసదక్షాయ్య, ఖరగృధ్రపోత్రిసృ • గాలపంచ
వదనభుజంగమ • వదనబాణంబులు, సింహామృగాస్యముల్ • వృశ్చికాండ
జాతకుక్కుటనక్ర • సారమేయముఖంబు, లగు పెక్కుబాణంబు•లసురుఁ డేయ
వచ్చెడు నసురాస్త్ర • వరముఁ గనుంగొని, రాముండు వహ్నిశ•రంబు నైవ

ఆ. నగ్నిదీప్తముఖము • లర్కముఖంబులు, నర్ధచంద్రశీత • లాంశుముఖము
లుడుఖగాస్యములును • నుల్కాముఖంబులు, కేతువక్త్రములును•నాతతముగ.

అర్థములు. పంచాస్య=సింహము, శార్దూల = పులి, వాయస = కాకి,
దక్షాయ్య=రాపులుఁగు, ఖర = గాడిద, గృధ్ర=గ్రద్ద, పోత్రి=పంది, సృగాల=

నక్క, పంచవదన భుజంగము=ఐదు తలల పాములు, వదన బాణంబులు = వీని ముఖములు గల బాణములు, ఈహామృగాస్యముల్=తోడేళ్ళ ముఖముగల బాణములు, వృశ్చిక=తేళ్ళు, అండజాత = పాములు (ఒంటితలవి), నక్ర = మొసలి, సారమేయ=కుక్క, ముఖంబులు = వీని ముఖము గలవి, అసురాస్త్రమునం దివి యన్నియుఁ బుట్టినవని భావము. వహ్నిశరంబు = ఆగ్నేయాస్త్రము, అగ్నిదీప్త ముఖములు = అగ్నివలె మండుచున్న ముఖములు గలవి, అర్క ముఖంబులు = సూర్యునివంటి ముఖములు గలవి, అర్ధచంద్రముఖములు, శీతలాంశుముఖములు = పూర్ణచంద్రముఖములు, ఉడు = నక్షత్రములు, ఖగ=గ్రహములు, ఆస్యములు = అటువంటి ముఖము గలవి ఉల్కా ముఖంబులు = కొఱవివంటి ముఖములు గలవి, కేతువక్త్రములును=కేతువువంటి ముఖములు గలవి.

తాత్పర్యము

రావణుఁడు అసురాస్త్రము వేయఁగా సింహము పులి మొదలైన జంతువుల ముఖములుగల బాణములు దానిలోనుండి వెలువడి రాఁగా రామచంద్రమూర్తి యాగ్నేయాస్త్రము ప్రయోగింపఁగా దానినుండి సూర్యచంద్రాగ్ని గ్రహాదుల ముఖములుగల బాణములు.

కం. జనియించి వానినన్నిటి,వినువీధి హరింప నంద ♦ విలయం బొందెన్
వనచరులు పొంగి యార్వఁగ,వనచరనాథాదు లధిపు♦బలసి భజింపన్. ౨౯౭

అర్థములు. జనియించి=పుట్టి, వినువీదిన్ = ఆకాశమందు, వనచరనాథాదులు=సుగ్రీవుఁడు మొదలగు వారు, బలసి=చుట్టుకొని.

తాత్పర్యము

పుట్టి వాని నన్నిటిని నాకాశమందే నాశము చేసెను. వానరులు సంతోషించి యార్చిరి.సుగ్రీవుఁడు లోనగువారు రామచంద్రమూర్తిని జుట్టి సేవించుచుండిరి.

కం. రావణముక్తశరంబును, భూవిభుఁ డిటు లణఁగఁ జేసి ♦ ముదమున వఱలెన్
రావణుఁడును దనయస్త్రం,బీవిధిహతమైనఁ గోప♦మినుమడిగాఁగన్ ౨౯౮

అర్థములు. రావణముక్త శరంబును = రావణుచే విడువఁబడిన బాణము, ఈవిధిన్=ఈవిధమున, హతమైనన్=నాశము కాఁగా, ఇనుమడి=రెండంతలు.

తాత్పర్యము స్పష్టము

—♦ ౧౦౧-వ సర్గము. శ్రీరామ రావణులు దివ్యాస్త్రంబులఁ బోరుట ♦—

చ. మయవిహితంబు రౌద్రమగుమార్గణ ♦ మొందు గుణంబు గూర్చి దు
ర్జయుఁ డగురాముపైఁ బఱపఁ ♦ గ్రచ్చఱ శూలగదాముసుంఠులా
లయసమయుత్ర వాతములు♦లాగున ముద్గరకూటపాశసం
చయములతోడ వెల్వడుచు ♦ సర్వమహాస్త్రవిదుండు రాముఁడున్. ౨౯౯

అర్థములు. మయవిహితంబు = మయునిచే నేర్పాటు చేయఁబడినది. రౌద్రము=రుద్రదేవతాకము, గుణంబున్=అల్లెత్రాటియందు, దుర్జయుఁడు= జయింపరానివాఁడు, ముసుంఠి = కొయ్యగుదియ, లయసమయ ప్రవాతముల = ప్రలయకాల మందలి మహావాయువుల, ముద్గర = ఇనుపగుదియలు, కూట = మోసపు, పాశసంచయము=పాశముల సమూహము.

తాత్పర్యము

మయుఁడు నిర్మించిన భయంకరమైన రౌద్రాస్త్రమును వింట సంధించి జయింపరాని రామచంద్రునిపై వేయఁగా దానినుండి శూలములు గదలు కొయ్యగుదియలు ప్రలయకాల మహావాయువులవలె బయలుదేఱి రాఁగా సమస్తాస్త్రములు దెలిసిన రామచంద్రమూర్తి.

కం. బంధురజవసంయుతుఁడై, గాంధర్వాస్త్రంబుఁ దనదు•కార్ముకమందున్
సంధించి వైచి దాని సు,ధాంధసు లరుదందఁ ద్రుంచె•నాక్షణమందున్. ౨౬౦౦

అర్థములు. బంధుర జవసంయుతుఁడై = విశేష వేగముతోఁ గూడినవాఁడై, సుధాంధసులు=దేవతలు, అమృత మాహారముగాఁ గలవారు.

తాత్పర్యము

మిగుల వేగముగ గాంధర్వాస్త్రము ప్రయోగించి దేవత లాశ్చర్యపడునట్లు దాని నఱకెను.

మూల బలమును ఖరాసురాదులను నాశము చేసినపుడు గంధర్వాస్త్రము ప్రయోగించినట్లు చెప్పఁబడెను. దీనివలన ననేకరాములు రావణునకుఁ దోఁచినట్లు చెప్పబడలేదు. కావున మూలబలవధ మందును బెక్కురాములు గానవచ్చుట గమనవేగముననే కాని యస్త్రబలము చేతఁ గాదు. ఇంద్రజాలముచేత గాదు.

సీ. ప్రతిహతంబగుడు న•స్త్రం బౌదు గఱచుచు, సౌరాస్త్రమేసె దా•శరథిమీఁదఁ
జక్రసంతతులతోఁ • జనుదెంచు నద్దాని, దివి యెల్ల వెలిఁగించు • తేజుదానిఁ
బుష్పవంతులఁబోలి•పొలుపు దాల్చినదాని, రాముండు శరపాళి•నాము మఱచె
నదియును హత మైనఁ•బదిబాణముల రాము, మర్మముల్ నొప్పింప•ధర్మశీలుఁ
తే. డించుకేనియు స్రుక్క•కిషునికాయ ములను రావణు నొప్పించె•నలవుమెఱసి
యంతలోఁ లక్ష్మణుఁడు తన•యన్న తోడ,సరిగఁబోరెడి యసురేంద్రు•చండమరసి.

అర్థములు. ప్రతిహతంబు = కొట్టఁబడినది, ఔదు = పెదవి, చక్రసంతతులతో = చక్రసమూహములతో, పుష్పవంతులన్ = సూర్యచంద్రులను, 'ఏకయోక్త్యా పుష్పవంతౌ దివాకరనిశాకరౌ'- అమరము, శరపాళిన్=బాణ సమూహములచే, మర్మముల్=ఆయువుపట్టులు, ఇషునికాయములను = బాణ సమూహములను, అలవు = బలము, అంతలో = ఇట్లు నొప్పించి శ్రమము తీర్చుకొనునంతలో- ఈ విరామకాలములో- రామచంద్రమూర్తి అలసట తీర్చుకొనుటకై

యూరకొన్న సమయమున నని యర్థము. అటుగాక రామునితోడ లక్ష్మణుండును కలసి యుద్ధము చేసియుండెనేని యీ నడుమనని చెప్పఁ గారణము లేదు. ఇట్లు వ్యాఖ్యానింపకుండిన ఒకనితో యుద్ధము చేయునపుడు వేఱొకఁ డెట్లు నడుమఁదూఱి కొట్టెనని దోష మారోపింపవలసివచ్చును. ఇరువురు కలిసి యొకనిఁ గొట్టుట దోషము కదా. అదియునుగాక లక్ష్మణుఁడు ముందు యుద్ధము చేయుచుండెను. తటాలున నాతని నతిక్రమించి రావణుఁడు రామచంద్రుమీఁదికిఁ బోయెను. మరల సందు దొరకునా యని లక్ష్మణుఁడు కాచియుండి కొంచెము విశ్రామము దొరకఁగానే మరలఁ దాను యుద్ధముసేయ నుపక్రమించెను. కావుననే రాముఁడు యుద్ధము చాలించి యూరక చూచుచుండెను. హనుమంతుఁ డిట్లు లేకదా చేసెను.

తాత్పర్యము

తన యస్త్రము హతమైపోఁగా రావణుఁడు పెదవి గొఱికి రామచంద్రమూర్తి మీఁద సౌరాస్త్రమేసెను. అది యాకాశమంతయు వెలిఁగించుచు చక్రసమూహములతో రాఁగా సూర్యచంద్రులవలె వచ్చు దానిని బాణములచేతనే నాశము చేసెను. అదియును హతమైపోఁగా రావణుఁడు పదిబాణముల రాముని యాయువు పట్టుల నొప్పింపఁగా ధర్మస్వభావుఁడైన రామచంద్రమూర్తి కొంచెమైనను నొప్పి చెందక బాణసమూహములచేఁ దన బలము ప్రకాశము ప్రకాశింపఁజేసి రావణు నొప్పించెను. ఇంతలో తన యన్నతోడ సమానముగా యుద్ధము చేయు రావణుని జూచి సహింపక లక్ష్మణుఁడు.

—• రావణ లక్ష్మణ యుద్ధము •—

చ. కనలి రథస్థుఁడై టెకేఁడు • కాల్నడ నిల్చిన యన్నతోడఁ దా
పెనఁగెడి నింతదవ్వనుచు • వీనుఁడు బాణము లేడు పూని కే
తనము మనుష్యశీర్షకము • ధాత్రిఁ దొరంగఁగ నేసి యొంటఁ జె
య్యన మణికుండలాంచితని•యంతృశిరంబు నొకంటఁ ద్రుంచుచున్. -౯౩౦-

అర్థములు. కనలి=కోపించి, రథస్థుఁడు = రథమునం దున్నవాఁడగుట పెనఁగెడిన్=యుద్ధము చేయుచున్నవాఁడు, మనుష్య శీర్షకము = మనుష్యుని తల గలది, మణికుండలాంచిత = రత్నకుండలములతో నొప్పుచున్న, నియంతృ శిరంబు=సారథితల. ద్వంద్వయుద్ధమందు రథస్థుఁడగువాఁడు పదస్థుఁడగువానిని గొట్టుట ధర్మముగాదు. రామచంద్రమూర్తికి రథము వచ్చు మార్గము లేదు. కావున రావణుని పదస్థుని చేయవలయునని లక్ష్మణు నుద్దేశ్యము. ఈ విషయమునసే కర్ణుఁడర్జునునితో నీవు రథస్థుండవు. నేను భూమిస్థుఁడను. కావున నీవు నన్ను వేయుట ధర్మము గాదు. నేను దేరిని జక్కఁజేసికొనువఱకు నీవు నన్ను వేయుటుడుగుమని చెప్పెను. "ఏను భూమిస్థుండ నీవు రథస్థుండ వ్యోడఁ దగ

వగు నేయుకునికి" భా-కర్ణ-౩-౩౯౦ ప. తరువాత వారివారి శక్తికొలఁది రెండు లైవను ప్రారంభమున ద్వంద్వమున నిరువురు సమాన దశయుండుండవలెను.

తాత్పర్యము

కోపించి వీఁడు రథమునం దుండుటచేఁ గదా యింతకాలము కాల్నడ నున్న మాయన్నతో యుద్ధము చేయఁగలిగెనని యొక్క బాణముతో మనుష్యుని తల చిత్రింబడిన కేతనమును, మఱియొక్క బాణముతో రత్నకుండలములతో మెఱయు సారథి తలను ద్రుంచుచు.

కం. తక్కినశరపంచకమున, దిక్కరికరతుల్య మైన • దృఢచాపంబున్
బెక్కులు దునియలుగాఁ గెం, పెక్కు కనుంగవను ద్రుంచె • నేడ్తెఱ నాలోన్.

అర్థములు. శరపంచకమునన్ = ఐదు బాణములచే దిక్కరికరతుల్య = దిగ్గజముల తొండములతో సమానమైన, దృఢచాపంబున్ = గట్టి వింటిని, కెంపెక్కు కనుంగవను = ఎఱ్ఱని కాంతి యతిశయించిన రెండు కన్నులతో.

తాత్పర్యము

మిగిలిన యైదు బాణములచే దిగ్గజముల తొండములతో సమానమైన వింటిని పెక్కు తుంటలుగా కన్నులు రెండు నెఱ్ఱనఁ గాఁగా కోపించి పరాక్రమించి ఖండించెను.

తే. కాలమేఘనిభంబులు • శైలగంధరాభ, ములును నగు తేరిగుఱ్ఱాల • బలియుఁ డౌ వి
భీషణుం డొక్క దూఁకున • భీమగదను, మొత్తివధియించె నన్నింటేఁ • దత్తతిలక.

అర్థములు. కాలమేఘ నిభంబులు = నల్లని మబ్బులతో సమానములు. శైలగంధరాభములు = పర్వతములతో సమానమైనవి.

తాత్పర్యము

కాఱుమబ్బులవలెఁ బర్వతములవలె నుండు తేరి గుఱ్ఱాలమీఁద విభీషణుఁ డొక్క దూఁకు దూఁకి చేతిగదచే వానిని మొత్తి చంపెను.

కం. హయములు గూలినయంతన, రయమున భూస్థలికి దాఁటి • రథగతశక్తిన్
భయదాకృతిఁ గొని తమ్ముని, లయముం బొందింపఁజూడ్కు • లన్ పెగలెగయన్.

అర్థములు. రథగతశక్తిన్ = రథమునం దున్న శక్తిచే.

తాత్పర్యము

గుఱ్ఱములు చావఁగానే తటాలున భూమిమీఁదికి దాఁటి రథమునం దున్న శక్తియను నాయుధమును దీసికొని భయంకరాకారుఁడై తమ్మునిఁజంప కన్నులందు సెగ లెగయుచుండఁగా.

ఉ. హనుమ్మని వేయ నద్ది పిడు • గో యన వెల్వడునంతలోన బా
ణమ్ములు మూఁడిటిం దొడిగి • నాశము చేసె సుమిత్రపట్టి యు

గ్రమ్మగుశక్తితునక లయి • కాంచనమాలికతోడ రాలెన
భ్రమ్మునఁ దోఁకచుక్కనఁ బ్లవంగమసైన్యము లుబ్బి యార్వఁగన్. ౨౩౦౬

తాత్పర్యము

హుమ్మని వేయఁగా నది పిడుగువలె వచ్చుచుండుట చూచి యది సమీపమునకు వచ్చులోపలనే మూఁడు బాణములచే దానిని లక్ష్మణుఁడు నాశము చేసెను. ఆ భయంకరశక్తి తునుకలయి బంగారు మాలికతోడ వానరులందఱు సంతోషమున నఱవఁగా నాకాశమునుండి తోఁకచుక్క పడినట్లు పడెను.

చ. తన యసమానశక్తి యిటు • దారితమౌటయు మండుఁగన్నులన్
దనుజవరేణ్యుఁ డుగ్రతర•దండధరాప్రతికార నైజకాం
తినిచయదీప్తమైన యొక • దివ్యతరాశనితుల్యహవ్యవా
హనసఖశక్తిఁ గేలఁ గొను•నంతటిలో రఘురాముతమ్ముఁడున్. ౨౩౦౭

అర్థములు. ఉగ్రతర=మిగుల భయంకరమైన, దండధర+అప్రతికార = యమునికైనను బదులుచేయరానిదై, నైజకాంతి నిచయ=స్వభావసిద్ధమైన కాంతి సమూహముచే, దీప్తమైన=మండుచున్న, అశనితుల్య=పిడుగుతో సమానమైన, హవ్యవాహనసఖ=అగ్నిహోత్రునితో సమానమైన, శక్తిన్=శక్తిని.

తాత్పర్యము

అసమానమైన తనశక్తి యీప్రకారము తునుకలు చేయఁబడఁగా మండుచున్న కన్నులతో, మిగుల భయంకరమై, యమునికైనను నిరాకరింపరానిదై స్వభావకాంతిచే వెలుఁగుచు వజ్రమువంటి వేగము గలదై, యగ్నివలెఁ గాల్చునది యగు శక్తిని చేతఁ దీసికొనునంతలో లక్ష్మణుఁడును.

ఉ. జడ్డొకయింత లేక యసు•సంశయదుస్థ్సితు నవ్విభీషణున్
జడ్డన వెన్కఁ వేసికొని • సాయకవర్షము వైరిమీఁద ము
జ్జిడ్డుగ ముమ్మరమ్ముగను • జేడ్పడఁ దిక్కటమక్కటం గొనన్
సడ్డొకయింతఁ జేయ కతి•సాహసవృత్తిని ముంచివైచినన్. ౨౩౦౮

అర్థములు. జడ్డు=ఆలస్యము, జడను - రూ. అసుసంశయదుస్థ్సితున్ = చచ్చునను సందేహస్థితియందున్న వానిని, ఆశక్తి తగిలినవిభీషణుఁడు బ్రదుకుటదుర్లభమని భావము. జడ్డన = తటాలున, ముజ్జిడ్డుగ = మూఁడుచెఱఁగులు గలసినట్లుగ, మిక్కిలి జిడ్డుగ=దట్టముగ, ముమ్మరమ్ముగను=విశేషముగను, చేడ్పడన్ = బాధపడునట్లు, తిక్కటమక్కటం గొనన్=దిగ్భ్రమ గొనునట్లు, సడ్డ=లక్ష్యము.

తాత్పర్యము

రావణుఁ డాశక్తిని బ్రయోగించినయెడల విభీషణుఁడు బ్రదుకుట సందేహమని తలంచి లక్ష్మణుఁడు శరణాగతుఁడైన విభీషణునకు నన్న యభయహస్తమిచ్చెను గావున నతనిని దన ప్రాణమిచ్చియైన రక్షించి యన్నవ్రతము సఫలము

చేయఁగోరి యాలస్యముచేయక విభీషణుని తన వెనుక వేసికొని యాయనకు ముందు తాను దూఁకి రావణునిమీఁద మిక్కిలి దట్టముగాను విశేషముగాను బాధపడునట్లు దిగ్భ్రమ చెందునట్లు లక్ష్యములేక బాణవర్షము గురియించుచు మిగుల తెంపుచేసి వానిని గొట్టఁగా.

ఉ. అడ్డము దూఁకి యిట్లు వసు♦ధాధిపుసూతి నిజానుజాతు పే
రెడ్డమిఁ బాప నైచిన శి ♦ తేషువులన్ నిజశౌర్య మంతయున్
జడ్డుపడంగఁ దమ్ము నిటు ♦ చావునకుం దొలగించి యున్న యా
దొడ్డబలిష్ఠు లక్ష్మణుని ♦ దుష్టచరిత్రుఁడు రావణుం డనున్. ౨౩౦౯

అర్థములు. నిజానుజాతు = తన తమ్మునియొక్క, పేరెడ్డమిన్ = మహాపదను, శితేషువులన్=వాఁడి బాణములచే, జడ్డుపడంగన్=తగ్గిపోఁగా, తమ్మున్= తన తమ్ముని విభీషణుని.

తాత్పర్యము

లక్ష్మణుఁడు విభీషణున కడ్డము దూఁకి యతని మహాపదనుండి తప్పింపఁగోరి వేసిన వాఁడి బాణములచేఁ దన శౌర్యము స్తబ్ధము కాఁగాఁ దన తమ్మునిఁ జావునుండి తప్పించిన మహాబలశాలి లక్ష్మణుని జూచి దుష్టప్రవర్తనము గల రావణుఁ డిట్లనియె.

చ. శిథిలి విభీషణున్ మృతికిఁ ♦ దప్పఁగఁ జేసిన శౌర్యసార! నీ
యవితథవిక్రమంబునకు ♦ నచ్చెరు వయ్యెడు మెచ్చితింజుమీ
సవరణ నిల్వు లక్ష్మణుఁడ! ♦ చావక తప్పెను రాక్షసుండు నీ
పొవ రడఁగింతు నీ హృదయ♦మున్ వెసఁ జీల్చి హరింతుఁ బ్రాణముల్. ౨౩౧౦

అర్థములు. అవితథ విక్రమంబునకున్=వ్యర్థము గాని శక్తికి, సవరణ= చక్కఁగా, పొవరు=మదము.

తాత్పర్యము

నీవు పని పూని లక్ష్మణా! విభీషణుని చావకుండఁ దప్పించితివి.నీ శౌర్యమునకు నమోఘపరాక్రమమునకు మెచ్చితిని. నీవు చక్కఁగా నిలువుము. రాక్షసుఁడు చావక తప్పించుకొనెను. నీ గుండెలు పగులఁజీల్చి నీ ప్రాణములు హరించి నీ మదం బడఁగింతును.

—♦ లక్ష్మణుఁడు రావణశక్తిచే మూర్ఛపోవుట —♦

ఉ. తాళు మంటను రావణుఁడు ♦ దారుణరావము భీమనష్టఘం
టాలసితం బమోఘ మరి ♦ నాశకమున్ మయదైత్యశాంబరీ
జాలసుకల్పితంబు నగు ♦ శక్తి దురాత్ముఁడు రామతమ్ము ను
ద్వేలజవాన్వితంబుగను ♦ వ్రేసిన వచ్చెడుశక్తిఁ గాంచుచున్. ౨౩౧౧

అర్థములు. దారుణ రావము=భయంకర ధ్వని. భీషణ = భయంకరమైన, అష్టఘంటాలసితంబు=ఎనిమిది ఘంటలచే ప్రకాశించునది, అమోఘము=వ్యర్థము పోనిది, అరినాశకము=శత్రువుల సంహరించునది, ఇట్లు చెప్పుటచే దీనిచే నిదివఱకెందఱనో వధించెనని భావము, మయదైత్య శాంబరీజాల = మయుని మాయాశక్తి చేత, సుకల్పితంబు = చక్కఁగాఁ గల్పింపఁబడినది. ఉద్వేల = అమితమైన, జవాన్వితంబుగను = వేగముతోఁ గూడినట్లుగ.

తాత్పర్యము

ఏల తొందరపడెదవు ? నిదానింపు మని రావణుఁడు భయంకరధ్వనియు, దిగులు పుట్టించు నెనిమిది గంటలు గలదై, వ్యర్థము పోనిదై, మయుఁడు తన శక్తిచేఁ గల్పించినదైన శక్తిని దుష్టచిత్తుఁడగు రావణుఁడు రామునితమ్మునిమీఁద మిగులఁ వేగముతో వేయఁగా వచ్చుచున్న శక్తి నిఁజూచి. ఈ శక్తినే మందోదరీ వివాహకాలమున మయుఁడు రావణున కిచ్చెను. చూ. ఉత్తర-౨౫౭ పద్యము.)

ఇటువంటి యమోఘశక్తి రామచంద్రమూర్తిపై వైవక లక్ష్మణుపై నేల రావణుఁడు వైచెను? రామచంద్రమూర్తి చచ్చినఁగదా తన యన్ని కార్యములు నెఱవేఱును. లక్ష్మణుఁడు పోయినను రాముఁడు సీతకై తన్నుఁజంపక మానునా?

విభీషణుఁడు రామచంద్రమూర్తి రావణునకు సమాన శత్రువులు. ఇంద్రజిత్తు లోనగువారివధకు విభీషణుఁడే మూలకారణ మని వాని యభిప్రాయము. అంతియేగాక యిప్పుడు ప్రత్యక్షముగ రామకైంకర్యము నిర్వచనముగఁ జేయఁగోరి తన గుఱ్ఱములనే చంపెను. ఇది తన్నుఁ జంపింపఁజేసిన కార్యమే కదా యని యతఁడు తలఁచి యతనిఁ జంపఁగోరి యీ శక్తి యెత్తెను. కాని లక్ష్మణుఁ డడ్డపడుటచే, నతనిఁ జంపఁజాలఁడయ్యెను. ఎత్తిన యాయుధము క్రిందఁబెట్టి వేఱొకటి తీసికొనుట, యొక బాణమును రెండుమార్లు సంధించుట యుత్తమవీరుని లక్షణము గాదు. రాముఁడో యుద్ధము చాలించి మూరమందున్నాఁడు. ఇప్పుడు లక్ష్మణు చేతిలోఁ దన చావు దప్పినఁగదా వెనుకఁ దాను శ్రీరాము జయించుట కావున లక్ష్మణుపైఁ బ్రయోగింపవలసి వచ్చెను.

ఇది కర్ణుని ఘంటాశక్తివలె నయ్యెనని యెంచఁదగు.

ఉ. స్వస్తి సుమిత్రపట్టికిని ♦ వ్యర్థము గమ్ము శరమ్మ ! యంచు భూ
శస్తుఁడు రామభద్రుఁడు ప్ర ♦ శాంతికరోక్తులు పల్క భీతిస
న్న్యస్తుని లక్ష్మణుం గదిసి ♦ వ్యాళవరేణ్యము జిహ్వవోలె వి
ధ్వస్తభుజాంతరుండుగను ♦ వైశమ వక్షము నాటె భీమమై. ౩౩౧౩

అర్థములు. వ్యర్థము గమ్ము = భస్మీకరించు నీ శక్తి వ్యర్థమై పోవును గాక, ఇది తపః కల్పితమైనదివ్యశక్తి యమోఘమైనది కావున మొదలంట రూపుమాప సాధ్యము కాదు. కొంతయైన దాని కార్య మది చేయవలసి యుండును.

గావున నీ యందలి పావనశక్తి వ్యర్థమై పోవును గాక యనియే చెప్పెను ప్రశాంతి కరోక్తులు = దాని శక్తి యణఁగు మాటలు, భీతి సన్న్యస్తుని = సన్న్యస్తభీతిని= భయము వదలిన వానిని, వ్యాళవరేణ్యము = శ్రేష్ఠమైన పాముయొక్క, జిహ్వ = కోఱ, విధ్వస్త=చీల్పఁబడిన, భుజాంతరంగుఁడు = ఱొమ్ముగలవాఁడు, వైళమ= త్వరగా.

తాత్పర్యము

లక్ష్మణునకు మేలగును గాక, బాణమా! భస్మముచేయు నీ శక్తి వ్యర్థమగును గాక ! యని ప్రపంచముచే స్తోత్రము చేయఁబడు శ్రీరామచంద్రమూర్తి మిక్కిలి శాంతిని గలిగించు మాటలు పల్కఁగా నిర్భయుఁడుగా నుండు లక్ష్మణుని శ్రేష్ఠమైన సర్పముయొక్క కోఱవలె భయంకరమై ఱొమ్ము చీలునట్లు వక్షమున నాటెను.

ఉ. గాటముగాఁగ శక్తి మెయిఁ ♦ గాఁడిన మూర్ఛ మునింగి లక్ష్మణుం
డోటఱి నేల వ్రాలుడు స ♦ హోదరు దుస్థితిఁజూచి వేదనా
స్ఫోటితచిత్తుఁడై మనుజపుంగవు డించుక పల్లటిల్లి యా
మేటిబలాఢ్యుఁ జూచుచును ♦ మేడ్పడి కన్నుల నీరు నించుచున్. ౨౩౧౩

అర్థములు. మెయిగాఁడినన్ = దేహమున నాటుకొనగాఁ, ఓటఱి = బల హీనుఁడై, వేదనాస్ఫోటిత చిత్తుఁడై = దుఃఖముచే చీల్పఁబడిన హృదయము గల వాఁడై, పల్లటిల్లి = చలించి, మేడ్పడి అజ్ఞతనొంది.

తాత్పర్యము

దేహమునందు దృఢముగా శక్తి నాటుకొనఁగా లక్ష్మణుఁడు మూర్ఛపోయి నేలవ్రాలఁగ తమ్ముని దురవస్థఁ జూచి వేదనచేఁ జీలిన హృదయము గలవాఁడై రామచంద్రమూర్తి కొంచెము కంపించి యా మహాబలశాలిని జూచుచు పరవశుఁడై కన్నుల నీరు నించుచు.

కం. కాల మిది గాదు వగవఁగ, నాలమునకు సమయ మనుచు ♦ నాగ్రహవశుఁడై
చాలించి వగపు వింటిని, గేలఁ గొని దశాస్యుఁ జంపఁ ♦ గృతయత్నుండై.

అర్థములు. ఆలమునకున్ = యుద్ధమునకు, ఆగ్రహవశుఁడై = కోపము తెచ్చుకొన్న వాఁడై, వింటిని—కేలఁగొని—ఇట్లు చెప్పుటచే లక్ష్మణుని యుద్ధకాలమున విల్లు విడిచియుండెనని భావము. కృతయత్నుండై = చేయఁబడిన యత్నముగలవాడై.

తాత్పర్యము

ఇది శోకింప సమయము గాదు. యుద్ధమున కిది సమయమని కోపము తెచ్చుకొన్న వాఁడై వ్యసనము చాలించి వింటిని దీసికొని రావణుఁ జంపఁ బ్రయత్నించిన వాఁడై

—• శ్రీరాముఁడు లక్ష్మణునిఁ గవుల కప్పగించుట. •—

సీ. తివిరి రక్షోవిభుఁ • డవిరళశరవృష్టి, తనమీఁదఁ గురియింప • దైన్యపడక
ప్లవగనాయకు లెల్లఁ • బాహుజాలని శక్తి, నవలీలఁ బెఱికి తుం•నాడి వైచె
నదె సమయం బని • యసురేంద్రుఁ డాతని, మర్మదారణశీల • మార్గణముల
నైన గణింపక • భ్రాతఁ గౌఁగిటఁ గ్రుచ్చి, సూర్యప్రభంజన • సుతులతోడ
ఆ. ననియె వీరులార! • యప్రమత్తుల రయి, బలసి నాదు తమ్ము • నిలుపరయ్య
యెంతకాలముగనొ •యెదురుచూచుచునున్న, కాల మొదవె నింత•కాలమునకు.

అర్థములు. అవిరళ శరవృష్టి=దట్టమైన బాణవర్షము, మర్మదారణశీల = ఆయువుపట్టులను భేదించు స్వభావముగల, మార్గణములన్=బాణములను, సూర్యప్రభంజన సుతులతోడన్ = సూర్యసుతునితోడ ప్రభంజనసుతునితోడ, ద్వంద్వ సమాసంబునఁ గడపటిపదము పూర్వపదముల యన్నిటితో సమసించును. సుగ్రీవాంజనేయాదులతోడ - అప్రమత్తుల రయి = ప్రమాదము లేక, బలసి = చుట్టుకొని.

తాత్పర్యము

తాను బాణములు వేయక యూరకున్నను రావణుఁడు వదలక బాణపరంపరలు తనపై దట్టముగ వేయుచున్న నభయపడక దుఃఖింపక వానరులందఱుఁ గలసియుఁ దీయఁ జాలకయుండ లక్ష్మణుఁడొమ్మున దూసి భూమిలో నాటుకొన్న రావణశక్తిని నవ లీలగాఁ బెఱికి తునుకలుగా విఱిచెను. ఇట్లాయన కార్యాంతరాసక్తుఁడై యుండఁగా నిదే సమయమని రావణుఁడు ఆయనను మర్మములు చీల్చు బాణముల నైన వానిని లక్ష్యపెట్టక తమ్ముని గౌఁగిలించుకొని సుగ్రీవాంజనేయులఁజూచి వీరులారా! మీరు నా తమ్ముని జుట్టుకొని హెచ్చరికగఁ గాచుచుండుఁడు. (పూర్వమువలె రావణుఁడు తీసికొనిపోవ యత్నించునేమో యని యీ హెచ్చరిక) ఎప్పుడు రావణుతో యుద్ధము లభించునా యెప్పుడు వానిని జంపుదునా యని యెంత కాలముగనో యెదురు చూచుచుండఁగా నిప్పటికి లభించెను. దీనిని దప్పఁ గొట్టరాదు.

మొదటి యుద్ధమువలన రావణుఁ డలసినాఁడని రామచంద్రమూర్తి కొట్టక విడిచెను. రామచంద్రమూర్తి కేల విల్లులేక కార్యాంతరాసక్తుఁడైన సమయంబున నిదేసమయమని రావణుఁడుకొట్టెను. ధర్మాత్ములకునధర్మాత్ములకిదియే నిదర్శనము.

శా. ఆసాంగొని వేచి మిన్నుగను సా • రంగంబు ఘర్మాంతవే
ళాసంలక్షిత వారిదంబుఁ గను లీ • లం గంటి సంగ్రామఖే
లాసంరబ్ధు దశాస్యు నేను జిరకా • లం బెంతయున్ వేచి యే
లా సందేహము వీనిఁ దున్నెదను స • త్యం బింతయున్ నమ్ముఁడీ. ౨౩౦౬

అర్థములు. ఆసాంగొని = మిగుల నాశపడి, వేచి = ఎదురుచూచి, మిన్నుగను = ఆకాశమును జూచు; సారంగంబు=చాతకము, 'చాతకేహరిణేపుంసి

సారంగ శ్చబలే త్రిషు' అమరము. ఘర్మాంత వేళా = ఎండాకాలము కడపటి సమయమున, సంలక్షిత = కానఁబడు, వారిదంబున్ = మేఘమును, కనులీలన్ = చూచు విధముగా, సంగ్రామ ఖేలా సంరబ్ధున్ = యుద్ధక్రీడయందు వేగిరపాటు గలవానిని.

తాత్పర్యము

ఎప్పుడు మేఘమువచ్చునా యెప్పుడు చినుకులుపడునా యెప్పుడు దప్పి తీర్చుకొందునా యని యెంతో యాసపడి యాకాశము చూచుచున్న చాతకము ఎండకాలము తుద మేఘములఁజూచినట్లు లిన్నాళ్ళు కాచియుండి యిప్పుడు యుద్ధసన్నద్ధుఁడై వచ్చిన రావణుఁ జూడఁగంటిని. ఇంక సందేహ మేల? వీనిని సంహరించెదను సత్యము నమ్ముఁడు.

కం. నావచనము వినుఁడీ నే, రావణు నీ క్షణము వేగ ♦ రణమునఁ ద్రుంతున్
రావణుఁడో రాముఁడో కా, కీవసుమతి నిద్ద ఱుంట ♦ యిది మిథ్య యిఁకన్.

తాత్పర్యము స్పష్టము

ఉ. లచ్చిని గోలుపోక, వను♦లం జరియించుట, దండకాటవిన్
మ్రుచ్చిరుచుంట, జానకిని ♦ మూర్ఖుఁడు ముట్టుట, పోరుమూఁకతో
హెచ్చినపోరు, ఘోర మగు ♦ నీనిరయోపమదుఃఖ, మిన్నియున్
గ్రచ్చఱ బాయువాఁడ దశ♦కంఠు రణావనిఁ దున్మి యాత్రుంటన్. ౨౬౧౦

అర్థములు. లచ్చిని గోలుపోక = రాజ్యసంపద పోఁగొట్టుకొనుట, మ్రుచ్చిరుచుంట = శోకించుచుండుట, పోరుమూఁకతో = రాక్షస సమూహముతో, ఈ నిరయోపమ దుఃఖము = లక్ష్మణుఁడు పడుటవలనఁ గలిగిన నరకబాధవంటి బాధ, క్రచ్చఱన్ = శీఘ్రముగ.

తాత్పర్యము

రాజ్యలక్ష్మిని పోఁగొట్టుకొనుట, అడవులఁ దిరుగుట, దండకలో దుఃఖించుట, మూర్ఖుఁడు రావణుఁడు సీతను దాఁచుట, రాక్షసులతో ఘోరయుద్ధము, నరక వేదనతో సమానమైన లక్ష్మణమూర్ఛచేఁ గలిగిన యీ దుఃఖము- వీని నన్నిటిని నీ క్షణమందు రావణుని జంపి వదలువాఁడను.

ఉ. ఏమినిమిత్త మేను వధి♦యించితి వాలిని, భానుసూను శా
ఖామృగరాజుఁ జేసి కపి♦కాండము నెల్లను గూర్చఁగంటి నే
నేమిటి కబ్ధిఁ గట్టి తరి♦యించితి, నింతకు మూల మైన నీ
చీమనుజాశనుండు ప్లవ♦గేశ్వరులార! యిదే కనంబడెన్. ౨౬౧౧

అర్థములు. నీచు + ఈ మనుజాశనుండు = నీచుఁడగు నీ రాక్షసుఁడు. నీచశబ్దము వృద్ధాదులలోఁ జేరినది కావున నుక్ లేకయు ప్రయోగము గలదు. "చొచ్చిన చోటఁ జొచ్చి తెగఁజూచెద నంచుఁ దలంచు గాని నన్నొచ్చుఁడు బాహుగర్వమున నీచు సుయోధనుఁడు" తిక్కన = ఉద్యో.

తాత్పర్యము

దేనికై వాలిని జంపితినో దేనికై సుగ్రీవుని వానరరాజు జేసితినో దేనికై యీ వానరుల నెల్ల గుంపు చేర్చితినో దేనికై సముద్రమున సేతువు కట్టి దాటి వచ్చితినో వీని కన్నిటికిని కారణమైన యీ నీచుఁడు రావణాసురుఁడు వానరులార! యిదిగో గానవచ్చెను.

కం. చూపులవిష ముండెడిఫణి, చూపులపాల్పడినవాని • చొప్పున నేఁ డీ
పాపి యని నాదుదృష్టికిఁ, జేపడియును బ్రదికిపోవఁ • జెల్లదు సుండీ. ౨౩.౨౦

అర్థములు. చేపడి = లభించి, ఇది లోపడి, పైపడి శబ్దములవంటిది.

తాత్పర్యము

చూపులలో విషమున్న పాముయొక్క దృష్టికిఁ గనఁబడినవాని విధమున నేఁడీ పాపాత్ముఁడు నాకుఁ గనబడియు బ్రదికిపోవరాదు.

ఉ. నెమ్మది నిమ్మళంబుగ వ • నేచరులార ! సమీపధారిణీ
ధ్రమ్మునఁ గూరుచుండి ఖలు • రావణు నాదు దురంబు జూడుఁడీ
యిమ్మెగ మూఁడులోకములు • నెల్ల నిలింపులు నింద్రహానియు
క్తమ్ముగ జూచువారలు ప్ర • కాశముగా రఘురాము రామతన్. ౨౩.౨౧

అర్థములు. సమీపధారిణీధ్రమ్మునన్ = దగ్గఱ నుండు కొండమీఁద, యుద్ధము దూరమునుండి చూచిననే నిరపాయము, రమ్యము–రఘురాము = రఘువంశమునఁ బుట్టిన రామునియొక్క, రామతన్ = రామత్వమును — (౧) రామనామ సార్థక్యమును, (౨) రామావతారప్రయోజనమును, (౩) జగదేకవీరత్వమును, (౪) పరాక్రమసమయమందును - రమయిత్రుత్వము, (౫) సత్య ధర్మ శౌర్యములచే మూఁడులోకములను రమింపఁజేయుటయు.

తాత్పర్యము

నిండు మనస్సుతో స్వస్థచిత్తులరై వానరులారా! దగ్గఱనుండు కొండమీఁదఁ గూర్చుండి రావణుతో నేను జేయు యుద్ధము చూడుఁడు. నేఁడు దేవతలతో నింద్రునితో మునులతోఁ గూడిన మూఁడు లోకములు నేను రఘురాముఁడు నిజముగా నన్ని వేళల నన్నివిధముల నన్ని దేశముల రాముఁడే యగుటను జూచును గాక

కం. నాకులు సచరాచర మగు, లోకంబులు గుములు గట్టి • శ్లోకయుతముగా
నాకదనమువిధ మెప్పుడు వాకొననొవరింతు భూమి • వఱలెడిదాఁకన్. ౨౩.౨౨

అర్థములు. నాకులు = దేవతలు, గుములు=గుంపులు, శ్లోకయుతముగా– (౧) పద్యరూపముగా, (౨) కీర్తితోఁ గూడినట్లుగా, 'శ్లోకః పద్యేయశస్యపి' నానా॥ర॥ కదనము = యుద్ధము, వాకొనన్ = చెప్పుచుండునట్లు.

తాత్పర్యము

దేవతలు జంగమస్థావరాత్మక మగు లోకమ్ములు గుంపులై పద్యరూపమున

భూమి యుండువఱకు నా యుద్ధ విధము చెప్పుచుండు నట్లు చేసెదను. (ఈ మాట సత్యమగు చున్నది గదా! బ్రహ్మవాక్య మిది యేకదా. కావున నెన్ని మహాయుగ ములు మాఱినను రామాయణమునకు హాని లేదు. రామచరిత్ర మన్ని మతముల వా రన్ని భాషలలో వ్రాసికొనినారు.

—• రావణుఁడు పరాజితుండై లంకకుఁ బరువెత్తుట •—

చ. అనుచు సువర్ణభూషణస•మంచితశాతశరాళి పంక్తిప
త్త్రినిమెయిఁ గాఁడ నేయుటయుఁ • గ్రూరత నాతఁడు దీప్తబాణముల్
పెనుముసలంబులున్ ముదిర•బృందము నీరన రాముమీఁదనో
యనఁ గురియింప వానిని ర•యంబునఁ దునకలు సేసె రాముఁడున్. ౨౩౨౩

అర్థములు. సువర్ణభూషణ సమంచిత = బంగారు సొమ్ములచేఁ బ్రకాశించు, శాతశరాళి=వాఁడి బాణములపంక్తి, ముసలంబులన్ = రోఁకండ్లు, ముదిర బృందము=మేఘసమూహము, నీరు + అనన్ = నీళ్ళనువలె, నోయన = చూచు వారు హోహోయనునట్లు, ఇది ఒయ్యన శబ్దముగా భ్రమింపరాదు. అర్థము పొసగదు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుచు బంగారు తీఁగలచే నలంకరింపఁబడిన వాఁడి బాణము లను రావణు దేహమునందుఁ గ్రుచ్చుకొనునట్లు వేయఁగా నాతఁడును ప్రకాశించు బాణములను పెద్ద రోఁకండ్లను మేఘము నీళ్ళు గురిసినట్లు చూచువారు హోహో యనునట్లు గురియింపఁగా వాని నన్నిటిని రామచంద్రమూర్తి తునుకలు చేసెను.

చ. ప్రకటబలప్రతాపనర•వల్లభ రాక్షసరాజముక్తసా
యకనిచయంబు లుప్పరమునం•దద యొకొంటిని దాఁకుచప్పుడుల్
సకలదిశాంతవీథుల న•సహ్యము లై పరఁగెన్ ధరాస్థలిన్
శకలము లౌచు రాలి పృథు•శైలవితానములట్టు లొప్పఁగన్. ౨౩౨౪

అర్థములు. ప్రకట = ప్రసిద్ధమైన, బలప్రతాప = బలము ప్రతాపము గల నరవల్లభ = రామచంద్రమూర్తి చేతను, రాక్షసరాజ = రావణు చేతను ముక్త=విడువఁబడిన, సాయక నిచయంబు = బాణసమూహము, ఉప్పరమునంద= ఆకాశమునందే సకల దిశాంత వీథులన్= సమస్త దిక్కుల కడపటి ప్రదేశముల, అసహ్యములై=సహింపరానివై, పృథువు = గొప్పవగు, శైల వితానములట్లు = కొండల సమూహములవలె.

తాత్పర్యము

ప్రసిద్ధబలపరాక్రమము గల రామరావణులు ప్రయోగించు బాణములు ఆకాశమునందె యొకదాని నొకటి కొట్టు ధ్వనులు దిక్కులందుండు వారికి విన

సహింపరానివై యుండెను. అవి తునకలై రాలి నేల మీఁదఁ గొండలవలెఁ బడి యుండెను.

ఉ. ఏమిర ! యింతదాఁక దెగి ♦ యీతఁడు పోరెడునంచు నల్కమై
    రాముఁడు నిప్పు గ్రక్కెడి శ♦రంబులఁ గోటుల లస్తకంబునన్
    స్తోమముగాఁగ నీనుగతిఁ ♦ దొప్పలు దోరలు పర్వఁజేసినన్
    దీమస మేది రావణుఁడు ♦ దీనతఁ బాఱెఁ బురంబులోనికిన్. ౨౩౨౫

అర్థములు. కోటులన్=వింటి కొప్పులందు, లస్తకంబునన్ = విల్లు పట్టు కొనెడి నడిమిచోటు, పిడికట్టు, తొప్పలు దోరలు=కోటానఁ గోటులు, దీమసమేది= ధైర్యము చెడి, దీనతన్=దుఃఖముతో, పాఱెన్=పరువెత్తెను.

తాత్పర్యము

ఏమిది, ఇంతసేపు వీఁడా నాయెదుటఁ దెగించి నిలిచి యుద్ధము చేయువాఁడని కోపించి రామచంద్రమూర్తి నిప్పులు గ్రక్కు బాణంబులను వింటి కొనల నడుమ గుంపులుగా గనుచున్నవా యన్నట్లు కోటానఁ గోటులు వేయగాఁ ధైర్యము చెడి యిఁక నుండినఁ జచ్చుట సిద్ధమని రావణుఁడు లంకలోనికిఁ బాఱి పోయెను.

—♦ ౧౦౩-వ సర్గము. మూర్ఛిల్లిన లక్ష్మణుఁ జూచి శ్రీరాముఁడు దుఃఖించుట ♦—

ఉ. రావణుతోడఁ బోరుచును ♦ రామవిభుం డొకకంట రక్తసి
    క్తావయవున్ నిజానుజుని ♦ నార్తిని గాంచుచు నెన్ సుషేణుతో
    హా! వరవిక్రముండు సుగు♦ణాంబుధి ప్రాణముకన్న మిన్న యీ
    ధీవిభవుండు తమ్ముఁడు క్షి♦తిం బొరలాడెడిఁ బాము కైవడిన్. ౨౩౨౬

అర్థములు. రక్తసిక్తావయవున్ = నెత్తుటఁ దడిసిన యవయవములఁ గల వానిని, నిజానుజునిన్=తన తమ్ముని.

తాత్పర్యము

ఒక కంట రావణాసురునిఁ జూచుచు యుద్ధము చేయుచు నొక కంట నెత్తుటఁ దడిసిన దేహముగల లక్ష్మణుఁ జూచుచు సుషేణుతో నిట్లనెను. అయ్యో! ఉత్తమమైన పరాక్రమము గలవాఁడు, మంచి గుణములకు సముద్రుఁడు, నాకుఁ బ్రాణముల కంటె శ్రేష్ఠుఁడు, బుద్ధిసంపదగలవాఁడు, నా తమ్ముఁడు పామువలెఁ నేలఁ బొరలు చున్నాఁడు.

ఉ. ఈతనిపాటుఁ గన్న మన ♦ మెంతయు నారటమందఁ జొచ్చెడిన్
    నాతర మౌనె యింకఁ గద♦నం బొనరింపఁగ ? శౌర్యశాలి నా
    భ్రాత ప్రశస్తలక్షణవి♦రాజితమూర్తి సుమిత్రపట్టి య
    య్యో! తెగ నేని నే బ్రదికి♦యుండుట యేటికి? సౌఖ్య మేటికిన్. ౨౩౨౭

అర్థములు. ప్రశస్త లక్షణ విరాజితమూర్తి = పొగడఁ బడిన శుభ చిహ్నములచేఁ బ్రకాశించు నాకారము గలవాఁడు.

తాత్పర్యము

ఈతనిస్థితి చూచిన మనస్సున కెంతయు సంకటము గలుగుచున్నది. ఇఁక యుద్ధముచేయ నాకు సాధ్యమా? శూరుఁడు నా తమ్ముఁడు ప్రశస్త శుభ చిహ్నములు గలవాఁడు, సుమిత్రకొడుకు కటా! మరణించెనా నేను బ్రదికి యేమి ప్రయోజనము? ఇఁక సౌఖ్య మనుమాట యేల?

ఉ. జాఱెడిఁ జాపదండ, మవ • శం బయి పోయె మనంబు బాణముల్
పాఱెడి నెట్టటో గుఱిని • బాసి, యయో కనులందు బాష్పముల్
మీఱెడి దృష్టి నాఁగుచును • మేను ధరింపఁగ నాశలన్నియుం
దీఱె, విషాద మెచ్చెడిని • దీనతఁ దమ్ముని పాటుఁ జూచినన్. ౨౩౨౯

తాత్పర్యము

తమ్ముఁడుండు స్థితిని జూడఁగా దుఃఖముచేఁ జేతినుండి విల్లు పడిపోవుచున్నది. మనస్సు స్వాధీనము తప్పినది. బాణములు గుఱి తగులక యెట్లెట్లో పోవుచున్నవి. ఏల యనిన కన్నుల నీళ్లూరి దృష్టిని నడ్డగించుచున్నవి. ఏయాశచే దేహము నిలుపఁ దలఁచితినో యా యాశ లన్నియు నాశమయ్యెను. దుఃఖము హెచ్చుచున్నది. (ఇవి యుద్ధము చేయుచుఁ జెప్పిన మాటలు)

ఆ. స్వప్నయానమందు•జనులకుఁబోలె నా, యంగకములు సడలి•యవనిఁ ద్రుంగఁ
బడుచు నున్న వయ్యె•పటిమ లే దొడలను, సడలి డీలు పడియె•సంధు లెల్ల.

అర్థములు. స్వప్నయానమందు = నిద్రలోఁ బ్రయాణము నందువలె, అంగకములు = అవయవములు, సడలి = బిగువుదప్పి, పటిమ = పటుత్వము, దార్ఢ్యము - బడలిన దేహమందు - సంధులు=కీళ్ళు, సడలి=శిథిలములై.

తాత్పర్యము

నిద్రలోఁ బ్రయాణము చేయువానికివలె నా యవయవములు బిగువుదప్పి భూమిపైఁ గూలఁబడుచున్నవి. దేహమునందు దార్ఢ్యము లేదు. కీళ్ళు వదులైనవి.

కం. నా కనుల ముందరఁ దమ్ముం, డీకరణి గరాసుచేత • మృతి గన నిస్సీ
నాకడిమిఁ దలఁప సిగ్గా, నా కెక్కడిబల? మిఁ కేల • నా కీ ధనువున్. ౨౩౩౦

అర్థములు. గరాసు=దుష్టుఁడు, కడిమి=బలము.

తాత్పర్యము

నా కన్నులయెదుట నా తమ్ముఁడు దుష్టునిచే నీ విధముగా మరణించిన నా బలమేమి బలము. నా కీ విల్లేల? ఇవి యెవరి నుద్ధరింపఁగలవు.

చ. అని వ్యసనాభి పీడితు శ • రాభిహతాంగు వినష్టవంతుఁ ద
మ్ముని వెలిప్రాణమై తనరు • మోహనగాత్రునిఁ జూచి చూచి తాఁ

గనులను నీరు గార్చుచు ♦ గాఢతరార్తిపరాయణుండు నై
మన మురియంగ మిక్కిలి క్ష♦మాతనయారమణుండు దీనుఁడై. ౨౩౩౧

అర్థములు. వ్యసనాభిపీడితున్=దుఃఖముచే మిగులఁ బీడింపఁబడిన వానిని, శరాభిహతాంగున్ = బాణములచేఁ గొట్టఁబడినవానిని, వినష్టవంతున్ = నిశ్వాసములు పుచ్చుచున్న వానిని, గాఢతర=మిక్కిలి యధికమైన, ఆర్తిపరాయణుండు=బాధ గలవాఁడు, ఉరియంగన్=పరితపింపఁగా.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి దుఃఖముచే మిగుల బీడింపఁబడినవానిని బాణములచే బాగుగా గొట్టబడినవానిని,ఊర్పులు పుచ్చుచున్న వానిని, తనకు వెలుపలి ప్రాణమైన వానిని, అందముగల దేహముగలవానిని దమ్ముని జూచి చూచి కన్నీరు గార్చుచు మిగుల బాధపడుచు మనస్సు సంతాపపడుచుండఁగా దీనుఁడై రామచంద్రమూర్తి.

కం. ఏలా నా కీ యుద్ధం? బేలా ప్రాణంబు? సీత ♦ యేలా యింకన్?
లాలితగుణుఁడగు తమ్ముం, డీలీలన్ ధూళి బ్రుంగి♦యిలఁ బడియుండన్.

అర్థములు. బ్రుంగి = మునిఁగి.

తాత్పర్యము స్పష్టము.

కం. నాముద్దుఁదమ్ముఁ డీతఁడు, భూమి నిహతుఁ డైనయేని ♦ భోగము రాజ్యం
బేమిటికి? బ్రదికి యేటికి?, నేమి ప్రయోజనము గలిచి♦యేనియు ననిలోన్.

అర్థములు. నిహతుఁడు = మరణించినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఊరూరఁ గళత్రంబులు, నూరూరన్ బాంధవులును ♦ నొదవెద రకటా!
యారయ భ్రాత సహోదరుఁ, డారఁగ లభియించుదేశ♦మవనిం గలదే?

అర్థములు. కళత్రంబులు = భార్యలు, భ్రాత = సహోదరుఁడని రెండు శబ్దములు చెప్పఁబడెను. భ్రాతృశబ్ద మొక్కటియే చెప్పిన నా శబ్దము నానార్థములు గలది యగును. భ్రాతృశబ్దమునకు (౧) తోడఁ బుట్టినవాఁడు, (౨) ఆప్తుఁడైన స్నేహితుఁడు, (౩) ఆప్తుఁడైన చుట్టము, సమీప బంధువు. (౪) సామాన్యముగ మిత్రుఁడు, 'భ్రాతః కష్ట మహో' అని భర్తృహరి. 'తత్త్వం చింతయ తదిహ భ్రాతః' మోహముద్గర పాఠము. ఈ కారణముచే భ్రాతృశబ్దమునం దిష్టార్థ సౌష్ఠవము లేదు. కావున సోదర శబ్దము చేర్పఁబడెను. సహోదర శబ్దము ఒక తల్లి గర్భమున జనించినవారికే యన్వయించును. రామలక్ష్మణులు లోక తల్లి బిడ్డలు గారు. కావున కేవల సోదరశబ్దము సరిగాదు. కావున భ్రాత సహోదరుఁ డనుటచే భిన్నోదరు లైనను నొక తల్లిబిడ్డలవలె నుండువారని యర్థము.

తాత్పర్యము

కావలయునని కోరువారికి నూరూర పల్లెపల్లెయందు భార్యలు దొరకుదురు.

ఊరూర భార్యల వెంట బంధువులు దొరకుదురు. కాని సవతి తల్లి కొడుకయ్యు సహోదరుఁడగు తమ్మునివలె సేవించువాఁడే దేశమందు దొరకఁడు.

తల్లి కని పెంచుచుండినదియైనను జారిణి యైనను ఏకోదరులు లభింపవచ్చును గాని యిట్టి వారు లభింపరు. పాండవులందు ముగ్గురు కుంతికొడుకులే. తక్కిన యిరువుర నామెయే పెంచెను. కావున నా సోదరభావ మిట్టిదిగాదు.

—• సుషేణుఁడు శ్రీరాము నూరార్చుట •—

తే. అనుచునిట్లార్పునిగిడించు•నవని బొరలుఁగన్నులను నీరునించుశో•కంబునొందుఁ
బనవుఁబలవించునిట్టున్న•మనఘుఁగాంచి, చేరి యూరార్చిపలుకును•షేణుఁడపుడు.

తాత్పర్యము స్పష్టము.

కం. లక్ష్మీవర్ధనుఁ డగు మన, లక్ష్మణుఁడు మృతుండుగాఁడు • శ్లాఘితచరితా!
లక్షణములఁ గనుఁగొనుమిా, సూక్ష్మమతీ! నీవు నిట్లు • శోకింపఁగ నేలా!

అర్థములు. లక్ష్మీవర్ధనుఁడు=కాంతిచే వృద్ధినొందినవాఁడు, 'లక్ష్మీస్సంపచ్ఛోభా' నా. నా. ర లక్షణములన్ = చిహ్నములను, "చిహ్ననామ్నో సలక్ష్మీకేసామిత్రౌ సారసస్త్రియాం" నా.నా.ర.

తాత్పర్యము

రామచంద్రా! లక్ష్మణుఁడు మృతుఁడేమో యని నీవు దుఃఖించుచున్నావు. ఆయన మృతుఁడుగాఁడు. ఏలన కాంతి వృద్ధియై యున్నదిగాని క్షీణింపలేదు. నీవు సూక్ష్మవిషయముల గ్రహింపఁగల మనస్సు గలవాఁడవు. మృతుని చిహ్నము లీయన యందుఁ గలవేమో చూడుము.

తే. కాంతి దొఱఁగదు నీలంబు•గాదు మోము, పాటునొందదు వదనంబు•పార్థివేంద్ర
సుప్రభంబు ప్రసన్నంబు•పొలుగు గలదు, పాణులును రక్తనీరజ•ప్రభలనొప్పె.

తాత్పర్యము

రామచంద్రా! లక్ష్మణుఁడు మృతుఁ డని నీ వెట్లు తలంచితివి ముఖమునందుఁ గాంతి తొలఁగిలేదు. నల్లనైనదికాదు. మాఱుపడినదిగాదు. మరణించిన వానియందుండవలసిన యీ గుణము లున్నవా? ఇవి లేకుండుటేగాక ముఖము మంచి కాంతి గలదై ప్రసన్నమై యుండమైయున్నది. అఱచేతు లెఱ్ఱ కమలముల వంటి కాంతిగలవై యున్నవి.

కం. కనులందుఁ దేజ మాఱదు, మనుజేంద్రా! యిట్టికాంతి • మహిమయుఁ గలదే
నినశించినవారికి? నీ,తనిముఖ మొకేఁగించు దీర్ఘ•తరజీవితమున్. ౨౩౩౮

తాత్పర్యము

కనులందుఁ గాంతి మాఱినదిగాదు. రాజేంద్రా! మరణించిన వారియందీ చిహ్నము లుండునా? ఈయన ముఖముచూడ నీయన దీర్ఘాయుష్మంతుఁడని తెలియుచున్నది.

ఉ. కాన మృతుండు గాఁడు సుమి • గాదిలితమ్ముఁడు భద్రమూర్తి న
 ప్రాణుఁడు దుఃఖ మొందకుము • రాజవరా! యనె మాటిమాటికిన్
 గావఁగనయ్యె నీన్ హృదయ•కంపన ముచ్ఛ్వసనంబు చూడుమీ
 మాను విషాద మంచు హను•మంతునిఁ జూచి వచించె నీగతిన్. -౨౩౯

తాత్పర్యము

రాజేంద్రా! లక్ష్మణుఁడు మూర్ఛితుఁడే కాని మృతుఁడు కాఁడనుటకు మఱి కొన్ని కారణములు గలవు. గుండెలు కొట్టుకొనుచున్నవి. శ్వాస వచ్చుచున్నది. ఱొమ్ము క్రిందికిఁ బైకిఁ జలించుచున్నది. కాన లక్ష్మణుఁడు మృతుఁడుగాఁడు. ప్రాణముతో నున్నాఁడు. కావున దుఃఖింపకుము అని చెప్పి హనుమంతునితో నిట్లనియె.

—• హనుమంతుఁడు సంజీవనిపర్వతంబు దెచ్చుట •—

కం. హనుమా! మందులమలకై, చనుమా వేగంబ మున్ను • చతురాస్యసుతుం
 డనిన పథంబున నగ్గిరి,గోనబోరెడి దక్షిణంపుఁ•గూటమునందున్ ౨౪౦

అర్థములు. చతురాస్యసుతుండు=బ్రహ్మకొడుకు, జాంబవంతుఁడు.

తాత్పర్యము స్పష్టము.

సీ. కలదు సుమ్ము విశల్య•కరణి యైన విశల్యకరణి శ్రేయస•కారి యగుచుఁ
 గల వందున సవర్ణ•కరణి సంజీవని, సంధానకరణియు • శక్తవేగ!
 కొనితెమ్ము లక్ష్మణు•మనుదల గూర్పఁగఁ, బొమ్ము వీరుఁడ! వేగ•రమ్ము టన్నఁ
 జివ్వునఁ జని యటఁ • జేరి మహౌషధి, నెల వెఱుంగఁగ లేక • నెమకి తలఁచె
తే. నేల యీ యాగు గిరిని స•మూలముగను, బెఱికికొనిపోదు మందులు•వఱలు నిందు
 నట్లు చెప్పె సుషేణుండు•నౌషధంబు, గొనక మసలిన నెంతయుఁ•గూడుఁ గీడు.

అర్థములు. విశల్యకరణి=శల్యములను (మేకులను చీలలను) యూడఁదీయునది యగుటచే విశల్యకరణి యని పేరొందినది, శ్రేయసకారి=శుభము కలిగించునది, అందున=అందే, దక్షిణశిఖరముందే, మనుదల=జీవితము, నెమకి=వెదకి.

తాత్పర్యము

దేహమున నాఁటిన ములుకులు లోనైనవానిని నూడఁదీయు విశల్య కరణియు, ఆ దక్షిణకూటమునందే సవర్ణకరణి, సంజీవని, సంధానకరణిగలవు. లక్ష్మణు జీవింపఁ జేయుటకై వానిని వేగ తెమ్ము, వేగరమ్ము, అని చెప్పగాఁ జివ్వునపోయి కొండఁజేరి ఓషధులున్న స్థలము నెఱుఁగలేక వెదకి యీ యాలస్య మేల? మరలఁ బోయి సుషేణు నరయుదు స్థల మడుగుదమా యనిన నాలస్య మగు నని తలఁచి కొండనే పీకికొని పోదును ఇందునెందో మందులుండును గాని లేకపోవు. సుషేణుఁ డిందు గలవని చెప్పెఁగదా. ఆలోచనలతో నాలస్యముచేసిన గీడు కలుగును.

కం. పౌరుషహానియు నా కని, వీరుఁడు చింతించి యెల్ల•పృథివీధరమున్
 వారక ముమ్మాఱూఁచెను, జారుతరోత్ఫుల్ల భూజ•సంతతితోడన్. ౨౪౧

అర్థములు. చారుతర=మిగుల నందమైన, ఉత్ఫుల్ల = వికసించిన పూలుగల; భూజసంతతితోడన్=చెట్ల సమూహముతో.

తాత్పర్యము

అదియును గాక నాకు పాపహానియుఁ గలుగును. అని యాలోచించి పర్వతమును మూఁడుమూర్లెంచి పూచిన చెట్లతోడ నా కొండను

సీ. పెకలించి పై కెత్తి ♦ వినువీధికిని దాఁటి, పుట్టచెండును బోలె ♦ భూమిధరము
నెగవైచి పట్టుచు ♦ జిగి జలపూర్ణ మే, చకఘన మగు దాని ♦ సరగఁ దెచ్చి
వనచరావళిమధ్య♦మున డించి యించుక, గాసి దీఱ సుషేణుఁ ♦ గాంచి పలికె
నిందలి మందుల ♦ నెఱుఁగఁజాలక కొండఁ, బెకలించి తెచ్చితి ♦ వీరవర్య!
ఆ. యనిన మెచ్చుకొనుచు♦నతని సుషేణుండు, దీసె నోషధులను ♦ దీవరముగఁ
బావమానికృతికి ♦ వానరరాక్షస, చయము లబ్రపడె న♦సాధ్య మనుచు.

అర్థములు. జిగిన్ = కాంతియందు, జలపూర్ణ = నీటనిండిన, మేచక ఘనము = నల్లమబ్బు.

తాత్పర్యము

పెళ్ళగించి మీఁదికెత్తి యాకాశమున కెగిరి చెండువలె దాని నెగుర వేసి పట్టుకొనుచు నీటితో నిండిన నల్లమబ్బు కాంతిగల యాపర్వతమును త్వరగాఁ దెచ్చి వానరుల నడుమనుంచి గాసి కొంచెము దీరఁగా సుషేణుఁజూచి యిట్లనియె. సుషేణా! యిందు మందులతీఁగ లేవియో నాకుఁ దెలియలేదు. కావునఁ గొండనే పెకలించి తెచ్చితిని అనిన మెచ్చుకొనుచు సుషేణుఁ డా మందుల తీఁగలను దీసెను. ఆంజనేయుఁడు చేసినపనికి వానరులు రాక్షసులు ఇది యసాధ్యకార్యమని యాశ్చర్యపడిరి.

— ♦ లక్ష్మణుఁడు మూర్ఛ దేఱుట ♦ —

ఉ. అంత సుషేణుఁడుం బరిమ♦హౌషధి మూర్కొనఁ జేసినంతలో
నెంతయుఁ దేజ మీఱి వ్యథ ♦ యేమియు లేక విశల్యుఁడై వెసన్
సంతస మార లేచెఁ, గపి ♦ సంఘము లా కపివర్యు శక్తి క
త్యంతము మెచ్చి మే లనుచు ♦ నర్హగతిం గొనియాడె నాతనిన్. ౨౩౭౮

అర్థములు. మూర్కొనన్ = వాసనచూడ, విశల్యుఁడై = ములుకు లూడినవాఁడై.

తాత్పర్యము

అంత సుషేణుఁ డా యోషధులఁ దీసి వాసనచూపి నంతలో లక్ష్మణుఁడు మిక్కిలి కాంతిగలవాఁడై బాధయనునది లేక ములుకులూడి సంతోషముతో లేచెను. ఆ సుషేణుశక్తికి వానరు లందఱు మిగుల మెచ్చిరి.

ఈ ఘట్టమునఁ గానవేమి కథ కల్పితమనుటకుఁ గారణములు కొన్ని పూర్వపీఠికయందు వ్రాయఁబడెను.

౧. లక్ష్మణమూర్ఛ పగటి చర్యయేకాని రాత్రిచర్య గాదు.

౨. హనుమంతుఁడు సంజీవనికిఁ బోయిన సమయమున ధాన్యమాలిని రావణు నింట నున్నది కాని మొసలియై యుండలేదు.

౩. సంజీవనిని దెచ్చు హనుమంతుని చూచి సూర్యోదయ మగుచున్నదని రామచంద్రమూర్తి భ్రమించెనఁట.

హనుమంతు డుత్తరముననుండి దక్షిణమునకు వచ్చుచున్నవాఁడు. ఉత్తరమున సూర్యుఁడుదయించెనని రామచంద్రమూర్తి తలఁచెనట! ఇంతకంటెఁ దెలివిమాలిన వ్రాతయు, దీనిని సత్యమని తలఁచువారికంటెఁ దెలివిమాలినవారు లోకమునఁ గలరా?

ఆలోనఁ గమలాప్తుఁడని చూచి విభుఁడు
కాలకాలోదగ్రగతి నాడ నుండ - గపికులాధీశులఁ గలయ నీక్షించి
కపులార సూర్యునిఁ గంటిరే మింటఁ - జేకొని బహుపుణ్య శీలంబులందు
మాకులంబుల కెల్ల మహిఁ గర్తయైన - యంధకారారాతి యకట యీ పద్మ
బంధుండు నేఁడు నా భగవానిఁ గూడి - యుదయించుచున్నవాఁ డుగ్రత మిగిలి."
[ద్విపద రంగనాథ రామాయణము.]

ఇచ్చట గోవిందరాజీయ వ్యాఖ్యానమం దొకటి శంకింపఁ బడినది. అదియెట్లన:—

౧. ఇంద్రజిత్తుచే గాయపడిన లక్ష్మణాదులకు సుషేణుఁడు పరమౌషధిచే విశల్యులఁ జేసెనని ముందు చెప్పఁబడెను. కావున సుషేణుఁ డీ యోషధిని సంగ్రహించికొని యుండవలెను. కావున నిప్పుడు హనుమంతుని మరల నా యోషధులఁ దెమ్మనుట యనుపపన్నము.

౨. విభీషణ లక్ష్మణ వానరాదులకుఁ జికిత్స చేయుటయం దా మూలికలన్నియు వ్యయపడిన వన్న పరిహారము చెప్పఁ గూడినను మఱపెట్టికో యేఁగని హనుమంతుఁడు అచిరకాలమునకుముందు తానే యుంచిన పర్వతవిషయమూహించి తెలిసికొనెననుటయు మూఁడు మార్లుఁ జే ననుటయు విరుద్ధమని తోఁచుచున్నది. దీనికిఁ బరిహారము విద్వాంసు లాలోచింపవలయు ననియున్నది.

ఈ మందర వ్యాఖ్యాత విద్వాంసుఁడు కాకున్నను తనకుఁ దోఁచినది వ్రాసి పండితవిమర్శకై విడుచుచున్నాఁడు.

౧. విశల్యకరణి, సంధానకరణి తెలిసినవారు చెంచులలో సేనాములలోఁ దదితరులలో నేటికిని గలరు. ఇది ప్రత్యక్షానుభవసిద్ధము. ఊహ కాదు. వీరు హిమవంతమునకుఁ బోయినవారు కారు. మన యడవులందే యివి దొరకుచున్నవి. సుషేణుఁడు వీనిని దనతోడఁ దెచ్చికొని యుండవచ్చును.

౨. అటు కాదేని కౌసల్యాదేవి రామచంద్రమూర్తికి విశల్యకరణి రక్షకట్టెఁ గదా, (అయోధ్య. ౨౫ స.) అది యేమె కెక్కడిది?

౩. హనుమంతుఁడు మొదటిసారి సంజీవని తేకముందు గాయపడిన వానరు లకుఁ జికిత్స చేసెనా లేదా? అప్పుడు దేనితోఁ జేసెను.

౪. ఋషభపర్వతమునుండి సుషేణుఁడు మూలికల సంగ్రహించెనని వాల్మీకి చెప్పకున్నను నూహింపవచ్చునుగాని యిన్నికోట్ల వానరులకుఁ జికిత్స చేయుటకు పిడికెడు దోసెఁడు వేరులు చాలవు గదా. ఒకగుట్టెఁడైనఁ గావలయును గదా. ఈ గుట్టెఁడు మూలికలు సేనామధ్యమున నుండెనేని వాని వాసనకుఁ జచ్చిన రాక్షసులు కూడ బ్రదికియుండవలెఁ గదా. అట్లు చెప్పఁబడలేదే.

౫. జాంబవంతుఁడు చెప్పినప్పుడు ఋషభపర్వతమని చెప్పెనుగాని దక్షిణ కూటమని యుత్తరకూటమని చెప్పలేదు. కావున హనుమంతుఁడు ఆ పర్వత మునే పెకలించి తెచ్చెను. ఆ పర్వతమందలి తక్కిన కూటములందలి మూలికలు వ్యయమగుటచేఁ గాఁబోలు దక్షిణకూటమని నిర్దేశించెను. అప్పుడు మొదటిసారి రాత్రివేళ కావున లతలు మెఱయుచుండెనని చెప్పఁబడెను. ఇది పగటివేళ. రాత్రి గాదు. మూర్ఛదేఱిన లక్ష్మణుఁడు ఈ సూర్యుఁ డస్తమింపకముందే రావణు సంహరింపుమని రామచంద్రమూర్తితోఁ జెప్పఁగలఁడు. పగటిపూఁట నోషధులు ప్రకాశింపవు. ప్రకాశించినను సూర్యరశ్మివలనఁ దెలియరాదు. కావున నోషధుల వలన నిది యని గుర్తించుట సాధ్యముకాదు. మునుపు తెచ్చినది పర్వతము. ఇప్పుడు దాని యందలి శిఖరము మాత్రమే. కావున కొంచెము కాలమునకు ముందుంచఁబడిన దానిని మరుమాఱు తెచ్చనేల యని సందేహింపఁ గారణములేదు. "హనుమాన్ శిఖరంగిరేః" "సన్న్యస్య శిఖరంగిరౌ" "తదిదం శిఖరం కృత్స్నం గిరేస్తస్యాహృతం మయా" యని శిఖరమును మాత్రము తెచ్చెను గావున రెండుమారులు పెకలించి తెచ్చినాఁ డనుటయందు విరుద్ధవిషయము కానరాదు. (పూర్వము 'సతేన శైలేన భృశం విరాజ'-'శైలోత్తమే వానరసేనమధ్యే - తమోషధీశైల ముదగ్రవీర్యః' అని పర్వతమునే తెచ్చినట్లు చెప్పఁబడెను.)

సుషేణుఁడు మూలికల సేకరించి యుంచుకొనెనని యనుకొనినను నవి వ్యయ పడిపోయెనని మొదటి సందేహమునకుఁ బరిహారము. కాలభేదముచే వస్తుభేదముచే గుర్తింపరాక తర్కింపవలసివచ్చెనని యు అప్పుడు తెచ్చినదిగాక యిప్పుడు వేఱుగఁ దెచ్చుటచే కొంచెము శ్రమింపవలసివచ్చెననియు రెండవసందేహమునకుఁ బరిహారము.

కం. రా రమ్మా లక్ష్మణ! యని, గారామునఁ దమ్ము నవ్వుచుఁ గౌఁగిటఁ గ్రుచ్చెన్
శ్రీరాముఁడు కనుఁగవలన్, నీరము దొలఁకాడ నిండు నెయ్యము పేర్మిన్. ౩౮౪

తాత్పర్యము స్పష్టము.

కం. అన్నా! లక్ష్మణ! మొంతటి, పున్నెంబో నిన్ను మరలఁ బొడగనఁగలిగెన్
జెన్నఁటి యమువారిం బడి, క్రన్నన చనుదెంచి తీవు గాదిలియనుజా! ౩౯౪

అర్థములు. పున్నెంబో=పుణ్యమో, నే నెంత పుణ్యము చేసితినో యనుట, చెన్నఱి=కాంతిచెడి, త్రన్నన=త్వరగా.

తాత్పర్యము స్పష్టము.

కం. నీవు మరణింప నాకిల, జీవితమున నేమిఫలము ♦ సీతయు నేలా?
రావణునిఁ జంపి జయమున, నే వఱలఁగ నేల? చెప్పు♦వే సౌమిత్రీ! -౨౩౪౭

అర్థములు. నాలవ పాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము స్పష్టము.

—♦ లక్ష్మణుఁడు శ్రీరాముని రణంబునకుఁ బ్రోత్సాహపఱచుట ♦—

కం. అనవుడుఁ బలుకులు తడఁబడ, మనమున నెగులూని యనియె♦మహితబలాఢ్యా?
తును ముదు రావణు రాజ్యం, బనఘ! విభీషణున కిత్తు♦నన వే చెపుమా. -౨౩౪౮

అర్థములు. నెగులు=దుఃఖరూపమైన విచారము.

తాత్పర్యము

అని చెప్పఁగా మాట తడఁబడ మనసున దుఃఖముతోడి విచారముగలవాఁడై యిట్లనియెను. మహాబలశాలీ! "నేను రావణుని జంపుదును, రాజ్యము విభీషణున కిత్తు"నని రెండు ప్రతిజ్ఞలు నీవు చేయలేదా?

కం. పలికినబాస మహాత్మకు, లలఘుమతీ! తప్పిపోదు♦రా యెపుడేనిన్?
బలికినబాసను దీర్పు, యలఘుగుణాఢ్యులకుఁ జిహ్న♦మతిబలధుర్యా! -౨౩౪౯

అర్థములు. బాస=మాట, భాషాశబ్ద భవము, ప్రతిజ్ఞ=ప్రమాణము.

తాత్పర్యము స్పష్టము.

కం. బలవంతుఁడ వీ వయ్యును, బలహీనునిమాడ్కిఁ, బేద♦పలుకులు తగునే?
వలవదు నాకై కార్యము, నిలుపఁగ రావణు వధించి ♦ నెఱపుము ప్రతినన్.

తాత్పర్యము

నీ వెంతో బలవంతుఁడ వయ్యును బలహీనునివలెఁ బేదపలుకులు పలుకుచున్నావు. ఇది సరిగాదు. నే నుండనీ పోనీ, నాకై కార్యము నీవు నిలుపవలదు. నీవు చేయఁబూనిన కార్యము చేయుము. రావణుఁ జంపెద నంటివి, చంపుము. నీ ప్రతిజ్ఞ నెఱవేర్పుము నీవు ప్రతిజ్ఞ చేసినపుడు, లక్ష్మణుఁడు జీవించి యుండిననే రావణుఁ జంపుదును, లేకున్న లేదని వ్యవస్థ పలుకలేదుగదా.

కం. ఖరదంతం బతిశాతన, ఖరమయి గర్జిలు మృగేంద్రు♦కనులం బడినన్
గరి యురుగ లేనిగతిఁ ద్వ, చ్ఛరపథగతుఁ డసుర బ్రదికి♦చనలేఁడన్నా. -౨౩౫౧

అర్థములు. ఖరదంతంబు=కఠినమైన పండ్లుగలది, అతిశాతనఖరము=మిగుల వాఁడియగు గోళ్ళు గలది, గర్జిలు=బొబ్బరించు, మృగేంద్రు = సింహమురొక్కఁ, కరి=ఏనుఁగు; త్వత్=నీయొక్కఁ, శరపథగతుఁడు=బాణమార్గమును పొందినవాఁడు

తాత్పర్యము

అన్నా! కఠిన దంతములు కరవాఁడిగోళ్ళు గలిగి బొబ్బలు పెట్టుసింహమునకుఁ గనఁబడి బ్రదికి పోలేని యేనుఁగువలె నీ బాణములబారిఁ బడి రావణుఁ డూపిరితోఁ బోలేఁడు.

చ. అరుణమయూఖుఁ డీత డిఁక • న స్తముఁ జెందక మున్న పంక్తికం
ధరుఁ దునుమాడు మాతనివ•ధం బలివాంఛిత మేని, త్వద్వచః
కరణము కార్య మేని, యిది • కైకొన నీ కభిలాష మేని, యో
నరవర ! యిప్డ శీఘ్రముగ • నావచనం బొనరింపు మర్మిలిన్. ॥౩౫౨॥

అర్థములు. అరుణమయూఖుఁడు = ఎఱ్ఱని కిరణములు గలవాఁడు — సూర్యుఁడు, అస్తము చెందకమున్న = అస్తమింపకముందే, ఈ సూర్యుఁ డస్తమించుటకు ముందే యనుటచే లక్ష్మణమూర్ఛ పగట జరిగిన కార్యమనియు కాలనేమిని హనుమంతుఁడు చంపుటలోనైన కథలు మిథ్యాకల్పితములనియు గ్రాహ్యము ఈ విషయమిదివఱకే చర్చింపఁబడినది. ఇది బహుళ చతుర్థశిసాయంకాలసమయము

తాత్పర్యము

నీవు రావణుని జంపు కోరిక గలవాఁడవైతివేని నీ మాటప్రకారము నీవు నడచుకొనువాఁడవేని, నామాట నీ వంగీకరింప నిష్టమేని నీ సూర్యుఁ డస్తమింపక ముందే రావణుని వధింపుము. శీఘ్రముగ నామాటప్రకారము చేయుము.

## —• { ౧౦౩-వ సర్గము. శ్రీరామరావణుల కడపటి యుద్ధము ప్రారంభము. } •—

చ. అనవుడు రామచంద్రుఁడు ని•జానుజవాక్యము లాత్మ నుంచి వే
ధనువుఁ గొనెన్, దశాననుఁడు • దా నొక స్యందన మెక్కి వేగిరై
దినకరుపైఁ దమోగ్రహము • తీవ్రత వచ్చిన మాడ్కి వచ్చి యా
మనుజవరేణ్యు వజ్రమయ•మార్గణతాడితుఁ జేసెఁ గ్రూరతన్. ॥౩౫౩

అర్థములు. నిజానుజవాక్యములు=తన తమ్మునిమాటలు, తమోగ్రహము= రాహువు. వజ్రమయ=వజ్రములచే నిండిన, మార్గణ=బాణములచే, తాడితున్ = కొట్టఁబడినవానిగా.

తాత్పర్యము

ఈ ప్రకారము లక్ష్మణుఁడు చెప్పఁగా నతనివాక్యములు మనస్సునందుంచిన వాఁడై శీఘ్రముగ ధనుస్సును గ్రహించెను. ఈ లోపల లంకకుఁ బరుగెత్తిన రావణాసురుఁడు తేరొకఁటి సిద్ధము చేసికొని శీఘ్రముగ సూర్యునిమీఁదికి రాహువు వచ్చునట్లువచ్చి రామచంద్రమూర్తిని వజ్రములచే నిండిన బాణములచేఁ గ్రూరుఁడై కొట్టెను. దీనివలన రావణాసురుఁడు లంకకుఁబోయి యలసటతీర్చుకొని

రథము సిద్ధముచేసి సన్నాహితుఁడై వచ్చునప్పటికి లక్ష్మణుఁడు మూర్ఛ తేఱెనని యేర్పడుచున్నది.

ఇచ్చట రంగనాథ రామాయణమున లక్ష్మణుఁడు మూర్ఛ తేఱిన తరువాత రావణుఁడు—

"అంత నా వృత్తాంత మంతయు నెఱిఁగి, యెంతయుఁ జింతించి యిచ్చలోఁ గలఁగి విక్రమక్రమశక్తి విడిచి రావణుఁడు, శుక్రుసన్నిధి కేగి" యతఁడు బోధింపఁగా పాతాళహోమము చేసినట్లు చెప్పఁబడెను.

వాల్మీకి రామాయణ ప్రకారముగ నిదియు విశ్వసింపరాదు. i. లక్ష్మణుఁడు లేచునప్పటికి రావణుఁడు యుద్ధసన్నద్ధుఁడై వచ్చెను. ii. ఇంద్రజిత్తు యజ్ఞము చేసి వరములు పొందెనని శుక్రుఁడు చెప్పఁగా "దీనను మేలులేదు మనద్వేషుల నింద్రముఖామరాదులన్, మానితరీతి భక్తిని సమంచిత వస్తువులన్ భజింతురే" యని రావణుఁడాక్షేపించెను. అట్టివాఁడు తాను యజ్ఞము చేసెననుట యెట్టిదో? iii. కపులు సమస్త యజ్ఞసామగ్రి ధ్వంసము చేసి స్రుక్స్రువముల నూడఁ జెఱిచిన పిమ్మట వాఁడు చేసిన యజ్ఞమేమిటో మండోదరి నేల తేవలసివచ్చెనో తెలియదు. యజ్ఞము యోగసమాధిగాదు గదా.

ఇట్టి యనుపపత్తులున్నను 'దశగ్రీవస్తతో హోమ మారేభే జయకాంక్షయా, ధ్వంసితం వానరేంద్రైస్తైః రభిచారాత్మకం రిపోః" యని పాద్మమందును, 'రావణుండు హోమాది విఘాతంబునంగాదె రాముచేత సమయింపఁబడె" శల్య. ౫౩ నందును జెప్పఁబడెను.

ఇందేగాక యితర విషయములఁ గొన్నిట కుంభకర్ణుని లక్ష్మణుఁడు జంపెనని లోనగు వ్యత్యాసములు గానవచ్చుచున్నవి. కావున నీ విషయముల నేరాముని గుఱించి వాల్మీకి రామాయణము వ్రాసెనో యా యుగమునాఁటి రాముని గుఱించి కాదని గ్రహింపనగు. స్కాందమునం దీసమాధానమే చెప్పఁబడెను.

కం. సీతాపతి పావకనిభ, శాతాశుగపంక్తి తప్త • జాంబూనదభూ
షాతతభూషితముం గొని, యాతని తను వెల్లవ్రణమ•యంబుగఁ జేసెన్.

అర్థములు. పావకనిభ=అగ్నితో సమానమైన శాతాశుగపంక్తి=వాఁడి బాణముల వరుసను, తప్త=పుటము వేసిన, జాంబూనద = బంగారుతోఁ జేయఁబడిన, భూషా = ఆభరణములచే, తతభూషితమున్ = విస్తారముగ నలంకరింపఁబడిన దానిని.

తాత్పర్యము

రామచంద్రమూర్తి పుటము వేసిన బంగారు సొమ్ములచే నలంకరింపఁబడి యగ్నిసమానములైన వాఁడిబాణముల వరుసను గ్రహించి రావణుని దేహము వ్రణములతో నిండినదానిని జేసెను.

సీ. దేవగంధర్వాది • దివిజు లప్పుడు చూచి; భూమిస్థితుండు శ్రీ • రామవిభుఁడు
రథికుండు రావణ • రాక్షసుం డిది సమ, యుద్ధంబు గా దంచు • నుగ్గడింపఁ
గాంచనరుచిరంబు • ఘంటికాశతభూషి, తము తరుణార్కని • భము విమూర
థవకూబరంబును • ఘర్మపరిష్కా-ర,మును సితచామరం • బును బలాశ
ఆ. కాంతి గలిగి రవిని • కాశ మా హారితతి, గ్రాల రుక్మవేణు • కలిత మైన
ధ్వజము మెఱయు తనర•థంబును శక్రుండు, పంపె నపుడు రాము•భద్రుకడకు.

అర్థములు. భూమిస్థితుండు=నేలమీఁద నిలువఁబడినవాఁడు, రథికుండు = రథమునందున్నవాఁడు, ఉగ్గడింపన్=చెప్పఁగా, కాంచనరుచిరంబు = బంగారువలె మనోహరమైనది, ఘంటికాశతభూషితము=నూఱు ఘంటలచే నలంకరింపఁబడినది. తరుణార్కనిభము=యౌవనవంతుఁడైన(మధ్యాహ్న)సూర్యునితో సమానమైనది. విమూరథవకూబరము = వైడూర్యములతో చేయఁబడిన, కూబరంబును = నొగ గలదియు, ఘర్మపరిష్కారమును=బంగారు సొమ్ములుగలదియు, సితచామరంబును= తెల్లని గొడుగు గలదియు, పలాశకాంతి=ఆకుపచ్చ కాంతిగలదై, రవినికాశమా= సూర్యునితో సమానమైన, హారితతి=గుఱ్ఱముల సమూహము, రుక్మవేణుకలితము= బంగారు తొడుపువేసిన వెదురుగల.

తాత్పర్యము

దేవతలు గంధర్వులు లోనగువారు చూచి రామచంద్రమూర్తి నేలఁ నిలఁబడినవాఁడు, రావణరాక్షసుఁడు రథమునం దున్నవాఁడు ఇది సమయుద్ధము గాదని చెప్పఁగా నింద్రుఁడు బంగారువలె మనోహరమై నూఱు గంటలు గలదై మధ్యాహ్నసూర్యుని బోలినదై వైడూర్యమయమైన నొగ గలదై బంగారు సొమ్ములు తెల్లగొడుగు గలదై ఆకుపచ్చవన్నె గలిగి సూర్యునితో సమానములైన గుఱ్ఱములు గట్టిన బంగారు వెదురు దండము గల ఛత్రము మెఱయఁగా తన రథంబును రామచంద్రు నొద్దకుఁ బంపెను.

—• మాతలి శ్రీరాముకడకు నింద్రుపనుపున రథంబుఁ దెచ్చుట •—

కం. ప్రీతిని హరిహయుపనుపున, మాతలి స్యందనముఁ గొనుచు•మహికిం డిగి శ్రీ
సీతాపతికిన్ మ్రొక్కెను, జేతన కశ యుండ దిగక • స్వీయరథంబునన్.

అర్థములు. హరిహయుపనుపున = ఇంద్రుని యాజ్ఞ ప్రకారము, కశ = కొఱడా, దేవతలు నేల తాఁకరు గనుక మాతలి రథమందే యుండెను.

తాత్పర్యము స్పష్టము.

శా. దేవా! నీ విజయంబుఁ గోరి పనిచెన్ • దేవేంద్రుఁ డీ స్యందనం
బీ వృత్రాహితుతోడ నెక్కి కొనుమీ • యీ యైంద్ర కాండాసనం
బీ వైశ్వానరతుల్యవర్మము దినా • ధీశాభ బాణోత్కరం
బీ విద్యున్నిభశక్తియున్ రఘుపతీ! • యీ వైరినాశార్థమై ౨౩౫౩

అర్థములు. ఐంద్రకాండాసనంబున్ = ఇంద్రసంబంధమైన వింటిని, వైశ్వానరతుల్య వర్మము = అగ్నిహోత్రముతో సమానమైన కవచము, దినాధీశాభ = సూర్యునితో సమానమైన, బాణోత్కరంబు = బాణముల సమూహము, ఈ విద్యున్నిభ = మెఱుపుతో సమానమైన, శక్తియున్ = శక్తియను నాయుధము, ఈ వైరి నాశార్థమై = ఈ విరోధిని జంపుటకై.

తాత్పర్యము

దేవా! నీ గెలుపు గోరి యింద్రుఁడు ఈ తేరిని పంపెను, దీనిపై నెక్కుము. ఇదియె గాక యీ వైరిని జంపుటకై యైంద్రధనుస్సును, అగ్నితో సమానమైన కాంతిగల కవచము, సూర్యకాంతిగలబాణ సమూహము, ఈ మెఱుపువంటి శక్తిని గ్రహింపుము.

కం. సారథినై యే నుండ బలారి దనుజనమితి మున్ను ♦ హరియించినటుల్
సారథి నై యే నుండఁగ, నీ రావణుఁ ద్రుంపు మిప్డు ♦ దీప్త మహాత్మా.

అర్థములు. బలారి = ఇంద్రుఁడు.

తాత్పర్యము స్పష్టము.

సీ. అనవుడు వలగొని ♦ యభివాదనము సల్పి, భువనముల్ లక్ష్మిచేఁ ♦ బూరటిల్ల
రాముఁడు రథ మెక్కి ♦ రణ మొనరింపఁగ, రోమహర్షణము సం♦గ్రామమయ్యె
రాముఁడు రథికుఁడై ♦ రాణించుటను గాంచి, దశకంఠుఁ డాగ్రహో♦దగ్రుఁడగుచు
గాంధర్వశర మేయ ♦ గాంధర్వశరమున, దైవశరం బేయ ♦ దైవమునను
ఆ. రాముఁ డడఁచి వైవ ♦ రాక్షసనాథుఁడు, పరమరోషుఁ డగుచుఁ ♦ బటుమహోగ్ర
రాక్షసాస్త్ర మేయ ♦ రాజితభూషణ, ఫణులు గవిసె రామ ♦ భద్రుమీఁద.

అర్థములు. వలగొని = ప్రదక్షిణముచేసి, అభివాదనము = నమస్కారము, పూరటిల్లన్ = నిండఁగా, రోమహర్షణము = గగ్గురుపాటుగలది, ఆగ్రహోదగ్రుఁడు = అతిశయించిన కోపముగలవాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పఁగా రామచంద్రమూర్తి రథమునకుఁ బ్రదక్షిణము చేసి లోకములు కాంతిచే నిండఁగా రథ మెక్కి యుద్ధము చేయఁగా గగ్గురుపాటు గలిగించు యుద్ధము జరిగెను. రామచంద్రమూర్తి రథమునం దున్నవాఁ డగుట చూచి కోపాతిశయమున రావణుఁడు గాంధర్వాస్త్రము వేయఁగా గాంధర్వ బాణమునను, దైవాస్త్ర మేయఁగా దైవాస్త్రమునను గొట్టివేయఁగా రావణుఁడు మిగులఁ గోపించి భయంకరమైన రాక్షసాస్త్ర మేయఁగా దానినుండి బంగారు భూషణములు గల పాములు రామచంద్రమూర్తిపైఁ గవిసెను.

ఉ. మంటలు గ్రక్కుచున్ మిగుల ♦ మండెడు మోములతోడ వాసుకిన్
జంటగఁ జెప్ప నర్హమయి ♦ సర్వదిశల్ వెస నాక్రమించుచున్

కంటకవృశ్చికంబులు ప్ర • కాశసముజ్జ్వల దీర్ఘభోగముల్
మంటలమారులై కవియ • మార్గణము లగని నిర్వికారుఁడై. ౨౬౧

అర్థములు. మంటల మారులు=మండు స్వభావము గలవై, మారియను నది దాని స్వభావము దెలుపు ప్రత్యయము, జగడాలమారి, కోట్లమారి మొదలైనవి, నిర్వికారుఁడై=వికారము లేనివాఁడై.

తాత్పర్యము

మంటలు గ్రక్కుచు మండుచున్న ముఖములతో వాసుకితో సమానములయి యున్నిదిక్కు లాక్రమించి బాధాకరములైన విషములు, ప్రకాశముచే వెలుఁగుచున్న పెద్ద పడగలు, మండు స్వభావములుగల బాణములు మీఁదికి రాఁగా వానిని జూచి భయపడక.

కం. గరుడాస్త్రమేయఁ గార్త, స్వరతార్క్ష్యాకారములను • సాయకచయముల్
పరభసగతిఁ జని కాకో, దరనికరముఁ ద్రుంచివైచెఁ • దత్క్షణమందున్.

అర్థములు. కార్తస్వర తార్క్ష్యాకారములను=బంగారు గరుత్మంతులరూపములను, కాకోదర నికరమున్=పాముల సమూహమును.

తాత్పర్యము

గరుడాస్త్రము వేయఁగా దానినుండి బంగారు కాంతిగల గరుత్మంతుని యాకారములతో బాణములు బయలుదేఱి యా పాముల బాణముల నిమిషమందే సంహరించెను.

మ. తన సర్వాస్త్రము లిట్లు వ్యర్థమగుటన్ • దర్పించి సంరంభియై
ఘనదుర్వారశరోగ్రవృష్టి పఱపెం • గాకుత్స్థుపైఁ సూతుపైఁ
దనువుల్ నాటఁగ నొండు బాణమున దో • ర్దర్పంబు నిండారఁ గాం
చనకేతుం బడవైచి యశ్వములపైఁ • జం బార్చె నంతేవడిన్. ౨౬౨

అర్థములు. సంరంభియై = వేగిరపాటు గలవాఁడై, ఘన = గొప్పదై, దుర్వార=అణఁపరానిదైన, శరోగ్రవృష్టి=భయంకరమైన బాణవర్షము.

తాత్పర్యము

ఇట్లు తన యస్త్రము లన్నియు వ్యర్థములుగాఁగా గర్వించి వేగిరపాటు గలవాఁడై వారింపరాని బాణములను వర్షమువలె రామచంద్రమూర్తి మీఁదను మాతలి మీఁదను గురియించి వారి దేహములు నాటఁజేసి మఱియొక బాణమున బంగారు కేతువుఁ బడఁగొట్టి తేరి గుఱ్ఱముల గర్వం బణఁచెను.

ఉ. వాని యసాధ్య కార్యమును • వాని విజృంభణ రామచంద్రు పె
న్దీనతఁ గాంచి సిద్ధముని • దేవనభశ్చరచారణాదులున్
వానరులున్ విభీషణుఁడు • వారిరి గుందిరి దుఃఖలిప్తులై
మానవభోజియే గెలిచి • మాన్పునొకో జగమంచు నెంచుచున్. ౨౬౩

తాత్పర్యము

రావణుఁడు చేసిన యసాధ్యకార్యము వాని యుద్రేకము రామచంద్ర మూర్తి దైన్యము చూచి సిద్ధులు, మునులు, దేవతలు ఆకాశసంచారులు చారణులు లోనగువారును వానరులు విభీషణుండును మిగుల దుఃఖించి రావణుఁడే గెల్చి లోకమును భస్మము చేయునేమో యని తలఁచుచు.

సీ. రామసుధాంశుండు ♦ రావణరాహుచే, సంగ్రస్తుఁడైన దఃత్తిణమునఁ
శశికిఁ బ్రియంబు ప్రాజా♦పత్య మగు రోహి,ణిని నాక్రమించె నిం♦దుని సుతుండు
ప్రజ కరిష్టంబుగఁ ♦ బ్రజ్వలితాంబుధి, ధూమవృతోర్మికా ♦ స్తోమ మగుచు
గ్రహరాజు నంటెడి♦గతి నుబ్బె సూర్యుండు, నీలవర్ణుండును ♦ నిష్ఠురుండు
తే. ద్యుతివిహీనుండు భీకర♦ధూమకేతు, సక్తుఁడు కబంధలక్షణ♦సంయుతుండు
నగుచుఁ దోఁచెను రావణుఁ♦డాక్రమింప, బాణసంధానశక్తి గో♦ల్పడియెఁ బతికి.

అర్థములు. రామసుధాంశుఁడు = రాముఁ డను చంద్రుఁడు, ఇందుని సుతుఁడు=బుధుఁడు, ప్రాజాపత్యము=ప్రజాపతి దేవతాకము, అరిష్టంబుగన్ = కీడుగా, ప్రజ్వలితాంబుధి=మండుచున్న సముద్రము,ధూమవృతోర్మికాస్తోమము= పొగచేఁ గూడిన యలల సమూహముగలది, గ్రహరాజున్ = సూర్యుని, ద్యుతిహీనుఁడు=కాంతివిహీనుఁడు, భీకర=భయంకరమైన, ధూమకేతుసక్తుఁడు=ధూమకేతులతోఁ గూడినవాఁడు, కబంధలక్షణ సంయుతుఁడు = కబంధ చిహ్నములు గలవాఁడు, బాణసంధానశక్తి = బాణము వింట సంధించు బలము, కోల్పడియెన్ = చెడెను.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యను చంద్రుని రావణుఁ డను రాహువు పట్టఁగా, చంద్రునికిఁ బ్రియమై ప్రజాపతి దేవతగాఁగల రోహిణిని ప్రజలకుఁ గీడుగ బుధుఁ డాక్రమించెను. సముద్రము సలసల గ్రాఁగు నీర్పుగలదై పొగలు వెడలు అలలు గలదై సూర్యునిఁ దాఁకునట్లు పొంగెను. సూర్యుఁడు నీలవర్ణుఁడు, కఠినుఁడు, కాంతిహీనుఁడు, ధూమకేతువులతోఁ గూడినవాఁడు, కబంధ లక్షణము గలవాఁడునై తోఁచెను. రావణుఁడు పరాక్రమింపఁగా రామచంద్రమూర్తి బాణము సంధించుటకు శక్తిగలవాఁడు కాఁడయ్యెను.

తే. కోసలేంద్రులకులతార♦వాసవాగ్ని, దైవతంబు విశాఖను ♦ ధరణితనయుఁ
డటిమె వింశతిభుజుఁడు శ♦రాసకరుఁడు, పంక్తివదనుండు మైనాకు♦పగిది నిలిచె.

తాత్పర్యము

ఇక్ష్వాకుల కులతారయు ఇంద్రాగ్ని దైవతమైన విశాఖను అంగారకుఁ డాక్రమించెను, రావణుఁడు విల్లు చేతగలవాఁడై మైనాకునివలె స్థిరుఁడై నిలిచెను.

—• శ్రీరాముఁడు విజృంభించి రావణుకోలంబుఁ దునియలు వేయుట •—

ఉ. వాని కడిందివీఁక తన•వారల వెల్వెలఁబోఁ గాంచి భూ
జాని సురక్తనేత్రుఁడు రు•షామతియుం భ్రుకుటీర్ధఫాలుఁ డై
వానిని దృష్టిమాత్రమున • భస్మము చేయువిధానఁ జూడఁ గ్రో
ధానను రాముఁజూచి భయ • మందె సమస్తములైన భూతముల్. ౨౩౬౨

అర్థములు. కడిందివీఁక = అసాధ్య పరాక్రమము, భూజాని=రామచంద్ర మూర్తి, సురక్తనేత్రుఁడు=మిగుల నెఱ్ఱనైన కన్నులుగలవాఁడు, రుషామతిన్ = కోపముతోఁడి మనస్సుతో, భ్రుకుటీర్ధఫాలుఁడు=బొమముడిగల నొసలు గలవాఁడు, దృష్టిమాత్రమునన్=చూపులచేతనే.

తాత్పర్యము

రావణుని పరాక్రమము, తనవారి విన్నఁదనము చూచి రామచంద్రమూర్తి కోపముచే నెఱ్ఱని కన్నులు గలవాఁడై కనుబొమలు ముడివడఁ జూపులచేతనే వానిని భస్మముచేయునట్లు చూడఁగా, కోపముతోఁడి ముఖముగల రామచంద్రుని జూచి సమస్తప్రాణులు భయపడెను.

౧౦౪-వ సర్గము.

చ. పుడమి వడంకె, సత్త్వయుత • భూధరముల్ ధరణీరుహాళితో
గడగడలాడె, సాగరుఁడు • గాకుపడెన్, ఖగజాతి మింటిపైఁ
గడుఁ బరుషధ్వనుల్ నెఱపెఁ • గర్కశరావము నించె మేఘముల్
పిడుగులు రాలె, రావణుఁడు • భీతిలెఁ దద్భయదాకృతిం గనన్. ౨౩౬౩

అర్థములు. సత్త్వయుత=జంతువులతోఁగూడిన, భూధరముల్=కొండలు, ధరణీరుహాళితోన్ = చెట్లతో, కాకుపడెన్ = కలఁతచెందెను, కర్కశరావము= కఠోరధ్వని, తత్ భయదాకృతిన్=ఆభయంకరాకారమును, కనన్=చూడఁగా.

తాత్పర్యము

భూమి వడఁకెను. మృగములతోఁ జెట్లతో కొండలు గడగడలాడెను. సముద్రము కలఁతచెందెను. పక్షు లాకాశమునఁ గఠినధ్వనులు నించెను. మేఘములు కఠోరముగ నఱిమెను. పిడుగులు పడెను. ఆ భయంకరాకారముఁ జూచి రావణుఁడు భయపడెను.

శా. కల్పాంతప్రతిమాన భీమతరసం•గ్రామంబుఁ జూడన్ దివిన్
వేల్పుల్ దానవదైత్యసిద్ధఋషులున్ • విద్యాధరుల్ గూడుచో
స్వల్పాన్యప్రియుతన్ రఘూత్తముఁడు గె•ల్వం గోర బృందారకుల్
జల్పింతుర్ దశకంఠుఁడే గెలువ ను•త్సాహంబుమై నాశరుల్. ౨౩౬౪

అర్థములు. కల్పాంత ప్రతిమాన = ప్రలయకాలముతో సమానమైన, భీమతర = మిగుల భయంకరమైన, సంగ్రామంబున్=యుద్ధమును, దివిన్=ఆకాశ

మందు, స్వల్పాన్యా=హెచ్చైన; ప్రియతస్ = ప్రీతిచే, బృందారకుల్ = దేవతలు, ఆశరుల్ = రాక్షసులు.

తాత్పర్యము

ప్రలయ కాలమువలె భయంకరమైన యుద్ధముఁ జూడ నాకాశమందు గుంపుగూడిన దానవులు దైత్యులు ఋషులు విద్యాధరులు-వీరిలో దేవతలు-వారి పక్షము వారత్యంత ప్రీతితో రామచంద్రమూర్తి జయింపవలెనని కోరఁగా, రాక్షసులు- ఆ పక్షమువారు రావణుఁడు జయించును గాక యనుచుండిరి.

సీ. ఈలోన రావణుం ♦ డెనఁగెడి కోపాగ్ని,జానకీవల్లభు ♦ సంహరింప
వజ్రసారము సర్వ♦వైరినిబర్హణం, బతులనాదము పర్వ♦తాగ్రతుల్య
కూటచితంబును ♦ క్రూరంబు దృష్టిభ, యావహంబును సుతీ♦క్ష్ణాగ్ర మధిక
రౌద్రం బనాసాద్య ♦ మద్రిదారణమును, శూలంబు నొక్కటిఁ ♦ గేల బూని
ఆ. మండిపడుచు నార్తి ♦ చండరవంబున, గర్జ సలిపెఁ బృథివి ♦ గగనతలము
దిశలుఁ గోణములును ♦ దిర్దిర దిరుగంగ, జలధి క్షోభ మొంద♦జగము లదర.

అర్థములు. ఎనఁగెడి = అధికమగుచున్న, వజ్రసారము = వజ్రమువంటి సత్తువగలది, సర్వవైరి నిబర్హణంబు=సమస్త శత్రువుల సంహరించునది. అతుల నాదము=అసమానమైన ధ్వని గలది. పర్వతాగ్రతుల్య = శిఖరముతో సమానమైన, కూటచితము = మేకులతోఁగూడినది, దృష్టిభయావహంబు = చూచుటకు భయంకరమైనది, సుతీక్ష్ణాగ్రము = మిగుల కూరిదైన కొనగలది, అనాసాద్యము=పొంకరానిది, అద్రిదారణమును=కొండలనైనఁ జీల్చునది.

తాత్పర్యము

ఈలోపల రావణుఁడు కోపాతిశయమున రామచంద్రుని జంపుటకై వజ్రమువలెదృఢమైసర్వశత్రువులసంహరింపఁగలదై,గొప్పధ్వనిగలదై,శిఖరముతో సమానమైన మేకులుగలదై,క్రూరమై,చూచుటకు భయంకరమై మిగులఁ బదునైన కొన గలదై, మిగుల రౌద్రమై, ప్రాపింపరానిదై, కొండలనైనఁ జీల్చునదియైన యొక శూలమును గట్టిగా ధ్వనించుచుఁ జేతఁదీసికొని మండిపడుచు భూమి ఆకాశము దిక్కులు మూలలు దిర్దిర దిరుగఁగ సముద్రము కలఁతపడ సింహనాదము చేసి.

చ. కరమునఁ బూని రాక్షసని♦కాయము లుబ్బఁగ రామచంద్రునిన్
బరుషవచస్కుఁడై యనియెఁ ♦ బార్థివనందన! వజ్రసారమై
పరఁగెడిసాధనం బిదియు ♦ భ్రాతృసహాయుని నిన్నుఁ ద్రుంచి సం
గరహతరాక్షసావళులఁ ♦ గావఁగఁ బంచెడిఁ దోడుగూడఁగన్. ౨౩౪౦

తాత్పర్యము

చేతధరించి రాక్షససమూహములు సంతోషించుచుండఁగా రామచంద్రమూర్తిని జూచి కఠినవాక్కుల నిట్లనియె. రాజకుమారా ! వజ్రమువలె దృఢమై

రొప్పుచున్న యీ యాయుధము తమ్ముఁడు తోడుగాఁగల నిన్నుఁజంపి యుద్ధమందు చచ్చిన రాక్షసులకుఁ దోడుగాఁ బంపఁగలదు.

చ. నిలు నిలుమీ నిమేష మిఁక • నీల్గితి వంచును వీచి వైచినన్
గలితమహాష్టఘంట మయి • గ్రాయుచుఁ జంచల లభ్రవీథి రా
జిలఁజవిలోచనుండు దృఢ • సారశరంబులఁ గల్పవహ్ని పై
జలములు చల్లినట్లు రథ • సంబున వైచిన వాని నన్నిటిన్. ౨౩౬౧

అర్థములు. కలితమహాష్టఘంటము = ఎనిమిది ఘంటలతోఁ గూడినది, చంచలలు = మెఱుపులు, అభ్రవీథిన్ = ఆకాశమందు, గ్రాయు = ఉమియు, కల్పవహ్నిపైన్=ప్రలయకాలాగ్ని మీఁద.

తాత్పర్యము

ఒక్క నిమిషము నిలుము చచ్చెదవని త్రిప్పివేయఁగా నెనిమిది గంటలు గలదై మెఱుఁగులు గ్రక్కుచు నాకాశమునరాఁగా రామచంద్రమూర్తి బలమైన బాణములను వేయఁగా నవి ప్రలయకాలాగ్ని మీఁద నీళ్ళు ప్రోక్షించి నట్లులై వాని నన్నిటిని.

కం. దహనుఁడు మిణుతలపింఛము,దహియించినమాడ్కిఁ గూల్చి•తనపై రాఁగన్
మహిపతితనయుఁడు గని దు, స్సహశక్రప్రేషితోరు•శక్తిన్ వైచెన్. ౨౩౬౨

అర్థములు. దుస్సహ = సహింపరాని, శక్రప్రేషిత = ఇంద్రునిచేఁ బంపఁబడిన, ఉరుశక్తిన్ = గొప్ప శక్తిని.

తాత్పర్యము

అగ్ని మిణుతలగుంపుల గాల్చినట్లు గాలిచి మీఁదికిరాఁగా నింద్రుఁడు పంపిన శక్తిని దానిపై వైచెను.

ఉ. మాతలి తెచ్చినట్టి బల • మర్దనశక్తియు ఘంటికారవం
బాతతభంగిఁ బర్వఁ జని • యాశరుశక్తిని దాఁక నద్దియున్
ద్మ్మాతలమందుఁ గూలె జవ • సత్త్వ మఱిన్ శకలీకృతంబు నై
భూతము లార్వ వానరులు • బొబ్బలు పెట్టఁగ వేల్పు లుబ్బఁగన్. ౨౩౬౩

తాత్పర్యము

మాతలి తెచ్చిన యింద్రశక్తియు ఘంటలధ్వనితోడఁ బోయి రాక్షసశక్తిని దాఁకఁగా నది జవబలములు క్షీణించి నేలఁగూలెను. ప్రాణు లఱచెను. వానరులు బొబ్బలు పెట్టిరి. దేవతలు సంతోషించిరి.

ఉ. రాఘవుఁ డంతఁ బోక ఖల • రావణు తేరిగుఱ్ఱాలఁ దీక్ష్ణ భా
సౌఘములన్ జవం బడఁగ • నాశుగతిన్ ఘటియించి నిస్తులా
మోఘశరాళి దైత్యుసుర • ముం బగిలించి ఖగత్రికంబునన్
లాఘవ మొప్ప నాతని ల • లాటము బ్రద్దలు వాఱఁ జేసినన్. ౨౩౬౪

అర్థములు. ఖగ త్రికంబునన్=మూఁడు బాణములచే.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యంతతో వదలక రావణునిశేరి గుఱ్ఱములను వాని వేగమడఁగునట్లు బాణములచేఁ గొట్టి, యమోఘ బాణములచే రావణు వక్షము పగిలించి మూఁడు బాణములచే వాని నొసలు బ్రద్దలగునట్లు కొట్టెను.

తే. భిన్నగాత్రుండు రక్తసం•క్లిన్నతనుఁడు,నగుచుఁబూచు నశోకంబు•జిగివహించి
బాణవేదన సైరింప•వశము గాక, దుఃఖసంతప్తుడై యుండె.• దురమునందు.

అర్థములు. భిన్నగాత్రుఁడు=భేదింపఁబడిన దేహము గలవాఁడు, రక్త సంక్లిన్నతనుఁడు = నెత్తుటఁ దడిసిన దేహము గలవాఁడు, జిగి = కాంతి, దురము నందు=యుద్ధమందు.

తాత్పర్యము

చీల్పఁబడి నెత్తుటఁ దడిసిన దేహము గలవాఁడై పూచిన యశోకము కాంతి గలవాఁడై బాణములవలని బాధ సహింపలేక యుద్ధభూమియందు మిగుల దుఃఖముచే సంతపించెను.

—• ౧౦౫-వ సర్గము. శ్రీరాముఁడు రావణు నిందించుట •—

కం. ముచ్చిరి వెంటనె రోషము, హెచ్చఁగ దశకంధరుం డ•హీనజవుం డై
చిచ్చఱములుకుల రఘుపతిఁ,జుచ్చుఱుకున మొగులు కొలఁకు•సొబగున నించెన్.

అర్థములు. ముచ్చిరి=శోకించి, అహీనజవుండై = మిగుల వేగము గలవాఁడై, చిచ్చఱములుకులన్ = అగ్నిని లక్ష్యము సేయని బాణముల, చిచ్చఱ, చిచ్చఱ, చుచ్చుఱుకున = మిగుల చుఱుకున, చుఱుకు+చుఱుకు, చుచ్చుఱుకు, మొగులు=మేఘము, కొలఁకు సొబగునన్=కొలని వలె.

తాత్పర్యము

ఈప్రకారము శోకించి వెంటనే రోషము హెచ్చఁగఁ దెచ్చుకొని మిగుల వేగముతో రావణుఁడు అగ్నివంటి బాణములచే రాముని కొలనిని మేఘమువలె నించెను.

చ. ఘనశరపూరితాంగుఁ డయి • కంపము నొందక తచ్ఛరంబులన్
దినకరభానుతుల్యము ల • దేవపథంబునయంద త్రుంచుచున్
జెనఁగుచు దద్విముక్తశిత • భీకరకాండపరంపరాహతిం
దను వెలవాఱ రాజిలి వ • సస్థితపుష్పితకింశుకం బనన్. ౨౩౭౭

అర్థములు. ఘనశరపూరితాంగుఁడయి = గొప్ప బాణములచే నిండిన దేహము గలవాఁడై,దినకరభాను తుల్యములన్=సూర్యకిరణములకు సమానమైన వానిని, దేవపథంబున యంద = ఆకాశమునందే, తత్=రావణునిచే, విముక్త =

విడువఁబడిన, శిత=వాఁడియగు, భీకర=భయంకరమైన, కాండపరంపరాహతిన్ = బాణపరంపరల దెబ్బచే, తనువు = దేహము, ఎఱవాఱ=ఎఱ్ఱన కాఁగా, వనస్థిత= అడవియందుండు, పుష్పిత=పూచిన, కింశుకము=మోదుగుచెట్టు.

తాత్పర్యము

గొప్ప బాణములచే నిండిన దేహము గలవాఁడై రామచంద్రమూర్తి చలింపక సూర్యకిరణములవంటి ఘోర బాణములను ఆకాశమందే ఖండించుచు యుద్ధము చేయుచు వాఁడు వేసిన బాణపరంపరల దెబ్బచే దేహము అడవియందలి పూచిన మోదుగువలె నెఱ్ఱనై.

మ. ప్రళయాదిత్యునిఁ బోలి రాఘవుఁడు క్రూ ♦ రస్ఫూర్జనారాచధా
రల రక్షోవిభుఁబింక మాఱ భుజశౌ ♦ ర్యస్థైర్యముల్ మాన్చ్పవన్
బలియుం డాతఁడు వీఁపుఁజూప కురిసెన్ ♦ బాణాలి నన్యోన్యచా
పలతాముక్తకలంబసంతతికృత ♦ ధ్వాంతంబు నీరంధ్రమై ౩౬౮

అర్థములు. వీఁపుఁజూప = వెనుదీయక, అన్యోన్య = పరస్పరము, చాపలతా=తీఁగవంటి వింటి యస్త్రాలటిచే, ముక్త = విడువఁబడిన, కలంబ సంతతిన్ = బాణ సమూహముచే, కృత = చేయఁబడిన, ధ్వాంతంబు = చీఁకటి, నీరంధ్రమై= ఎడము లేనిదై, నీరంధ్రమై ధ్వాంతము కనులం గప్పిన వని యన్వయక్రమము, నిర్ + రంధ్రము=రంధ్రము లేనిది.

తాత్పర్యము

ప్రళయకాలమందలి సూర్యునివలె రామచంద్రమూర్తి క్రూరములైన బాణములధారలచే రావణుని పౌరుషము చెడునట్లు భుజబలము శౌర్యము స్థైర్యము మానునట్లుగా బలవంతుఁడగు నా దుష్టుఁడు వెనుదీయక బాణములు కురిసెను. సందు లేకుండునట్లొకరిపై నొకరు వేసిన బాణసమూహములచేఁ గలిగిన చీఁకట్లు.

మ. కనులం గప్పినఁ దోఁపరైరి కవరిక ♦ కాలంబునన్ రాముఁ డి
ట్లనుఁ జిర్ణమ్మున రోషవాక్యముల తోం ♦ తా ! నీవు నా లేనిచో
మును నా భార్యను బాలికన్ వివశనున్ ♦ మూఢాత్ముఁడా ! యాగతిం
గొని తెచ్చిన్ మది నిక్కి పొంగెద వకీ ♦ కూళిండ వీరుండవే ? ౩౬౯

అర్థములు. తోఁపరైరి = రామరావణులు కనఁబడరైరి.

తాత్పర్యము స్పష్టము.

కం. క్రూరా ! మద్విరహిత వెతఁ, గూర వనీస్థలిని సీతఁ ♦ గోమలిని బలా
త్కారంబున హరియించియు, వీరుఁడ ననుకొనియెదే వి♦వేకవిహీనా! ౩౭౦

అర్థములు. మద్విరహిత = నేను వదలియుండిన దానిని.

తాత్పర్యము స్పష్టము.

కం. శూరుఁడ వనాథసతులన్, ధీరత ముచ్చిల్లఁ బరస•తీకాముకుఁడా!
చోరునిగతిఁ గృతి సల్పియు, వీరుఁడ ననుకొనెదవా వి•వేకవిహీనా! ౨౩౮౧

అర్థములు. అనాథసతులన్=రక్షకులు లేని స్త్రీలను, ముచ్చిల్లన్=దొంగిలింప, పరసతీకాముకుఁడా=ఇతరుల భార్యలయందు కామము గలవాఁడా!

తాత్పర్యము స్పష్టము.

కం. దూరీకృతమర్యాదా, హ్రీరహితా! సాధుమార్గ•హీనా! బలిమిన్
జేరిచి చేరువ మృత్యువు, వీరుఁడ ననుకొనెదవా వి•వేకవిహీనా! ౨౩౮౨

అర్థములు. దూరీకృత మర్యాదా=దూరముగాఁ జేయఁబడిన మర్యాద గలవాఁడా!- మర్యాదాహీనుఁడా!, హ్రీరహితా = సిగ్గులేనివాఁడా, చేరువన్= సమీపమందు.

తాత్పర్యము స్పష్టము.

కం. పుట్టి కుబేరునకు దోఁ,బుట్టువవై బలము గలిగి • పోఁటుమగఁడవై
దిట్టా! జగములు మెచ్చెడు, నట్టిమహాకృతిని జల్పి•తివు దురాత్మా! ౨౩౮౩

అర్థములు. పోటుమగఁడవై=శూరుఁడవై.

తాత్పర్యము స్పష్టము.

కం. అడిగొట్టవగుచు లోకము, చెడఁదిట్టెడి నీచకృతిని • జేసితి విస్సీ
కుడువుము తత్ఫల మిప్పుడు, వెడఁగా! దురితంబు నేల•వృథగా జను నే? ౨౩౮౪

అర్థములు. అడిగొట్టు=కుత్సితుఁడు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. సిగ్గును నీకు లే దటర • సీతను జోరునిఁబోలె దుర్మతీ
యగ్గహనంబునన్ బలిమి • నట్లు హరించియు నీవె శూరుఁడం
చెగ్గతి నెంచెదో? యపుడ • యే నట నుండఁగ సీతఁ దాఁకినన్
నిగ్గులు దేఱుబాణముల • నీ యనుజున్ ఖరుఁ గూర్చునే నినున్. ౨౩౮౫

అర్థములు. అగ్గహనంబునన్=ఆ యడవియందు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఎంతటిభాగ్యమో చెనఁటి • యిన్నిదినాలకు నిన్నుఁ గంటి ని
న్నంతకుఁ జేరఁ బుత్తు నిఁబు•మా యిపుడే మణికుండలప్రభా
వంతము శీర్షముం బలల•భక్షకపక్షులు లాగి లాగి యిం
తింతలు చేసి మెక్కుఁ బరి•హృష్టములై తనివార నిర్యోడన్. ౨౩౮౬

అర్థములు. చెనఁటి = దుష్టుఁడా, అంతకున్ = యముని. పలలభక్షక పక్షులు = మాంసముతిను పక్షులు, పరిహృష్టములై = మిగుల సంతోషించినవై, తనివారన్=తృప్తికలుగఁగా.

తాత్పర్యము స్పష్టము.

కం. నేలపయి నానావిధముల, వ్రీలిపడిన నీ యురంబు ♦ గృధ్రంబులు చం
చ్వాళిం జీల్చుచు క్షతజము, హాళిం బానంబు సేయు ♦ నాపోశచనన్. ౨౩౮౭

అర్థములు. చంచు+ఆళిన్ = ముక్కుల వరుసలచే, క్షతజము = నెత్తురు, ఆపోశచనన్=తృప్తికలుగఁగా.

తాత్పర్యము స్పష్టము.

కం. మన్నిశితకాండచయని, ర్భిన్నాంత్రంబులఁ బతంగ ♦ బృందము లిపుడే
పన్నగుల వైనతేయుని, చెన్నునఁ బడవైచు బ్రదుకఁ♦జెల్లదు నీకున్. ౨౩౮౮

అర్థములు. మత్=నాయొక్క, నిశిత = పదునైన, కాండచయ = బాణసమూహములచే, నిర్భిన్న = భేదింపఁబడిన, అంత్రంబులన్ = ప్రేగులను, పతంగబృందములు=పక్షుల గుంపులు, పన్నగులన్=పాములను, వైనతేయుని చెన్నున= గరుడునివలె.

తాత్పర్యము

నా వాఁడి బాణములచేఁ జీల్పఁబడిన ప్రేగులను పక్షు లిప్పుడే పాములను గరుత్మంతుఁడువలెఁ బడవైచును. ఇఁక నీవు బ్రతుకఁదగవు.

—♦ రావణు రథంబును సారథి మరలించుట —♦

చ. అని ప్రతిపక్షఘాతమున ♦ కై ద్విగుణీకృతవీర్యముద్బలుం
డును బరమాస్త్రశక్తియును ♦ నూత్నసముత్సుకుఁడై సమస్తసా
ధనముల లోఁ దలంచుటయుఁ ♦ దత్క్షణ మస్త్రము లన్ని మ్రోల ని
ల్చినఁ గని తీవ్రవేగుఁ డయి ♦ చిత్తమునన్ శుభచిహ్న లన్నియున్. ౨౩౮౯

అర్థములు. ప్రతిపక్షఘాతమునకై = విరోధిని జంపుటకై, ద్విగుణీకృత= రెండంతలుగా చేయఁబడిన, వీర్య + ముత్ +బలుండు = వీర్యము, సంతోషము, బలము గలవాఁడై, పరమాస్త్రశక్తియును = గొప్ప యస్త్రముల శక్తియు గలవాఁడై, నూత్నసముత్సుకుఁడై =క్రొత్త ప్రయత్నము గలవాఁడై.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి రావణుఁ జంపుటకై రెట్టించిన వీర్యము, సంతోషము, బలము, మహాస్త్రశక్తి, నూతనప్రయత్నము గలవాఁడై, అన్ని యస్త్రంబులను మనస్సులోఁ దలఁచఁగా నన్నియు వచ్చి యెదుట నిలువఁగా తీవ్రవేగము గలవాఁడై శుభచిహ్నములు.

చ. గెలు పెఱిఁగింపఁ బొంగుచుఁ బ్ర ♦ కృష్టశరంబుల నొంప వాఁడు కీ
శుల యుపలంబులున్ మనుజ ♦ శూరుశరంబులు దాఁకి గుండియల్
గులగులగాఁగ నోటఁజెడె ♦ గ్రుక్కలు మ్రింగ నలంగెఁ దేజమున్
గళవళపాటు చెందె మదిఁ ♦ గాతరతన్ వహియించె డీల్పడెన్. ౨౩౯౦

అర్థములు. ప్రకృష్ట శరంబులన్ = శ్రేష్టములైన బాణములచే, నొంపన్ = నొప్పింపఁగా, ఉపలంబులు = రాలు, ఇదివఱకే వానరులు రాలదెబ్బలచే నలఁగిన గుండెలు రామబాణములచే గుళుగుల యయ్యెనని భావము ఇట్లు రెండిచ్చటఁ జెప్పుటచే నిప్పుడు వానరులు కొట్టిరని తలఁపరాదు, గులగుల గాఁగన్ = చూర్ణము గాఁగ, ఓటతిరొనన్ = బలహీనుఁడయ్యెను. తేజఱన్ = కాంతి మాయఁగా, కాతరతన్ = భయమును, డీల్పడెన్ = డిల్లపోయెను.

తాత్పర్యము

జయము దెలుపఁగాఁ బొంగుచు శ్రేష్ఠము లయిన బాణములచే నొప్పింపఁగా వాఁడు ఇంతకుముందు తగిలిన వానరుల రాల దెబ్బలచేతను ఇప్పుడు దాఁకు రామ బాణములచేతను గుండెలు పొడిపొడి గాఁగా బలహీనుఁడై, గుటకలు మ్రింగుచు నలఁగి కాంతి మాసి కలఁతచెంది భయపడి డిల్లపోయెను.

ఉ. చాపముఁ బట్టలేఁడు శరసంతతిఁ గూర్పఁగ లేఁడు జ్యాలతన్
 గోపునఁ గట్టలేఁడు ప్రతికూలశరంబులఁ ద్రుంపలేఁడు మే
 పైపయి దూఁకు బాణములపై నిగిడించు పృషత్కసంఘ మే
 దో పెరమార్గముం గొనెడిఁ దోఁప దొకింతయు దేహవిస్మృతిన్. ౨౯౯౧

అర్థములు. కోపున = కొప్పున, వింటికొనయందు, ప్రతికూలశరంబులన్ = ఎదురువచ్చు బాణములకు, పృషత్కసంఘము = బాణసమూహము, పరమార్గము = వేఱుమార్గము, దేహవిస్మృతిన్ = మైమఱపుచే.

తాత్పర్యము

చేత విల్లు గట్టిగాఁ బట్టలేఁడు. ఎట్లెట్లో పట్టుకొనినను బాణములు సంధింప లేఁడు. అల్లెత్రాఁ డెక్కుపెట్టలేఁడు. ఎదురుగా వచ్చు బాణములను గొట్టలేఁడు. మీఁదమీఁద దూఁకుచున్న బాణములపైఁ దాను వేయు బాణములు తానొక్క ప్రక్కగా వేసినవవి వేఱొక మార్గమునఁ బోవుచుండెను. మైమఱపుచే వాని కేదియుఁ దోఁచినదికాదు.

తే. కాలునకు గోచరించిన కరణి నున్న, రథికుగతిఁ జూచి సారథి రణధరిత్రి
 దైత్యవరుఁడున్నఁ జచ్చుటపత్యమనుచు, నెందివెల్లఁగనఁదోలఁగించెరథము

అర్థములు. కాలునకున్ = మృత్యుదేవతకు, గోచరించినకరణిన్ = కనఁబడినట్లు.

తాత్పర్యము

మృత్యుదేవతకుఁ గనఁబడి చావ సిద్ధముగా నున్న వానివలె నుండు రథికుఁ డగు రావణుస్థితిఁ జూచి వీఁడిప్పుడీ యుద్ధభూమియం దుండినఁ జచ్చుట నిజమని దూరముగా రథమును దీసికొనిపోయెను.

—• ౧౦౬-వ సర్గము. రావణుఁడు సారథిని దూషించుట •—

చ. అనికిఁ దొలంగ దవ్వుగ శ • తాంగముఁ దెచ్చినసూతుఁ జూచి యి
ట్లనియెఁ గృతాంతచోదితసు • రాహితుఁ డాగ్రహరక్తనేత్రుఁడై
వివర యశక్తువట్లు బల • విక్రమపౌరుషహీనుమాడ్కి భీ
రునిగతి మానహీనువలె • రోషవివర్జితుపోల్కి దుర్మతీ ! ౩౯౬౩

అర్థములు. అనికి౯ = యుద్ధమునుండి, పంచమ్యర్థమున సప్తమి — కృతాంతచోదిత = యమునిచేఁ బ్రేరేపింపఁబడిన, సురాహితుఁడు = రాక్షసుఁడు, ఆగ్రహరక్తనేత్రుఁడై = కోపముచే నెఱ్ఱవాఱిన కన్నులుగలవాఁడై, భీరునిగతి౯ = పిఱికివానివలె, రోషవివర్జితుపోల్కి౯ = రోషముచే విడువఁబడినవానివలె.

తాత్పర్యము

యుద్ధభూమినుండి తొలగించి దూరముగ రథమును దోలికొని వచ్చిన సారథిని జూచి రావణుఁడు మృత్యుప్రేరితుఁడై కన్నులెఱ్ఱజేసి కోపించి యిట్లనియె. ఏమిర శక్తిలేనివానివలె, బలము పరాక్రమము పౌరుషము లేనివానివలె, పిఱికివానివలె, మానహీనునివలె, రోషము లేనివానివలె, బుద్ధి లేనివాఁడా!

ఉ. ఏమిటికి రథంబు నిపు • డీపటుఁ దెచ్చితి శత్రుసన్నిధి౯
నామదిచొప్పెఱుంగక య • నాదరబుద్ధిని నిచ్చవచ్చిన
ట్లేమయి పోయె శస్త్రతతు • లేమయిపోయెర నాదుమాయ లి
స్సీ మరియాద దప్పి చెనఁ • టీ పరువంతయుఁ బాడుచేసితే. ౩౯౬౪

తాత్పర్యము

నా మనస్సిని యెఱుంగక నాయం దాదరబుద్ధి లేక నీ యిష్టమువచ్చినట్లు ఏల యీ రథమును నిప్పు డిచ్చటికి శత్రువు చూచుచుండఁగాఁ దెచ్చితివి? నేనిట్లు వచ్చునంత గతి యేమిరా? వచ్చెను. యుద్ధముచేయుటకు నా యస్త్రములన్నియు నేమై పోయెనురా? నామాయ లేమాయెనురా? దుష్టుఁడా! మరియాదదప్పి నాగౌరవము నాశము చేసితివా ?

కం. చిరకాల సమార్జితమై, పరఁగిన నా యశము తేజ • బలములు నీచా !
దురమున వెనుదీయం డా, శరపతి యను నమ్మకంబు • సమసెను నీచే౯ ౩౯౬౫

అర్థములు. చిరకాలసమార్జితమై = ఎంతో దీర్ఘకాలముగ నేను సంపాదించిన.

తాత్పర్యము

ఎంతకాలముగానో నేను సంపాదించిన కీర్తి తేజస్సు బలము యుద్ధమునందు రావణుఁడు వెనుదీయఁడను పేరు నీచుఁడా ! నీచే నాశమయ్యెను.

కం. భువనప్రసిద్ధవీర్యుం, డవిరళబలరంజనీయుఁ • డరి కనుచుండ౯
బవరమున కానపడు నా,బవి నార్చితె దేబెథంగి • బాపాత్మకుఁడా! ౩౯౬౬

అర్థములు. అవిరళబలరంజనీయుఁడు = అధిక మగు బలముచే రంజింపఁ జేయఁదగినవాఁడు, అరి=పగవాఁడు, బవరమునకు = యుద్ధమునకు, బవిసి + ఆర్పితే=సిగ్గుదీసితివిక దా, దీనభంగి=దీనునివలె.

తాత్పర్యము

జగత్ప్రసిద్ధమైన వీర్యము కలవాఁడు అధికబలముచే సంతోషింపఁజేయఁదగినవాఁడు నగు శత్రువు చూచుచుండఁగా యుద్ధమునం దాసక్తిగల నాసిగ్గును దీనుని వలె నాశము చేసితివిగదా. ఒకసారి పరువెత్తి చాటుగవచ్చి మరల నే నేమి శూరుఁడనని నాయన కెదురుగఁ బోదును. చూచినవారైన నవ్వరా ?

సీ. పరుని పై రథమును ♦ బఱపక మూలకు, నిటు తెచ్చితివె దేహ♦మెఱుఁగ లేక నామేలు కోరెడు♦నా సుహృదుండ విటు, సలుపునా యొప్పుడైనఁ♦బలువ కూళ? పగతుండు సలుపంగఁ ♦ దగుకార్య మిదిగాక, నీయట్టివానికి ♦ నీతి యగునె? నీ విట్లు సేయుట ♦ నిక్కంబు పరులచే, నేదియో మే లొంది ♦ తీవు దుష్ట

ఆ. నాదుసొమ్ము బహుది♦నంబుల నుండియుఁ, దినుట మఱవ వేని ♦ దీర్ఘ కాల మీవు నన్నుఁగొలిచి♦యొసఁగుట తలఁ తేని,రథముఁబఱపు మతఁడు♦రాకమున్న.

అర్థములు. సుహృదుఁడు=మిత్రుఁడు, పగతుఁడు = విరోధి.

తాత్పర్యము

యుద్ధము చేయునపుడు పగవాని మీఁదికి రథముఁ దోలుటకు మాఱుగ నీకు దేహము తెలియక మదించి యీ మూలకుఁ దెత్తువా ? ఇక్కడ నేమున్నదని తెచ్చితివి? నా మేలుకోరు నా మిత్రుఁ డెప్పుడైన నీచుఁడా! యిట్లు చేయునా?నీవు చేసినపని శత్రువు చేయఁదగినది కాని నీవంటి వానికి నీతియైనదా ? అయినను దుష్టా! నీ విట్లు చేయుటచేఁ బగవానిచేత నేదో లాభము పొంది యుండవలెను.నీవు నా సొమ్మనేక దినములుగ దినుట మఱచినవాఁడవు కావేని, చిరకాలముగ నీవు నా కొలువునందుండి వృద్ధికి వచ్చుట తలఁచెద వేని శత్రు విచ్చటికిఁ దఱుముకొని రాకముందే యతని యెదుటికిఁ దేరు పోనిమ్ము.

—♦ సారథి రావణునకు సమాధానము చెప్పుట ♦—

కం. మతిమాలిన యసురేశుఁడు, హితమతి యగు తనదుసూతు ♦ నిటు నిష్ఠురభాషితముల నన నాతఁడుకడు,హితముగ సానునయసూక్తి♦నీగతిఁబలికెన్. ౨౩౯౦

అర్థములు. మతిమాలిన=బుద్ధిలేని, నిష్ఠురభాషితములన్ = పరుషవాక్యముల, సానునయసూక్తి=ఓదార్పుతోఁ గూడిన మంచి మాటలచే.

తాత్పర్యము

సారథి తనకు మేలుచేసెనా కీడుచేసెనా యని యాలోచించు శక్తియు లేని రావణుఁడు తనమేలుగోరు తనసారథి నట్లు పరుషముగఁ బలుకఁగా నా సారథి మిగుల హితముగ నూరార్చు మాటలచే నిట్లు చెప్పెను.

చ. వెఱచినవాఁడఁ గాను, మఱి • వెంబరవిత్తను గాను, మార్తుచే
నెఱి చెఱి కానుక ల్గొనిన•నీతివిహీనుఁడఁ గాను నేను మై
మఱచినవాఁడఁ గాను, గొఱ•మాలినవాఁడను గాను, నీదుమేల్
మఱచినవాఁడఁ గాను, వినుఁ•మా చెలికారము మాన నే నెదన్. ౨౩౯

అర్థములు. వెంబరవిత్తను=దుష్టాగ్రేసరుఁడను, మార్త = శత్రునిచేత, నెఱిచెఱి=నీతిమాలి, కొఱమాలిన వాఁడను=ప్రయోజన హీనుఁడను, చెలికారము = స్నేహము.

తాత్పర్యము

నేను భయపడినవాఁడనుగాను. దుష్టాగ్రేసరుఁడనుగాను. పగవానిచే లంచము గొన్న నీతిమాలిన నీచుఁడనుగాను. నేను దేహమును మఱచినవాఁడనుగాను. నిష్ప్రయోజకుఁడనుగాను. నీవు చేసిన మేలు మఱచినవాఁడనుగాను. నీయందు స్నేహభావము వదలినవాఁడఁగాను.

కం. నీ కల్యాణమె కోరుదు, నీకీర్తిం గాచువాఁడ • స్నేహవశమునన్
నీ కేను బ్రియము సేయఁగ, నీకది యప్రియము దోఁచె•నే నేమందున్. ౨౪౦

తాత్పర్యము

నీ శుభముఁగోరి నీ కీర్తి రక్షించువాఁడను. స్నేహకారణమున నీకు నేను మేలు చేయఁగా నీకది కీడుగాఁ దోఁచెను. దానికి నే నేమి చెప్పఁగలను ?

సీ. ఈవిషయంబున • దేవ! నానుడి విను, తావకప్రియహితా•త్మకుఁడ నేను
నేదియో కులమునఁ • బ్రాదుర్భవించిన, యులుచయేతరిపోలెఁ • దలఁప వలదు
నన్ను నున్నతభూమి • నున్న వాహినిఁ గ్రిందఁ, దెచ్చినగతి నీదు•తేరి నిప్పు
డనిలోన మరలించి•నట్టివిధంబును, సర్వంబు వినిపింతుఁ • జక్క వినుము
ఆ. బవరమునను మిగుల•బడలిక గని తని, గలివి లేమి మోము•తెలివి లేమిఁ
దలఁచినాఁడ గుఱ్ఱ•ములు సుడివడి డస్సి, డీలువడుదుఁ జెమట • జాలువాఱ.

అర్థములు. తావకప్రియహితాత్మకుఁడను = నీకుఁ బ్రియము హితము చేయువలయునను మనస్సు గలవాఁడను, ఏదియో కులమున=పేరు చెప్పరాని నీచ కులమున. ప్రాదుర్భవించిన = పుట్టిన, ఉలుచయేతరి పోలెన్ = చపలచిత్తుఁడగు దుర్నీతిపరునివలె, గలివి=తేట.

తాత్పర్యము

ఏల నేను దేరి నిచ్చటికిఁ దెచ్చితినో యా విషయము చెప్పెదను. నా మాటలు వినుము. నేను నీ మేలు సంతోషము కోరువాఁడను. నేను ఏదియో నీచ కులమం దెవనికో పుట్టిన చపలచిత్తుఁడగు నీతిమాలినవాఁడని తలఁప వలదు. మిట్టనున్న నీళ్ళు పల్లమునకుఁ దెచ్చినట్లు నీ రథమును నేనేల తెచ్చితినో యాకారణము పూర్ణముగఁ జెప్పెద వినుము. నీ ముఖము తేటగాలేని దయ్యెను.నీ దేహమే

నీకుఁ దెలియదయ్యెను. నీ బాణము లెట్లు పోవుచుండెనో నీకుఁ దెలియలేదు. ఈ కారణములచే నీవు యుద్ధమునఁ జాల బడలినాఁడ వని తలఁచితిని. నీ గతి యట్లుండ గుఱ్ఱములు దస్సి కలవరపడి డిల్లపోయి చెమటలు గాఱుచుండఁగా.

తే. అధికవృష్టిని మేద్పడు • నాలనంగఁ, గోఁచె; నన్నియు శకునముల్ • కుష్టఫలము
లన్ని యగవడె; నిట్టిచో • నసురనాథ!, సూతునకు నర్హకృత్యంబు • రీతి వినుము.

అర్థములు. అధికవృష్టిని = పెద్ద జడివానచే, మేద్పడు = అజ్ఞతనొందిన, ఆలు = గోవులు.

తాత్పర్యము

జడివానకు గోవులు దిగ్భ్రమ నొందునట్టులయ్యెను. ఇదియును గాక నీకుఁగీడు తెలుపు చెడు శకునములు గానవచ్చెను. ఇట్టి సందర్భములందు సారథి చేయఁదగిన కార్యము చెప్పెద వినుము.

సీ. దేశకాలంబుల • తెఱఁగు లెఱుంగుచు, నశుభశుభాంకంబు • లరసి కొనుచు
రథికునిముఖమునఁ • గ్రాలెడి దైన్యంబు, ఖేదంబు తెంపును • మోద మెఱిఁగి
రాజబలాబల • తేజంబు లరయుచుఁ, బల్లంబు మిట్టల • భంగిఁ గనుచు
సమవిషమస్థలీ • క్రమము లూహించుచు, సమరకాలంబును • జక్కఁ దెలిసి
తే. పగులరంధ్రంబు వెదకుచుఁ • బగతునకును, బ్రక్క నెదురుగఁ బిఱుదికిఁ • బఱచు వేళ
లిన్ని కనిపెట్టి రథికున • కే విపత్తు, రాకయుండఁగఁ జేత సా • రథికిఁ దగవు.

అర్థములు. అశుభశుభాంకంబులు = కీడు మేలు దెలుపు చిహ్నములు, సమ = చదరము, విషమ = గుంత మిట్టగానుండు, స్థలీక్రమము = నేల విధము, రంధ్రంబులు=దోషములు.

తాత్పర్యము

సారథి యగువాఁడు యుద్ధప్రదేశము ప్రతికూలమైనదా యనుకూలమైనదా? కాలము నెట్టులో యెఱుఁగవలెను. శకునము లనుకూలములా ప్రతికూలములా? రథికుని ముఖము త్సాహములేక దుఃఖవంతమై యున్నదా లేక సంతోషము తెంపుగలదై యున్నదా? రాజు బలవంతుఁడై యున్నాఁడా, బలహీనుఁడై యున్నాడా? తేజమెట్టు లున్నది విచారింపవలెను. రథము దోలునపుడు గుంతలు మిట్టలు చూచితోలవలెను యుద్ధభూమి చదరముగా నున్నదా హెచ్చుతగ్గులుగా నున్నదా, కాలము నట్లే యుద్ధమునకుఁ దగినది యగునా కాదా తెలియవలెను. గట్టిగాఁ గొట్టుటకై శత్రువు లందు లోపము లేవియున్నవో వెదకవలయును. శత్రువునకుఁ దే రెప్పు డెదురుగా సమీపమునకుఁ బోనీయవలె, ఎప్పుడు ప్రక్కగాఁ బోనీయవలె, ఎప్పుడు దూరముగ వెనుకకుఁ బోవలె? ఇవి యన్నియుఁ గనిపెట్టి రథికునకు తన లోపమువలన నేవిపత్తు రాకయుండఁ జూడవలయును. ఇది సారథి కృత్యము.

ఉ. వాజుల గాసి దీఱఁగ, భ•వచ్ఛ్రమముం దొలఁగింప, నీదు ని
స్తేజత ఖేదముం దొలఁగఁ • జేసితిఁ గాని స్వతంత్రవృత్తి నో
రాజ! యొనర్ప లేదు, పతి • రాగపరీతుఁడ, నమ్ము మింక నే
యోజ నొనర్పు మన్న నటు•లొప్పఁగఁ జేసెద రాక్షసేశ్వరా! ౨౮౦౪

తాత్పర్యము

గుఱ్ఱముల బడలిక దీరుటకును నీగాసి తొలఁగుటకును నీ ఖేదము, కాంతి హీనత మానుపుటకును నేను దేరిచ్చటికిఁ దెచ్చితినిగాని నా యిష్టము వచ్చినట్లు స్వతంత్రించి నిష్కారణముగఁ దెచ్చినవాఁడఁ గాను. రాజా! ప్రభువునం దనురాగము గలవాఁడను. నా మాట నమ్ముము. ఇఁక నీ వెట్లు చేయుమనిన నట్లు చేసెదను.

కం. తీరుపఁగా నీదుఋణం, బేరీతి ఘటింపు మన్న • నే గడఁగెద నా
సారథివాక్యంబుల వే,సారులు మెచ్చుచును రాక్షస•ప్రభు వనియెన్. ౨౮౦౫

తాత్పర్యము స్పష్టము.

కం. పోనిమ్ము స్యందనము నీ, తానాథున కభిముఖముగఁ•నడయకుమీ ర
క్షోనాథుఁ డహితునసుఱున్,మానుపకే దవ్వునుండి•మరలఁడు వింటే. ౨౮౦౬

తాత్పర్యము స్పష్టము.

కం. అని సంతసించి రావణుఁ, డనుపమహస్తాభరణము • నాతని కీయన్
దనుజేంద్రుముదల స్యందన,మును సారథి పఱపె రామ•భూవరుమీఁదన్. ౨౮౦౭

అర్థములు. అనుపమ=అసమానమైన, హస్తాభరణము = చేతిభూషణము, ముదలన్=ఆజ్ఞాప్రకారము.

తాత్పర్యము స్పష్టము.

## ఆదిత్య హృదయము

-• ౧౦౭-వ సర్గము. అగస్త్యుఁడు శ్రీరామున కాదిత్యహృదయం బుపదేశించుట •-

కం. అంతట సంగ్రామపరి, శ్రాంతునిఁ జింతాకులాత్ము • రక్షఃపతిసిన్
ప్రాంతంబునఁగని రణవి,శ్రాంతికి మును నిలిచియున్న•రఘురామవిభున్. ౨౮౦౮

అర్థములు. అంతటన్=సూర్యోదయానంతరము, లక్ష్మణ మూర్ఛ తేఱు నప్పటికి సూర్యాస్తమానము సమీపించినట్లు చెప్పఁబడెను.

ఇచ్చట నీతం డె యీతం డె యని వ్రేలఁ జూపి చెప్పుటచే సూర్యబింబమును జూపి చెప్పినట్టుల య్యెను. కావున నిది యమావాస్యయుదయమని గ్రహింపవగు. ఇది వఱకు జరిగిన యుద్ధము రాత్రియుద్ధము. అంతటన్=రావణుని తేరిని సారథి తొలఁగఁ దీసికొనిపోయిన పిమ్మట, సంగ్రామ పరిశ్రాంతున్=యుద్ధమం దలసినవానిని, అనఁగా విరామము లేక యుద్ధముచేసి విసిఁగినవాని నని గ్రహింపనగు. రావణాసురుని వె

బడలిన వాని నని చెప్పరాదు. రావణుని స్థితియందే రామచంద్రమూర్తియు నున్న యెడల రావణుఁడుచచ్చునని భయపడి యతనిసారథి రథము దొలఁగింపఁ గారణము లేదు. చింతాకులాత్మన్ = (౧) భుజబలము అస్త్ర శస్త్రబలముగల వీనిని ఎట్లు చంపుదునాయని వ్యాకులపడిన మనస్సు గలవానిని, (౨) పరత్వము ప్రకటింపక యే కేవల మనుష్యవిధముగానే వీనిని జంపు టెట్లని యాలోచించు వానిని, (3) వీఁడు యుద్ధమున నిలువక తప్పించుకొని పోయెనే, ఇఁక నే నేమి చేయుదునా? యూరిలోకిఁ బోవునేమో మరల రాఁడేమో ? నే నూరిలోకిఁ బోవుటకు లేదు. వాఁడా సంధికి రాక యుద్ధమునకు రాక యుండిన నేమి చేయవచ్చునని యాలోచించువానిని, ప్రాంత మున=ఎదుట, సమీపమందు, రణవిక్రాంతికి=యుద్ధమున విక్రమించుటకు, మును= ముందుగా, మరల యుద్ధమునకు వచ్చెఁగదా యని సంతోషించి త్వరపడి చంపు టకై ముందుగా నున్నవానిని, రఘు రామవిభున్=రాముని, మఱియొక యోజన :- సంగ్రామ పరిశ్రాంతుని=రామబాణములచే మిగుల గాసిపడినవానిని, చింతాకులా త్మన్ = ఆ కారణముచేతనే రాముఁడు బలవంతుఁడుగా నున్నాఁడే, నన్నుఁ జంపునేమో నే నెట్లు గెల్తునా యని చింతించు వానిని, రక్షఃపతిదిన్=ఇట్టి రావణుని అనియు నన్వయింపవచ్చును. ఈ యర్థము సరసముగా నున్నది. 'యుద్ధపరిశ్రాం తం, చింతయాస్థితం,' అను విశేషణములను బక్కనున్న రావణ శబ్దముతో నన్వ యింపక రెండవ శ్లోకములోఁ గడపటనున్న రామశబ్దముతో నన్వయించుటచేఁ బ్రాప్తించు దూరాన్వయదోషమీ యన్వయంబున లేదు. ప్రకరణానుసారముగను నన్వయసౌకర్యము నర్థసౌలభ్యము గలదై యున్నది. రామచంద్రమూర్తి బడలి నాఁడని, ఎట్లు చంపుదునా యని యాలోచించు చున్నాఁడనియుఁ జెప్పవలసిన యవసరము లేదు. దీనివలనఁ బరత్వ ప్రకటన ప్రశంసయు లేదు. ఆదిత్యహృద యోపదేశమునకుఁ గారణము లేదు. గోవిందరాజీయ వ్యాఖ్యయందు కొన్ని గ్రంథ ములం దీ సర్గము లేదు. ఉదారి వ్యాఖ్యానింపను లేదు. అని యిది ప్రక్షిప్త సర్గ మని వ్రాయఁబడి యున్నది. గ్రిఫిత్ రామాయణమున నిట్లు వ్రాయఁబడినది. పుట 587.

"This canto does not appear in the Bengali recension. It comes in awkwardly and may, I think, be considered as an interpolation but I paraphrase a portion of it as a relief after so much fighting and carnage and as an interesting glimpse of the monotheistic ideas which underlie the Hindu religion." అనఁగా ఈసర్గము మన దేశప్రతులందు లేదు. ఇది వికారముగ నడుమ వచ్చినది. ఇది ప్రక్షిప్తమని నా యభిప్రాయము. అయినను నింత యుద్ధము, రక్తస్రావమయిన పిమ్మట కొంత విశ్రాంతిగ నుండు ననియు నిది హిందూమతమున వినోదకరమైన యద్వైతాభి ప్రాయముల చూచాయలిందుఁ గాన వచ్చుచున్నవి గనుకను దీనిలో కొంత

దండాన్వయముగ వ్రాసితిని. ఇది గోవిందరాజీయము చూడక స్వతంత్రాభిప్రాయముగ వ్రాయఁబడినది.

శ్రీరామచంద్రమూర్తి సూర్యుని ధ్యానించె ననుటచే నాయనకు రాఁగల పరత్వహాని యేమియు లేదు. దినదినము పూఁటపూఁట సంధ్యావందనంబునఁ జేయునది సూర్యోపాసనముగాదా. లోకసంగ్రహార్థమై మహోపాధ్యాయులాదిదేవతలకు లోనగు వారికి నమస్కరించినవాఁడు, తా నున్న గుడిసెలో దేవాలయము చిన్నది నిర్మించుకొని నిత్యారాధన చేయుచుండినవాఁడు తన వంశమున కాదిపురుషుఁడైన సూర్యుని ధ్యానించుటచే నాయనకు వచ్చిన లోటేమియు లేదు. ప్రకరణమునుబట్టి యిది బుభుక్షువులకు నుద్దేశింపఁబడెను గాని ముముక్షువులకుఁ గాదు 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛే' త్తని లోకులు దీనిని ధ్యానింపవచ్చును. కావున రామచంద్రమూర్తి చేసినది కార్యమా యకార్యమా యనునది విచార్యముగాదు. వాల్మీకి దీనిని జెప్పెనా, మఱి యెవరైన దీని నిందు చూర్చిరా యను విషయమున నిది ప్రక్షిప్తమని కొందఱ యభిప్రాయమని తెలుప నిది వ్రాయవలసి వచ్చెను. రామచంద్రమూర్తి దీనిని ధ్యానించినను ధ్యానింపకున్నను స్తోత్రము సారవంతమైనది కావున సర్వజన సేవ్యము. కావున నాంధ్రీకరింపఁబడెను.

ఈ గ్రంథకర్త బాల్యమున గవ్వలు చదరంగ మాడునపుడు దీనిని ముమ్మాఱు పఠించుచుండెను.

కం. వ్యోమంబున వారల సంగ్రామంబును జూడఁ గోరి • గమి గొనిన దివా
కోమండలితో నుండెడి, శ్రీమహితుఁ డగస్తి రాముఁ • జేరి వచించెన్. ౨౮౯

అర్థములు. వ్యోమంబునన్ = ఆకాశమందు, గమిగొనిన = గుంపుగాఁ జేరిన, దివౌకోమండలిలో = దేవతా సమూహములో, అగస్తి = అగస్త్యుఁడు, అగస్త్యోగస్తి రేవచ॥ద్వి॥కో॥

తాత్పర్యము స్పష్టము.

కం. శ్రీరామ రామ! విను శ్రద్ధారతి గుహ్యంబు మఱి స • దాతన మిది నీ
వైరుల నెల్లర సంగర, ధారిణి నిద్ధాన గెలిచె • దవు దీర్ఘభుజా! ౨౯౦

అర్థములు. శ్రీరామ రామ = (౧) రామచంద్రమూర్తి చింతాపరుఁడై యుండుట చేతను, (౨) ఆదరాతిశయము వలనను, (౩) కార్యము తొందరఁబట్టియు రెండు మార్లు సంబోధనము, శ్రద్ధారతి = శ్రద్ధతోను భక్తితోను, రతి భక్తికిఁ బూర్వాంగమైనను నిచట భక్తి పర్యాయముగనే చెప్పఁబడెను. శ్రద్ధాభక్తులు లేనిచో సర్వము వ్యర్థము. శ్రద్ధ = దృఢమైన విశ్వాసము. దీనివలన నీ ఫలము గలుగునను నమ్మకము. ఇది యుండినను భక్తి యుండవలెను. భక్తిలేని శ్రద్ధపూర్ణ ఫల మీయఁజాలదు. గుహ్యంబు = రహస్యమైనది. మంత్రము నెప్పటికి రహస్యముగ నుంచిననే ఫలవంత మగును. దానిని వెలిగాఁ జెప్పరాదు. గురువుపేరు దాఁపరాదు. గురువు పేరు దాఁచినను మంత్రమును దాఁపకపోయినను సంపద ఆయువు క్షీణించును.

"గుహ్యం ప్రకాశయేద్ధీమాన్, మంత్రం యత్నేన గోపయేత్
అప్రకాశ ప్రకాశాభ్యాం క్షీయతే సంప్రదాయినీ".

సనాతనము=సనాతనము, 'శాశ్వతస్తు ధ్రువో నిత్య సదాతన సనాతనాః' అమరము. వేదమువలె నాశములేక యెల్లప్పుడు నుండునది. దీర్ఘభుజా = ఇది పూర్వకృత పరాక్రమమును ప్రకటించుచున్నది. నీవు మహాభుజబలపరాక్రమమును గలవాఁడవై నను శత్రుసంహారమందు నీకిది తోడుపడఁగలదు. నీ వైరుల నిది సంహరించు నని ఫలశ్రుతి చెప్పుటచే నిది కామ్యమని గ్రాహ్యము. 'రోచనార్థా ఫలశ్రుతి' యనునట్లు ఫలశ్రుతి చెప్పుట దానియందు రుచి పుట్టించుటకుఁ గావున ఫలశ్రుతి ముందుగాఁ జెప్పుచున్నాఁడు.

సీ. ఆదిత్యహృదయంబు • శ్రీదంబు పుణ్యంబు, నఖిలవిరోధిసం•హారకంబు
పరమశివంబును • భద్రకారణమును, నిత్య మక్షయ్యంబు • నిఖిలపాప
వినాశనక్షమమును • విజయకారణమును, శోకచింతాదిని•షూదనంబు
నుత్తమమంత్ర మా•యుర్వర్ధనము సర్వ, మంగళమాంగల్య•మహితయశము

తే. భక్తి జపియింపఁ, దన్మనో•పాస్యమాను, రశ్మిమంతు సముద్యతు•రవిసురాసు
రాదివందితు భాస్కరు•నఖిలలోక, వల్లభునిఁ గొల్వుమీ వివ•స్వంతుఁ దండ్రి.

అర్థములు. ఆదిత్యహృదయంబు = సూర్యునకుఁ బ్రీతికరమై యాదిత్య హృదయ మను పేరు గలది, శ్రీదంబు = సంపత్కరమైనది, పుణ్యంబు = పాఠకులకు పుణ్యఫలము నిచ్చునట్టిది, పుణ్యస్వరూపమైనది, అఖిల విరోధి సంహారకంబు= సమస్త విరోధుల సంహరించునది, పరమశివంబును = గొప్ప మేలిచ్చునది, భద్ర కారణమును=క్షేమమునకుఁ గారణమైనది, నిత్యము=శాశ్వతమైనది. అక్షయ్యంబు= క్షయింపని ఫలము గలది, నిఖిలపాపవినాశనక్షమమును=సమస్త పాపములనుచీల్చుట యందు సామర్థ్యము గలది, విజయకారణము = గెలుపొసంగునది, శోకచింతాది నిషూదనంబు = శోకము చింత లోనగు మనఃక్లేశములను చంపునది, ఉత్తమ మంత్రము=ధ్యానించువారిని రక్షించుటయందు త్తమమైనది, ఆయుర్వర్ధనము = ఆయుస్సును వృద్ధి చేయునది, సర్వమంగళ మాంగల్యము = సర్వమంగళకరము లలో మంగళకరమైనది, మంగళకరములగు వానికిని మాంగల్యము కలిగించునది, మహితయశము=మిగులఁ గీర్తికరమైనది, తన్మను = ఆ యాదిత్య హృదయ మను మంత్రముచే, ఉపాస్యమానున్=ఉపాసింపఁబడుచున్న వానిని, ఉపాసన మనఁగా ధ్యానము, రశ్మిమంతున్ = కిరణములు గలవానిని, సూర్యుని - సముద్యతున్ = ఉదయించుచున్న వానిని, రవిన్ = సూర్యుని, సుర+అసుర+ఆది = దేవతలు రాక్షసులు మొదలగు వారిచే, మనుష్యులచే - వందితున్ = నమస్కరింపఁబడిన వానిని, భాస్కరున్ = కాంతి గలిగించు వానిని, అఖిలలోక వల్లభునిన్ = ప్రాకృత

మండలమందలి సర్వలోకములకుఁ బ్రియుఁడైన వానిని, వివస్వంతున్ = సూర్యుని తండ్రీ = ప్రేమను దెలుపు పదము.

ఆదిత్య హృదయము = ఇచ్చట ఆదిత్య శబ్దముచే నాదిత్యమండలము చెప్పఁబడెను, హృదయము = లోపలి భాగము, ఆత్మయుండునది హృదయమం దేకదా.

'అణో రణీయాన్ మహతో మహీయాన్, నాత్మాస్య జంతోర్నిహితంగుహాయామ్' అని కదా శ్రుతి చెప్పుచున్నది. కావున నాదిత్యహృదయ మనఁగా సూర్యమండల హృదయస్థానమున నుండు పరమాత్మకుఁ బ్రీతికరమైనదని యర్థము. ఆదిత్యమండలాంతర్వర్తియగువాఁడు శ్రీమన్నారాయణుఁడే. "య ఏషోంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే" యనికదా శ్రుతి చెప్పుచున్నది. 'ధ్యేయ స్సదా సవితృమండలమధ్యవర్తీ నారాయణః సరసిజాసన సన్నివిష్టః, కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ, హారీహిరణ్మయవపుర్ధృతశంఖచక్రః" సూర్యమండలమధ్యమున శంఖచక్రములు కిరీటము హారములు భుజకీర్తులు మకరకుండలములు బంగారుచాయగల దేహముగలవాఁడై కమలాసనమందుండు నారాయణుఁడు సర్వదా ధ్యానింపఁదగినవాఁడు అని కదా ప్రసిద్ధి :—

బృహదారణ్యకము 3-7-3-అంతర్యామి బ్రాహ్మణమందు—

య ఆదిత్యే తిష్ఠన్ ఆదిత్యా దంతరోఽయ మాదిత్యో న వేద యస్యాదిత్య శ్శరీరం య ఆదిత్య మంతరో యమయ త్యేష త ఆత్మాంతర్యా మ్యమృతః॥

ఎవఁడు ఆదిత్యునం దున్నాఁడో తనయందున్న యెవనిని ఆదిత్యుఁ డెఱుఁగఁడో, యెవని కాదిత్యుఁడు శరీరమో, యెవఁడాదిత్యునందుండి ఆదిత్యుని ప్రవృత్తినివృత్తిలక్షణ నియమములు చేయుచున్నాఁడో. వాఁడు అంతర్యామి, యమృతుఁడగు నీ యాత్మ; అనఁగా నిరుపాధికామృతత్వశాలి యగు నాత్మ యని యర్థము. జీవాత్మ నిరుపాధికామృతత్వశాలి కాఁడు గనుక పరమాత్మకే యీ విశేషము చెల్లుచున్నది.

ఆదిత్యశబ్దము కేవల మాదిత్య స్థూలదేహమున కన్వయింపదనియు దానినధిష్ఠించియుండు దేవత కన్వయించుననియుఁ దదంతర్యామి యనినపుడా దేవతకంతర్యామి యగు పరమాత్మ యనియు గ్రహింపవలయును. కావున ఆదిత్యుఁడన్నప్పుడు స్థూలదేహవిశిష్టుఁడై యాదిత్యుఁ డను పేరుగల జీవాత్మ యనియే గ్రహింపవలయును, దేవదత్తుఁడు శ్యాముఁ డన్నట్లు ఈ యంతర్యామి యగు దేవత నారాయణుఁడే యని శంకరాచార్యులవారు భాష్యమున వ్రాసియున్నారు. యఈద్య గీశ్వరో నారాయణాఖ్యః పృథివీం = పృథివీదేవతాం, యమయతి = నియమయతి,

కావున నీ యాదిత్యహృదయ మనునది శ్రీమన్నారాయణప్రీతికరమైన స్తోత్రమని యెఱుఁగనగు.

'రశ్మిమంతున్ = రస్మి రశ్మీనాం మధ్యే తపంతమ్' అని సంపూర్ణఘుర్యాను

వాక్శక్తి కలదు. ఇందు రశ్ములనఁగాఁ బ్రకాశించు రశ్మి యని పరమాంతరంగ భక్తుల విషయమున రశ్మిశబ్దము ప్రయోగింపఁబడినది. కావున రశ్మిమంతుఁడనఁగా అంతరంగభక్తులతో నిత్యసంయోగము గలవాఁడు.

సముద్యతున్ = ఉదయ మనునది లేనివాఁడయ్యు నున్న వానివలెఁ గాన వచ్చువాఁడు. సూర్యోదయము సూర్యాస్తమానము చూచువారికే కాని సూర్యునకు లేవు కదా ! అట్టులే భగవంతునకు నవతారములు.

'యః పూర్వ్యాయ వేధసే నవీయసే' అను శ్రుతి క్రొత్తక్రొత్తగానుదయించు నట్లు కనఁబడువాఁడు.

'రవిః=రూయతే స్తూయతే ఇతి రవిః, స్తోత్రము చేయఁబడువాఁడు.

సురాసురాదివందితున్='దేవానాం దానవానాంచ సామాన్య మధిదైవతమ్" అని జితంతా స్తోత్రములోఁ జెప్పినట్లు దేవతలకు రాక్షసులకుఁగూడ సమానుఁడైన దేవుఁడు. వారిచే నమస్కరింపఁబడువాఁడు.

భాస్కరున్ = భాస్కరుఁడు = భాస్+కరుఁడు = (౧) కాంతిని గలిగించు వాఁడు. (౨) పరులను పరిభవించు ప్రభావము గలవాఁడు, (౩) భాస్ అనఁగా చక్రము. దానిని చేతియందుఁ గలవాఁడు భాస్కరుఁడు. ప్రకాశవంతులని చెప్పఁబడు సూర్యచంద్రాగ్నులకుఁ గూడఁ బ్రకాశము గలిగించువాఁడు. "న తత్ర సూర్యో భాతి న చంద్రతారకమ్, నేమావిద్యుతో భాంతి కుతోయ మగ్నిః, తమేవ భాంత మనుభాతి సర్వం, తస్య భాసా సర్వ మిదం విభాతి" — శ్రుతి.

అచ్చట నీ సూర్యచంద్రులు నక్షత్రములు లేరు. ఇఁక నగ్ని యెక్కడిది ? ఆయన ప్రకాశ మనుసరించి యన్నియుఁ బ్రకాశించుచున్నవి. ఆయన కాంతిచే నన్నియుఁ బ్రకాశించుచున్నవి.

"That there are other worlds admit of little doubt — Our Sun is only a private in the host of heaven. The lustre of Arcturus is one hundred times greater than that of our Sun The two components of Mizar, it is said have a mass not less than forty times that of our Sun Beta Cygni consists of a pair of Suns, one of its colour of topaz, the other of an emarald and the Galaxy contains a host of Suns. Sir Robert Ball has good reasons for holding that the millions of stars which we actually see are simlpy the conspicuous members of a vastly more numerous hosts, of whose existance we are almost entirely ignorant, save for such glimqses of knowledge as the theory of possibilities can afford."
Leasts of God by Zero. Page 55.

"ఇతర ప్రపంచములు గలవనుట సందేహము లేని విషయము. ఆకాశమున గానవచ్చు (నక్షత్ర) సేనా సమూహమందు మన సూర్యుఁడొక భటుఁడుమాత్రమే మన సూర్యుని తేజస్సుకంటె ఆర్కటరస్ కాంతి నూఱంతలు గొప్పది. మిజార్

లోని రెండు భాగములు మన సూర్యునికంటె నలువదంతలకుఁ దక్కువ గాని గొప్పవై యున్నవి. జేటసిగ్నియందు నిరువురు సూర్యులు గలరు. అందొకటి గోమేధికవర్ణము గలది. రెండవది మరకతవర్ణము గలది. గాలాక్సియందుసూర్యుల గుంపు గలదు. సర్ రాబర్ట్సు బాల్ అను వాఁడు మనకుఁ గానవచ్చు లక్షల కొలఁది నక్షత్రములు ఇంతకంటెఁ జాల గొప్పనియు ననేకములు నగు వాని గుంపులో గొప్ప వనియు (సన్నవి మనకుఁ గానరావు) వానిని గుఱించి యూహచేఁ దెలిసికొనఁదగి నంత జ్ఞానలేశమును విడిచితిమేని మన కేమియుఁ దెలియదనియు వ్రాసెను."

మనకుఁ గానవచ్చు సూర్యునికంటె గొప్ప సూర్యుఁ డున్నప్పు డాయనను ప్రార్థింపక యీ సూర్యుని ప్రార్థింపనేల యని ప్రశ్నింపరాదు. అట్లు మన మూహించి గొప్ప సూర్యుని నర్చింపఁదలఁచితిమేని మన ప్రయత్నము వ్యర్థమగును ఏలన భూగోళమందు నొక కొండకంటె మఱియొక కొండ, దానికంటె మఱియొక కొండ, దానికంటెఁ బెద్దపర్వతము లెట్లున్నవో, యట్లేఖగోళమందు నొకసూర్యుని మించిన మఱియొక సూర్యుఁడు, అంతకు మించిన మఱియొక సూర్యుఁడు, అంతకు మించిన సూర్యుఁ డిట్లు లెందఱో కలరు. అన్నిటికంటె గొప్పసూర్యుని మనము కనుఁగొనుటెట్లు? పూజించు టెట్లు? కావున నే సూర్యుని మన మర్చించినను ఆ సూర్యమండల మందుండు భగవంతుని. శ్రీమన్నారాయణమూర్తిని మనము పూజించు వారమై యున్నాము. ఆ మాత్రమునకు చిన్న సూర్యునందుఁ బూజించిననేమి? పెద్దసూర్యునందు బూజించిననేమి? అందు నిందు సర్వత్ర నుండు వాఁడొక్క భగ వంతుఁడే. గడ్డిపోఁచయందుఁగల భగవంతుఁడే బ్రహ్మరుద్రేంద్రాదులందుఁగలఁడు. మనము భక్తితో శ్రద్ధతోఁ బూజించితిమేని మనకు భగవంతుఁ డాగడ్డిపోఁచయందే కానవచ్చును. రాతి స్తంభమునందు ప్రహ్లాదునకుఁ గానరాలేదా? కావున మనకు నేది సులభసాధ్యమో, మన మనస్సును నేది యాకర్షింపఁగలదో, దేనియందు మనకుఁ బ్రీతి విశ్వాసములు గలుగునో దానిని మనము పూజించిన నిష్టార్థసిద్ధి గలుగును. మనకు ప్రాణశక్తి సూర్యునినుండి విశేషము వచ్చుచున్నది. కావునఁ గానరాని సూర్యులకై మనము కడగండ్లు పడక యీ సూర్యునినే భగవచ్ఛరీరమని తలఁచి యందుండు భగవంతుని మన మర్చింప వలయును. విగ్రహారాధనార్థ మిదియే. సగుణోపాస్తి యిదియే. దీని వలననే మన కైహికాముష్మికఫలము లన్నియు లభించును. అనివార్యఫలదము. సమాన ఫలదము - శీఘ్ర ఫలదము - కావున దీనినే శ్రేష్ఠముగ భగవంతుఁ డర్జునున కుపదేశించెను కానరాని సూర్యు నుపా సించువారి నుపాసింపనిండు. దానికై కన్న కడగండ్లు పడనిండు. సగుణోపాసకుల కంటె వారి కెక్కువ ఫలమురాదు. శ్రమము మాత్రమే యెక్కువ.

వివస్వంతమ్ = వివస్తే ప్రభయా ఆచ్ఛాదయతీతి వివస్వాన్, వస-ఆచ్ఛా దనే, కాంతిచేత నన్నిటిని గప్పెడువాఁడు.

## తాత్పర్యము

ఆదిత్యహృదయము సంపత్కరమైనది. పుణ్యదమైనది. సకలబాహ్యాభ్యంతరశత్రువుల నాశము చేయునది. మిక్కిలి శుభకరమైనది. క్షేమమునకు హేతువైనది. శాశ్వతఫల మిచ్చునది. క్షయము కానిది. పూర్వోత్తర పాపముల నెల్ల నాశము చేయునది గెలుపు గలిగించునది. దేహబాధ, మనోవేదన తొలఁగించునది. మంత్రములం దుత్తమమైనది. విహితమైన యాయువుకంటె నెక్కువ యాయువు కలిగించునది సమస్త మంగళములందు మంగళమైనది. జపించు వారికి గొప్ప కీర్తిని కలిగించునది. కావున నా మంత్రముచే రశ్మిమంతుఁడై యుదయించు సూర్యుని దేవతలచే రాక్షసులచే మనుష్యులచే నమస్కరింపఁబడు సూర్యుని, సమస్త లోకములకుఁ బ్రియుఁడైనవానిని నాయనా! యిఁక వివస్వంతుని గొల్వుము.

సీ. ఈతండె తేజస్వి • యీతండు సర్వదే, వస్వరూపుఁడు రశ్మి • భావనుండు
ఈతండ సుమి సర్వ • బృందారకాసుర, గణము జగంబోము • కరచయముల
నీతండె బ్రహ్మయు • నీతండె విష్ణువు, స్కందుండు శివుఁడు ప్ర • జాపతియును
నితఁడె మహేంద్రుఁడు•నీతండె ధనదుండు,యముఁడు కాలుఁడుసోముఁ•డప్పతియును
తే. నితఁడె పితరులు వసువులు • నీతఁ డితఁడ,
మరుతులును సాధ్య లశ్వులు • మనువు నితఁడె
వాయువును వహ్నియును బ్రజా • ప్రాణ మితఁడె
భద్రగుణ ! ఋతుకర్త ప్ర • భాకరుండు. ౪౪౧

అర్థములు. తేజస్వి = గొప్ప తేజస్సుగలవాఁడు. పరులను దనకు లోప ఱచుకొనుశక్తి తేజస్సనఁబడును. సర్వదేవస్వరూపుఁడు = సమస్త దేవతల స్వరూపములు ధరించి యుండువాఁడు, అన్ని రూపులు తన రూపమైనవాఁడు భగవంతుఁడు తానే పెక్కు రూపములు ధరించెద నని సంకల్పించి పాలెపురుగు తన దేహమందున్న దానినే పోగులుగాఁదీసి పెద్ద గూడుకట్టినట్లు తన శరీరమైన ప్రకృతితోఁ దానే యుపాదానకారణమై నానారూపములు సృష్టించి వానిలో నేయే జీవున కేయే రూపము కర్మఫలానుభవమునకుఁ దగియుండునో దానిలో నాయా జీవుని బ్రవేశ పెట్టి ఆ రెంటికి నియామకుఁడుగఁ దానందుఁ బ్రవేశించెను. జీవుఁడు, ప్రకృతి, ఆయన శరీరములే కావున వారికొనైన రూపము లన్నియు నాయన రూపములే. దీనినే 'య స్సర్వేషు దేవేషు తిష్ఠన్' అను శ్రుతియు; జెప్పుచున్నది. రశ్మిభావనుండు= రశ్ములనఁగా పరమాంతరంగభక్తు లని ముందు వ్రాయఁబడెను. వీరే నిత్యులు ముక్తులు నను వారు. వీరిని భావింపఁజేయువాఁడు. భావమనఁగా సత్త-(ఉనికి) వారు భగవదిచ్ఛకులోనై నిత్యులు ముక్తులు నయి యుందురు. కావున వారి యా యునికి భగవదధీనము.

కరచయములన్ =కిరణసమూహములచే, సర్వబృందారకాసురగణమున్ =

సమస్త దేవతలయు రాక్షసులయు సమూహమును, జగము = ప్రపంచములను, ఓమున్=రక్షించును, 'యాభి రాదిత్య స్తపతి. రశ్మిభి స్తాభిః పర్జన్యో వర్షతి' అనఁగా సూర్యుఁడు తన కిరణములచే లోకమునందలి నీటిని నావిరిగా గ్రహించి దానిని మరల వర్షముగాఁ గురియించి దానివలన నన్నము గలిగించి సర్వప్రాణులను రక్షించునని భావము.

'అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్యగాదిత్య ముపతిష్ఠతే,ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టే రన్నం తతః ప్రజా' అగ్నియందు వేల్వఁబడిన యాహుతి సూర్యుని బొందును. ఆ సూర్యునివలన వర్షము,వర్షమువలన నన్నము, దానివలనఁ బ్రజలు కలుగుదురు.

'దేవాన్ భావయ తానేన తే దేవా భావయంతి వః' యజ్ఞాదులచే దేవతలు పూజింపఁబడుదురేని వారు వర్షముచేఁ బ్రజల రక్షింతురు.

'య ఏషోంత రాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే' యని యోగుల సాక్షాత్కారమందుఁ జెప్పఁబడుటచే దాని ననుసరించి యందును నట్లే యతఁడితఁడని చెప్పఁబడెను.

బ్రహ్మ = నాలుగు ముఖముల బ్రహ్మ తనకు శరీరముగాఁ గలవాఁడు, బ్రహ్మపదవికి రాఁదగిన జీవాత్మయందు భగవంతుఁడు ప్రవేశించి యతనిచే సృష్టి కార్యములు చేయించును."తవచాంత రాత్మా మమచయే చాన్యే దేహిసంజ్ఞితాః" అని బ్రహ్మ శివునకు నీకు నాకు దేహముగల యందఱకు నాత్మ విష్ణువే యని చెప్పినట్లు విష్ణుపురాణంబునఁ గలదు. విష్ణువు=ఉపేంద్రావతారమూర్తి, స్కందుఁడు= 'స్కందిర్ గతి శోషణయో' యను ధాతువును బట్టి శత్రువులను శోషింపఁ జేయువాఁడు. కుమారశరీరకుఁడు. శివుఁడు=శివశరీరకుఁడు = 'స బ్రహ్మా స శివ స్సేంద్ర' యని శ్రుతి. ప్రజాపతియు - ప్రజాపతి శ్చరతి గర్భే అంతః - అన్నట్లు ప్రజలను బాలించువాఁడు. ప్రజాపతిశబ్దవాచ్యుఁడు, మహేంద్రుఁడు = స్వరూపైశ్వర్యములచేఁ దనకంటె గొప్పవాఁడు లేనివాడు,'ఇంద్ర విచిక్యుః పరమే వ్యోమన్ ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే" అని శ్రుతి- ఇది=పరమైశ్వర్యే, ఇందతీంద్రః= పరమైశ్వర్య యుక్తుఁడు,అట్టివారిలో గొప్పవాఁడు,మహేంద్రుఁడు-సర్వతో ముఖం ప్రవృత త్వేన పూర్ణ మైశ్వర్యతయా మహాం శ్చాసా వింద్రశ్చ = అన్ని దిక్కుల వ్యాపించి యుండుటచే పూర్ణమైన యైశ్వర్యము గలవాఁడు కావున మహేంద్రుఁడు.

ధనదుండు = లఘుభ్యో ధనాయద్భ్యో ధనం దదాతీతి ధనదః, అన్నాదో వసుదానః=ప్రసిద్ధుఁడైన సర్వఫలప్రదుఁడు (బృహ.౬౭-౨.౭)యముఁడు-యమయతి, శిక్షయతి- దండించువాఁడు-యః పృథివీ మంతరో యమయతి-భూమిలోపల నుండి శిక్షించువాఁడు-అకంటకం చానుకూలం యచ్ఛతీ త్యఖిలం యమః-'యమో వైవస్వతో రాజా య స్తవైష హృది స్థితః తేన చేదవివాద స్తే మాం గంగాం మాకురూం గమ'=నీహృదయమందుండి నిన్ను శిక్షించు రాజుతో నీకు వివాదము లేక

యాయన చెప్పినట్లు నీవు వర్తించితివేని నీవు గంగకుఁ గురుక్షేత్రములకుఁ బోవలసిన పని లేదు. అంతర్యచ్ఛతీతి యమః - జీవుల మనమును నిలుపువాఁడు - యమాదీన్ యచ్ఛతి యమః తత్తత్ఫల నియామకాన్- ఆయా ఫలనియామకములైన యమాదులం దథిష్ఠించి యిచ్చువాఁడు - యోగమున కంగము లగు యమ నియమము లయినవాఁడు.

కాలుఁడు=ఆత్మని చరాచర సంకలనాత్ కాలః=చిదచిత్తులను దనయందుఁ గలుపుకొనువాఁడు కావునఁ గాలుఁడు. చరాచరం కలతే సంకలితం భవత్యస్మిన్ ఇతి కాలః, కాలః కలయతా మహమ్, భ. గీ. అ-౧౦-౩౦ అంతటిని నెంచువాఁడు కాలుఁడు. కాలాయ మహాగ్రాసాయవై నమః, అత్తా చరాచర గ్రహణాత్, శ్రుతి. అనాది ర్భగవాన్ కాలః, వి॥ పురా॥ జగత్సంహారకుఁడు, కలయతి ధర్మాధర్మాణా మాయుషోవా సంఖ్యానం కరోతీతి కాలః = ధర్మాధర్మముల నైనను ఆయువునైనను లెక్కించువాఁడు కాలుఁడు.

సోముఁడు=సోమశబ్ద మమృత వాచి, తృతీయస్యామితో దివి సోమ ఆసీత్, అష్ట. ౩-౧-౭ ఖల్వమృతోపమః, అమృతస్యేవ నాతృప్యన్ ప్రేక్షమాణా జనార్దనమ్- శాంతి సమృద మమృతమ్ (తై-ఉ-శి-౬-౨) సోమః సుధాయమానత్వాత్ ముక్తానాం పరికీర్తితః=ముక్తులకు నమృతమువంటివాఁడు, సూతే అమృతమితి సోమః=అమృతమును బుట్టించినవాఁడు, "సోమః పవతే జనితా మతీనాం జనితాదివః" ఇట్లు సకల కారణ సోమశబ్దవాచ్యుఁడు, సోమరూపేణౌషధీఃపోషయన్ సోమః, చంద్రరూపమున నోషధులఁ బోషించువాఁడు.

అప్పతి=అప్పులను బాలించువాఁడు, ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః తా యద స్యాయనం పూర్వం తేన నారాయణస్మృతః-మను. అప్పులనఁగా నారములు, భూతములు, వానికిఁ బతియైనవాఁ డప్పతి... పితరులు=అగ్నిష్వాత్తు మొదలగువారు, వసువులు "సదా వసంతీతి వసవః"=ఎప్పుడు నుండువారు ఆహాత్య వసంతీతి వసవః=కూర్చుకొని యుండువారు. వసనివాసే, వీరు ఆపుఁడు ధ్రువుఁడు సోముఁడు అధ్వర్యుడు అనిలుఁడు ప్రత్యూషుఁడు అనలుఁడు ప్రభాసుఁడు. దీనికి గొంచెము పాఠభేదము కానవచ్చెడి. "ధ్రువో ధర సథా సోమ సోమ ఆపో వై శ్వానరో నిలః। ప్రత్యూషశ్చ ప్రభావశ్చ వసవో ష్టౌ ప్రకీర్తితాః".

అగ్నిశ్చ పృథివీచ వాయుశ్చాంతరిక్షంచ ఆదిత్యశ్చ ద్యౌశ్చచంద్రమాశ్చ నక్షత్రాణి చేతేవై వసవః. వీరు శ్రుత్యుక్త వసువులు. మరుతులు = కుపితేన అనేన మ్రియతే లోక ఇతి మరు. కుపితుఁడైన యితనిచేత లోకము మృతి పొందింపఁబడును. మ్రియంతే వరదాచి దితి మరుతః=ఎన్నఁడు మరణింపనివారు. వీరు శుక్ర జ్యోతి ప్రభృతులు, నలువది తొమ్మండ్రు. సాధ్యులు = సాధ్యంతే- ఆరాధ్యంత ఇతి సాధ్యాః=ఆరాధింపఁబడువారు. సాధ్యం సిద్ధి ర్యేషా మస్తీతివా=

సిద్ధిగలవారు. రాధ సాధ సంసిద్ధౌ. మనుఁడు, హనుమంతుఁడు, విష్ణువు,ధర్మఁడు, నారాయణుఁడు మొదలగువారు. ఎనమండ్రుు.

బ్రహ్మణో వై ముఖాత్సృష్టా యేతు దేవా ప్రకీర్తితాః, సాధ్యా మంత్ర శరీరా స్తే స్థితా మన్వంత రేష్వపి,ధర్మపుత్రా మహాభాగా విజ్ఞేయా ద్వాదశామరాః, మనుర్మంత్రః ప్రాణదశ్చ చేతయానశ్చ వీర్యవాన్ విత్తిర్హయో నయ శ్చైవ హంసో నారాయణ స్తథా, ప్రభవో థ విభుశ్చైవ,సాధ్యా ద్వాదశ జజ్ఞిరే (వాయు పురాణము.)

మనువు="నాన్యతో స్తిమంతా" ఇతని కంటె మననము చేయువాఁడితరుఁడు లేఁడు. శ్రుతి. సృష్టికి పూర్వము ప్రపంచవిషయక మగు మననము గలవాఁడు, మను ఆలోచనే, మనజ్ఞానే.

వాయువు=వా గతిగంధనయోః=సమస్తము వాసన గలదిగాఁ జేయువాఁడు భక్తుల యొద్దకుఁ దానై పోవువాఁడు, వాతి గంధం కరోతీతి వాయుః, పుణ్యో గంధః పృథివ్యాంచ, (భ - గీ. ౧౦.౩౦-)

'సర్వకర్మా సర్వ కామ స్సర్వగంధ స్సర్వరసః' శ్రుతి.వహ్ని=హవ్యమును దేవతలకుఁ గొనిపోవువాఁడు. ఇష్టాపూర్తం బహుధా జాతం జాయమానం విశ్వం బిభర్తి భువనస్య నాభి, తదేవాగ్ని స్తద్వాయు స్తత్సూర్య స్తదు చంద్రమాః" శ్రుతి. ఏది భువనమునకు నాభియై పుట్టినది, పుట్టుచున్నదియు నగు సమస్తము నిష్టాపూర్తము భరించుచున్నదో యదియే యగ్ని- అదియే వాయువు- అదియే సూర్యుఁడు- అదియే చంద్రుఁడు- ప్రజాప్రాణము - 'ప్రాణా ద్వాయు రజాయత' ప్రాణము నుండి వాయువు పుట్టెను.

కో హ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్ యదేష ఆకాశ ఆనందో నస్యాత్ - ఆనంద రూపమయినయాకాశము(బ్రహ్మము)లేనియెడల నెవఁడు ప్రాణముగలవాఁడగును?

ప్రాణోస్మి ప్రజ్ఞాత్మా. త మ్మా మాయు రమృతమి త్యుపాస్స్వ- అమృతం దేవానాం-ఆయుః ప్రజానామ్ - ప్రాణ స్తథానుగమాత్ బ్ర॥ ౧-౧-౨౯.

"పుంసాం జీవిత రూపత్వాత్ ప్రాణ ఇత్యభిధీయతే. 'ప్రాణయతి సర్వాణి భూతాని' అనగా సమస్తభూతములయొక్క ప్రాణన వ్యాపారమును జేయించునది అను శబ్ద వ్యుత్పత్తినిబట్టి యిచ్చటఁ బ్రాణశబ్దము పరమాత్మపరము" - ఆంధ్ర శ్రీభాష్యము. ప్రజలను బ్రదుకఁజేయువాఁడు. ప్రజాప్రాణుఁడు.

ఋతువు = ఋ గతిప్రాపణయోః, ధాతువు - గమ్యస్థాన మైనవాఁడు- పొందఁబడువాఁడు- ఋతువు-ఋతు స్సుదర్శనః కాలః అని సహస్రనామ స్తోత్రము ఋచ్ఛతీతి ఋతు ప్రోక్తః - సర్వోల్లాసకరైర్గుణైః = అందఱకు నుల్లాసకరమగు గుణములచేఁ బొందఁబడునది.

కర్త=చేయువాఁడు - 'కర్తా స్వతంత్రః పరికీర్తితః' తేన వినా తృణాగ్ర

మసి నచలతి - ఆయన యాజ్ఞ లేక గడ్డిపోఁచయుఁ గదలదు- కావున ప్రతివస్తువు నందు లోపలఁజొచ్చి కార్యము చేయువాఁడు, అంతః ప్రవిష్టః కర్తార మేతం- లోపలఁ బ్రవేశించి కార్యములు చేయువాఁడు అథ రథాన్ రథాయోగాన్ పథ స్సృజతే సహికర్తా - సర్వకర్మా-మఱియు రథములను రథములు పోవు మార్గము లను స్వప్నములందు సృజించువాఁడు - అతఁడు కదా కర్త.

ప్రభాకరుఁడు = వెలుతురు-జ్ఞానము-దానిని గలిగించువాఁడు. ప్ర+భా+ కరుఁడు, ప్రకృష్టజ్ఞానము గలిగించువాఁడు. తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్, దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాంతి తే॥ భ. గీ. ప్రీతితో భజించు నా భక్తులు నన్నుఁ బొందుటకు గావలసిన బుద్ధియోగమును నేనె యిచ్చుచున్నాను.

తాత్పర్యము

ఇతఁడే మిగులఁ దేజస్సు గలవాఁడు. సర్వవేదస్వరూపుఁ డితఁడె. కాంతులు గలవాఁ డితఁడె తన కిరణములచే సమస్త దేవతలయు నసురులయు సమూహ మును బ్రపంచమును రక్షించువాఁడు. ఇతఁడె బ్రహ్మ ఇతఁడె విష్ణువు, ఇతఁడె స్కందుఁడు. ఇతఁడె శివుఁడు, ఇతఁడే ప్రజాపతి. ఇతఁడె మహేంద్రుఁడు. ఇతఁడె కుబేరుఁడు. ఇతఁడె యముఁడు. ఇతఁడె కాలుఁడు. సోముఁడు. వరుణుఁడు పితరులు వసువులు మరుత్తు లితఁడె. సాధ్యులు అశ్వులు మనువు వాయువు వహ్నియు ప్రజల ప్రాణము ఋతుకర్త. ప్రభాకరుఁ డితఁడె.

సీ. నీవె యాదిత్యుఁడ ♦ నీవె సవితృఁడవు, నీవె సూర్యుండవు ♦ నీవె ఖగుఁడ
నీవె పూషుండవు ♦ నీవె గభస్తిమం. తుండవు హేమరే ♦ తుండ నీవె
భానుండు తపన ది ♦ వాకరులును నీవె. నీవె సువర్ణుండ ♦ నీవె త్వష్ట
హరిదశ్వుఁడవు సహ ♦ స్రార్చివియు మరీచి, మంతుండవును నంశు ♦ మంతుఁడవును
తే. సప్తసప్తివి తిమిరారి ♦ శంభు నీవ, నీవ మార్తండుఁడవు రవి ♦ నీవ యగ్ని
గర్భుఁడవు శంఖుఁడవును భా ♦ స్కరుఁడ నీవ, శిశిరనాశనతపనులు ♦ శిశిర మీవ.

అర్థములు. ఇఁక స్తోత్రము ప్రారంభింపఁబడు చున్నది. పూర్వ మర్థము వ్రాయబడిన పదముల కర్థము మఱల వ్రాయఁబడదు. సవితృఁడవు = సువతి సమస్తం ప్రేరయతి, షూ ప్రేరణే, ప్రేరించువాఁడు. ప్రేరితారంచ మత్వా, అని శ్వేతాశ్వ శ్రుతి. అంతర్యామిగా నుండి కర్మములు చేయఁ బ్రేరించువాఁడు. సూర్యద్వారా వృష్టి సస్యాదికం సూతే ఇతి సవితా, సూర్యుని మూలమున వర్షము పైరు ప్రసవించువాఁడు. 'ప్రజానాంతు ప్రసవనాత్ సవితేతి నిగద్యతే' సకల జనులఁ బుట్టించువాఁడు. విష్ణుధర్మోత్తరము. సూర్యుండవు = అంతః ప్రవిష్ట శ్శాస్తా జనానాం సర్వాత్మా యస్సర్వాణిభూతాన్యంతరో యమయతి। శ్రుతి, చరాచరాత్మక ప్రపంచమునకు నంతర్యామియై యుండువాఁడు. వాయుస్సరతి

యస్మాద్ధి తస్మాత్ సూర్యః షడక్షరః॥ ఎవని వలన వాయువు చలించుచున్నదో వాఁడు సూర్యుఁడు,సంపద నొసంగువాఁడు,ఖగుఁడవు=లోకోపకారార్థము ఆకాశ మున సంచరించువాఁడు, పరమాకాశమున నుండువాఁడు, పూషుండవు = వర్షేణ పుష్ణాతి జగదితి పూషా=వర్షముచే ప్రపంచమును పోషించువాఁడు.

గభస్తిమంతుఁడవు=గో క్షేయవర్గః, తం భస్తీతి గభస్తిః=వస్తువులను జూపు నది.అట్టి దానిని గలవాఁడు గభస్తిమంతుఁడు 'గాం దిశం వ్యాప్య భాస్తి ప్రకా శయతీతి గభస్తిః దిక్కుల నన్నిట వ్యాపించి ప్రకాశింపఁజేయునది.కావున గభస్తి యనఁగా సర్వవ్యాపిని లక్ష్మి.ఆమెతో నిత్య సంయోగము గలవాఁడు గభస్తిమం తుఁడు. యథాసర్వగతో విష్ణుః తథై వేయం ద్విజోత్తమ=ఎట్లు విష్ణువు సర్వము నందు వ్యాపించి యున్నాఁడో యట్టులే యీమెయు వ్యాపించియున్నది. - వి.పు.

యథా మయా జగద్వ్యాప్తం స్వరూపేణ స్వభావతః।తయా వ్యాప్తమిదం విశ్వం నియంత్రీచ తథేశ్వరీ— నేను స్వరూప స్వభావములచే నెట్లు లోకమంతయు వ్యాపించి యున్నానో యట్టులే యీమెయు వ్యాపించి యున్నది. ఈమె లోకే శ్వరి=లోక నియంత్రి.

హేమ రేతుండవు=బంగారు రేతస్సుగా గలవాఁడవు,'హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖ' మ్మన్నట్లు హేమము ప్రపంచము.దానిని రేతస్సుగాఁ గల వాఁడు. అనఁగా సృష్టించు శక్తి గలవాఁడు.

* "అపఏవ ససర్జాదౌ తాసు వీర్య మపాసృజత్, తదంత మభవ ద్ధైమం సహ స్రాంశు సమప్రభమ్." మనుస్మృతి.

భానుఁడు=భాతీతి భానుః, ప్రకాశించువాడు. "భాను స్సర్వస్య భాతీతి నిర్మాణే ష్వవికారతః తమేవ భాంత మనుభాతి సర్వమ్" శ్రుతి. లోకమును దపింపఁ జేయువాఁడు, దివాకరుఁడు=అజ్ఞాన మను చీఁకటిని బోఁగొట్టి జ్ఞాన మను పగలు కలిగించువాఁడు.

సుపర్ణుండవు=ద్వాసుపర్ణా సయుజా 'సఖయా' అని శ్రుతి- అనఁగా పర మాత్మ, త్వష్టవు=త్వక్ష్ణోతి, త్రిస్సప్త కృత్వః సక్షత్రియాం భూమి మితి త్వష్టా, ముయ్యేకు (ఇరువది యొకటి) మార్లు రాజులతోడి భూమిని సన్నగింపజేసినవాడు. వడ్రంగి కొయ్యలు చెక్కునట్లు చెక్కునవాఁడు - తక్షతే-త్వక్ష్యతేస్మ లష్టః త్వష్టః తక్షం త్వక్ష్వా తనూకరణే - ఇది పరశురామావతారమును సూచించును. సర్వాణి రూపాణి తక్షతి తనూకరోతి=సర్వరూపములు సన్నవిగాఁ జేయువాఁడు- సర్వము సంహరించువాఁడు - హరిదశ్వుఁడవు- హరతి మనఇతి హరిత్=మనస్సును హరించునది హరిత్ - దానిని అశ్వముగా ననఁగా వాహనముగాఁ గలవాఁడు - గరుత్మంతుని వాహనముగాఁ గలవాఁడని యర్థము.

సహస్రార్చిచి - వేయికిరణములు గలవాఁడవు, అర్చ్యతే ఇతి అర్చిః=అర్చి

శబ్దము అర్చింప యోగ్యము లగువానిని దెలుపును. అర్చింప యోగ్యత గలవి-కల్యాణ గుణములు కావున అనంత కల్యాణగుణములు గలవాఁడ వని భావము.

మరీచిమంతుఁడవు=మరీచులు = కాంతులు, మరీచిమంతుఁడు = కాంతులు గలవాఁడు మ్రియంతే శత్రవో అనేన మరీచి=దేనిచే శత్రువులు చత్తురో యది మరీచి, సుదర్శన చక్రము - దానిని ధరించువాఁడు మరీచిమంతుఁడు.

అంశుమంతుఁడవు-సర్వపదార్థములందు లోపల వెలుపల వ్యాపించియుండు వాఁడు, అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థ్సితః।శ్రుతి. సప్తసప్తివి-సప్తయనెడి గుఱ్ఱము గలవాఁడు. ఏకో అశ్వో వహతి సప్తనామ - శ్రుతి ఇది కల్క్యవతారము సూచించుచున్నది. కల్కిమూర్తికి గుఱ్ఱమే వాహనము.

తిమిరారి=తిమిరము - అజ్ఞానము, దీనిని నాశము చేయువాఁడు. ఎక్కడ భగవచ్చింతనము గలదో యచ్చట నజ్ఞానము రూపుమాయును. "ఉద్యంతస్థో హ్యభద్రాణి విధునోతి సుహృత్సతామ్" అని స్మృతి.

శంభువు – శం=సుఖం, భవత్యస్మాత్ శంభుః=శమ్మనఁగా సుఖము. అది యాయనవలనఁ గలుగును, గావున శంభువు.

సౌందర్యాది గుణానాం యో హ్యావిష్కారేణ శం సుఖమ్,పుంసాం సమ్యక్ భావయతి స శంభుః పరికీర్త్యతే. తన స్వసౌందర్య సౌశీల్యాది కల్యాణ గుణావిష్కరణముచే సుఖము గలిగించువాఁడు.

మార్తండుఁడవు=మృతం బ్రహ్మాండం జీవయతీతి మార్తండః, నశించిన బ్రహ్మాండమును మరల బ్రతికించువాఁడు,జీవా జీవతు జీవయత్, శ్రీ భాగవతము. మృతే అండే జాతో మార్తండః. మృతమయిన యండమందుఁ బుట్టినవాఁడు. సమస్తము సంహారము చేసి దానినిసృజించుటకు మరల దానియందుఁబుట్టినవాఁడు.

రవివి = రూయతే స్తూయత ఇతి రవిః = స్తోత్రము చేయఁబడువాఁడు, 'యశ్చిత్తరాయణద్వారా రూయతేఽత్ర ప్రకాశ్యతే, సవై రవిః సమాఖ్యాతః ప్రాశస్త్యఫలదో మనః" అగ్నిగర్భుఁడవు=పగటివేళ నగ్నిని గర్భమునందుఁ గలవాఁడు. ఉద్యంతం వాదిత్య మగ్ని రనుసమారోహతి. పగటివేళ నగ్ని సూర్యుని యందుఁ బ్రవేశించును గనుక సూర్యకిరణములు వేఁడిగా నుండును. రాత్రివేళ సూర్యుఁ డగ్నిని బ్రవేశించుఁ గావున నగ్ని వెలుతురు గలదై యుండును.

శంఖుఁడవు, శమేః ఖః=సాయంతనంబునందు దానే శమించువాఁడు.

శిశిర నాశనుండవు=శిశిరమును - మంచును నాశము చేయువాఁడు.

తపనుఁడు=ఆశ్రిత విరోధులను దపింపఁ జేయువాఁడు.

శిశిరుఁడు = చల్లనివాఁడు. సంసారమునఁ దాపములచేఁ దప్తులైన వారికి విశ్రమస్థాన మైనవాఁడు.

## తాత్పర్యము

అఖండభూమండలమునకుఁ బతియగువాఁడును లేక పరమాకాశమునకుఁ బతి యగువాఁడు. సర్వమును ప్రేరించువాఁడవు. వర్షము గురియించి పైరులు పండఁ జేయువాఁడవు. పరమాకాశమం దుండువాఁడవు. పోషించువాఁడవు. లక్ష్మీదేవితో నిత్య సంయోగము గలవాఁడవు. ప్రపంచము సృష్టికిఁ గారణమైన సాధనము గల వాఁడవు. ప్రకాశించు సర్వవస్తువులకుఁ బ్రకాశము నిచ్చువాఁడవు. సూర్య చంద్రాగ్ని యమాదులను నాజ్ఞచేఁ దపింపఁ జేయువాఁడవు. ఆశ్రితులకు జ్ఞానము గలిగించు వాఁడవు. నీవు జీవకోటుల హృదయములం దుండువాఁడవు, లోకమును సన్నగింపఁ జేయువాఁడవు. గరుత్మంతుని వాహనముగాఁ గలవాఁడవు. అనంత కల్యాణగుణములు గలవాఁడవు, సుదర్శనమును ధరించినవాఁడవు. సమస్త పదార్థముల లోపల వెలుపల వ్యాపించి యుండువాఁడవు. కల్క్యవతారమందు గుఱ్ఱము వాహనముగాఁ గలవాఁడవు. అజ్ఞాననాశకుఁడవు. సౌందర్య సౌశీల్యాదుల సుఖము కలిగించు వాఁడవు. నష్టమైన ప్రపంచమును మరల జీవింపఁజేయు సత్పృత్తి యగు వాఁడవు. స్తోత్రము చేయఁబడు వాఁడవు. అగ్నిని నీయందు గలవాఁడవు. సాయం కాలమున శమించువాఁడవు. ప్రలయవేళ వ్యాపార రహితుఁడై యుండువాఁడవు. చక్రాయుధుఁడవు. తాపత్రయ బాధితులకు తాపమార్పుకొన చల్లని యాశ్రయ మైన వాఁడవు. నిజభక్త విరోధులఁ దపింపఁ జేయువాఁడవు. మంచును నాశము చేయువాఁడవు నీవే.

ఉ. నీవె హిరణ్యగర్భుఁడవు • నీ వదితిప్రియపుత్రుఁడున్ సువ
ర్ణావహుఁడున్ నభోధవుఁడ • వప్పులమిత్రము భక్తహృత్తమో
భావవిభేదివిన్ నిగమ • పారగుఁడుం గవిరాజు వింధ్యవీ
థీవరవర్తనీప్లవగ • దేవసమస్తభవోద్భవుండవున్. ౪౨౧౨

అర్థములు. హిరణ్యగర్భుఁడవు=బంగారు బీజము గర్భమునఁ గలవాఁడు,
అప ఏవ ససర్జాదౌ తాసు వీర్య మపాసృజత్, తదండ మభవద్ధైమం సహస్రాంశు సమప్రభమ్. మను. ౧-౮.

తొలుత నీటినిసృజించి దాని యందు స్వశక్తి యగు బీజము నుంచెను. ఆబీజము సూర్యునితో సమానమగు కాంతి గలదై బంగారువన్నె గల యండ మయ్యెను.

హిరణ్య మనఁగా సకలజగత్తు నుత్పాదిల్లఁ జేయు సమష్టిజీవసమూహము. దానిని దన గర్భమునందుఁ గలవాఁడు హిరణ్యగర్భుఁడు.

'హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే' యనియు హిరణ్యగర్భోభూగర్భ' యనియు శ్రుతి.

నీ వదితి ప్రియపుత్రుఁడున్=ఇది వామనావతారమును సూచించును.

సువర్ణావహుఁడు-సు = గొప్పయగు, వర్ణ = కర్మనుల కర్మములకు ఫలమును

దండిగఁ గలిగించువాఁడు, కర్మఫలదాతయని భావము. 'అహంహి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభురేవచ॥ భ.గీ. యజ్ఞఫలమఁడు- సర్వఫలప్రదాతయును సర్వేశ్వరుఁడు- శ్రీ భాగవతము.

నభోధవుఁడవు = పరమాకాశనాథుఁడవు. ఆకాశమును దననుండి (అహంకార రూపమున) సృజించినవాఁడు. ఆత్మన ఆకాశస్సంభూతః॥ శ్రుతి- అప్పుల మిత్రము = ప్రలయవేళ సముద్రమున శయనించువాఁడు, 'అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్య గాదిత్యముపతిష్ఠతే, ఆదిత్యాజ్జాయతే వృష్టిః వృష్టే రన్నం తతః ప్రజాః' శ్రుతి. అగ్నియందు వేల్చినది సూర్యుని బొందును.సూర్యునివలన వర్షము, వర్షము వలన నన్నము గలుగును. దానివలనఁ బ్రజలు గలుగుదురు. కావున నప్పుల మిత్రుఁడు- అప్పు లనగా జలము.

భక్త = భక్తుల, హృత్ - హృదయమండలి, తమోభావ=అజ్ఞాన మనెడి చీఁకటి భావమును, విభేదివిన్ = భేదించువాఁడవు.

నిగమపారగుఁడున్ = ఋక్కు, యజుర్వేదము సామవేదమునందుఁ దుద నొందినవాఁడవు.

ఋగ్భిః పూర్వాహ్ణే దివిదేవ ఈయతే యజుర్వేదే తిష్ఠతి మధ్యాహ్నే సామవేదే నాస్తమయే మహీయతే వేదై రశూన్యస్త్రిభి రేతి సూర్యః. శ్రుతి.

సమస్తవేదములకుఁ బర్యవసానభూమి యగువాఁడు. వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః, యేచ వేదవిదో విప్రా, యేచాధ్యాత్మవిదో జనాః తే వదంతి మహాత్మానం, కృష్ణం ధర్మం సనాతనమ్

కవిరాజ=వేద్యములనెల్లఁ దెలిసినవాఁడు య స్సర్వ స్సర్వవిత్॥ శ్రుతి— కవు లనఁబడు వారిలో శ్రేష్ఠుఁడు.

విందువీథీ వరవర్తనీ ప్లవగ=ఆకాశవీథి యను గొప్పమార్గమందు త్వరగాఁ బోవువాఁడు, వింధ్యపర్వతమువలె పోవుటకుఁ గష్టమైన మార్గమందు అనఁగా సుషుమ్నానాడియందు ప్లవం+గ = శీఘ్రముగా పొందించుచున్నాఁడు. ముక్తులను సుషుమ్నానాడియందు బ్రవేశపెట్టుచున్నాఁడని భావము.

సమస్త భవోద్భవుండవు = అన్ని విధములైన, భవ=కార్యసమూహము నకు,ఉద్భవ=కారణమైన వాఁడవు,సర్వమునకు నుత్పత్తికారణమైన వాఁడ వనుట.

భవము=సంసారము, సమస్త జనుల సంసారమునకుఁ బుట్టుచోటు, ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్॥ భ. గీ॥

తాత్పర్యము

దేవా! నీవే హిరణ్యగర్భుఁడవు. నీవే వామనావతారమూర్తివి. నీవే కర్మకుల కర్మఫలముల నవారిగా నిచ్చువాఁడవు.నీవే పరమాకాశనాథుఁడవు.ఉదకములకు మిత్రుఁడవు నీవే. భక్తుల హృదయమండలి చీఁకటి పోఁగొట్టువాఁడవు నీవే.

వేదముల యంతమును బొందినవాఁడవు నీవే. కవిరాజు నీవే. ముక్తులనుసుషుమ్నా నాడియందుఁ బ్రవేశపెట్టువాఁడవు నీవే.

తే. పింగళుండవు మృత్యువు • విశ్వ మీవుఁ నాతపివి మండలివియు స • మస్తతాప
సుండు రక్తుండుభూరి తే • జుండువిశ్వ, భావనుఁడుఖగ తారో డు • పతివినీవు ౨౮౧౫

అర్థములు. పింగళుండవు = పింగ వేశనే, తా నెంత గొప్పవాఁడైనను దక్కువ వారితోఁ గలిసి మెలసి యుండువాఁడు సుశీలుఁడు. ఆ విధముగఁ గలసి యుండువాఁ డని భావము. ఉదయసమయమునపింగళ వర్ణముగలవాఁడు,మృత్యువు= విరోధుల నివర్తించువాడు. మృత్యువు ప్రకృతి, ప్రకృతి శరీరముగాఁగలవాఁడవు. 'యస్య మృత్యు శ్శరీరమ్' శ్రుతి—విశ్వము = ప్రపంచస్వరూపుఁడవు, సమస్తము నిర్వహించువాఁడు.

విశ్వము—(౧) జగత్తు—దీనికిఁ గారణమైనవాఁ డగుటచేఁగార్యకారణముల కభేదము కావున విశ్వమని భగవంతుఁడే చెప్పఁబడెను. 'బ్రహ్మైవేదం విశ్వమ్' పురుష ఏవైదం విశ్వమ్ విశ్వమేవేదమ్......(౨) విశతీతి విశ్వం బ్రహ్మ, 'తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్' ప్రపంచము సృష్టించి దానియందుఁ బ్రవేశించు వాఁడు (౩) సంహరింపఁబడిన ప్రపంచ మెవనియందుఁ బ్రవేశించునో వాఁడు విశ్వము, 'యత్ప్రయం త్యభిసంవిశంతి' శ్రుతి.

'విశ్వనా ద్విశ్వ మిత్యాహుర్లోకానాం కాశిసత్తమ లోకాంశ్చ విశ్వమేవేతి ప్రవదంతి నరాధిప' మోక్షధర్మ.

"విశ్వం సర్వత్ర పూర్ణత్వాత్ స్వరూపగుణవైభవైః'—నిరుక్తి. స్వరూప గుణ వైభవములచే సర్వత్ర పూర్ణుఁడు కావున విశ్వము.

*ఆతపివి, ఆ = అంతటను, తపః = జగన్నిర్మాణవిషయమైన యాలోచన గలవాఁడు, ఎండ గలవాఁడు.

మండలివి=మండ్యతే అనేనేతి మండలి, మండల మనఁగా నలంకారములు కౌస్తుభాదులచే నలంకరింపఁబడువాఁడు కావున మండలి.

సమస్త తాపనుఁడు=సమస్తప్రపంచము నొకప్పారికిఁ దపింపజేయువాఁడు

రక్తుండు = భక్తులను రంజింపజేయువాఁడు, సర్వరంజనుఁడు.

భూరితేజుండు = ఇతరులను లోపఱుచుకొను గొప్ప తేజస్సు గలవాఁడు.

విశ్వభావనుఁడు = సమస్తమును స్థాపించువాఁడు-ఖగతారోడుపతివి=గ్రహ ములకు తారలకు నక్షత్రములకు నధిపతివి – వీనియం దంతర్యామివై శాసించు వాఁడు. విశ్వస్థితికి హేతువగువాఁడు. ద్యౌ స్సచంద్రార్క నక్షత్రం ఖం దిశో భూర్మహోదధిః, వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః" భారతము.

యశ్చంద్రతారక మంతరో యమయతి – శ్రుతి.

### తాత్పర్యము

సుశీలుఁడవు. ప్రకృతిశరీరముగాఁ గలవాఁడవు. స్వరూపగుణ విభవములచేఁ బూర్ణుఁడవు. ప్రపంచనిర్మాణవిషయమైన సంకల్పము గలవాఁడవు. కౌస్తుభాద్యలంకారములు గలవాఁడవు. ప్రపంచమంతయు నొక్కసారిగఁ దపింపజేయువాఁడవు. సర్వభూతకోటుల రంజింపఁజేయువాఁడవు. ఎట్టివారికైన లోపలఁబడకొను గొప్పశక్తి గలవాఁడవు. సమస్తము వానివాని స్థానములందు స్థాపించువాఁడవు. గ్రహ నక్షత్రాదులకు నంతర్యామినై వానిని శాసించువాఁడవు.

కం. తేజస్వులలో మిక్కిలి, తేజస్వివి ద్వాదశాత్మ • దినవాయక దే
వా జయభద్రా జయ యంభోజభవా నీకివే నమోవాకంబుల్. ౩౮౧౬

అర్థములు. తేజస్సులలోఁ దేజస్వివి = కాంతిగల యగ్నిహోత్రాదులలోఁ దేజస్సుగలవాఁడవు. "యేన సూర్య స్తపతి తేజసేద్ధః" శ్రుతి. సూర్యస్యాపి భవేత్సూర్యః, ద్వాదశాత్మ=పండ్రెండు నెలలకుఁ బండ్రెండుమూర్తులు గలవాఁడు. "ఇంద్రో ధాతా భగః పూషా మిత్రోథవరుణోర్యమాః, అర్చిర్వివస్వాన్ త్వష్టాచ సవితా విష్ణురేవచ" అని ద్వాదశమూర్తులు. దినవాయక=దినమున కధిపతియగు వాఁడు. ద్యతి అంధకార మితి దినం=అంధకారమును ఖండించునది దినము, అజ్ఞానాంధకారమును ఖండించునది జ్ఞానము. కావున దినసంజ్ఞ. అట్టి జ్ఞానము ఎవనికి శరీరము, గుణమైనదో యతఁడు దినవాయకుఁడు, 'చైతన్యవపుషేనమ" యని విష్ణుపురాణము. దేవా = ప్రకాశించువాఁడా.

జయభద్ర=జయమును క్షేమమును కలిగించువానికి.

జయా=భక్తులకు జయము కలిగించు వానికి. 'యత్ర రామో భయం నాత్ర నాస్తి తత్ర పరాభవః, అంభోజభవా = అంభోజము = పద్మము, పద్మము ఇచ్చట లక్ష్మీదేవి కర్థము, కావున లక్ష్మీవల్లభుఁడని యర్థము. కమలానాయకుఁడు, కమల నాయకుఁడు, సాధ్యసమాసము కావున హ్రస్వము. నమోవాకంబుల్ = నమస్కారవాక్యములు.

### తాత్పర్యము

తేజోవంతులలోఁ దేజోవంతుఁడవైన వాఁడా! పండ్రెండుమూర్తులుగల వాఁడా! దినాధిపతీ! ప్రకాశించువాఁడా! భక్తులకు జయము క్షేమము గలిగించువాఁడా! జయస్వరూపుఁడా, కమలనాయకా! నీకు నమస్కారములు.

కం. మ్రొక్కెదఁ బ్రాక్శైలమునకు, మ్రొక్కెదఁజరమాచలంబు • మ్రొక్కుగ్రునకున్
మ్రొక్కెద జ్యోతిర్గణపతి, మ్రొక్కెద హర్యశ్వునకును • మ్రొక్కెదజయునిన్

అర్థములు. ప్రాక్శైలము = తూర్పుకొండ, చరమాచలంబు = పడమటి కొండ, ఉగ్రునకున్ = భక్తులుగాని వారికి భయంకరుఁడు, జ్యోతిర్గణపతి=జ్యోతిర్మండలమున నుండువాని కన్నిటికిని నధిపతికి, జ్యోతిర్గణములు=ముక్తులు, వారికి

అధిపతి - సూర్యపర్యాయ నామము లన్నియు తదంతర్యామియైన భగవంతునకు శరీర శరీరి భావమున నన్వయించును.

### తాత్పర్యము

ఉదయపర్వతమునకుఁ బశ్చిమపర్వతమునకు పాపాత్ములకు భయంకరుఁడైన వానికి ముక్తుల కధిపతి యగువానికి హర్యశ్వునకు జయునకు మ్రొక్కెదను. స్తుతియందు వచ్చినమాట మరల వచ్చుట దోషముగాదు.

సీ. మ్రొక్కెద నాదిత్యు • మ్రొక్కెద వేవేల్పు, మ్రొక్కెద సారంగ•మూర్తివిభు
మ్రొక్కెదమార్తండు•మ్రొక్కెదబ్రహ్మేశ, రాచ్యుతునాదితే•యార్చిసూర్య
భాస్వంతుని సమస్త•భక్షు రౌద్రాకారు, విశ్వకర్ముఁదమోఘ్ను • విశ్వసాక్షి
నమితాత్ము శత్రుఘ్ను•హిమవైరిని దమోభి నిఘ్నుఁ దప్తస్వర్ణ • నిభునివహ్ని
తే. గ్రహపతిని కృతఘ్నఘ్ను నిఁ • గంజహితుని
మ్రొక్కెద నమస్కరించెద • మోడ్పుఁగేలు
గూర్తు నంజలి ఘటియింతు • గొంశెగ లోలిఁ
జిన్నిపూల్గొన్నతు లిచ్చుచు • సన్నుతింతు. ౨౧౭

అర్థములు. సారంగమూర్తి- సారం+గ = శీఘ్రం గచ్ఛతి = సారంగః= మిగుల వేగముగఁ బోవువానికి. గజరాజమోక్షణ మందు గరుడుని వేగము చాలక తన వేగముచే గరుడునిగూడ నీడ్చుకొని పోయెను. సారగ్రాహి యగువాని = హంసావతారుఁ డగువానిని, ఏభన్ = వివిధ విహారయతి - ప్రేరయతి=పలువిధము లుగా ప్రాణులను ప్రేరించి వారిచేఁ గార్యములఁ జేయించువానిని, బ్రహ్మేశ్వరాచ్యుతున్ = సృష్టిస్థితి సంహారకర్తలగు బ్రహ్మ విష్ణు శివులగు వానికి, 'సృష్టిస్థిత్యంతకరణీం బ్రహ్మవిష్ణు శివాత్మికామ్। సంజ్ఞాం సయాతి భగవా నేక ఏవజనార్దనః.వి.పు.

ఇచ్చటఁ బరబ్రహ్మ స్వరూపముగా స్తుతి, అనాదితోఁ బ్రహ్మ యనుట ననుసంధించునది. బ్రహ్మేశ్వరాచ్యుతున్ = బ్రహ్మేశ్వరులను వదలి యుండని వానిని. అంతర్యామియై వారిచే సృష్టిసంహార కార్యములు చేయించువానిని, వేదాపహారము బ్రహ్మహత్య వృకాసురబాధ లోనైనవి తొలఁగించి కాపాడువానిని, అదితేయార్చి = ఆదిత్యరూపమగు కాంతిగలవానిని, సమస్త భక్షు=సర్వ సంహారకుఁ డగు వానిని, సర్వయజ్ఞభోక్తను; రౌద్రాకారున్ = అసమయమున భయంకరమైన యాకారము గలవానిని, నృసింహావతారము సూచితము. విశ్వకర్మన్=సమస్త ప్రపంచము సృష్టించు వానిని, తమోఘ్నున్ = చీఁకటి పోఁగొట్టు వానిని, విశ్వసాక్షిన్=ప్రాణు లన్నియుఁ జేయు కార్యములు తటస్థుఁడై చూచుచుండు వానిని, అమితాత్మన్ = అపరిచ్ఛిన్న స్వరూపుని, శత్రుఘ్నున్ =ఆశ్రితుల శత్రువులను దన శత్రువులుగా నెంచి చంపువానిని, హిమవైరిని=మంచును బోఁగొట్టువానిని, తమోభినిఘ్నున్ = చీఁకటినిఁ బోఁగొట్టు వానిని, తప్తస్వర్ణనిభునిన్ = పుటము